www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



పెళ్లి పీటలెక్కనున్న సింధు

హైదరాబాదీని మనువాడనున్న స్టార్ షట్లర్

వరుడు దత్తసాయి ఓ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్

ఈ నెల 22న రాజస్థాన్ ఉదయ్‌పూర్‌లో వేడుక

24న హైదరాబాద్‌లో రిసెప్షన్ 10

మంగళవారం | 3-12-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 228 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంతరుతువు, మార్గశిరమాసం, శుక్లపక్షం; తిథి: విదియ మ. 1.09 తదుపరి తదియ; నక్షత్రం: మూల సా. 4.42 తదుపరి పూర్వాషాఢ; వర్జ్యం: మ. 3.02-4.42, రా. 2.31-4.09; దుర్ముహూర్తం: ఉ. 8.46-9.30, రా. 9.51-10.42; అమృతఘడియలు: ఉ. 10.02-11.42; రాహుకాలం: మ. 3.00-4.30; సూర్యోదయం: 6.34; సూర్యాస్తమయం: 5.35 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

‘డిజిటల్’తో దోపిడీ..!

బూతుకో రేటు..!

ఇప్పటికి తేలింది రూ.50 కోట్లు

‘సోషల్’ సైకోలకు గత ఐదేళ్లు రాజపోషణే

డిజిటల్ కార్పొరేషన్‌ను కొల్లగొట్టి జీతాలు

రోత మీడియా, ఐ-ప్యాక్‌ల సిబ్బందికీ, ఐడ్రీమ్ ఓనర్ ఇంటి పనోళ్లకూ...

రాంగోపాల్ వర్మ, సజ్జల భార్గవ్, దేవేందర్‌రెడ్డిలకు భారీగా చెల్లింపులు

బాకా సైట్లు, యూట్యూబ్ చానళ్లకు రూ.కోట్లలో యాడ్లు

కార్పొరేషన్‌లో ఫోరెన్సిక్ ఆడిట్

త్వరలో ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక

విజిలెన్స్ పరిశీలనలో అక్రమాలు వెలుగులోకి..

అసభ్యకరమైన భాషతో చంద్రబాబు, పవన్, లోకేశ్, అనితతోపాటు, వారి కుటుంబ సభ్యులపై సైకోయిజం ప్రదర్శించిన వైసీపీ సోషల్ మీడియా బాధ్యులు సజ్జల భార్గవ రెడ్డి, గుర్రంపాటి దేవేందర్ రెడ్డి లాంటి వారికి భారీగానే చెల్లింపులు జరిగాయి.

ఐ డ్రీమ్ చానల్ యజమాని ఇంటికొచ్చి పిల్లలకు ట్యూషన్ చెప్పిన టీచర్లకు కూడా ఇక్కడినుంచే చెల్లింపులు జరిగాయి.

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

సొంత బాకా ఊదించుకోవడానికి ప్రకటనల రూపంలో రూ.వందల కోట్ల ప్రభుత్వ ధనాన్ని తన రోత మీడియాకు సమర్పించారు. వలంటీర్లకు తన రోత పత్రికను అంటగట్టి కోట్ల రూపాయలు ప్రభుత్వ ఖజానా నుంచి స్వాహా చేశారు. చివరికి తన రాజకీయ ప్రత్యర్థులపై బురద జల్లేందుకు తన పత్రిక, చానల్ ఉద్యోగులు, వైసీపీ సోషల్ మీడియా సైకోలకు వందల కోట్ల రూపాయలు పంచేశారు. ఇదీ వైసీపీ హయాంలో... నాటి సీఎం జగన్మోహన్ రెడ్డి చేసిన ఆర్థిక అరాచకం! అయితే, ఈ చెల్లింపులకు డిజిటల్ కార్పొరేషన్ నిధులను అడ్డగోలుగా వాడుకున్నట్లు తాజాగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. డిజిటల్ కార్పొరేషన్‌లో ఆనాడు పాల్పడిన అక్రమాలు, అరాచకాలు ఒక్కొక్కటిగా బయటికి వస్తున్నాయి. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కొన్ని రోజులుగా చేస్తున్న ఫోరెన్సిక్ ఆడిట్‌లో సోషల్ సైకోలు కొందరు

మిగతా 13వ పేజీలో...



పేదల బియ్యం వారికి చేరాలి. లేదా ప్రభుత్వానికి ఉపయోగం కలగాలి. మధ్యలో మాఫియా పాలైతే ఎలా? కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి కుటుంబంతోపాటు ఆఫ్రికా దేశాలకు బియ్యం తీసుకెళుతున్న అగర్వాల్, పోర్టులో అంతా మేనేజ్ చేస్తున్న అధికారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఆధారాలు, అవకాశాలను పరిశీలించాలి!

- చంద్రబాబు

సోమవారం సీఎం చంద్రబాబుతో భేటీ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కరచాలనం

బియ్యం దొంగల భరతం పడదాం!

సీఎం, డిప్యూటీ సీఎం భేటీలో నిర్ణయాలు

అక్రమార్కులు, వారికి సహకరించిన వారి వివరాలు ఇవ్వండి

కాకినాడ పోర్టు అధికారిగా ఐపీఎస్

ఉన్నతాధికారులకు సీఎం ఆదేశం

స్మగ్లింగ్‌పై సీనియర్ ఐపీఎస్‌తో కమిటీ

వ్యవస్థీకృత నేరంగా బియ్యం అక్రమ రవాణా

ఎగుమతి చేసిన కీలక వ్యక్తులపై చర్యలు

వారి అక్రమాస్తులు కూడా స్వాధీనం

అక్రమాల కట్టడిపై మంత్రి వర్గ ఉపసంఘం



రేషన్ బియ్యం నిల్వలు ఉన్న స్టెల్లా నౌక

అమరావతి/కాకినాడ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రేషన్ మాఫియాపై ఉక్కుపాదం మోపేందుకు చకచకా రంగం సిద్ధమవుతోంది. ఈ దిశగా సోమవారం అనేక కీలక పరిణామాలు చోటు చేసుకున్నాయి. ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఉప ముఖ్యమంత్రి పవన్ సమావేశం... ఆ వెంటనే ఉన్నతస్థాయి అధికారులతో సీఎం సమీక్ష... అంతకుముందే మంత్రివర్గ ఉపసంఘం భేటీ! ఇలా ఒకే రోజు వరుస పరిణామాలు వేగంగా జరిగాయి. ఈ సమావేశాల్లో పలు కీలక

మిగతా 12వ పేజీలో...



అమరావతి 2.0 పనులు పరుగు

అభివృద్ధి పనులకు 11 వేల కోట్లు

కీలక ప్రాజెక్టులకు ఆర్థిక కేటాయింపులు

ఆమోదం తెలిపిన సీఎం చంద్రబాబు

సీఎం అధ్యక్షతన సీఆర్డీఏ సమావేశం

ట్రంక్ ఇన్‌ఫ్రా, వరదనీటి యాజమాన్యం, గ్రీనరీ పనుల కోసం ‘పీఎంసీ’ ఏర్పాటు

నెలాఖరు నాటికి టెండర్లు : నారాయణ

విజయవాడ, అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజధాని పనుల్లో కూటమి ప్రభుత్వం మరింత వేగం పెంచింది. అమరావతిలో రూ.11 వేల కోట్ల భారీ వ్యయంతో నిర్మాణ పనులను చేపట్టేందుకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు కీలకమైన ఆర్థిక కేటాయింపులపై నిర్ణయాలు తీసుకుంది. వైసీపీ ప్రభుత్వ హయాంలో గత ఐదేళ్లూ అమరావతి విధ్వంసానికి గురైంది. దానిని తిరిగి ట్రాక్ మీదకు తెచ్చేందుకు ఆరు నెలలుగా చంద్రబాబు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతోంది. ఈ క్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు తాజాగా నిర్ణయం తీసుకుంది. సోమవారం ముఖ్యమంత్రి క్యాంపు

మిగతా 14వ పేజీలో...



ఫుట్‌బాల్ మ్యాచ్ రణరంగం

గినీలో 100 మంది మృతి.. వీధులు రక్తసిక్తం

తీవ్ర వివాదానికి దారితీసిన రిఫరీ నిర్ణయం

ఇరు వర్గాల ఘర్షణ.. పలువురికి గాయాలు 2



విధుల్లో చేరడానికి వెళ్తుండగా..

కాటేసిన మృత్యువు

కర్ణాటకలో రోడ్డు ప్రమాదం

యువ ఐపీఎస్ అధికారి దుర్మరణం

టైరు పేలి.. అదుపుతప్పి చెట్టును ఢీకొన్న వాహనం 2

నాడు అబ్బాయ్.. నేడు బాబాయ్!

మాజీ మంత్రి అనిల్ కుమార్ బాబాయ్ రూప్ దందా

కూటమి సర్కారులో చక్రం తిప్పుతున్న వైనం

జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా ఆయనదే హవా

సాధారణ నాయకుడికి అసాధారణ ప్రాధాన్యం

ఎవరి అండతో రెచ్చిపోతున్నారనే చర్చ

రూ.ఐదు వేల కోట్ల క్వార్ట్జ్ సంపదపై కన్ను

ఖనిజం తమకే విక్రయించాలని బెదిరింపులు

రూప్ ఆధీనంలోని గనుల్లో తవ్వకాలకు ఓకే

తేడా కొడుతోందని గుర్తించి తెల్లారేసరికి రద్దు



అప్పుడు అబ్బాయ్... అనిల్ కుమార్ యాదవ్! ఇప్పుడు బాబాయ్ రూప్ కుమార్! సర్కారు మారింది కానీ... నెల్లూరులో ‘ఫ్యామిలీ’ పొలిటికల్ దందా మాత్రం మారలేదు! వైసీపీ ప్రభుత్వంలో అనిల్ హవా కొనసాగితే.. కూటమి ప్రభుత్వంలో రూప్ కుమార్ హడావుడి చేస్తున్నారు. క్వార్ట్జ్ తవ్వకాల్లో కాలూవేలూ పెడుతున్నారు. జిల్లాకు చెందిన బడా నేతలే సైలెంట్‌గా ఉండిపోగా... రూప్ కుమార్ రెచ్చిపోతుండటం గమనార్హం. ఒక సాధారణ నాయకుడికి... ఇంతటి అసాధారణ ప్రాధాన్యం ఏమిటి? ఏం చూసుకుని ఇలా చెలరేగిపోతున్నారు? ఇదీ ఇప్పుడు చర్చ!

(నెల్లూరు - ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ఒక్కటి కూడా వదలకుండా 11 స్థానాలూ తెలుగుదేశానివే! అక్కడి నుంచి గెలిచిన వాళ్లలో ఇద్దరు మంత్రులూ ఉన్నారు! మహామహా నాయకులెందరో ఈ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కానీ.. కేవలం ఎన్నికలకు నెలరోజుల ముందు పార్టీ కండువా కప్పుకొన్న రూప్ కుమార్ జిల్లాలో చక్రం తిప్పుతున్నారు. అవీఇవీ ఎందుకు... రాయికాదు, రత్నం అనే పేరు పొందిన క్వార్ట్జ్‌లో కాలుమోపారు. డిప్యూటీ మేయర్ హోదాలో, ద్వితీయ శ్రేణి హోదా నాయకుడు మాత్రమే అయిన రూప్ కుమార్‌కు ఇంత ప్రాధాన్యం ఎక్కడిది? ఎలా వచ్చింది? ఎవరి అండతో ఇలా రెచ్చిపోతున్నారనే చర్చ నెల్లూరులో తీవ్రంగా జరుగుతోంది. అంతర్జాతీయ మార్కెట్‌లో క్వార్ట్జ్‌కు కొంతకాలంగా మంచి డిమాండ్ ఏర్పడింది. దీంతో నెల్లూరు జిల్లాలో

మిగతా 13వ పేజీలో...



బీద మస్తాన్ | సానా సతీశ్ | ఆర్.కృష్ణయ్య

బీద.. సానా.. ఆర్. కృష్ణయ్య!

13

మూడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కూటమి కసరత్తు కొలిక్కి

టీడీపీ నుంచి మస్తాన్‌రావు, సతీశ్..

బీజేపీ నుంచి బరిలోకి ఆర్.కృష్ణయ్య?

టీడీపీలోకి ఆళ్ల నాని..!

13

మంతనాలు పూర్తి.. ఒకట్రెండు రోజుల్లో చేరిక

ఆయన దారిలోనే మరో ఇద్దరు వైసీపీ నేతలు?

కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష

2

దిగిపోయే ముందు సంచలన నిర్ణయం

మద్యం ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే

భారీ జరిమానా

మొదటిసారి పట్టుబడితే రూ. 5 లక్షలు, రెండోసారి లైసెన్సు రద్దు

బెల్టు షాపుల ద్వారా అమ్మినా అదే జరిమానా

మద్యం అమ్మకాల్లో అక్రమాలపై కఠిన చర్యలు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం



అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): మద్యం అమ్మకాల్లో అక్రమాలకు పాల్పడితే ప్రభుత్వం భారీ జరిమానాలు విధించనుంది. ఈ విషయంలో ఇటీవల సీఎం చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ఎక్సైజ్ శాఖ జరిమానాలను పెంచింది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎంకే మీనా సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం మద్యం షాపుల్లో ఎమ్మార్పీకి మించి వసూలు చేస్తూ పట్టుబడితే రూ. 5 లక్షలు జరిమానా విధిస్తారు. అదే ఉల్లంఘనకు రెండోసారి పాల్పడితే లైసెన్సు రద్దుచేస్తారు. అలాగే మద్యం షాపులో కాకుండా ఇతర ప్రదేశాల్లో బెల్టు షాపు ద్వారా మద్యం అమ్మినా రూ. 5 లక్షలు జరిమానా విధిస్తారు. అదే రెండోసారి కూడా

మిగతా 14వ పేజీలో...



జగన్‌పై కేసుల వివరాలన్నీ

ఇవ్వండి

ఏయే కోర్టుల్లో ఏమేం కేసులున్నాయో తెలపండి

విచారణ ఏ దశలో ఉందో పట్టిక రూపంలో అందించండి

2 వారాల్లో సమగ్ర అఫిడవిట్లు దాఖలు చేయండి

దర్యాప్తు సంస్థలకు సుప్రీంకోర్టు ఆదేశం

కేసుల విచారణలో జాప్యంపై అసహనం



న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్ అక్రమాస్తుల కేసులకు సంబంధించిన సమగ్ర వివరాలు అందించాలని సీబీఐ, ఈడీలను దేశ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. జగన్ బెయిల్‌ను రద్దు చేయాలని, కేసుల విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేయాలని కోరుతూ

మిగతా 14వ పేజీలో...

రాష్ట్రాన్ని వదలని వర్షాలు

కోస్తాలో పంటలకు నష్టం.. నేడు కోతలొద్దని సూచన

పెన్నా నదిలో చిక్కుకున్న పశువుల కాపరులు

పడవల ద్వారా కాపాడిన అధికారులు

తీవ్ర అల్పపీడనంగా మారిన వాయుగుండం

కోస్తా, రాయలసీమకు వర్షసూచన 2



కృష్ణగిరి జిల్లా ఊత్తంగరైలో కొట్టుకుపోతున్న వాహనాలు

తమిళనాట ఆగని విధ్వంసం

తుఫాను తీరం దాటాక కొనసాగుతున్న బీభత్సం!

కృష్ణగిరి జిల్లాలో 50 సెం.మీ. వర్షం

ధర్మపురి, సేలం, నామక్కల్ జిల్లాల్లోనూ వర్షాలు

తిరువణ్ణామలైలో విరిగిపడిన కొండచరియలు

సజ్జల భార్గవకు సుప్రీంలో చుక్కెదురు

14

కేసులు కొట్టేయాలన్న పిటిషన్‌పై విచారణకు నో

దుర్భాషలాడే వాళ్లెవరైనా చర్యలు ఎదుర్కోవాలి

ఇలాంటి విషయాల్లో మాకే సానుభూతి లేదు

విజ్ఞప్తులేవైనా హైకోర్టుకే చెప్పుకోవాలని స్పష్టీకరణ

బెయిల్ వచ్చిన వెంటనే మంత్రిగా నియామకమా?

» తమిళనాడు మంత్రి సెంథిల్ బాలాజీ కేసులో సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ఉద్యోగాల నియామకాల కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న సెంథిల్ బాలాజీని బెయిల్ వచ్చిన వెంటనే మళ్లీ మంత్రిగా తీసుకోవడంపై సోమవారం సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. సీనియర్ మంత్రిగా విధులు నిర్వర్తిస్తుంటే సాక్షులు ప్రభావితం కారా? అని ప్రశ్నించింది. ఈ చర్య కారణంగా నిందితులు స్వతంత్రంగా, నిబ్బరంగా ఉండగలరా అన్న సహేతుక సందేహాలు కలుగుతాయని జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ ఎ.జి.మాసిహ్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. చెన్నైలోని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఉద్యోగాల నియామకంలో అక్రమాలకు పాల్పడ్డారన్న ఆరోపణలపై అప్పట్లో రవాణా మంత్రిగా పనిచేసిన సెంథిల్ బాలాజీని 2023 జూన్‌లో అరెస్టు చేశారు. ఈ ఏడాది సెప్టెంబరు 26న ఆయనకు సుప్రీంకోర్టులో బెయిల్ మంజూరయింది. సెప్టెంబరు 29న ఆయన ఎం.కె.స్టాలిన్ మంత్రివర్గంలో విద్యుత్తు, సంప్రదాయేతర విద్యుత్తు, ఎక్సయిజ్ శాఖల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఆయన బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఫిర్యాదుదారుల్లో ఒకరైన కె.విద్యా కుమార్ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సుప్రీంకోర్టు విచారణ జరుపుతోంది. దీనిపై సమాధానం చెప్పాలని సెంథిల్ బాలాజీకి నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 13కు వాయిదా వేసింది.

బూత్‌ల్లో ఓటర్ల సంఖ్య పెంపుపై వివరణ ఇవ్వండి

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ప్రతి పోలింగ్ బూత్‌లో ఉండాల్సిన గరిష్ఠ ఓటర్ల సంఖ్యను 1200 నుంచి 1500 వరకు పెంచడాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిల్‌పై సుప్రీంకోర్టు ప్రాథమిక విచారణ చేపట్టింది. దీనిపై సమాధానం ఇవ్వాలని ఎన్నికల సంఘాని(ఈసీ)కి నోటీసులు ఇచ్చింది. గరిష్ఠ ఓటర్ల సంఖ్యను పెంచుతూ 2019లో ఎన్నికల సంఘం తీసుకున్న నిర్ణయం కారణంగా ఇబ్బందులు కలుగుతాయని పేర్కొంటూ ఇందు ప్రకాశ్ సింగ్ అనే వ్యక్తి ఈ పిల్ దాఖలు చేశారు. ఓటర్ల సంఖ్య పెంపు కారణంగా ఎక్కువ సేపు నిలబడాల్సిన పరిస్థితి వస్తుందని, అందువల్ల బడుగు వర్గాల వారు ఓట్లు వేయలేని పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. సోమవారం ఈ పిటిషన్‌ను పరిశీలించిన ధర్మాసనం ఈసీకి నోటీసులు ఇస్తూ ఏ ఒక్కరు కూడా ఓటు వేయలేని పరిస్థితి రాకూడదని వ్యాఖ్యానించింది. అయితే, ఈసీ తరఫు న్యాయవాది మణీందర్ సింగ్ పిటిషనర్ వాదనను ఖండించారు. ఓటర్లందరూ ఒకేసారి వచ్చే పరిస్థితి ఉండదు కాబట్టి ఎలాంటి ఇబ్బందులు ఉండవని చెప్పారు. రాజకీయ పార్టీలను సంప్రదించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

ఎఫ్ఐఆర్ లేకున్నా ఆస్తులు స్వాధీనం చేసుకోవచ్చా?

న్యూఢిల్లీ, డిసెంబరు 2: నేరాలపై ఎఫ్ఐఆర్ నమోదు కాకమునుపే మనీలాండరింగ్ నిరోధక చట్టం కింద నిందితుల ఆస్తులను ఈడీ స్వాధీనం చేసుకోవచ్చా అన్న కీలక ప్రశ్నపై సుప్రీంకోర్టు విచారణ జరపనుంది. ఈ అంశం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ పి.వి.సంజయ్ కుమార్‌ల ధర్మాసనం ముందుకు వచ్చింది. అక్రమ ఇసుక తవ్వకాలు జరుపుతున్న ప్రయివేటు కాంట్రాక్టర్లపై చర్యలు తీసుకోకూడదంటూ మద్రాసు హైకోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ ఈడీ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ సందర్భంగా ధర్మాసనం ఈ మేరకు నిర్ణయం తీసుకొంది. విచారణలో భాగంగా మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎల్ఎంఎ)లోని సెక్షన్-5లో ఉన్న రెండు నిబంధనలపై సామరస్యపూర్వక భాష్యం చెప్పనుంది. మొదటి నిబంధన ప్రకారం...ఆస్తులు నమోదు చేయాలంటే ఎఫ్ఐఆర్ నమోదు తప్పనిసరి. రెండో నిబంధన ప్రకారం...మనీలాండరింగ్ కింద విచారణ ప్రారంభించాలనుకుంటే మాత్రం ఎఫ్ఐఆర్‌ను నమోదు చేసుకోకుండానే ఆస్తులను స్వాధీనం చేసుకునే అధికారం ఈడీకి ఉంది. దాంతో మొదటి నిబంధనను పాటించకుండానే స్వతంత్రంగా రెండో నిబంధనను అమలు చేయవచ్చా? అన్న ప్రశ్న తలెత్తింది. దీనిపై తదుపరి విచారణ ఫిబ్రవరి 17కు వాయిదా పడింది.

కోర్టు ధిక్కరణ కేసులో పిచాయ్‌కు నోటీసులు

ముంబయి, డిసెంబరు 2: వీడియోను తొలగించాలన్న ఆదేశాలను పాటించలేదన్న కారణంతో ముంబయి బల్లార్డ్ పియర్‌లోని అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేటు న్యాయస్థానం గూగుల్ సీఈఓ సుందర్ పిచాయ్‌కు కోర్టు ధిక్కరణ నోటీసులు పంపించింది. యూట్యూబ్‌లో తనపై పెట్టిన వీడియో పరువు నష్టం కలిగించేదిగా ఉందంటూ తొలుత ధ్యాన్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు యోగి అశ్విని కోర్టును ఆశ్రయించారు. దాన్ని తొలగించాలని మార్చి 2023న కోర్టు ఆదేశించింది. ఆ వీడియోను ఇంకా పూర్తిగా తొలగించలేదని, భారత్‌లో మినహా మిగిలిన చోట్ల అందుబాటులో ఉందని పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ వేశారు. దాంతో సమాధానం ఇవ్వాలని యూట్యూబ్ అధిపతి పిచాయ్‌కు కోర్టు నోటీసు జారీ చేసింది. తదుపరి విచారణను జనవరి మూడో తేదీకి వాయిదా వేసింది.

బీజేపీ నేత హెచ్. రాజాకు ఏడాదిజైలు శిక్ష

చెన్నై, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ద్రావిడ సిద్ధాంత పితామహుడు పెరియార్ విగ్రహాన్ని పగులగొడతానని ప్రకటించడం, డీఎంకే ఎంపీ కనిమొళిని కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన కేసుల్లో బీజేపీ సీనియర్ నేత హెచ్.రాజాకు చెన్నై ప్రత్యేక కోర్టు ఒక్కో కేసులో ఆరు నెలల చొప్పున జైలు శిక్షతో పాటు రూ.5 వేల జరిమానా విధించింది. ద్రవిడ ఉద్యమనేత పెరియార్ విగ్రహాన్ని పగులగొడతానని హెచ్.రాజా 2018 ఏప్రిల్‌లో తన ఎక్స్‌పేజీలో ప్రకటించారు. అదే ఏడాది మార్చిలో డీఎంకే ఎంపీ కనిమొళిని కించపరుస్తూ సామాజిక మాధ్యమాల్లో వ్యాఖ్యలు చేశారు. ఈ రెండు సంఘటనలకు సంబంధించి ఈరోడ్ నగర పోలీసులు, కరుంగల్‌పాళయం పోలీసులు కేసులు నమోదు చేశారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి జయవేల్ ఈ పిటిషన్‌లపై విచారణ జరిపారు.

తెల్లారితే తొలి పోస్టింగ్.. కాటేసిన మృత్యువు..

» రోడ్డు ప్రమాదంలో యువ ఐపీఎస్ అధికారి దుర్మరణం

బెంగళూరు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఐపీఎస్ కావాలన్నది ఆ యువకుడి కల.. ఎంతో కష్టపడి చదివి తన కలను నెరవేర్చుకున్న ఆ యువకుడు విధుల్లో చేరేందుకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. పోలీసు వాహనం టైరు పేలి అదుపుతప్పి చెట్టును ఢీకొట్టడంతో కర్ణాటక కేడర్ యువ ఐపీఎస్ అధికారి హర్షవర్ధన్(26) దుర్మరణం పాలయ్యారు. కర్ణాటకలోని హాసన్ జిల్లాలో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. బిహార్‌కు చెందిన హర్షవర్ధన్ 2023లో ఐపీఎస్‌కు ఎంపికై శిక్షణ పొందారు. ఇటీవల మైసూరులో 4వారాల శిక్షణ ముగించుకుని, హాసన్‌లో ప్రొబేషనరీ ఏఎస్పీగా నియమితులయ్యారు. సోమవారం సాయంత్రం విధుల్లో చేరడానికి పోలీసు వాహనంలో బయల్దేరి వెళ్తుండగా ప్రమాదం జరిగింది.

కెనడా వద్దంటోంది..

తాత్కాలిక పర్మిట్లపై ఉన్న 50 లక్షల మంది భవిష్యత్ ప్రశ్నార్థకం

» వచ్చే ఏడాదితో ముగియనున్న పర్మిట్ల గడువు

» విద్యార్థులు గడువు పెంచుకునేందుకు చాన్స్



న్యూఢిల్లీ, డిసెంబరు 2: తాత్కాలిక పర్మిట్లపై కెనడాలో ఉంటున్న లక్షలాది మంది భవితవ్యం ఇప్పుడు ప్రశ్నార్థకంగా మారింది. వలస విధానంలో కొత్త పాలసీలు తీసుకొచ్చిన నేపథ్యంలో వారిని దేశంలో కొనసాగనిస్తారా? లేదా.. అవన్నీ రద్దవుతాయా? అనే దానిపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వచ్చే ఏడాది ఆఖరుకు సుమారు 50 లక్షల తాత్కాలిక పర్మిట్లకు గడువు తీరిపోతోంది. ఇందులో వర్క్ పర్మిట్‌పై, స్టడీ పర్మిట్‌పై ఉన్న వారితో పాటు శరణార్థులు కూడా ఉన్నారు. కెనడా ప్రస్తుత పరిస్థితుల్లో వీరందరికీ మళ్లీ పర్మిట్లు కొనసాగించే పరిస్థితి కనిపించడం లేదు. వలస వచ్చిన వారు స్వచ్ఛందంగా తిరిగి వెళ్లిపోతారని కెనడా ప్రభుత్వం కూడా భావిస్తోంది. ఇదే విషయాన్ని కామన్ ఇమిగ్రేషన్ కమిటీ సమావేశంలో ఇమిగ్రేషన్ మంత్రి మార్క్ మిల్లర్ కూడా తెలిపారు. గత వారం జరిగిన ఆ సమావేశంలో కన్జర్వేటివ్ ఎంపీ టామ్ కిమియెక్ ఈ అంశాన్ని లేవనెత్తారు. తాత్కాలిక పర్మిట్స్‌పై ఉన్న సుమారు 49 లక్షల మందిని అవసరమైతే దేశం నుంచి పంపించడానికి సిద్ధంగా ఉన్నారా? అని ఆ ఎంపీ ప్రశ్నించారు. దీనికి మార్క్ మిల్లర్ సమాధానమిస్తూ.. కెనడియన్ బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ) వలస చట్టాలను అమలు చేయడంలో చురుకుగా పనిచేస్తోందని, అయినా చాలా మంది స్వచ్ఛందంగానే దేశాన్ని వదిలి వెళ్లిపోతారని భావిస్తున్నామని తెలిపారు. అలాగే స్టూడెంట్ వీసాపై ఉన్న సుమారు 7.66 లక్షల మందికి డిసెంబర్ 2025తో గడువు ముగుస్తున్న నేపథ్యంలో వారిని సీబీఎస్ఏ ట్రాక్ చేస్తుందా అన్న ప్రశ్నకు కూడా మార్క్ మిల్లర్ జవాబిచ్చారు. కొంత మంది విద్యార్థులు వారి పర్మిట్స్‌ను పునరుద్ధరించుకుంటారని లేదా పోస్టు గ్రాడ్యుయేషన్ కోసం దరఖాస్తు చేసుకుంటారని ఇలా చేయడం వల్ల వారి పర్మిట్ల గడువును పెంచుకునే అవకాశం ఉందన్నారు. దీనికి సబంధించిన ఓ వీడియోను కెనడా మీడియా సంస్థ నేషనల్ పోస్టులో ఆయన షేర్ చేశారు.

భారతీయులకే ఇబ్బంది ఎక్కువ?

దేశంలో మౌలిక వసతులు తగ్గిపోతున్నాయనే ఆందోళనల నేపథ్యంలో ఎన్నికల ముందు ట్రూడో ప్రభుత్వం ఇటీవల కీలక నిర్ణయం తీసుకుంది. ఏటా తీసుకుంటున్న శాశ్వత, తాత్కాలిక రెసిడెంట్స్ సంఖ్యను వచ్చే మూడేళ్లలో గణనీయంగా తగ్గించాలని నిర్ణయించింది. దీని కోసం కొత్త పాలసీలు ప్రవేశపెట్టింది. ఇది భారతీయులకు పెద్ద ఇబ్బందిగానే భావిస్తున్నారు. ఎందుకంటే కెనడాకు వలసల్లో భారతీయులే ఎక్కువగా ఉంటున్నారు. శాశ్వత రెసిడెంట్స్‌లో 2022లో మొత్తం భారతీయులు 27 శాతం ఉన్నారు. అయితే తాత్కాలికంగా పర్మిట్లు పొందిన వారిలో భారత జాతీయులు ఎంతమంది అనేది స్పష్టంగా లెక్కలు లేవు. పర్మినెంట్ రెసిడెంట్స్‌కు పర్మిట్లను 2025 కల్లా 5 లక్షల నుంచి 3.95 లక్షలకు తగ్గించాలని కెనడా ఇమిగ్రేషన్ కొత్త పాలసీలో పేర్కొన్నారు. ఇది 21 శాతం తగ్గుదల. కాగా తాత్కాలిక వర్కర్స్, స్టూడెంట్స్ విషయంలో కూడా పర్మిట్లను భారీగా తగ్గించనున్నారు. 2026 కల్లా తాత్కాలిక విదేశీ వర్కర్ల సంఖ్యలో 40 శాతం, అంతర్జాతీయ విద్యార్థుల సంఖ్యలో 10 శాతం కోత పడుతుందని భావిస్తున్నారు. కొత్త పాలసీ వల్ల దేశంలో జనాభాను నియంత్రించడమే కాకుండా, ఇళ్ల నిర్మాణం, హెల్త్ కేర్, ఇతర సేవలపై ప్రభుత్వ ఖర్చు పెంచే అవకాశం ఉంటుందని కెనడా అధికారులు భావిస్తున్నారు. ఇక ప్రస్తుత ఆర్థిక పరిస్థితుల్లో దేశంలో ఖర్చులన్నీ పెరిగిపోయిన కారణంగా కెనడాకు వలసపై భారతీయుల పునరాలోచించుకోవాలని ఇమిగ్రేషన్ విశ్లేషకుడు దర్శన్ మహారాజ్ సూచించారు. కెనడాకు వద్దామనుకునే భారతీయులు వేరే దేశంలో అవకాశాలు చూసుకోవడం మంచిదని సలహా ఇచ్చారు.

మహారాష్ట్రకు ఇద్దరు పరిశీలకులు

» నిర్మల, విజయ్ రూపానీలకు బాధ్యత

» రేపు బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక

ముంబై, డిసెంబరు 2: మహారాష్ట్రలో కొత్త సీఎం ఎవరన్న అంశంపై నెలకొన్న ఉత్కంఠకు తెరదించేందుకు బీజేపీ అధిష్ఠానం కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్, గుజరాత్ మాజీ సీఎం విజయ్ రూపానీలను పరిశీలకులుగా నియమించింది. వీరిలో రూపానీ నేడు ముంబై చేరుకోనుండగా నిర్మల 4న చేరుకుంటారు. వీరిద్దరూ కొత్త ప్రభుత్వ ఏర్పాటుపై మహాయుతి నేతలతో చర్చలు జరుపుతారు. ఈ నెల 4న ఉదయం 10 గంటలకు ముంబైలోని విధానసభ సెంట్రల్ హాల్‌లో బీజేపీ శాసనసభాపక్ష నేత ఎన్నిక ఉంటుంది. ఫడణవీస్‌ను బీజేపీ శాసనసభాపక్ష నేతగా ఎన్నుకున్నాక ఆయననే ముఖ్యమంత్రిగా ప్రకటిస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఆర్ఎస్ఎస్ మద్దతు కూడా ఫడణవీస్‌కే ఉన్నట్లు సమాచారం. ఈ నెల ఐదున సాయంత్రం 5 గంటలకు ముంబై ఆజాద్ మైదానంలో కొత్త సీఎం ప్రమాణ స్వీకారం ఉంటుంది. అనారోగ్యంతో బాధపడుతున్న మహారాష్ట్ర ఆపద్ధర్మ సీఎం ఏక్‌నాథ్ శిందేకు ఫడణవీస్ ఫోన్ చేశారు. ఆరోగ్య వివరాలు కనుక్కోవడమే కాక తన సన్నిహితుడైన గిరీశ్ మహాజన్‌ను శిందే దగ్గరకు పంపారు. అంతకు ముందు అనారోగ్యం కారణంగా శిందే మహాయుతి నేతల సమావేశంతో పాటు మిగతా కార్యక్రమాలన్నింటినీ రద్దు చేసుకున్నారు. వాస్తవానికి డిప్యూటీ సీఎం పదవితో పాటు హోం శాఖ కూడా ఇవ్వాలని శిందే పట్టుబడుతున్నట్లు సమాచారం. హోంమంత్రిత్వ శాఖ తనకు కేటాయిస్తే సీఎం పదవి లేకపోయినా తన ప్రతిష్ఠ తగ్గదని, ఒకవేళ తాను కోరిన మంత్రిత్వ శాఖలు ఇవ్వకపోతే ప్రతిపక్ష నేతగా అయినా కొనసాగుతానంటూ శిందే బీజేపీ అధిష్ఠానానికి చెప్పినట్లు సమాచారం. మరోవైపు, తాను డిప్యూటీ సీఎం రేసులో లేనని శిందే తనయుడు శ్రీకాంత్ చెప్పారు. ఢిల్లీలో కేంద్ర హోం మంత్రి అమిత్ షాతో ఎన్సీపీ అధ్యక్షుడు అజిత్ పవార్, ఇతర ఎన్సీపీ నేతలు భేటీ అయ్యారు. కొత్త ప్రభుత్వంలో చేపట్టబోయే మంత్రిత్వ శాఖల కేటాయింపులపై చర్చించారు. ఇప్పటికే జరిగిన చర్చల ప్రకారం బీజేపీకి 20, శివసేనకు 12, ఎన్సీపీకి పది మంత్రిత్వ శాఖలు దక్కే అవకాశం ఉంది. ఈ నెల 5న కూటమి తరఫున కనీసం 20 మంది మంత్రులు ప్రమాణం చేస్తారని సమాచారం.

లోకం తీరు



ఫుట్‌బాల్ మ్యాచ్‌లో ఫ్యాన్స్ ఘర్షణ

గినీలో 100 మంది మృతి

జెరెకొరె, డిసెంబరు 2: పశ్చిమాఫ్రికా దేశం గినీలో ఓ ఫుట్‌బాల్ మ్యాచ్ సందర్భంగా రెండు వర్గాల మధ్య చెలరేగిన ఘర్షణ తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. అభిమానులు పరస్పరం ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో దాదాపు వంద మంది వరకు మృతి చెందగా చాలా మంది తీవ్రంగా గాయపడ్డారు. గినీ మిలటరీ జుంటా నేత మమాడీ దౌమబోయా గౌరవార్థం దేశంలోని రెండో అతిపెద్ద నగరం జెరెకొరెలో ఫుట్‌బాల్ టోర్నమెంట్ నిర్వహించారు. ఇందులో భాగంగా ఆదివారం జరిగిన మ్యాచ్ మధ్యలో రిఫరీ తీసుకున్న ఓ నిర్ణయం వివాదాస్పదమైంది. దీన్ని వ్యతిరేకించిన ఓ జట్టు అభిమానులు మైదానంలోకి దూసుకెళ్లారు. దీంతో అవతలి జట్టు అభిమానులు వీరిని అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఘర్షణ చెలరేగింది. వేలాది మంది అభిమానులు వీధులలోకి వచ్చి పరస్పరం ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశముంది.

పది అగ్రశ్రేణి సైనిక శక్తుల్లో పాక్!

న్యూఢిల్లీ, డిసెంబరు 2: ప్రపంచంలోని పది అగ్రశ్రేణి సైనిక శక్తుల్లో ఒకటిగా పాకిస్థాన్ నిలిచింది. పలు విభాగాల్లో భారత్ కంటే కూడా ముందంజలో ఉంది. ఫైర్ పవర్ ఇండెక్స్ కథనం మేరకు ప్రపంచంలోని 9వ అతిపెద్ద మిలిటరీ శక్తిగా పాకిస్థాన్ నిలిచింది. ఆ దేశం వద్ద వేలాదిగా యుద్ధ ట్యాంకులు, యుద్ధ వాహనాలు, యుద్ధ విమానాలు ఉన్నాయి. ఫైర్ పవర్ ఇండెక్స్ ప్రకారం.. పాక్‌లో 6.54 లక్షల మంది సైనికులు, 1,434 సైనిక విమానాలు, 387 ఫైటర్ జెట్‌లు ఉన్నాయి. భారత్, పాక్ రెండూ అణ్వస్త్ర దేశాలే. సిప్రి నివేదిక ప్రకారం 2024 జనవరి నాటికి భారత్ వద్ద 172, పాకిస్థాన్ వద్ద 170 అణ్వాయుధాలు ఉన్నాయి. అయితే, ఇప్పటి వరకు నాలుగుసార్లు భారత్‌తో యుద్ధానికి దిగగా, ప్రతి సందర్భంలోనూ భారత సైన్యం చేతిలో పాకిస్థాన్‌కు భంగపాటు ఎదురైంది.

పార్లమెంటులో ప్రతిష్టంభనకు తెర!

న్యూఢిల్లీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంటులో పలు అంశాలపై చర్చ జరపాలన్న అంశంపై కేంద్రం, విపక్షాల మధ్య నెలకొన్న ప్రతిష్టంభనకు తెర పడింది. ఉభయ సభల్లో రాజ్యాంగంపై చర్చకు కేంద్రం అంగీకారం తెలపడంతో ఎట్టకేలకు మంగళవారం నుంచి సభ సజావుగా సాగేందుకు ఇరు పక్షాల మధ్య సయోధ్య ఏర్పడింది. నవంబరు 25న శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి అదానీ, సంభాల్ హింసాకాండ, మణిపూర్ అశాంతి వంటి విషయాలపై విపక్షాల తీవ్ర ఆందోళనల ఫలితంగా లోక్‌సభ, రాజ్యసభలు నిరంతరం వాయిదా పడుతూ వస్తున్నాయి. అయితే.. పార్లమెంటులో ఈ ప్రతిష్టంభనను తొలగించేందుకు అధికార బీజేపీ, ప్రతిపక్ష పార్టీలు సోమవారం ఒక ఒప్పందానికి వచ్చినట్లు పార్లమెంటు వర్గాలు తెలిపాయి. ఈమేరకు పార్టీల ఫ్లోర్ లీడర్లతో స్పీకర్ ఓం బిర్లా సమావేశం నిర్వహించారు. ఆ సమావేశం అనంతరం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరెన్ రిజిజు మీడియాతో మాట్లాడుతూ... రాజ్యాంగంపై డిసెంబరు 13, 14 తేదీల్లో లోక్‌సభలో, డిసెంబరు 16, 17 తేదీల్లో ఎగువసభలో చర్చ జరపాలని నిర్ణయించినట్లు తెలిపారు. రాజ్యాంగ సభ రాజ్యాంగాన్ని ఆమోదించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంటు ఉభయ సభల్లో చర్చలు జరపాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేశాయన్నారు. కాగా, పార్లమెంటు శీతాకాల సమావేశాలు ఐదోరోజైన సోమవారం సైతం అంతంతమాత్రంగానే జరిగాయి. అదానీ ముడుపుల వ్యవహారంపై ప్రధాని మౌనం వీడాలని విపక్షాలు డిమాండ్ చేశాయి. ఈ అంశంపై జేపీసీ వేయాలని ఉభయ సభల్లో విపక్ష ఎంపీలు పట్టుబట్టారు. దీంతో, రెండు సభలను వాయిదా వేశారు.

పెద్దపాదం మార్గం బంద్

» పులిమేడు రూట్‌లో రెడ్ అలర్ట్

» పంపా, సన్నిధానానికి ఎల్లో అలర్ట్

» శబరిమలలో భారీ వర్షాలు



శబరిమల, డిసెంబరు 2: ఫెంజల్ తుఫాన్ ప్రభావం శబరిమల యాత్రపైనా పడింది. రెండ్రోజులుగా తెరిపినివ్వకుండా వర్షాలు కురుస్తుండడం.. మంగళ, బుధవారాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) హెచ్చరికలను జారీ చేయడంతో.. అయ్యప్ప భక్తుల వనయాత్రలను నిషేధించారు. కేవలం పంపా బేస్ నుంచి మాత్రమే యాత్రకు అనుమతిస్తున్నారు. శబరిమలకు చేరుకునేందుకు ప్రధానంగా మూడు మార్గాలుంటాయి. అవి.. పులిమేడు మార్గం, ఎరుమేళి నుంచి పెద్దపాదం మార్గం, పంపా బేస్ నుంచి చిన్నపాదం మార్గాలు. ఫెంజల్ తుఫాన్ ప్రభావంతో మంగళ, బుధవారాల్లో మలప్పురం, కోళిక్కోడ్, వయనాడ్, కన్నూర్, ఇడుక్కి జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ అయ్యింది. ఈ నేపథ్యంలో వండిపెరియార్ నుంచి పులిమేడ్ మార్గాన్ని మూసివేసినట్లు అధికారులు ప్రకటించారు. ఇప్పటికే ఈ మార్గంలోని కుజుత్తకులి వద్ద 12 మంది భక్తులు చిక్కుకుపోగా.. వారిని జాతీయ విపత్తు నిర్వహణ బృందం(ఎన్డీఆర్ఎఫ్) కాపాడింది. ఈ మార్గమంతా చిత్తడిగా మారడంతో.. చిన్నపాటి లోయలోకి జారిపడ్డ ఇద్దరు భక్తులకు తీవ్ర గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. ఎరుమేళి నుంచి పెద్దపాదం మార్గాన్ని కూడా అధికారులు మూసివేశారు. ఈ మార్గంలో కాలికట్టె ఆశ్రమం, అజుతా వద్ద చిక్కుకుపోయిన 450 మంది భక్తులను ఎరుమేలికి.. అక్కడి నుంచి 11 బస్సుల్లో పంపాబేస్‌కు తరలించారు. తదుపరి ఆదేశాలు జారీ చేసేవరకు.. పులిమేడు, పెద్దపాదం మార్గాల్లో వనయాత్రను నిషేధించారు. రాత్రిళ్లు శబరి కొండపై రాకపోకలను నిషేధించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదాలుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఎరుమేలి పుంగావనంలో స్నానాలను నిషేధించినట్లు, పంపాలో హైఅలర్ట్ కొనసాగుతోందని ప్రకటించారు. కాగా, భారీ వర్షాల నేపథ్యంలో శబరిమల భక్తులకు భద్రత కల్పించాలని కేరళ హైకోర్టు ప్రభుత్వానికి సూచించింది. కోర్టు ఆదేశాల నేపథ్యంలో శబరిమల స్పెషలాఫీసర్ నాయర్ నేతృత్వంలో వివిధ శాఖల అధికారులతో ఉన్నతస్థాయి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అధికారులు ప్రస్తుత పరిస్థితులను సమీక్షించారు. వరద ఉధృతి పెరిగితే.. పంపాలో స్నానాలను నిషేధించాలని నిర్ణయించారు.

కుమారుడికి బైడెన్ క్షమాభిక్ష



న్యూయార్క్, డిసెంబరు 2: మరి కొద్దిరోజుల్లో అధికార పీఠం నుంచి దిగిపోబోతున్న అమెరికా అధ్యక్షుడు జో బైడెన్.. అక్రమ ఆయుధ కొనుగోలు, పన్ను ఎగవేత కేసుల్లో నిందితుడుగా ఉన్న తన కుమారుడు హంటర్ బైడెన్‌కు సంపూర్ణ, బేషరతు క్షమాభిక్షను ప్రసాదించారు! హంటర్‌పై పన్ను ఎగవేతకు సంబంధించి తొమ్మిది కేసులు నమోదయ్యాయి. ఆ కేసుల్లో అతడి నేరం రుజువైతే 17 ఏళ్ల దాకా జైలు శిక్ష పడే అవకాశం ఉంది. అలాగే. మాదక ద్రవ్యాలను వినియోగించే వ్యక్తి అయి ఉండీ తుపాకీని కలిగి ఉండడంపై మూడు కేసులు నమోదయ్యాయి. ఈ కేసుల్లో అతడికి 25 ఏళ్ల దాకా శిక్ష పడే అవకాశం ఉంది. ఈ కేసుల్లో అతడికి శిక్ష పడితే.. ఒక సిటింగ్ ప్రెసిడెంట్ కుమారుడు దోషిగా తేలడం అమెరికా చరిత్రలోనే ఇది తొలిసారి అయ్యేది. కానీ, ఆదివారం అనూహ్యంగా బైడెన్ అతడికి క్షమాభిక్ష ప్రసాదించడం సంచలనం సృష్టించింది. "న్యాయ వ్యవస్థ నిర్ణయాల్లో నేను జోక్యం చేసుకోనని అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన రోజు నుంచీ చెబుతూనే ఉన్నా. అందుకే.. ఇన్నాళ్లుగా నా కుమారుడిపై అన్యాయంగా విచారణ జరుపుతున్నా చూస్తూ ఉండిపోయాను. కానీ, నా కుమారుడిపై పెట్టిన కేసులన్నీ.. నాపై దాడి చేయడానికి రాజకీయ ప్రత్యర్థులు పన్నిన కుట్రలో భాగమే. అందుకే దీనిపై నేనొక నిర్ణయం తీసుకున్నా. దీన్ని అమెరికా ప్రజలు అర్థం చేసుకుంటారని నేను ఆశిస్తున్నా" అని బైడెన్ పేర్కొన్నారు.

తీరం దాటినా.. ఆగని విధ్వంసం

» తమిళనాట కొనసాగుతున్న తుఫాను బీభత్సం!

» కృష్ణగిరి జిల్లాలో 50 సెం.మీ. వర్షం

» చెరువు కట్టలు తెగి కొట్టుకుపోయిన వాహనాలు

» ధర్మపురి, సేలం, నామక్కల్ జిల్లాల్లోనూ భారీ వర్షాలు

» తిరువణ్ణామలైలో విరిగిపడిన కొండచరియలు

» శిథిలాల నుంచి ఆరు మృతదేహాల వెలికితీత

» మరొకరి కోసం కొనసాగుతున్న గాలింపు



తిరువణ్ణామలైలో కొండచరియల కింద చిక్కుకున్నవారి కోసం గాలిస్తున్న ఎన్డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది

చెన్నై, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను తీరం దాటిన తర్వాత కూడా తమిళనాడును అతలాకుతలం చేస్తోంది. కృష్ణగిరి జిల్లా ఊత్తాంగరై ప్రాంతంలో ఆదివారం 50 సెం.మీ.ల వర్షం కురిసింది. దీంతో ఎక్కూరు అమ్మన్ చెరువు కట్టలు తెగి దిగువకు వరద పోటెత్తి, రహదారి పక్కన నిలిపిన వ్యాన్లు, కార్లు కొట్టుకుపోయాయి. ధర్మపురి, సేలం, నామక్కల్ జిల్లాల్లోనూ భారీగా వర్షాలు కురిశాయి. ధర్మపురి జిల్లా అన్నై సత్యానగర్, ఆవిన్ నగర్, నంది నగర్ ప్రాంతాల్లో నివాసాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. విల్లుపురం జిల్లాలో తెన్‌పెన్నై, కొరైయారు వాగులు ఉధృతంగా ప్రవహించి నాలుగు గ్రామాలను దీవులుగా మార్చాయి. వరద బాధిత జిల్లాల్లో ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పర్యటించారు. బాధితులకు ఆహారపానీయాలు, దుప్పట్లు, వస్త్రాలు తదితరాలను అందజేశారు. మరోవైపు కేంద్రపాలిత ప్రాంతం పుదుచ్చేరి క్రమంగా కోలుకుంటోంది. సోమవారం సాయంత్రానికి కొన్ని ప్రాంతాల్లో వరదనీరు తగ్గుముఖం పట్టింది. తమిళనాడులోని సుప్రసిద్ధ శైవక్షేత్రం తిరువణ్ణామలైలో కొండచరియలు విరిగి పడడంతో దంపతులు సహా ఏడుగురు శిథిలాల కింద చిక్కుకున్నారు. ఆదివారం మధ్యాహ్నం తిరువణ్ణామలైలో కుండపోతగా వర్షం కురిసింది. సాయంత్రం 4.30 గంటలకు కార్తీక దీపోత్సవం సందర్భంగా అరుణాచలంపై 2,668 అడుగుల ఎత్తున మహాదీపాన్ని వెలిగించే శిఖర భాగం నుంచి హఠాత్తుగా బండరాళ్లు, మట్టిపెళ్లలు విరిగిపడ్డాయి. ఓ ఇంటిపై పెద్ద బండలు, మట్టిపెళ్లలు భారీగా పడ్డాయి. ఆ ఇంట్లో చిక్కుకుపోయిన రాజ్‌కుమార్(32), ఆయన భార్య మీనా(26), పిల్లలు గౌతమ్(9), ఇనియా(7), బంధువుల పిల్లలు మహా(12), వినోదిని(14), రమ్య(12) కోసం అధికారులు గాలింపు చేపట్టి ఆరు మృతదేహాలను వెలికితీశారు. మరొక చిన్నారి కోసం గాలింపు కొనసాగుతోంది.

రాష్ట్రాన్ని వదలని వర్షాలు

» కోస్తాలో పంటలకు నష్టం.. పెన్నాలో ఆకస్మిక ప్రవాహం

» నదిలో చిక్కుకుపోయిన పశువుల కాపరులు

» పడవల ద్వారా కాపాడిన అధికారులు

» తీవ్ర అల్పపీడనంగా మారిన వాయుగుండం

» కోస్తా, రాయలసీమకు వర్షసూచన

» నేడు వరి కోతలు కోయవద్దని సూచన

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)



పెన్నానది చిక్కుకుపోయిన పశువుల కాపరులు

ఫెంగల్ తుఫాన్ ప్రభావం ఇంకా వీడలేదు. సోమవారం కూడా భారీ వర్షాలు కురవడంతో నెల్లూరు జిల్లాలో రోడ్లపై నీరు ప్రవహించింది. ఉత్తర తమిళనాడు పరిసరాల్లో ఉన్న వాయుగుండం మరింత బలహీనపడి సోమవారం తీవ్ర అల్పపీడనంగా మారింది. సముద్రం నుంచి భారీగా తేమ భూ ఉపరితలంపైకి రావడంతో ఆదివారం నుంచి కోస్తాంధ్ర, రాయలసీమల్లో అనేకచోట్ల వర్షాలు, అక్కడక్కడ భారీవర్షాలు కురిశాయి. నెల్లూరు జిల్లా గుడ్లూరులో 122.2, గూడూరు మండలం దారకానిపాడులో 109, కందుకూరు మండలం ఆనందపురంలో 95.25, ఓలేటిపాలెం మండలం నలందలపూర్‌లో 95, లింగసముద్రంలో 90.2, భీమవరంలో 88.5, ఉలవపాడులో 86.4, వలేటివారిపాలెంలో 80, ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం కొట్లపల్లిలో 79.5, బోగోలులో 77.6, కాకినాడ జిల్లా కాజులూరులో 71.75 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. కోస్తాలో అనేక ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయి. మంగళవారం కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల వర్షాలు, శ్రీసత్యసాయి జిల్లాలో ఒకటి, రెండుచోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. అందువల్ల కోస్తాలో రైతులు మంగళవారం వరి కోతలు కోయవద్దని సూచించారు. బుధవారం నుంచి కొంతమేర ఆకాశం నిర్మలంగా మారుతుందని అంచనా వేశారు.

పశువుల కాపరులను కాపాడిన అధికారులు

పెన్నానది మధ్యభాగంలోకి పశువుల్ని మేపేందుకు వెళ్లిన ఆరుగురు కాపరులు ఆకస్మిక ప్రవాహం రావడంతో చిక్కుకుపోయారు. వారిని అధికారులు కాపాడారు. నెల్లూరు జిల్లా కోవూరు మండలం జమ్మిపాలెంకు చెందిన మదనపల్లి నవీన్, చల్లకొలును కావమ్మ, కత్తి గోవింద్, చలంశెట్టి పోలయ్య, కత్తి గణేశ్, కత్తి వెంకటరమణయ్య సోమవారం పశువుల్ని తోలుకుని పెన్నానదిలోకి వెళ్లారు. నది ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో వారంతా నది మధ్యభాగంలో చిక్కుకుపోయారు. ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి జిల్లా ఉన్నతాధికారుల్ని అప్రమత్తం చేయడంతో అగ్నిమాపక సిబ్బంది పడవల ద్వారా ఆ ఆరుగురిని కాపాడారు. దీంతో అధికారులను ఎమ్మెల్యే అభినందించారు.

‘వైద్య సేవ’కు గ్రహణం!

ట్రస్టులో గాడి తప్పిన పాలన.. ఇన్‌చార్జి సీఈవోల కుర్చీలాట

ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌లో పాలన గాడి తప్పింది. ఒకవైపు ఇన్‌చార్జి సీఈవోలు, మరోవైపు నాన్ మెడికల్ అధికారులతో అంతా అస్తవ్యస్తంగా మారింది. నిర్వహణ లోపాలతో క్షేత్రస్థాయిలో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ రోగుల సేవల కంటే సొంత వ్యవహారాలకే ప్రాధాన్యం ఇస్తున్నారు. రెగ్యులర్ సీఈవో లేకపోవడం, కొత్తగా వచ్చినవారికి అనుభవం లేకపోవడంతో పాటు ట్రస్టులో అనుభవం ఉన్న ఉద్యోగులను అధికారులు పక్కన పెట్టడంతో సమస్యలు మరింత జటిలమవుతున్నాయి.

- ఒకే ఏడాదిలో ఐదుగురు మార్పు
- సొంత పనులకే ఉద్యోగుల ప్రాధాన్యం
- రోగుల వైద్యం పట్ల తీవ్ర నిర్లక్ష్యం
- వైసీపీ మద్దతుదారుల అడ్డాగా ట్రస్ట్
- ధనుంజయరెడ్డి ఓఎస్డీకి సీఎంవో బ్రేక్
- కీలక పోస్టులో మాజీ మంత్రి పీఏ
- తాజాగా మొరాయించిన సర్వర్
- వేల మంది రోగులకు అవస్థలు
- కొత్త అడ్మిషన్లు, డిశ్చార్జ్‌లు బంద్
- డయాలసిస్ సేవలకూ ఆటంకం
- రెగ్యులర్ సీఈవో ఉంటేనే దారిలోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో 1.40 లక్షల కుటుంబాలకు ఆరోగ్య భరోసా కల్పించే వ్యవస్థ ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్. ఇలాంటి వ్యవస్థకు రెగ్యులర్ సీఈవోను నియమిస్తే ఎలాంటి ఇబ్బందులు లేకుండా రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందుతాయి. అయితే ఈ ట్రస్టుకు ప్రభుత్వం సీఈవోను నియమించినా, కొద్ది రోజులకే బదిలీ చేస్తోంది. హరేంద్రీ ప్రసాద్ తర్వాత ఇన్‌చార్జి సీఈవోగా వెంకటేశ్వర్లు విధులు నిర్వహించారు. ఆయన తర్వాత వచ్చిన డి.కె. బాలాజీని కృష్ణాజిల్లా కలెక్టర్‌గా వెళ్లడంతో ఆ స్థానంలో మంజులను నియమించారు. తర్వాత ఆమె స్థానంలో లక్ష్మీశకు పోస్టింగ్ ఇచ్చారు. ఆయన ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్‌గా బదిలీ కావడంతో ఇప్పుడు మళ్లీ మంజులను ప్రభుత్వం ఇన్‌చార్జి సీఈవోగా నియమించింది. ఏడాదిలో ఐదుగురు సీఈవోలు మారడంతో ట్రస్ట్‌లో పాలన అస్తవ్యస్తంగా మారింది. లక్ష్మీశ రెగ్యులర్ సీఈవోగా ఉన్నప్పటికీ మరో నాలుగు విభాగాల బాధ్యతలు కూడా అప్పగించడంతో ఆయన ట్రస్ట్‌పై పూర్తిస్థాయిలో దృష్టి సారించలేదు.

ఆకాశరామన్న ఉత్తరాల కలకలం

ట్రస్ట్‌లో ఆకాశరామన్న ఉత్తరాలు కలకలం రేపుతున్నాయి. కొన్నేళ్ల నుంచి ట్రస్ట్‌లో పనిచేస్తున్న ఉద్యోగులపై గుర్తుతెలియని వ్యక్తులు ఆకాశరామన్న ఉత్తరాలు రాస్తున్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వీటి సంఖ్య ఎక్కువైంది. ఉత్తరాలపై అప్పటి సీఈవో లక్ష్మీశ ప్రత్యేక దృష్టిపెట్టి కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. దానిద్వారా ప్రతి ఆస్పత్రికి ఫోను చేసి అన్ని కోణాల్లో విచారణ చేశారు. నెట్‌వర్క్ ఆస్పత్రుల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాలేదు. ట్రస్ట్ నుంచి వివిధ ఆరోపణలతో తొలగించిన ఉద్యోగులే ఈ ఉత్తరాలు రాస్తున్నారని విచారణలో వెల్లడైంది. ఇప్పుడు ఇన్‌చార్జి సీఈవో రావడంతో మళ్లీ ఉత్తరాలు రావడం మొదలైంది. వైసీపీ ప్రభుత్వంలో జరిగిన క్లెయిమ్స్ స్కామ్, డెంటల్ స్కామ్‌ల్లో కలిపి దాదాపు 15మంది ఉద్యోగులను తొలగించారు. వారంతా ట్రస్ట్‌పై అనేక ఆరోపణలు చేస్తూ ఉత్తరాలు రాయడం ప్రారంభించారు. వీరిలో కొంతమంది టీడీపీ, బీజేపీ నాయకుల వద్దకు వెళ్లి ఫిర్యాదులు చేస్తున్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్‌కు ప్రభుత్వం రెగ్యులర్ సీఈవోని నియమిస్తే తప్ప వ్యవస్థ గాడిలో పడేలా కనిపించడం లేదు.

వైసీపీ బ్యాచ్‌కు అందలం

వైద్య సేవ ట్రస్ట్‌లోకి రావడానికి వైసీపీ అనుకూల అధికారులు శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం మారగానే ధనుంజయరెడ్డి ఓఎస్డీగా విధులు నిర్వహించిన మహిళా అధికారి ట్రస్ట్‌లోకి వచ్చేందుకు విశ్వప్రయత్నం చేశారు. ఆరోగ్యశాఖ అధికారులు క్లియరెన్స్ ఇచ్చినా సీఎంవో జోక్యంతో ఆమె ప్రయత్నాలకు బ్రేక్ పడింది. వైసీపీ ప్రభుత్వంలో ఓ మంత్రి వద్ద పీఏగా పనిచేసిన డీఎల్‌డీవో ఒకరు ట్రస్ట్‌లో అదనపు సీఈవోగా చేరారు. ఈయనపై అనేక ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వంలో పంచాయతీరాజ్ ఉద్యోగులకు పదోన్నతులు, ఇతర ప్రయోజనాలు కల్పిస్తామని రూ.కోట్లలో వసూళ్లు చేశారు. ట్రస్ట్ పాలన మొత్తం సదరు అధికారి చేతుల్లో పెట్టారు. రెగ్యులర్ సీఈవో లేకపోవడంతో ఆయన ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. వైసీపీ ప్రభుత్వంలో గుంటూరుకు చెందిన ఓ ఆస్పత్రి క్లెయిమ్‌ల స్కామ్‌కు పాల్పడింది. ఆ ఆస్పత్రిని కాపాడాలని ఆయన తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. తాను ఆరోగ్య మంత్రి తాలుకా అని ఉద్యోగుల వద్ద చెబుతూ, పెత్తనం చెలాయిస్తున్నారు. ఈయనతో పాటు పల్నాడు జిల్లాకు చెందిన మరో అధికారి ట్రస్ట్‌లోకి వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆయనపైనా ఆరోపణలున్నాయని తెలుస్తోంది.

రోగులకు సర్వర్ కష్టాలు

ట్రస్ట్ సర్వర్లు నవంబరు 28న ఉదయం ఆగిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. వేల మంది రోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కొత్తగా ఆస్పత్రుల్లో చేరేందుకు వెళ్లినవారికి రిజిస్ట్రేషన్లు కాలేదు. డిశ్చార్జి అయి ఇంటికి వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నవారు ఆస్పత్రుల్లోనే ఉండిపోయారు. డయాలసిస్ సేవలకూ బ్రేక్ పడింది. శస్త్రచికిత్సలు నిలిచిపోయాయి. సాయంత్రం 7గంటలకు సర్వర్లు అందుబాటులోకి వచ్చేవరకూ రోగులను పట్టించుకున్న నాథుడే లేడు. సాధారణంగా ఇలాంటి పరిస్థితుల్లో రోగులకు బయోమెట్రిక్ నుంచి మినహాయింపు ఇవ్వాలి. అధికారులు మాత్రం సర్వర్లు బాగయ్యేవరకూ సేవలు నిలిపివేశారు.



అప్పు తీర్చమంటే... ఎంపీ అవినాశ్‌రెడ్డి పేరు చెప్పి బెదిరిస్తున్నారు

- లోకేశ్ ప్రజాదర్బార్‌లో మొరపెట్టుకున్న మహిళ
- నా భర్తను సౌదీలో అక్రమంగా నిర్బంధించారు విడిపించి, స్వదేశానికి రప్పించండి... ఓ మహిళ వేడుకోలు


మంత్రి లోకేశ్‌కు మొరపెట్టుకుంటున్న సత్యసాయి జిల్లా తూపల్లి అమ్మాజీ

తాడేపల్లి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ‘మా వద్ద అప్పు తీసుకున్నారు. తిరిగి చెల్లించమంటే ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ మధు పేర్లు చెప్పి బెదిరిస్తున్నారు’ అని ఒక మహిళ, మంత్రి నారా లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. తాడేపల్లి మండలం ఉండవల్లిలోని ఆయన నివాసంలో సోమవారం ప్రజాదర్బార్ జరిగింది. ఈ సందర్భంగా ప్రజా దర్బార్‌కు వచ్చిన సత్యసాయి జిల్లా తూపల్లికి చెందిన సీ అమ్మాజీ, మంత్రి లోకేశ్‌తో మాట్లాడుతూ, ‘పులివెందులకు చెందిన షేక్ సాయి అనే వ్యక్తి దశల వారీగా రూ.40 లక్షల వరకు అప్పు తీసుకున్నారు. డబ్బు చెల్లించమని అడిగితే ఎంపీ అవినాశ్‌రెడ్డి, వైఎస్ మధు పేర్లు చెప్తున్నారు. వారి అనుచరులమంటూ బెదిరిస్తున్నారు. డబ్బులు ఇప్పించి, వారి నుంచి రక్షణ కల్పించాలి’ అని విజ్ఞప్తి చేశారు. ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం దరిమడుగులో పేద రైతుకు చెందిన 13.70 ఎకరాలను ఆక్రమించి మాజీ మంత్రి, వైసీపీ నేత ఆదిమూలపు సురేశ్, అతని సోదరుడు ఆదిమూలపు సతీశ్ ఇంజనీరింగ్ కాలేజి నిర్మించారని, విచారించి న్యాయం చేయాలని దర్శికి చెందిన బి వెంకట రామాంజులరెడ్డి, కేసరి రంగలక్ష్మమ్మ లోకేశ్‌కు ఫిర్యాదు చేశారు. 2003లో ఆదిమూలపు సురేశ్ తండ్రి దివంగత ఆదిమూలపు శామ్యూల్ జార్జి సర్వే నం.841/1లో ఆరుగురు పేద రైతులకు చెందిన భూములను తప్పుడు ప్రతాలతో రిజిష్టరు చేయించుకున్నారు. అనంతరం ఆ భూముల్లో డాక్టర్ శామ్యూల్ జార్జి ఇంజనీరింగ్ కాలేజి నిర్మించారు. సదరు భూముల కోసం 15 ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ఏ అధికారి ఇంతవరకూ స్పందించ లేదు. భూములు ఇప్పించండి’ అని కోరారు. సౌదీ అరేబియాలో అక్రమ నిర్బంధానికి గురైన తన భర్త షేక్ ఇస్మాయెల్‌ను విడిపించి స్వదేశానికి రప్పించేలా చర్యలు తీసుకోవాలని ఏలూరు జిల్లా తంగెళ్ల మూడికి చెందిన షేక్ నగీనా మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. మంగళగిరి పట్టణంలోని ఆటోనగర్ ఆల్ఫా సెంటర్, శ్రీ బాలాజీ ఫార్చ్యూన్ టవర్స్ ప్రాంతంలో డ్రెయినేజి నిర్మాణంతోపాటు పూర్తి నిడివి గల రోడ్డు సౌకర్యం కల్పించాలని స్థానికులు విన్నవించారు. ప్రజారవాణా శాఖలో రెగ్యులర్ డ్రైవర్లుగా నియామక పత్రాలు పొందిన తమకు పూర్తి జీతం మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సిబ్బంది మంత్రికి విజ్ఞప్తి చేశారు. 14 నెలలుగా పూర్తి జీతం రాక ఇబ్బందులు పడుతున్నామని లోకేశ్ వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద అవుట్ సోర్సింగ్ విధానంలో పని చేస్తున్న 1,800 మందికి వేతనాల పెంపుతో పాటు సర్వీసుతో కూడిన ఎఫ్‌టీఈ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. భారీగా వచ్చిన అర్జీదారులు తమ సమస్యలను విన్నవించారు. అందరి సమస్యలనూ ఓపిగ్గా విన్న లోకేశ్... పరిష్కరిస్తానంటూ హామీ ఇచ్చారు.

తిరుమల, తిరుపతి స్థానికులకు ఉచిత దర్శన టోకెన్ల జారీ


తిరుపతిలో స్థానికులకు శ్రీవారి దర్శన టోకెన్ అందజేస్తున్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు

తిరుమల, డిసెంబరు2(ఆంధ్రజ్యోతి): తిరుమల, తిరుపతి స్థానికులకు ‘ప్రతినెలా మొదటి మంగళవారం దర్శనం’ టోకెన్లను సోమవారం జారీ చేశారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే గతంలో ఉన్న స్థానికుల దర్శనాన్ని తిరిగి ప్రారంభిస్తామని కూటమి నేతలు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కూటమి ప్రభుత్వంలో ఏర్పాటైన టీటీడీ ధర్మకర్తల మండలి తొలి సమావేశంలోనే ప్రతి నెలా మొదటి మంగళవారం స్థానికులకు ఉచిత దర్శన విధానాన్ని తిరిగి ప్రారంభించాలని తీర్మానం చేశారు. ఇందులో భాగంగా మంగళవారం దర్శనానికి సంబంధించి తిరుపతిలోని మహతి ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఏడు కౌంటర్ల ద్వారా టోకెన్లు జారీ చేశారు. వేకువ జాము 4 గంటలకు ప్రారంభం కాగా, ఉదయం 11.30 గంటల సమయానికి 2,500 టోకెన్లు జారీ చేశారు. టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, చంద్రగిరి ఎమ్మెల్యే నాని, ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి కొంతమంది స్థానికులకు స్వయంగా టోకెన్లు ఇచ్చారు. ఇక, తిరుమలలోని బాలాజీనగర్ కమ్యూనిటీ హాల్‌లో 403 టోకెన్లు జారీ చేశారు.

లెబనాన్‌లో తుపాకీ పేలి ప్రవాసాంధ్రుడి మృతి

- మృతుడు ఖతర్‌లో అత్యంత సంపన్నుడి వ్యక్తిగత సిబ్బంది
- మృతుడి స్వగ్రామం కాళ్ల మండలం కొలనపల్లి

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్‌కు చెందిన తన యజమాని వద్ద పనిచేసే క్రమంలో తుపాకీని శుభ్రపరుస్తుండగా ప్రమాదవశాత్తూ పేలి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒక యువకుడు మరణించాడు. ఈ ఘటన లెబనాన్‌లో చోటుచేసుకుంది. పశ్చిమ గోదావరి జిల్లా కాళ్ల మండలం కొలనపల్లి గ్రామానికి చెందిన 26 ఏళ్ల యాల్ల జాన్ డేవిడ్.. ప్రపంచంలో అత్యంత సంపన్నుల్లో ఒకరైన ఖతర్‌లోని ఒక ప్రముఖ అరబ్బు కుటుంబ వ్యక్తిగత సిబ్బందిగా పని చేస్తున్నాడు. ఆ కుటుంబానికి అత్యంత విశ్వసనీయపాత్రుడిగా పని చేసే డేవిడ్.. యజమాని వెంట తరచూ ఇతర దేశాలకూ వెళ్తుంటాడు. ఈ క్రమంలో ఏడు నెలల క్రితం లెబనాన్‌కు వెళ్లి అక్కడ పని చేస్తున్నాడు. గత వారం యాజమాని ఇంట్లో సామాన్లతో పాటు తుపాకీని శుభ్రపరుస్తుండగా అది ప్రమాదవశాత్తు పేలిపోయి డేవిడ్ మరణించాడని సమాచారం. ఘటనపై పూర్తిస్థాయిలో పోలీసు, వైద్య నివేదికలు ఇంకా భారతీయ ఎంబసీకి అందలేదు. వీలైనంత త్వరగా మృతుని కుటుంబానికి న్యాయం చేకూర్చే విధంగా భారతీయ ఎంబసీ అధికారులు ప్రయత్నిస్తున్నట్లు సమాచారం.

‘రా ఎన్టీఆర్’ సంస్థ ఆధ్వర్యంలో పిఠాపురంలో ఆహారం పంపిణీ


పిఠాపురంలో అన్నార్తులకు భోజన ప్యాకెట్లు అందజేస్తున్న రా ఎన్టీఆర్ సంస్థ ప్రతినిధులు

పిఠాపురం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ‘ఆకలితో ఉన్నవారిని వెతుక్కుంటూ వెళ్లి కడుపు నింపుదాం పదండి’ అనే నినాదంతో చెన్నైకు చెందిన రా ఎన్టీఆర్ సంస్థ (నెట్‌వర్క్) ఎన్టీఆర్ మీల్ కార్యక్రమానికి సోమవారం శ్రీకారం చుట్టింది. ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణం పాదగయ క్షేత్రం వద్ద ఈ కార్యక్రమాన్ని సంస్థ ప్రతినిధులు ప్రారంభించారు. జనవరి నాటికి రాష్ట్రంలో 33 ప్రాంతాలకు కార్యక్రమాన్ని విస్తరిస్తామని సంస్థ ప్రతినిధి కిషోర్ తెలిపారు.

నదుల అనుసంధానంపై 17న జాతీయ స్థాయి సమావేశం

- రాష్ట్రాలకు వర్తమానం పంపిన ఎన్‌డబ్ల్యూడీఏ

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నదుల అనుసంధానంపై మరోసారి రాష్ట్రాల అభిప్రాయం తీసుకోవడానికి నేషనల్ వాటర్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఎన్‌డబ్ల్యూడీఏ) సిద్ధమైంది. ఈ నెల 17వ తేదీన జాతీయ స్థాయి సమావేశం నిర్వహించాలని నిర్ణయించింది. ఈ మేరకు అన్ని రాష్ట్రాల జలవనరుల శాఖ మంత్రులు, ఇంజనీర్ ఇన్ చీఫ్‌లు, సూపరింటెండింగ్ ఇంజనీర్లకు సోమవారం ఆహ్వాన పత్రాలు పంపింది. నదుల అనుసంధానంపై ఇప్పటివరకు అనుసరించిన విధానాలు, రాష్ట్రాలతో నిర్వహించిన సమావేశాలు, ఆయా రాష్ట్రాల అభిప్రాయాలను గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాగా, రాష్ట్ర ప్రభుత్వం గోదావరి-కృష్ణా-కావేరి అనుసంధాన ప్రక్రియకు సిద్ధమవుతోంది. పోలవరం నుంచి నాగార్జున సాగర్-బొల్లాపల్లి మీదుగా కావేరి అనుసంధాన ప్రక్రియ చేపట్టాలని భావిస్తోంది. ఇప్పటికే పోలవరం నుంచి పట్టిసీమ ద్వారా కృష్ణా నదికి గోదావరి జలాల అనుసంధాన ప్రక్రియను 2014-19 కాలంలోనే చంద్రబాబు ప్రభుత్వం పూర్తి చేసింది. ఇప్పుడు.. దాన్ని విస్తరిస్తూ ప్రకాశం బ్యారేజీకి సమీపంలో వైకుంఠపురం బ్యారేజీ ద్వారా రోజుకు రెండు టీఎంసీల చొప్పున నాగార్జునసాగర్ కాలువకు మళ్లించి.. అక్కడి నుంచి బొల్లాపల్లి రిజర్వాయరుకు తరలించాలని నిర్ణయించారు. అయితే.. గోదావరి - కృష్ణా జలాల అనుసంధానం విషయంలో తెలంగాణ అభిప్రాయం విరుద్ధంగా ఉంది. ఇచ్చంపల్లి నుంచి గోదావరి జలాలను సాగర్‌కు తరలించాలన్న యోచనలో తెలంగాణ ఉంది. కేంద్ర ప్రభుత్వం భావిస్తున్నట్లుగా అఖండ గోదావరి ప్రతిపాదనలతో తెలంగాణ ఏకీభవించడం లేదు. ఈ నేపథ్యంలో ఈ నెల 17న జరగనున్న ఎన్‌డబ్ల్యూడీఏ సమావేశంలో ఏపీ, తెలంగాణ వాదనలు ఎలా ఉంటాయన్నది ఆసక్తిగా మారింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

అంతుచిక్కని రాజకీయం

ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిత్యం కాట్లాడుకొనేకంటే, వెన్నుపోట్లతో ప్రజాతీర్పును వక్రీకరించడం కంటే, ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో పదవులు చక్కగా పంచుకొని, బలమైన ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకొని, నాలుగుకాలాలు ఏలుకోవడమే ఉత్తమం. అయినా, మహారాష్ట్రలో మహాయుతి ప్రభుత్వం ఏర్పాటుకు ఏకంగా పదిరోజులు పైనే పడుతూండటం చాలామందికి ఆశ్చర్యం కలిగిస్తోంది. గత ఐదేళ్ళ వెన్నుపోటు రాజకీయాల అనుభవం రీత్యా కాబోలు, బీజేపీ అతి జాగ్రత్తగా, మర్యాదగా వ్యవహరిస్తోంది. అత్యధికస్థానాలు గెలుచుకొని కూడా మరీ ఇంత వినయం ఎందుకని పార్టీ నాయకులే ఆశ్చర్యపోయే రీతిలో పెద్దలు నడుస్తున్నారు. ఏక్‌నాథ్ శిందే ఒత్తిళ్ళు, అలకల వల్లనే ప్రభుత్వం ఏర్పాటులో ఇంతటి జాప్యం జరుగుతోందన్నది కాదనలేని నిజం. సోమవారం మహాయుతి నాయకుల సమావేశం మరోమారు రద్దయింది. శిందే అందుబాటులో లేని కారణంగా ఇలా జరగడం గత నాలుగురోజుల్లో ఇది రెండోసారి. పాపం ఆయనకు ఒంట్లో బాగుండడం లేదట. శిందే కోరుతున్నదానిని కాదనడానికి, మెడలు వంచడానికి బీజేపీ ఎందుకు వెనకడుగువేస్తోందో, సాధారణ జనానికి అంతుచిక్కని మరో వ్యూహం ఏమైనా ఇందులో ఉన్నదో తెలియదు.

ఎవరు ముఖ్యమంత్రి అన్నది తేల్చుకోకుండానే, ప్రమాణస్వీకారోత్సవాన్ని మాత్రం బాగా ముందుగానే నిర్ణయించుకున్నారు. ఐదవతేదీ ప్రమాణం చేయబోయేవారెవ్వరో నాలుగున నిర్ణయమవుతుంది. నిర్మలా సీతారామన్, విజయ్ రూపానీ సమక్షంలో బీజేపీ శాసనసభాపక్షనేతగా దేవేంద్ర ఫడణవీస్ ఎన్నిక, సీఎంగా ఆయన పేరు ప్రకటన జరిగిపోతాయని వార్తలు వస్తున్నాయి. ఫడణవీస్ తరఫున శిందేను పలకరించి, పరామర్శించి వచ్చిన గిరీశ్ మహాజన్ ఆయన అలకబూనలేదన్న విషయాన్ని మీడియాకు మరీ ప్రత్యేకంగా విన్నవించారు. డిప్యూటీ సీఎంతో పాటు, హోంశాఖ కూడా తనకే కావాలని శిందే పట్టుబడుతున్నారనీ, కావస్తే మరో రెండు తీసుకోగానీ, హోం మాత్రం ఇచ్చేది లేదని బీజేపీ అన్నందుకు శిందే ఆగ్రహించారని వార్తలు వెలువడుతున్న తరుణంలో, తనకు అసలు మంత్రిపదవే అక్కరలేదని జూనియర్ శిందే చేసిన వ్యాఖ్యకు ఎంతో కొంత విలువైతే ఉంది.


ఫడణవీస్ కాక, మరొకరు తెరమీదకు వస్తారన్న ఊహాగానాలేమీ లేవు కానీ, శిందే ఎందుకు తగ్గడం లేదన్నది ప్రశ్న. సామాన్యుడిలాగా ఉంటాను కనుక, ప్రజలు మళ్ళీ తననే ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని ఓ పక్క అంటూనే, మోదీ మాటకు కట్టుబడతానని మాట ఇచ్చిన ఆయన, ఆ తరువాత పట్టుబిగించిన విషయం తెలిసిందే. 288మంది ఎమ్మెల్యేలున్న సభలో బీజేపీకి 132 వచ్చిన తరువాత కూడా శిందేయే మళ్ళీ సీఎం అని ఆయన పార్టీచెప్పుకుంటూ బిహార్‌లో నితీశ్ ప్రభుత్వాన్ని ఉదాహరించింది. ఎవరెన్ని గెలిచినా, మళ్ళీ మీ నాయకుడే సీఎం అని బీజేపీ తమకు ఎన్నికలముందు హామీ ఇచ్చిందని కూడా శిందేసైన్యం వాదించింది. ఫలితాలు వెలువడిన నాలుగురోజులకు దిగివచ్చి, నేను అడ్డంకికాబోను అని ప్రకటించిన శిందే, సీఎం పదవిలో రాజీపడినా హోం మాత్రం వదలడం లేదు. నిన్నటివరకూ తాను సీఎంగా ఉన్నప్పుడు, డిప్యూటీ సీఎం ఫడణవీస్ దగ్గర హోం ఉన్నందున, ఇప్పుడు కూడా అదే న్యాయం అమలు కావాలి కదా అన్నది మంచి ప్రశ్న. కానీ, ఉద్ధవ్‌పార్టీని చీల్చి, అగాడీ ప్రభుత్వాన్ని నిలువునా కూల్చినప్పుడు బీజేపీ తాను పక్కకు తప్పుకొని, అనూహ్యంగా శిందేను ముఖ్యమంత్రిగా కూచోబెట్టడానికీ, ఇప్పటి అవసరాల్లోనూ, సంఖ్యాబలాల్లోనూ ఎంతో తేడావుంది. శిందే ప్రోద్బలం మేరకు శివసేన ఎమ్మెల్యేలు రాత్రికిరాత్రి విమానాలు ఎక్కి ఇతరప్రాంతాలకు తరలిపోతున్న విషయం అప్పట్లో ముఖ్యమంత్రి ఉద్ధవ్‌ఠాక్రేకు తెలియరాలేదని, హోంశాఖ ఎన్సీపీ చేతుల్లో ఉండటం ఇందుకు కారణమని అప్పట్లో విశ్లేషణలు వచ్చాయి. ఆ సంగతి అటుంచితే, విపక్షాలతో సహా సమస్తపార్టీలనూ, రాష్ట్రరాజకీయాలను నియంత్రించగలిగే శక్తిమంతమైన హోం చేతుల్లో ఉండటానికీ, కేవలం డిప్యూటీ సీఎం అనిపించుకోవడానికీ ఎంతో తేడా ఉన్నదని శిందే అభిప్రాయం. ఏక్‌నాథ్ శిందేలను సృష్టిస్తాం అని విపక్షపార్టీలను చీటికీమాటికీ బెదిరించే బీజేపీకి, ఆ పదవి అతడి చేతికి పోతే ఏమి జరుగుతుందోనన్న వెరపు ఉండటం సహజం. అజిత్‌పవార్ వెంటనే ఫడణవీస్‌కు మద్దతు ప్రకటించి ఆటలో మంచి ఎత్తు వేశారు. అంతిమంగా శిందే సర్దుకుపోవచ్చునేమో కానీ, ఆరంభంలో రేగిన ఈ అనుమానాలు రేపటి రాజకీయాన్ని ప్రభావితం వేసే ప్రమాదమైతే ఉంది.

ఉన్నత విలువల ఖని

మన తొలి దేశాధ్యక్షుడు డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ 140వ పుట్టిన రోజు నేడు. ఆయన 1884 డిసెంబర్ 3న బిహార్‌లోని జీరాడి గ్రామంలో మహదేవ్ సహాయి, కమలేశ్వరిదేవి దంపతులకు జన్మించారు. వీరు ధనికులైనా నిరాడంబర జీవితాన్ని సాగించేవారు. రాజేంద్రప్రసాద్ జీవితమంతా బిహార్ పౌరుడిగా గడిపినా ఆయన పూర్వీకులు మాత్రం ఉత్తర ప్రదేశ్‌కు చెందినవారు.

కలకత్తా, ప్రెసిడెన్సీ కాలేజీలో విద్యాభ్యాసం సమయంలో రాజేన్ బాబు నాయకత్వ లక్షణాలకు ఆకర్షితులైన విద్యార్థులు స్టూడెంట్స్ యూనియన్ కార్యదర్శిగా భారీ మెజారిటీతో గెలిపించారు. 1910లో కలకత్తా విశ్వవిద్యాలయం నుంచి ఆయన న్యాయశాస్త్రంలో పట్టభద్రులయ్యారు. 1917 వరకు కలకత్తా, బిహార్ న్యాయస్థానాలలో న్యాయవాదిగా గడిపారు. రాజేంద్రప్రసాద్ న్యాయ పరిజ్ఞానం, వాదనా పటిమలు విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ జస్టిస్ అశుతోష్ ముఖర్జీని ఆకట్టుకోవడంతో యూనివర్సిటీ 'లా' విభాగంలో అధ్యాపకునిగా నియమించారు.

బిహార్‌లోని 'చంపారన్' రైతుల దుస్థితిని స్వయంగా పరిశీలించడానికి 1917లో వచ్చిన మహాత్మాగాంధీ వ్యక్తిత్వానికి ఆకర్షితుడైన రాజేంద్రప్రసాద్ ఆయనకు అనుయాయిగా మారారు. అంత వరకు ఆడంబర జీవితం గడిపిన రాజేంద్రప్రసాద్ ఒక్కసారిగా నిరాడంబరుడిగా, సంఘ సేవకుడిగా, ఉదార స్వభావుడిగా రూపాంతరం చెందారు.



మహాత్ముడు 1919లో దేశ వ్యాప్తంగా ఇచ్చిన 'సత్యాగ్రహం' పిలుపును పురస్కరించుకుని ప్రజా చైతన్యమే లక్ష్యంగా బిహార్‌లోని అన్ని వర్గాల ప్రజలను సమీకరించి సత్యాగ్రహోద్యమాన్ని విజయవంతం చేశారు రాజేంద్రబాబు. బహిరంగ సభలను నిర్వహించి ప్రజలలో చైతన్య దీపికలను రగిలించారు.

సహాయ నిరాకరణోద్యమంలో పాలుపంచుకునేందుకు 1920లో న్యాయవాద వృత్తిని, పాట్నా విశ్వవిద్యాలయం సెనేట్, సిండికేట్ సభ్యత్వాలను త్యాగం చేశారు రాజేంద్రప్రసాద్. 1921లో ప్రభుత్వ కళాశాలలను బహిష్కరించమని పిలుపునిచ్చి, అదే సంవత్సరం జనవరి 5న తన స్వగృహంలోనే జాతీయ కళాశాలను ప్రారంభించారు. తన జీవితంలో అనేక విద్యా సంస్థలతో సంబంధ, బాంధవ్యాలను ఏర్పరచుకొని విద్యారంగానికి ఎనలేని సేవలు అందించారు. త్రిభాషా సూత్రాన్ని ప్రతిపాదించారు. గ్రామీణ విశ్వవిద్యాలయాల ఆవశ్యకతను విపులీకరించారు. మన విద్యావిధానం నిజ జీవితంలో ఎదురయ్యే సమస్యల పరిష్కారానికి దోహదం చేసేదిగా ఉండాలని ఆయన సూచించారు. గాంధీజీ ఆశయాలను ప్రచారం చేసే నిమిత్తం బిహార్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించి, అక్కడి వారి స్థితిగతులను ఆకళింపు చేసుకొని ప్రజలకు చేరువయ్యారు.

రాజేంద్రప్రసాద్ జాతీయ కాంగ్రెస్ కార్యదర్శిగా 1923లో పదవీ బాధ్యతలు చేపట్టారు. 1928లో విదేశీ యాత్రలు ప్రారంభించి అక్కడి ప్రజలతో యుద్ధ వ్యతిరేక ప్రచారాన్ని చేపట్టారు. భారతదేశ ఉద్యమాల గురించి బహుళ ప్రచారం చేశారు. కాంగ్రెస్ ఇచ్చిన 'సైమన్ గో బ్యాక్' పిలుపు అందుకొని రాజ్యాంగ సంస్కరణల కమిటీ బహిష్కరణోద్యమాన్ని బిహార్‌లో సమర్థంగా నిర్వహించారు. అనేకసార్లు బ్రిటిష్ ఖాకీల దౌర్జన్యానికి గురయ్యారు. అయినా మొక్కవోని ధైర్యంతో ప్రభుత్వానికి వ్యతిరేకంగా అనేక ఉద్యమాలను నడిపారు. 1934 నుంచి 1940 వరకు కాంగ్రెస్ అధ్యక్షునిగా ఉన్నారు. కాంగ్రెస్ పార్టీ స్వర్ణోత్సవాలను 1935లో సమర్థంగా నిర్వహించారు. అదే సంవత్సరంలో 'సంపూర్ణ స్వరాజ్యం' కోసం పిలుపునిచ్చారు. 1939లో కాంగ్రెస్ నాయకులను సంప్రదించకుండా యుద్ధం ప్రకటించినందుకు నిరసనగా ప్రాంతీయ ప్రభుత్వాల నుంచి కాంగ్రెస్ వాదులు అందరినీ రాజీనామా చేయించారు. అలా యుద్ధ సమయంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా సహాయ నిరాకరణోద్యమాన్ని చేపట్టారు. 1941 మే నెలలో ఉవ్వెత్తున లేచిన మత కలహాలను తన చర్యల ద్వారా, వాగ్ధాటితో అదుపు చేశారు. బాధితులను స్వయంగా పరామర్శించి కాంగ్రెస్ సేవా దళాలను స్థాపించి ఆదుకున్నారు.

ఆపద్ధర్మ ప్రభుత్వంలో 1946లో వ్యవసాయ శాఖ మంత్రిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు కృషి చేశారు. వ్యవసాయ ఉత్పత్తులను పెంచేందుకు 'గ్రో మోర్ ఫుడ్' అనే నినాదాన్ని ఇచ్చారు. అదే సంవత్సరం డిసెంబర్‌లో రాజ్యాంగపరంగా ఏర్పడిన అసెంబ్లీకి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆ పిమ్మట 1950, 1952, 1957 సంవత్సరాలలో స్వతంత్ర భారతావనికి అధ్యక్షునిగా ఎన్నికయ్యారు. ఆయన సారథ్యంలో భరతమాత పునీతమైంది. తన అధికారాన్ని సామాన్య మానవుని సంక్షేమానికి వినియోగించిన కార్యదక్షుడు రాజేంద్రప్రసాద్. ఉన్నత విలువలను ప్రదర్శించి దేశ, విదేశీ ప్రముఖుల ప్రశంసలు అందుకున్న బాబూ రాజేంద్రప్రసాద్ చిరస్మరణీయుడు. 79వ ఏట 1963 ఫిబ్రవరి 28న ఆయన తన జీవన యాత్రను ముగించారు. అదే ఏడాది భారత ప్రభుత్వం ఆయనకు 'భారతరత్న'ను ప్రకటించింది.

– పి.బి.ఆర్. ప్రసాదరావు

(నేడు బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి)

ఆలయం.. ఆదరణ.. అక్కసుల చరితం!

సర్వమత సమాదరణలో మనకు సాటిరాగల దేశం లేదని గర్వంగా చెప్పుకుంటాం. శతాబ్దాల మతాల సహజీవనానికి అదే కారణమనీ నమ్ముతాం. అది నూటికి నూరుపాళ్లూ నిజమా? ఒట్టి ఆదర్శ ప్రచారమా? చరిత్ర పరిశీలనకు అది నిలబడేదేనా? మన పాలకులు అంతటి విశాల హృదయులా? రాజ్యాన్ని వీరభోజ్యంగా భావించిన నేలలో అంతటి ఔన్నత్యాన్ని ప్రదర్శించారా? అన్నీ గంభీర ప్రశ్నలే! అందరినీ సంతృప్తిపరచే జవాబులే తేలికగా లభించవు! రాజ్య విస్తరణకు రక్తాలు చిందించటంలో మన పాలకులు ఎవరికీ తీసిపోలేదు. కానీ సర్వమత సమాదరణలో మాత్రం మన పాలకులు కొంతమేరకు సఫలం అయ్యారు. పూర్తిగా విఫలం మాత్రం కాలేదు! అందుకే మన చరిత్రను జాగ్రత్తగా మదింపు వేసుకుంటే సమాదరణలో మన సఫలతను ఆత్మస్తుతిగా భావించలేం! దీన్నుంచి ప్రేరణ పొంది మరిన్ని మంచి అడుగులు వేయటానికి మాత్రం ప్రస్తుతం తడబడుతున్నాం. విద్వేషాన్ని ఎగదోసే భావాలతో మందిర్-మసీద్‌ల చుట్టూ వివాదాలను రగల్చటానికే నాయకులు వ్యూహాలకు పదును పెడుతున్నారు. మసీదులపై కేసుల మీద కేసులు అందుకే పడుతున్నాయి. వారణాసి, మథుర, భోజ్‌శాల వివాదాలకు ఇప్పుడు సంభల్ మసీదు గొడవ తోడైంది. ఆరోపణల సారం మాత్రం మారటం లేదు. గుడులను కూల్చి మసీదులు కట్టారనే ఆరోపణలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయోధ్య తీర్పుతో భవిష్యత్తులో మందిర్-మసీద్ వివాదాలు తలెత్తవనే నమ్మకం క్రమేపీ నీరుకారి పోతోంది. ప్రార్థనా స్థలాలు, కట్టడాల స్వభావాన్ని మార్చకూడదని నిర్దేశించే 1991 నాటి చట్టాన్ని సుప్రీంకోర్టు గట్టిగానే సమర్థించింది. దాన్నిప్పుడు పట్టించుకునే పరిస్థితి కనపడటం లేదు. గుడుల కూల్చివేతలను తేల్చటానికీ, అవసరమైన పక్షంలో ప్రార్థనలు అనుమతించటానికీ సుప్రీం తీర్పు తమకు అడ్డుకాబోదన్న రీతిలోనే కింది కోర్టులు వ్యవహరిస్తున్నాయి. దీన్ని కట్టడి చేయాలని అభ్యర్థనలు వెల్లువెత్తుతున్నా సుప్రీంకోర్టు నుంచి అలాంటి ఆదేశాలు ఇప్పట్లో వచ్చే అవకాశమే కనపడటం లేదు.

ఇస్లాం పాలకులందరినీ ఆలయ విధ్వంసకులుగా ప్రచారం చేయటం ఇటీవల మామూలైపోయింది. చరిత్ర పేరుతో పుంఖానుపుంఖంగా అటువంటి రచనలు వచ్చి పడుతున్నాయి. అన్ని వైపుల నుంచి చుట్టుముట్టుతున్న ఆ తరహా ప్రచారంతో ఇబ్బందులెన్నో వస్తున్నాయి. పాలకుల మతం ఆధారంగా చరిత్రలో మంచిచెడులను నిర్ణయించటంతో ద్వేషభావనలకు పునాదులు పడ్డాయి. దేశంలో చీకటియుగం ముస్లిం పాలకులతో మొదలైందని చెప్పటానికి చరిత్రనే తారుమారు చేస్తున్నారు. బ్రిటిష్ పాలకులతో మొదలైన చరిత్ర వక్రీకరణ ఇటీవల ఇంకా ముదిరిపోతోంది.

మన చరిత్రలో ఆలయాల విధ్వంసాలు జరిగాయి. కాదనలేం. మసీదులు దాడులకు గురయ్యాయి. వాటినీ తృణీకరించలేం. అధికారం కోసం సాగిన యుద్ధాల్లో ప్రార్థనా మందిరాలు సమిధలయ్యాయి. వాటినీ విస్మరించలేం. ప్రత్యర్థిని దెబ్బతీయటానికి అతని కోటలనే కాదు అతను పరమ పవిత్రంగా పూజించే దేవాలయాలనూ మందిరాలనూ లక్ష్యంగా చేసుకున్నారు. అవి జరగలేదనీ చెప్పలేం. కానీ మొత్తం చరిత్రంతా అదేననీ, ముస్లిం రాజుల పాలనంతా పరమత ద్వేషంతోనే నిండిపోయి ఆలయాల విధ్వంసంతో గడచి పోయిందని చెప్పటంతోనే సమస్య వస్తుంది. ముస్లిం రాజుల పాలన మొదలయ్యే నాటికే కుల సామాజిక వ్యవస్థ బాగా వేళ్లూనుకుంది. దీన్ని తొలగించటానికో, సంస్కరించటానికో ముస్లిం పాలకులు ప్రయత్నించలేదు. సైనిక సామర్థ్యంతో పాలనా యంత్రాంగంలో పైస్థాయిలో కుదురుకున్నా శిస్తు, పన్ను వసూళ్లకు కుల పెద్దలపైనే ఆధారపడ్డారు. చాలా చోట్ల రెవెన్యూ యంత్రాంగాన్ని యథాతథంగా కొనసాగించారు.



> ఏకపక్ష మతదృష్టితో చారిత్రక వాస్తవాలను విస్మరించి విద్వేష భావనలను రగల్చటం రాజకీయంగా లాభం కావచ్చు. వందల ఏళ్ల ముస్లిం రాజుల కాలాన్ని చీకటి యుగంగా ముద్రవేయటం తేలిక కావచ్చు. కానీ ఆ యుగమే సూఫీ, భక్తికవుల సమానత్వ భావనను ఎలుగెత్తి చాటింది. కరడుగట్టిన కులవ్యవస్థ కదలబారటానికి భావాగ్నిని అందించింది. ఆధునికత వైపు దేశం అడుగులు వేయటానికి ఆర్థిక భూమికను ఏర్పరిచింది. ముస్లిం పాలనంతా అంధకారమైతే 17, 18 శతాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రభాగాన నిలవటం అసాధ్యమయ్యేది.

సైన్యంలో గతంలోలాగే చేరికలను ప్రోత్సహించారు. కొందరికి ఉన్నత పదవులూ కట్టబెట్టారు. ఇక మెడమీద కత్తిపెట్టి మతమార్పిడులు చేశారనటానికి కూడా చారిత్రక ఆధారాల్లేవు. వందలేళ్ల అధికారం చలాయించిన దిల్లీ చుట్టుపక్కల గంగా మైదాన ప్రాంతాల్లో అత్యధిక ప్రజలు ముస్లింలుగా మారలేదు. వందల సంవత్సరాలు ముస్లిం పాలనలో ఉన్నా హైదరాబాద్‌లోనూ మెజారిటీ ప్రజలు హిందువులుగానే ఉన్నారు. బలవంతంగా మతమార్పిడులు చేసి ఉంటే ముస్లిం పాలనకు కేంద్రాలైన నగరాల్లోనే గట్టిగా ఆ పనిని చేసి ఉండేవారు. బలగాలన్నీ అక్కడే ఉంటాయి. బలవంతాలూ అక్కడే సులువు! ఇక దేశానికి రెండు కొనల్లో ఉండే పశ్చిమ పంజాబులోనూ, తూర్పు బెంగాల్‌లోనూ పెద్దఎత్తున ప్రజలు ముస్లింలుగా మారటానికి అనేక కారణాలున్నాయి. అక్కడా బలప్రయోగం లేదు. సూఫీ గురువుల బోధనలే ప్రధానపాత్రను పోషించాయి. ఇక ముస్లిం పాలకులు కూడా గుడులకు జాగీర్లూ ఇచ్చారు. ఇనాంలూ ఇచ్చారు. పునరుద్ధరణకు పైకాలూ ఇచ్చారు.



■ రాహుల్ కుమార్

చరిత్రను నిష్పాక్షికంగా విశ్లేషించిన అధ్యయనాల్లో ఇదే తేలింది. క్యాలిఫోర్నియా వర్సిటి యాంత్రపాలజీ ప్రొఫెసర్‌గా పనిచేసిన క్యారన్ లేనర్డ్ హైదరాబాద్‌లోని హిందూ ఆలయాలపై చేసిన పరిశీలనల్లో ఎన్నో నిజాలు నిగ్గుతేలాయి. నిజాంల పాలనలో కీలకంగా ఉన్న కాయస్థ కులస్థులపై లేనర్డ్ చేసిన పరిశీలన బహుముఖమైంది. 50 ఏళ్ల కిందటే అందుకోసం విస్తృతంగా పర్యటించారు. హైదరాబాదీయులపై ఇటీవల వరకూ ఆమె పరిశోధనలు చేస్తూనే ఉన్నారు. నిజాంలు హిందూ ఆలయాలపై చూపిన ఆదరణను వివరించటానికి లేనర్డ్ చాలా ఉదాహరణలు ఇచ్చారు. ముస్లిం పాలకులు గుడులను కూల్చివేస్తారనే దురభిప్రాయం తొలగటానికి లేనర్డ్ పరిశోధనలు తోడ్పడతాయి. సందేహం లేదు! అంతమాత్రాన నిజాంలు మతాన్ని రాజకీయాల కోసం అసలు వాడుకోలేదని చెప్పలేం. సంక్షోభం చుట్టుముట్టినప్పుడు మతాన్ని రెచ్చగొట్టే చర్యలకు ఊతం ఇచ్చారు. రజాకార్ల విజృంభణలో అది స్పష్టంగా కనపడింది. 1940లకు ముందు మాత్రం మతాదరణలో చాలావరకూ సాధారణ వైఖరినే ప్రదర్శించారు. ఈ సాధారణ వైఖరేమిటి అన్న ప్రశ్న వెంటనే వస్తుంది. దీన్నే బహుళ మత సంస్కృతుల ఆదరణ విధానంగా లేనర్డ్ వర్ణించారు. అంటే ఒక మతాన్ని పాలక మతంగా స్వీకరించి.. మిగతా మతాలను పూర్తిగా అణగదొక్కి.. పాలకవర్గ మతానికే ప్రోత్సాహం ఇవ్వటం కాకుండా.. అన్ని మతాలను వీలైనంత మేరకు ఆదరించటమే దాని సారంగా చెప్పుకోవచ్చు. భారత ఉపఖండంలో ఈ భావన ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో ఒక విధాన రూపాన్ని సంతరించుకుంది. నైజాం పాలకులూ దీన్ని అనుసరించారు. వారు సున్నీ వర్గానికి చెందిన వారైనా షియాల ప్రార్థనా మందిరాల పోషణకు జాగీర్లు ఇచ్చారు. మొహర్రం ఊరేగింపులను కొనసాగనిచ్చారు.

ముస్లిం రాజుల పాలనా కాలంలో కాయస్థులు పాలనా వ్యవహారాల్లో, రెవెన్యూ లెక్కల్లో ప్రావీణ్యం సంపాదించి, మంచి అధికారులుగా గుర్తింపు తెచ్చుకున్నారు. అరబ్బీ, పర్షియన్, ఉర్దూ భాషలపై గట్టిపట్టును సాధించారు. ఇక హైదరాబాద్ కాయస్థుల్లో ఏడు ఉపకులాలు (సక్సేనా, మాథుర్, శ్రీవాత్సవ, గౌర్, భట్నాగర్, నిగం, అస్థానా) ఉండేవి. నిజాంల రాజ్యంలోని కాయస్థ అధికారులు-ప్రముఖుల అజమాయిషీలో 19వ శతాబ్దంలో 15 హిందూ ఆలయాలు ఉండేవి. వీటిల్లో ఎక్కువ వాటిని వారే స్వయంగా నిర్మించారు. అంతకుముందు నుంచీ ఉన్న కొన్నిటిని నిర్వహణలోకి తీసుకున్నారు. రాంబాగ్ (హైదరాబాద్‌కు పశ్చిమాన), చిత్రగుప్త (ఉప్పుగూడ), దేవల్ బజార్ రూప్‌లాల్ (శాలిబండ), నర్సింజీ/మాయారాం (శాలిబండ), బుచర్‌మాల్ ఆలయం (శాలిబండ), లలితాదేవి బాగ్ (ఉప్పుగూడ), బాలాజీ మహదేవ్ (కోట్ల ఆలీ జా), కేశవ్‌గిరి (హైదరాబాద్ దక్షిణం), రామచంద్రజీ (పురానాపూల్), రాంమందిర్ (శాలిబండ), కాళీ టెంపుల్ (ఉప్పుగూడ), శంకర్‌జీ (మీర్ జుమ్లా ట్యాంక్), నర్సింగ్ బాబా (ఉప్పుగూడ), శంకర్‌బాగ్ (ఉస్మాన్‌గంజ్) ఆలయాలు.. ఇప్పుడు మనం పాతబస్తీగా భావించే ప్రాంతంలోనే ప్రధానంగా ఉండేవి.

కాయస్థేతరులు నిర్మించిన గుడులు కూడా ఉన్నాయి. రెండుమూడు చోట్ల ఆలయాలు, దర్గాలు, మసీదులు ఒకే ప్రాంగణంలో ఉండేవి. బ్రహ్మక్షత్రీ కులానికి చెందిన రాజా రఘురాం బహదూర్ 1822లో నిర్మించిన కిషన్‌బాగ్ గుడి అలాంటిదే. ఈ గుడికి మూడో నిజాం సికిందర్‌జా రెండు జాగీర్లు ఇచ్చారు. దర్గా ఉర్సు ఉత్సవాలకు రాజా రఘురాం ప్రత్యేకంగా భవనాలను నిర్మించారు. బేగంబజార్ సీతారాం గుడిని మార్వాడి అగర్వాల్ అయిన పూరణ్‌మాల్ కట్టించారు.

> వారణాసి, మథుర, భోజ్‌శాల వివాదాలకు ఇప్పుడు సంభల్ మసీదు గొడవ తోడైంది. ఆరోపణల సారం మాత్రం మారటం లేదు. గుడులను కూల్చి మసీదులు కట్టారనే ఆరోపణలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. అయోధ్య తీర్పుతో భవిష్యత్తులో మందిర్-మసీద్ వివాదాలు తలెత్తవనే నమ్మకం క్రమేపీ నీరుకారి పోతోంది.

ఇక్కడ కూడా గుడి ఆవరణలో కుతుబ్‌షాహి కాలంనాటి మసీదు ఉండేది. ఈ గుడి పోషణకూ జాగీర్‌ను ఇచ్చారు. ఆలయ శంకుస్థాపనకు నిజాం స్వయంగా హాజరయ్యారు. పురానాపూల్ నుంచి మీరాలం ట్యాంకుకు వెళ్లే దారిలో రాజా శంభుప్రసాద్ కాళీ ఆలయాన్ని నిర్మించారు. నిజాంతో ఉన్నతస్థాయి అధికార సంబంధాలున్న కాయస్థులు, హిందువులు నిర్మించిన గుడుల్లో చాలా వాటికి నైజాం సర్కార్ నుంచి ఏదో రూపంలో సహాయం అందుతూనే ఉండేది. శ్రీరామనవమి సందర్భంగా భద్రాచలం ఆలయానికి పట్టువస్త్రాలు సమర్పించే సంప్రదాయం కుతుబ్‌షాహీల కాలం నుంచే ఉండేది. నిజాం పాలకులు దాన్ని కొనసాగించారు. అలాగే అజంతా గుహల పునరుద్ధరణను చేపట్టారు. ప్రఖ్యాత రామప్పగుడినీ పునరుద్ధరించారు. అందుకే దేశంలోని ముస్లిం పాలకులందరినీ ఒకే గాటనకట్టలేం.

ఏకపక్ష మతదృష్టితో చారిత్రక వాస్తవాలను విస్మరించి విద్వేష భావనలను రగల్చటం రాజకీయంగా లాభం కావచ్చు. వందల ఏళ్ల ముస్లిం రాజుల కాలాన్ని చీకటి యుగంగా ముద్రవేయటం తేలిక కావచ్చు. కానీ ఆ యుగమే సూఫీ, భక్తికవుల సమానత్వ భావనను ఎలుగెత్తి చాటింది. కరడుగట్టిన కులవ్యవస్థ కదలబారటానికి భావాగ్నిని అందించింది. ఆధునికత వైపు దేశం అడుగులు వేయటానికి ఆర్థిక భూమికను ఏర్పరిచింది. ముస్లిం పాలనంతా అంధకారమైతే 17, 18 శతాబ్దాల్లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో భారత్ అగ్రభాగాన నిలవటం అసాధ్యమయ్యేది. ఆ యుగంలో కొన్ని ఆలయాల విధ్వంసం జరిగినా ఆదరణా సమృద్ధిగానే ఉండేది! ఏ దేశ చరిత్ర అయినా మంచీచెడులు రెండింటినీ అందిస్తుంది. ఏది తీసుకోవాలన్నది మన విజ్ఞతకు గీటురాయిగా మిగులుతుంది.

(ఆంధ్రజ్యోతి ఎడిటర్)

వికలాంగులకూ రాజకీయ రిజర్వేషన్లు

రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడంతో వికలాంగులు మరింత వివక్షకు గురవుతున్నారు. తెలంగాణలో 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో 2.1శాతం మంది అంగవైకల్యం ఉన్నవారు ఉన్నారు. 2014లో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 10,46,820 మంది వికలాంగులు ఉన్నారు. అయితే ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, లండన్‌లోని స్కూల్ ఆఫ్ హైజిన్ అండ్ ట్రోపికల్ మెడిసిన్ సర్వే ప్రకారం 43.02 లక్షల మంది వికలాంగులు ఉన్నారు.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 77 ఏండ్లు, రాజ్యాంగం అమల్లోకి వచ్చి 73 సంవత్సరాలు పూర్తయ్యాయి. రాజ్యాంగంలో పేర్కొన్న స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం వంటివి వికలాంగులకు అందని ద్రాక్షగానే మిగులుతున్నాయి. ఆర్టికల్ 14 నుంచి 19 వరకు సమాజంలోని పౌరులందరు సమానమేనని ఎలాంటి వివక్ష ఉండరాదని పేర్కొంది. కానీ ఇవేవీ వికలాంగులకు దక్కడం లేదు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం, 2017 ఇంటర్ హెల్త్‌కేర్, నేషనల్ ట్రస్ట్, ఆటిజం యాక్ట్ ఐక్యరాజ్యసమితి హక్కుల ఒప్పందం వంటి అనేక చట్టాలను అమలు చేయాలనే చిత్తశుద్ధి కనిపించడం లేదు.



వికలాంగుల సమస్యలను పరిష్కరించి వారికి ఆసరానిచ్చి, వారు గౌరవంగా జీవిస్తూ సాధారణ జనజీవనంలో భాగమై అన్ని హక్కులు పొందేలా చూడడం కోసం 1992లో ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలో వికలాంగుల దినోత్సవం మొదలయింది. 1998 నుండి ప్రతి సంవత్సరం వికలాంగులకు సంబంధించిన ఒక అంశంతో అన్ని దేశాలు ఈ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాయి. కానీ ఆచరణలో తూతుమంత్రంగా దినోత్సవం జరపడం, వికలాంగుల హక్కుల గురించి అందాల్సిన ఫలాల గురించి ఊకదంపుడు ఉపన్యాసం ఇవ్వడం, ఆ తర్వాత మర్చిపోవడం అనేది ఒక ఆనవాయితీగా వస్తుంది. ఇక రాజకీయ పార్టీలు వికలాంగుల విభాగం ఏర్పాటు చేసుకోవడం, అధికారంలోకి వచ్చిన పార్టీలో వికలాంగుల విభాగానికి చెందిన వారికి ఒక నామినేటెడ్ వికలాంగుల చైర్మన్ పోస్ట్ ఇవ్వడంతో చేతులు దులుపుకుంటున్నాయి. వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు అందించడం ద్వారా వారి రాజకీయ ప్రాతినిధ్యంతో అవకాశాలని పెంచుకోవచ్చు. భారత రాజ్యాంగం వికలాంగులకు సమాన హక్కులు, అవకాశాలను కల్పించడానికి అనేక చట్టాలు విధానాలు రూపొందించింది. కానీ అవి అమలు కాకపోవడానికి కారణం వికలాంగులకు రాజకీయ రిజర్వేషన్లు లేకపోవడమే అని చెప్పనవసరం లేదు. వికలాంగులకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించడం వల్ల వారి హక్కులు అవసరాలు, సమస్యలపై స్థానిక సంస్థలు నుంచి చట్ట సభల వరకు గళమెత్తి ప్రశ్నించడానికి పోరాడటానికి తోడ్పడుతుంది. విద్య, ఉపాధి సామాజిక ఆర్థిక ఆత్మగౌరవ అసమానతలపై ప్రశ్నించి వాటిని సాధించుకోవడానికి రాజకీయ రిజర్వేషన్లు అనేది ఎంతైనా అవసరం ఉంది.

– ప్రహ్లాద్

(నేడు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం)

కార్మికుల పెన్షన్ కార్పొరేట్ల పరం!

ఇరవై ఐదు సంవత్సరాల పాటు ఒక ప్రభుత్వ రంగ పరిశ్రమలో పనిచేసి నెలకు ఏభై వేల రూపాయలకు పైగా జీతం పొందిన ఒక కార్మికుడు పదవీ విరమణ తర్వాత కేవలం రెండువేల రూపాయల లోపు మాత్రమే పెన్షన్ పొందడం నమ్మశక్యం కాని విషయం. కానీ ఇది వాస్తవం. ఇపిఎస్–95 పేరుతో దేశంలో ప్రవేశపెట్టిన పెన్షన్ పథకం కార్మికుల పొదుపు సొమ్మును హరించి కార్పొరేట్లకు ధారాదత్తం చేసే విధాన ఫలితం.

మన దేశంలో కార్మికులకు ఉన్న హక్కులను ఒకటొకటిగా హరిస్తున్న వేళ విచిత్రంగా కేంద్ర ప్రభుత్వం కార్మికులు కోరకుండానే వారికి ఒక పెన్షన్ పథకాన్ని చాలా ఉదారంగా ప్రవేశపెట్టింది. కార్మికులు వద్దన్నా వినలేదు. కనీసం ఇందులో చేరాలా వద్దా అనే ఆప్షన్ ఇమ్మన్నా ఇవ్వలేదు. కార్మికులపై ఎందుకింత ప్రేమ అని కొద్దిగా పరిశీలిస్తే 1991 నుంచి దేశంలో అమలవుతున్న నయా ఉదారవాద విధానాలలో భాగమే ఈ పెన్షన్ పథకం అని సులువుగానే అర్థమవుతుంది.

1995లో నాటి పివి నరసింహారావు ప్రభుత్వం అప్పటి వరకు అమలులో ఉన్న ఉద్యోగుల భవిష్య నిధి (పిఎఫ్) చట్టం 1952ను సవరించి, ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ ఇపిఎస్–95 పేరున ఒక కొత్త చట్టాన్ని చేసింది. ఈ పెన్షన్ చట్టం ప్రకారం అప్పటివరకు కార్మికుల భవిష్యనిధిలో ఉన్న యాజమాన్యం వాటా భాగం 8.33శాతం, ప్రభుత్వ వాటా 1.16 శాతం ఈ పెన్షన్ నిధికి మళ్ళించబడుతుంది. ఈ నిధి నుండి ప్రతినెల పిఎఫ్ డిపార్టుమెంట్ పెన్షన్లు చెల్లిస్తుంది.

ఈ పథకం వల్ల కార్మికులకు వచ్చే సంక్షేమం కంటే కార్మికులు పొదుపు సొమ్మును కోల్పోవడమే అధికంగా ఉంటుందని ఆనాడే కొన్ని కార్మిక సంఘాలు ముఖ్యంగా సిఐటియు వంటి కేంద్ర సంఘాలు దీన్ని తీవ్రంగా వ్యతిరేకించాయి. కొన్ని యూనియన్లు దీనిపై దేశంలోని వివిధ రాష్ట్ర హైకోర్టులలో కేసులు కూడా వేశాయి. ఈ కేసులపై కొన్ని హైకోర్టులు ఈ పథకం అమలుపై స్టే ఉత్తర్వులు కూడా ఇచ్చాయి. ఈ కేసులన్నీ చివరకు సుప్రీంకోర్టుకు చేరాయి. దీనిని తరచూ సమీక్షిస్తూ ఉంటామని, పథకాన్ని మరింత పటిష్టపరుస్తామనే అనేక హామీలు ప్రభుత్వం ఇవ్వడంతో సుప్రీంకోర్టు ఈ పథకం అమలుకు అనుమతించింది. ఈ విధంగా కార్మికుల ఆమోదం లేకపోయినా, వివిధ యూనియన్లు ప్రతిఘటించినా ఈ పథకం 1995 నుండి అమలులోకి వచ్చింది.

ఈ పెన్షన్ పథకం ప్రత్యేకత ఏమిటంటే దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు, ఎల్ఐసి, బ్యాంకు ఉద్యోగులకు, ఇతర సంస్థలలో ఉన్న పెన్షన్ పథకాలలోని ఒక్క అనుకూల అంశం కూడా ఇందులో లేకపోవడమే. వీటికి భిన్నంగా ప్రతికూలంగా ఉండే అనేక అంశాలు ఈ పథకంలో ఉన్నాయి.

ఉదాహరణకు మిగిలిన అన్ని పెన్షన్ పథకాలలో పెరిగిన ధరలకు అనుగుణంగా కరువు భత్యం ఉండగా ఈ పథకంలో అది లేదు. అన్ని పెన్షన్ పథకాల్లోనూ పదవీ విరమణ సమయంలో పెన్షన్‌లోని కొంత మొత్తాన్ని కమ్యూట్ చేసుకుని, ఒకేసారి పెద్ద మొత్తాన్ని తీసుకునే అవకాశం ఉండగా, ఈ పెన్షన్ పథకంలో మాత్రం ఆ సదుపాయం లేదు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆఖరి నెల జీతం ఆధారంగా పెన్షన్ లెక్కిస్తే, ఈ పథకంలో మాత్రం కార్మికుని ఆఖరి అరవై నెలల జీతం సగటు తీసుకుని దాని ఆధారంగా పెన్షన్ లెక్కిస్తారు. అలాగే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు 20 సంవత్సరాల సర్వీసు పూర్తయితే పూర్తి పెన్షన్ పొందడానికి అర్హత రాగా, ఇక్కడ మాత్రం 33 సంవత్సరాల సర్వీసుకు గాని ఆ అర్హత రాదు. ఇలాంటి అనేక లోపాల వల్ల పెన్షన్ చాలా తక్కువగా ఉంటోంది.



> ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా దయాధర్మంగా ఏమీ పెన్షన్ ఇవ్వనవసరం లేదు. పెన్షన్ నిధి నుండే, అది కూడా దానిపై వచ్చే వడ్డీ నుండే వివిధ కార్మిక, పెన్షనర్ల సంఘాలు కోరుతున్నట్లుగా కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలకు పెంచడం, కరువు భత్యం చెల్లించడం, కమ్యూట్ చేసుకునే అవకాశం, ఐదేళ్లకు ఒకసారి పెన్షన్ సవరించడం వంటివి నిక్షేపంగా చేయవచ్చు. అయితే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే విధానాలను అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం అలా చేస్తుందా అన్నదే అసలు ప్రశ్న

పెన్షన్ పొందే జీతం పరిమితిని కూడా మొదట రూ.6,500గా నిర్ణయించారు. తరువాత దానిని రూ.15,000కు పెంచారు. పూర్తి జీతంపై హయ్యర్ పెన్షన్ అనుమతించాలని, సుప్రీంకోర్టు 2022 నవంబరులో తీర్పు ఇచ్చి రెండేళ్లు గడిచినా నేటికీ అమలు కాలేదు సరికదా ఈ పేరున పదిహేడున్నర లక్షల మంది పెన్షనర్ల నుండి రూ.1,86,920 కోట్లు వసూలు చేసి, ఆ సొమ్మును ప్రభుత్వం తొక్కిపెట్టింది. ఇది పచ్చి దగా.

విచిత్రమేమిటంటే అనేక మందికి 100, 150, 200 రూపాయలు పెన్షన్ వచ్చిన సందర్భాలు కూడా ఉన్నాయి. పెద్ద ఎత్తున ఒత్తిడి రావడంతో చివరకు ప్రభుత్వం కనీస పెన్షన్‌ను వెయ్యి రూపాయలకు 2017లో పెంచింది. దీనివల్ల 36.4 లక్షల మంది లాభపడ్డారని ఘనంగా ప్రకటించుకుంది. కానీ దీన్ని బట్టే తెలుస్తున్నదేమిటంటే అంత మందికి అప్పటి వరకు వెయ్యి రూపాయల లోపే పెన్షన్ ఉందని. దీనికి ప్రభుత్వం సిగ్గు పడవలసింది పోయి, తిరిగి గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమే. ఇప్పటికీ వెయ్యి రూపాయల లోపు పెన్షన్ వస్తున్నవారు కూడా ఉన్నారు. అత్యధికమందికి వచ్చే పెన్షన్ రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న వృద్ధాప్య పెన్షన్ కంటే కూడా తక్కువగా ఉంటోంది.

2024లో ఈ పథకం ద్వారా 78.5 లక్షల మందికి పెన్షన్ చెల్లించారు. ఇందులో 46.6 శాతం మందికి వెయ్యి, అంతకంటే తక్కువ; 85 శాతం మందికి రూ.2,500 లోపు మాత్రమే పెన్షన్ వస్తోందని వీరి గణాంకాలు తెలుపుతున్నాయి. ఐదు వేల రూపాయలకు పైగా పెన్షన్ పొందుతున్నవారు కేవలం 29,608 మంది; అంటే మొత్తం పెన్షన్ దారులలో కేవలం 0.37శాతం మంది. సగటు పెన్షన్ కేవలం రూ.1578 మాత్రమే. ఫలితంగా అనేకమంది పెన్షనర్లు కడు పేదరికంలో మగ్గుతున్నారు.

అందువల్లే దీని కార్పస్ ఫండ్ 2018లో 4లక్షల 37వేల కోట్ల రూపాయల నుంచి 2024 నాటికి 8లక్షల 88వేల కోట్లకు అంటే ఆరేళ్ల కాలంలో ఏకంగా రెట్టింపుకు పైగా పెరిగింది. ఈ సొమ్మును ప్రభుత్వం మిగిలిన పిఎఫ్ నిధులతో పాటు, వివిధ సంస్థలలో పెట్టుబడులుగా పెడుతోంది. ఇలా కార్మికుల పొదుపు కార్పొరేట్ల పాలవుతోంది. కార్మికుల ఖాతా నుంచి ఈ పెన్షన్ నిధికి మళ్లిస్తున్న సొమ్ము ఎంత, దానిపై వచ్చే వడ్డీ ఎంత, కార్మికునికి పదవీ విరమణ తర్వాత ప్రభుత్వం చెల్లిస్తున్న పెన్షన్ ఎంత, అనే ఈ మూడు అంశాలను పరిశీలిస్తే చాలా ఆశ్చర్యకరమైన వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

ఇప్పుడు ఈ పెన్షన్ పొందే జీతం యొక్క గరిష్ఠ పరిమితి రూ.15వేలుగా ఉంది. అంటే కార్మికునికి రూ.15వేల జీతం నుండి ప్రతినెల 8.33శాతం చొప్పున పెన్షన్ ఫండ్‌కు అయ్యే జమ, ప్రభుత్వ వాటా 1.16శాతం కలిస్తే, ప్రతి నెల రూ.1420 చొప్పున 25 ఏళ్ల సర్వీసులో మొత్తం రూ.4,26,000. దీనిపై ప్రస్తుతం పిఎఫ్‌పై ఉన్న వడ్డీ రేటు 8.25 శాతం ఆధారంగా 25 ఏళ్ల చివరకు వచ్చే వడ్డీ రూ.10,25,725. అంటే– అసలు, వడ్డీ కలిపి మొత్తం రూ.14,51,725 అవుతుంది. దీనిపై ఇప్పుడు సీనియర్ సిటిజన్లకు బ్యాంకులలో ఉన్న వడ్డీ రేటు 8.4 శాతం రేటు చొప్పున నెలకు రూ.10,162 వడ్డీ వస్తుంది. కానీ నేడు ఇదే కార్మికుడికి ఈ పథకం ద్వారా వచ్చే గరిష్ఠ పెన్షన్ నెలకు కేవలం రూ.5,785 మాత్రమే. దీనర్థం ఏమిటంటే కార్మికుని పొదుపు సొమ్ముపై వచ్చే వడ్డీ కంటే కూడా తక్కువగా పెన్షన్ ఉంది. మరి అసలు పొదుపు సొమ్ము అంతా స్వాహా అవడం కాదా ఇది. దీనితో పాటు నాడు సుప్రీంకోర్టుకు ఇచ్చిన హామీలు కూడా ప్రభుత్వం అమలు చేయడం లేదు. సరికదా నాడున్న సౌకర్యాలనే కొన్నిటిని ఎత్తివేశారు. అందువల్ల దీన్ని కార్మికుల సంక్షేమం అనడం కంటే, కార్పొరేట్ల సంక్షేమ పథకం అనడం సబబుగా ఉంటుంది. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వ పెద్దలు దీనిని సవరిస్తామని హామీ అయితే ఇచ్చారు కానీ, మూడోసారి అధికారం లోనికి వచ్చినా, ఇంకా నేటికీ కార్యరూపం దాల్చలేదు.

ప్రభుత్వం కార్మికులకు ఉచితంగా దయాధర్మంగా ఏమీ పెన్షన్ ఇవ్వనవసరం లేదు. కార్మికుల పొదుపు సొమ్ము అయిన పెన్షన్ నిధి నుండే, అది కూడా దానిపై వచ్చే వడ్డీ నుండే వివిధ కార్మిక, పెన్షనర్ల సంఘాలు కోరుతున్నట్లుగా కనీస పెన్షన్ తొమ్మిది వేల రూపాయలకు పెంచడం, కరువు భత్యం చెల్లించడం, కమ్యూట్ చేసుకునే అవకాశం, ఐదేళ్లకు ఒకసారి పెన్షన్ సవరించడం వంటివి నిక్షేపంగా చేయవచ్చు. అయితే దేశ సంపదను కార్పొరేట్లకు దోచిపెట్టే నయా ఉదారవాద విధానాలను మరింత స్పీడుగా అమలు చేస్తున్న మోదీ ప్రభుత్వం అలా చేస్తుందా అన్నదే అసలు ప్రశ్న. దేశానికి అనేక విధాలుగా సేవలందించిన, ఈ సీనియర్ సిటిజన్ల పొదుపును దోచుకోవడమే కాక, వారి న్యాయమైన డిమాండ్లను సైతం నిర్లక్ష్యం చేయడం క్షంతవ్యం కాదు. ఈ పని చేయకుండా సీనియర్ సిటిజన్లకు ఏదో చేసేశామని గొప్పలు చెప్పుకోవడం సభ్యత అంతకంటే కాదు.

• ఎ. అజ శర్మ
ప్రధాన కార్యదర్శి, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక



నిశీధిలో నగరి



చలి.. ఆ పేరు చెబితేనే వెన్నులో వణుకు పుడుతుంది. అటువంటి చలిలో.. నిశీధిలో.. నగరం వెచ్చని దుప్పటి కప్పుకొని మాగన్నుగా నిద్రపోతోందా? ఒళ్లు విరుచుకుని, బద్ధకం వదుల్చుకుని రోజువారీ కృత్యాల్లో నిమగ్నమైపోతోందా..? అంటే పొరపాటే. కాలం మారింది. కల్చర్ కూడా మారుతోంది. ఇక రాజధాని రాకతో అంతా మారిపోయింది. అర్ధరాత్రి దాటాక కూడా సిటీ సందడిగానే ఉంటోంది. ఇంకేముంది నగరంలో నైట్‌లైఫ్‌కు క్రేజ్ పెరిగింది. వ్యాపారాలూ ఊపందుకున్నాయి. పగలు కంటే రాత్రే క్రయవిక్రయాలు పెరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో అర్ధరాత్రి వేళ నగరంలో జోరుమీదున్న వ్యాపారాలను 'ఆంధ్రజ్యోతి' క్లిక్‌మనిపించింది. 8లో

దుర్గాఘాట్‌లో భక్తుల రద్దీ



స్వర్గాన్ని పోలి

అల నక్షత్రాలు ఇల దిగినట్టు కృష్ణానదిలో పోలి దీపాలు కనువిందు చేశాయి. కార్తీకమాసం ముగియడంతో పోలిని స్వర్గానికి పంపే వేడుక సోమవారం సాయంత్రం ఘనంగా జరిగింది. ప్రత్యేక పూజలు చేసిన మహిళలు అరటి దొప్పల్లో దీపాలు పెట్టి కృష్ణానదిలో వదిలి కార్తీక నోములకు ముగింపు పలికారు. భక్తుల రాకతో తీరప్రాంతాలు కిటకిటలాడాయి.



కోటి ఆశలకు కొత్త రెక్కలు

అమరావతి 2.0 పనులకు ఆర్థిక కేటాయింపులు

పలు అభివృద్ధి పనులకు పచ్చజెండా

- భవన నిర్మాణాలు, ఎల్పీఎస్ ఇన్‌ఫ్రా, రోడ్లు, మౌలిక సదుపాయాలు, వరద నివారణ, హ్యాపీనెస్ట్ పనులకు..
- సీఎం అధ్యక్షతన సీఆర్డీఏ అథారిటీ సమావేశం
- కొత్త ఏడాదిలో పనులు వేగం చేయాలని నిర్ణయం

నూతన సంవత్సరంలో రాజధాని అమరావతి నిర్మాణ పనులను వడివడిగా ముందుకు తీసుకెళ్లేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ఇందుకోసం ఆర్థికపరమైన కేటాయింపులపై కీలక నిర్ణయాలు తీసుకుంది. రూ.11 వేల కోట్లతో నిర్మాణ పనులు చేపట్టేందుకు పచ్చజెండా ఊపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాంపు కార్యాలయంలో సోమవారం జరిగిన 41వ సీఆర్‌డీఏ అథారిటీ సమావేశంలో అమరావతి అభివృద్ధికి కీలక అడుగులు పడ్డాయి.

విజయవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వ హయాంలోని నష్టాలను భరిస్తూ రాజధాని అమరావతిని అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు కీలకమైన ఆర్థిక కేటాయింపులకు ఆమోదం తెలిపారు. కొంతమేర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో పాటు ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధులతో పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. బహుళ అంతస్థుల భవన నిర్మాణాల పనులు చేపట్టేందుకు రూ.1,931.76 కోట్ల అంచనాలకు ఆమోదం తెలిపారు. అమరావతికి ల్యాండ్ పూలింగ్‌లో భూములిచ్చిన రైతాంగానికి ప్యాకేజీ కింద చేపట్టాల్సిన ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా కోసం రూ.3,859.66 కోట్లు, రాజధానిలో రోడ్ల బ్యాలెన్స్ పనులు చేపట్టేందుకు రూ.2,498.3 కోట్లు, శాశ్వత వరద నివారణ పనుల కోసం రూ.1,585.95 కోట్లు, సీఆర్‌డీఏ టౌన్‌షిప్ ప్రాజెక్టు హ్యాపీనెస్ట్‌కు రూ.984.10 కోట్ల ఆర్థిక కేటాయింపులకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించింది. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు వల్ల తలెత్తిన నష్టాన్ని కూడా ప్రభుత్వమే భరించాలన్న కీలక నిర్ణయం తీసుకోవటంతో పాటు టెక్నికల్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం కాంట్రాక్టు సంస్థలతో ఒప్పందాలను రద్దు చేసుకున్న తేదీ నుంచి నాలుగు నెలల్లోగా పెండింగ్ బిల్లులు చెల్లించేందుకు ఓకే చెప్పింది. దీనికి సంబంధించిన ఉత్తర్వులను కూడా ప్రభుత్వం జారీ చేసింది. రాజధాని అమరావతిలో ట్రంక్ ఇన్‌ఫ్రా, వరద నీటి యాజమాన్యం, గ్రీనరీ పనులకు సంబంధించి ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్ (పీఎంసీ) నియామకానికి కూడా అథారిటీ ఆమోదం తెలిపింది. ప్రపంచబ్యాంకు, ఏడీబీల సూచన మేరకు పీఎంసీని నియమించాలని నిర్ణయం తీసుకుంది. కొత్త సంవత్సరంలో పనులు ఉధృతంగా జరిగేందుకు వీలుగా ఈ మేరకు చర్యలు తీసుకున్నారు.

అమరావతి నిర్మాణానికి కేటాయింపులు ఇలా..

- రాజధాని అమరావతిలో గవర్నమెంట్ కాంప్లెక్స్ నిర్మాణ పనుల్లో భాగంగా నిలిచిపోయిన గజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1, 2, 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్ల నిర్మాణ పనులను పూర్తి చేయటానికి రూ.594.54 కోట్లు ఖర్చు చేసేందుకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించింది. ఈ నిర్మాణ పనుల్లో భాగంగా మొత్తం 1,440 అపార్ట్‌మెంట్లకు మిగతా 6లో..

ఎమ్మెల్సీ ఓట్ల గందరగోళం

ఇంకా అండర్ వెరిఫికేషన్‌లోనే దరఖాస్తులు



- తిరస్కరించినవి 10 వేల ఓట్లు
- అండర్ వెరిఫికేషన్, అదర్ మండల్స్ పేరుతో 5 వేలు పెండింగ్
- ఆన్‌లైన్ దరఖాస్తులను పరిశీలించకపోవడం వల్లేనా?
- ఎమ్మెల్సీ కార్యాలయంలో నిర్లక్ష్య వైఖరి కారణంగానా?

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల జాబితాలు గందరగోళంగా మారాయి. అర్హులైన వారికి ఓటుహక్కు రాకపోవటంతో పట్టభద్రులు మండిపడుతున్నారు. 10 వేల దరఖాస్తులను తిరస్కరించటాన్ని ప్రశ్నిస్తున్నారు. వీటిలో సగానికి పైగా అండర్ వెరిఫికేషన్‌లోనే ఉండటం, మరికొన్ని ఇతర మండలాల పేరుతో చూపించడం వివాదంగా మారింది. ఇతర మండలాలు అని ఉంటే.. పట్టభద్రులు చేసిన తప్పేంటి? ఆయా మండలాలకు పంపి వెరిఫికేషన్ చేయాల్సి ఉండగా, ఎన్నికల అధికారులు ఆ పని చేయట్లేదు. దీంతో వేలాది మంది అర్హులైన పట్టభద్రులు ఓటుహక్కును కోల్పోవాల్సి వస్తోంది. ఐదు వేలకు పైగా ఓట్లు ఎందుకు అండర్ వెరిఫికేషన్‌లో ఉంచాల్సి వచ్చిందన్నది అర్థంకాని ప్రశ్నగా ఉంది. గన్నవరం, కంకిపాడు మండలాల పరిధిలో ఈ అండర్ వెరిఫికేషన్ కేసులు ఎక్కువగా ఉన్నాయి. ఓటర్ల జాబితా పరిశీలించుకుంటున్న పట్టభద్రులు తమ పేర్లు లేకపోవటంతో ఆన్‌లైన్‌లో చెక్ చేసుకుంటున్నారు. దరఖాస్తు ఇంకా అండర్ వెరిపై పేరుతో కనిపిస్తోంది. వీఆర్‌ఏలకు ఫోన్ చేయగా, తమకు వెరిఫికేషన్ చేయమని ఆదేశాలు రాలేదని అంటున్నారు. ఆన్‌లైన్ దరఖాస్తులకు సంబంధించి ఎన్నికల వెరిఫికేషన్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారని తెలుస్తోంది.

నగరంలోనే అధిక ఓటర్లు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో 3 లక్షల మందికి పైగా పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటు కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 10 వేల దరఖాస్తులను వివిధ కారణాలతో తిరస్కరించారు. మొత్తం 2,90,000 మందికి ఓటుహక్కు వచ్చింది. ఉమ్మడి కృష్ణా-గుంటూరు ఎమ్మెల్సీ ఓట్ల దరఖాస్తులకు సంబంధించి చూస్తే అత్యధికంగా ఎన్టీఆర్ జిల్లా నుంచే 63 వేల దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 35 వేల వరకు ఒక్క విజయవాడ నగరంలోనివే. మిగిలిన దరఖాస్తులన్నీ కృష్ణా, ఉమ్మడి గుంటూరు జిల్లాకు సంబంధించినవి.

అండర్ వెరిఫికేషన్‌లోనే..

ఏపీఎన్‌జీజీవో వంటి సంఘాలు స్వచ్ఛందంగా ఓటు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాయి. రెండు రోజుల పాటు వెబ్‌సైట్ పనిచేయకపోవటంతో దరఖాస్తులను ఆలస్యంగా నమోదు చేశారు. ఆ తర్వాత దరఖాస్తులు ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆఫీసుకు వెళ్లాయి. తాము ఏపీఎన్‌జీజీవో ఆఫీసులో దరఖాస్తులు ఇస్తే ఎమ్మెల్సీ అశోక్‌బాబు కార్యాలయం మిగతా 6లో..

మెట్రోకు గ్రీన్‌సిగ్నల్



విజయవాడ మెట్రో ప్రాజెక్టుకు రాష్ట్ర ప్రభుత్వ ఆమోదం

మొదటి, రెండు దశల పనులకు ఓకే

- ఐదేళ్ల తర్వాత ఆమోదానికి నోచుకున్న డీపీఆర్
- ఇక కేంద్రానికి పంపడమే తరువాయి
- మూడు కారిడార్లుగా పనులు చేసే అవకాశం
- ఇప్పటికే క్షేత్రస్థాయిలో పనులకు శ్రీకారం

నూరుశాతం కేంద్ర ప్రభుత్వ బాధ్యతే..

రాష్ట్ర విభజన సమయంలో ఏపీ రీ-ఆర్గనైజేషన్ యాక్ట్‌ను కేంద్రప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ చట్టంలోని 12వ ఐటమ్‌లో పొందుపరిచిన 13వ సెక్షన్‌లో విజయవాడలో మెట్రో రైల్ ప్రాజెక్టు ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం తన పూర్తి సహకారాన్ని అందిస్తానని పేర్కొంది. దీని ప్రకారం ఫండింగ్ నూరుశాతం కేంద్ర ప్రభుత్వమే భరించాలి. లేదంటే నూతన మెట్రో పాలసీలో ఉన్న క్లాజ్ ప్రకారం కేంద్రం పూర్తిగా తన సొంత ఖర్చుతో నిర్మించాలన్న ప్రతిపాదనను కూడా తీసుకొచ్చారు.

విద్యుత్ తీగలు లేని

మెట్రో ప్రాజెక్టులు అనగానే విద్యుత్ తీగలు కనిపిస్తుంటాయి. పక్క రాష్ట్రాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలో విద్యుత్ తీగలతో కూడిన ప్రాజెక్టులే ఉన్నాయి. దేశవ్యాప్తంగా కూడా ఇదే విధానం కొనసాగుతోంది. ఒక్క కేరళ, ఆ తర్వాత మరో రాష్ట్రం తప్ప ఇంకెక్కడా లేదు. కాగా, విద్యుత్ తీగలు లేని మెట్రోల్లో దేశంలోనే మూడోదిగా విజయవాడ మెట్రోకు ప్రాధాన్యం దక్కనుంది. ఈ మెట్రోలో థర్డ్‌రైల్ విధానాన్ని అనుసరించాలని ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ భావిస్తోంది. ఈ విధానంలో ట్రాక్ నుంచే విద్యుత్ తీసుకునే వెసులుబాటు ఉంటుంది. తీగలు ఎక్కడా కనిపించవు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ మెట్రో రైల్ ప్రాజెక్టు డీపీఆర్‌ను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఆమోదించింది. మొదటి దశ పనులు చేపట్టడానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. శిస్ట్రా సంస్థ 2019లో ఇచ్చిన తుది డీపీఆర్ ప్రకారం ఈ నిర్ణయం తీసుకుంది. దీనిప్రకారం మొదటి ఫేజ్‌లో విజయవాడలో రెండు కారిడార్లు, రెండో ఫేజ్‌లో అమరావతి రాజధానికి కారిడార్లను నిర్మించేందుకు వీలుగా కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం డీపీఆర్‌కు ఆమోదం తెలపటంతో కేంద్ర ప్రభుత్వానికి అధికారికంగా పంపటమే మిగిలుంది. ఇప్పటికే ఈ ప్రాజెక్టు ప్రతిపాదనలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లారు. తాజాగా నూతన మెట్రో పాలసీ విధానంలో నూరుశాతం కేంద్ర సహాయాన్ని కోరుతూ మరోమారు ప్రతిపాదన పంపనున్నారు.

యుద్ధప్రాతిపదికన పనులు

కేంద్రం నుంచి అనుమతులు రాగానే మిగతా 6లో..

భవానీ దీక్షల విరమణకు ప్రత్యేక బందోబస్తు

- అధికారులతో సీపీ సమీక్ష



గుణదల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : భవానీ దీక్షల విరమణ ఉత్సవాలకు ప్రత్యేక బందోబస్తు ఏర్పాటు చేయాలని సీపీ రాజశేఖరబాబు అధికారులను ఆదేశించారు. ఈనెల 21 నుంచి 25 వరకు జరిగే ఉత్సవాలకు రాష్ట్ర నలుమూలల నుంచి భవానీ భక్తులు రానున్న నేపథ్యంలో బందోబస్తు నిర్వహణ, ఏర్పాట్ల విషయమై పోలీసు, దేవదాయ శాఖ అధికారులతో కమిషనర్ సోమవారం సమీక్ష నిర్వహించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఒక యాప్‌ను రూపొందించాలని, ఎంతమంది, ఏ ఊరు నుంచి, ఏ రోజున వస్తున్నారో తెలిసేలా ఈ యాప్ ఉండాలన్నారు. పార్కింగ్ ఎక్కడ, స్నానఘాట్ ఎక్కడ, వైద్య సౌకర్యాలు ఎక్కడ, ఆన్‌లైన్‌లోనే ప్రసాదం బుకింగ్, దర్శన టికెట్ బుకింగ్, తాగునీటి వివరాలు, గిరిప్రదక్షిణ మ్యాప్, దర్శన సమయాలు, పూజా విధానాలు ఆ యాప్‌లో పొందుపరచాలని పేర్కొన్నారు. ఈ విషయంపై దేవదాయ శాఖ దృష్టి పెట్టాలని సీపీ సూచించారు. ఇలా చేయడం వల్ల భక్తుల రద్దీని నియంత్రించవచ్చని చెప్పారు. గిరిప్రదక్షిణ సమయంలో భవానీలకు ట్రాఫిక్ కష్టాలు లేకుండా చూడాలన్నారు. దీక్షల విరమణ సమయంలో ట్రాఫిక్ ఆంక్షలకు సహకరించాలని ప్రజలను కోరారు.

ట్రాఫిక్ సైనిక్

నగరంలో ట్రాఫిక్ క్లియరెన్స్‌కు వినూత్న ప్రయోగం

- హైదరాబాద్‌లోని సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలోనే ఐటీ కంపెనీలు ఎక్కువగా ఉంటాయి. దీంతోపాటు ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్ ఉంటుంది. ఇందుకోసం ఎస్‌సీఎస్‌సీ (సొసైటీ ఫర్ సైబరాబాద్ సెక్యూరిటీ కౌన్సిల్) ఆధ్వర్యంలో 2,600 మంది ట్రాఫిక్ వలంటీర్లను తయారు చేశారు. వివిధ ఐటీ కంపెనీల్లో పనిచేసేవారంతా ట్రాఫిక్ నియంత్రణలో భాగంగా అక్కడి ట్రాఫిక్ పోలీసులతో కలిసి పనిచేస్తారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించిన వాహనాలను సెల్‌ఫోన్‌లో క్లిక్‌మనిపిస్తారు. వెంటనే దాన్ని ట్రాఫిక్ పోలీసుల గ్రూపులో పోస్టు చేస్తారు. ఈ ఉల్లంఘన ఎక్కడ జరిగిందో వివరాలు రాస్తారు. ట్రాఫిక్ స్తంభించిపోయినప్పుడు గ్రూపులోనే వెంటనే సమాచారాన్ని షేర్ చేస్తారు.

కట్‌చేస్తే.. విజయవాడలోనూ ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులు ఇదే దారి ఎంచుకుంటున్నారు. సేవాభావం ఉన్న నగర ప్రజల నుంచి ట్రాఫిక్ అంబాసిడర్లను ఎంపికచేసి నగర రోడ్లపై విధులు నిర్వహించేలా తర్ఫీదునిస్తున్నారు.



ట్రాఫిక్ అంబాసిడర్ల ప్రత్యేక కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు

- నగరవాసులే అంబాసిడర్లుగా ప్రత్యేక కార్యక్రమం
- సేవా దృక్పథంతో వచ్చే వారికి ట్రాఫిక్ విధులు
- ఆరు పీఎస్‌లలో 379 మంది నమోదు
- 33 కేటగిరీల నుంచి అంబాసిడర్ల ఎంపిక
- ప్రత్యేక శిక్షణ అనంతరం విధుల కేటాయింపు
- సమస్యను ఫొటోతీసి వాట్సాప్ గ్రూపులో పోస్ట్ చేయడమే

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నగరంలో ట్రాఫిక్ సమస్యను సత్వరం పరిష్కరించేందుకు ఉత్సాహవంతులను ఉపయోగించుకోవాలని పోలీసు అధికారులు భావించారు. వారికి ట్రాఫిక్ అంబాసిడర్లుగా నామకరణం చేశారు. ఈ అంబాసిడర్ మిగతా 6లో..



ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్ లక్ష్మీశ

అర్జీల పరిష్కారంలో రాజీపడొద్దు

» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ

కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ప్రజాసమస్య చిన్నదైనా, పెద్దదైనా సమాన ప్రాధాన్యమిచ్చి గడువులోగా పరిష్కరించాలని, ఈ విషయంలో రాజీపడొద్దని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, ఆర్డీవో ఎం.లక్ష్మీ నరసింహం, గ్రామ, వార్డు సచివాలయాల ప్రత్యేక అధికారి జి.జ్యోతితో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అధికారులు గడువులోగా పరిష్కరించాలని సూచించారు. ప్రతి దశలోను పారదర్శకత, జవాబుదారీతనానికి ప్రాధాన్యమిచ్చేలా, అర్జీ రీ ఓపెన్ అయిన సందర్భంలో రీ వెరిఫికేషన్ శాఖల వారీగా ప్రత్యేక గ్రీవెన్స్ ఆడిట్ అధికారులను నియమించినట్టు వివరించారు. రెవెన్యూ, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్‌కు సంబంధించిన అర్జీలకు విజయవాడ, నందిగామ, తిరువూరు ఆర్డీవోలకు ఆడిట్ అధికారులుగా బాధ్యతలు అప్పగించినట్టు కలెక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక అలవెన్స్‌లు ఇవ్వాలి

» ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ డిమాండ్



కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : డిసెంబరు 21 నుంచి భవానీ దీక్షలకు డ్యూటీలు కేటాయించిన వారికి, గతంలో దసరా డ్యూటీలు చేసిన ఆశ వర్కర్లకు ప్రత్యేక అలవెన్స్, టీఏ, డీఏలు ఇవ్వాలని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.కమల డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విజయవాడ నగరంలో డిసెంబరు 21 నుంచి భవానీ దీక్షా విరమణలకు రాష్ట్ర వ్యాప్తంగా వచ్చే భవానీలకు, ఆరోగ్య సేవలందించేందుకు ఆశ వర్కర్లకు విధులు కేటాయించారన్నారు. ఈ నేపథ్యంలో ప్రయాణ ఖర్చులతో ఆశ వర్కర్లపై ఆర్థిక భారం పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాక దసరా నవరాత్రుల సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా భక్తులకు ఆరోగ్యపరమైన సేవలు అందించేందుకు ప్రతీ ఏడాది ఆశ వర్కర్లు మూడు షిఫ్టుల్లో 15 రోజుల పాటు డ్యూటీలు చేశారని తెలిపారు. వీరందరూ ప్రభుత్వం ఇచ్చే గౌరవ వేతనం రూ.10 వేల మీదే ఆధారపడి జీవిస్తున్నారన్నారు. ఇప్పటివరకు వారికి ప్రయాణ ఖర్చులు చెల్లించలేదని తెలిపారు. ఇప్పటికైనా కలెక్టర్ స్పందించి ఆశ వర్కర్లకు ప్రత్యేక అలవెన్స్, టీఏ డీఏలు చెల్లించేవిధంగా చర్యలు తీసుకోవాలని, కమల కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా కోశాధికారి పి.శ్రీలక్ష్మి, ఉపాధ్యక్షులు టి.హవేలీ కుమారి తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు కృషి

కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : లింగ వివక్ష లేని సమాజ స్థాపనకు సమష్టిగా కృషి చేద్దామని, లింగ ఆధారిత హింస ఏ రూపంలో వున్నా ఉపేక్షించకూడదని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.లక్ష్మీశ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో డీఆర్డీఏ-సెర్ప్ అధ్వర్యంలో జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నిధి మీనా, వివిధ శాఖల అధికారులతో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. హింసకు వ్యతిరేకంగా 'ఒకటే స్వరం, వరకట్నం ఇవ్వడం లేదా తీసుకోవడం చట్టరీత్యా నేరం.. వరకట్న వేధింపులు హింసకు దారితీస్తాయి' అంటూ రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అదేవిధంగా లింగ వివక్షను రూపుమాపడంలో తమవంతు పాత్ర పోషిస్తామంటూ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, లింగ ఆధారిత హింసకు వ్యతిరేకంగా గళం విప్పాలని, మనచుట్టూ జరిగే హింసను సహించవద్దని సూచించారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీ నరసింహం, డీఆర్డీఏ పీడీ కె.శ్రీనివాసరావు, ఐసీడీఎస్ పీడీ జె.ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ సైనిక్

(5వ పేజీ తరువాయి)

వ్యవస్థను సోమవారం నుంచి పట్టాలెక్కించారు. ఈ ట్రాఫిక్ అంబాసిడర్లకు పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు, డీసీపీలు గౌతమీశాలి, కృష్ణమూర్తినాయుడు, తిరుమలేశ్వరరెడ్డి,ఏడీసీపీలు గుణ్ణం రామకృష్ణ, అరిటాకుల శ్రీనివాసరావు, ప్రసన్నకుమార్, ఎం.రాజారావు సోమవారం శిక్షణ ఇచ్చారు. అంబాసిడర్లు ఎలా విధులు నిర్వర్తించాలన్న దానిపై చార్టు సిద్ధం చేశారు.

ప్రత్యేక వాట్సాప్ గ్రూపు

నగరంలో ట్రాఫిక్ విభాగంలో అంబాసిడర్లుగా పనిచేయాలనుకున్న వారికోసం పోలీసులు ప్రత్యేకంగా వాట్సాప్ గ్రూపును ఏర్పాటు చేశారు. ఇందులో మొత్తం 300కు పైగా సభ్యులు చేరారు. అంబాసిడర్లుగా వ్యవహరించాలనుకున్న వారు అక్కడున్న సమస్యను ఫొటో తీసి, లొకేషన్‌ను గ్రూపులో పోస్టు చేయవచ్చు. లేనిపక్షంలో ఫోన్‌చేసి ట్రాఫిక్ పోలీసులకు సమాచారం ఇవ్వొచ్చు. ఇలా పోలీసులకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతారు. అంబాసిడర్లకు సర్టిఫికెట్లు, ప్రశంసాపత్రాలు ఇచ్చి ప్రోత్సహించాలన్న యోచనలో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు ఉన్నారు. ఈ గ్రూపులో కమాండ్ కంట్రోల్ సెంటర్ సిబ్బందితో పాటు పోలీసు అధికారులు కూడా ఉంటారు.

ఇదీ అంబాసిడర్ల లెక్క

ప్రస్తుతం విజయవాడలో ట్రాఫిక్ అంబాసిడర్లుగా పనిచేయడానికి 379 మంది నమోదయ్యారు. నగరంలో ట్రాఫిక్ విభాగానికి సంబంధించి ఆరు పోలీస్‌స్టేషన్లు ఉన్నాయి. ట్రాఫిక్ 1లో 62, ట్రాఫిక్ 2లో 30, ట్రాఫిక్ 3లో 115, ట్రాఫిక్ 4లో 94, ట్రాఫిక్ 5లో 58, ట్రాఫిక్ 6లో 20 మంది అంబాసిడర్లుగా నమోదయ్యారు. ఈ అంబాసిడర్లను 33 కేటగిరీల నుంచి ఎంపిక చేశారు. పోలీసులు ట్రాఫిక్ నియంత్రణకు ఇప్పటికే అస్త్రం యాప్‌ను ఉపయోగిస్తున్నారు. దీనికి అనుసంధానంగా కీలకమైన కూడళ్లలో డ్రోన్లను గాల్లో తిప్పుతున్నారు. ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఎందుకు స్తంభించిపోయిందో స్పష్టంగా తెలుసుకుంటున్నారు. ఇది సత్ఫలితాలు ఇచ్చిన నేపథ్యంలో ట్రాఫిక్ అంబాసిడర్ల సేవలతో మరిన్ని ఫలితాలు సాధించవచ్చన్న అభిప్రాయంలో ఉన్నారు.

ఎమ్మెల్సీ ఓట్ల గందరగోళం

(5వ పేజీ తరువాయి)

నుంచి ఫోన్లు వస్తుండటంతో చాలామంది ఓటీపీలు చెప్పలేదు. ఇలా ఓటీపీలు చెప్పని వాటిని కూడా అండర్ వెరిఫికేషన్‌లో పెట్టినట్టు తెలుస్తోంది. ఓటీపీలు చెప్పని వాటిని ఆ కార్యాలయం సిబ్బంది ఆయా మండల కార్యాలయాల్లోని ఎలక్షన్ విభాగానికి పంపిస్తే మాన్యువల్‌గా స్వీకరించేవారు. ఎమ్మెల్సీ అశోక్‌బాబు ఆఫీసు నుంచి ఆయా మండల కార్యాలయాలకు దరఖాస్తులు వెళ్లకపోవడం వల్లే అండర్ వెరిఫికేషన్‌లో పెట్టారన్న విమర్శలు వస్తున్నాయి. తక్షణం అండర్ వెరిఫైడ్, అదర్ మండల్ పేరుతో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాల్సిన అవసరం ఉంది.

అన్నదాతకు తప్పని నిబంధనాలు!

తుపాను గండం గడిచినా తప్పని కష్టాలు

1262 ధాన్యం కొనుగోలుకు నిరాకరిస్తున్న మిల్లర్లు



దేవరకోట శివారులో 1262 రకం ధాన్యాన్ని కొనుగోలు చేయలేదని చెబుతున్న రైతు

ఫెంగల్ తుపాను ప్రభావం తగ్గటంతో ఊపిరి పీల్చుకున్నప్పటికీ ధాన్యం కొనుగోలుకు మిల్లర్ల నిబంధనలు అడ్డు పెట్టడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరుగాలం పండించిన పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడిన రైతులు ముందస్తు వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో యాంత్రీకరణతో పంటను కాపాడుకున్నప్పటికీ మిల్లర్లు పెట్టే నిబంధనలకు బెంబేలెత్తుతున్నారు.



రోడ్డుపై ఆరబోసిన ధాన్యం కాటా వేస్తున్న సిబ్బంది

ఘంటసాల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతుల ధాన్యం చివరి గింజవరకూ కొంటామని ప్రభుత్వం ఎన్ని చెప్పినా పలుకుబడి ఉన్న వారికి మాత్రమే ఎలాంటి నిబంధనలు అడ్డురావని, ధాన్యం విక్రయాల్లో తేటతెల్లమవుతుందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. ప్రశ్నించిన వారికే న్యాయం జరుగుతుందనటానికి నిదర్శనంగా దేవరకోట గ్రామానికి చెందిన రైతు దోనేపూడి గోపికృష్ణ ధాన్యాన్ని కొనుగోలు చేయటమే నిదర్శనం.

ఘంటసాల మండలం దేవరకోట గ్రామానికి చెందిన టీడీపీ నేత, రైతు దోనేపూడి గోపికృష్ణ తాను సాగు చేసిన 1262 పంటను యాంత్రీకరణ సహాయంతో గత ఐదు రోజుల క్రితం కోతకోసి రోడ్డుపై ఆరబోశాడు. ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు నిరాకరించటంతో సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ విధానాన్ని, మిల్లర్లు అనుసరిస్తున్న నిబంధనలను ప్రశ్నిస్తూ రైతులకు జరుగుతున్న అన్యాయాన్ని నిలదీశాడు. దీంతో స్పందించిన జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ గోపికృష్ణ ధాన్యాన్ని కొనుగోలు చేయాలని తహసీల్దార్ విజయప్రసాద్‌కు ఆదేశాలు జారీ చేయటంతో సోమవారం ఉదయం హుటాహుటిన సంచులు ఇప్పించి కాటాలు వేశారు. కానీ గోపికృష్ణ ధాన్యానికి కూతవేటు దూరంలో ఉన్న రైతు కన్నా జనార్ధనరావు ధాన్యాన్ని కొనుగోలు చేయలేదు. మండలంలో అచ్చెంపాలెం, తెలుగురావుపాలెం, పాపవినాశనం తదితర గ్రామాల్లో 1262 పంటను సాగు చేసిన రైతాంగం మిల్లర్లు పెట్టే నిబంధనలకు తలొగ్గలేక రోడ్డుపైనే ధాన్యాన్ని నిల్వ పెట్టుకుని దీనంగా చూస్తున్నారు.

1262 ధాన్యం నిరాకరిస్తున్న మిల్లర్లు

1262 ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు మిల్లర్లు నిరాకరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం అనుమతిచ్చిన రకాలనే సాగుచేసినా 1262 ధాన్యాన్ని ఎందుకు కొనుగోలు చేయటం లేదని, 1061 ధాన్యానికి అడ్డు రాని నిబంధన 1262కు ఎందుకు వస్తుందని రైతులు ప్రశ్నిస్తున్నారు. కాగా 1061 రకం ధాన్యం క్వింటా మిల్లులో ఆడితే 70 కేజీలకుపైగా బియ్యం వస్తాయని, అదే మిగిలిన రకాలకు చెందిన బియ్యం ఆడితే అంతగా రావనే ఉద్దేశ్యంతో మిల్లర్లు 1262 ధాన్యాన్ని కొనుగోళ్లు చేయటంలేదని రైతులు వాపోతున్నారు. అసలు విషయాన్ని దాచి బిజిలు లేవని, గోడౌన్లు ఖాళీలు లేవని మిల్లర్లు చెబుతున్నట్లు రైతులు పేర్కొన్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి

- రైతు నాయకుడు వేమూరి రత్నగిరిరావు



ఫెంగల్ తుపాను ప్రభావంతో రైతుల వద్ద నిల్వ ఉన్న పంటను గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలి. బస్తాకు 75 కేజీలు కాకుండా మిల్లర్ 76 కేజీలు కాటాలు వేస్తున్నారు. దీంతో రైతులు కేజీ ధాన్యానికి రూ.23లు నష్టపోతున్నారు. హమాలీల చార్జీలు కూడా పూర్తి స్థాయిలో ప్రభుత్వమే చెల్లించాలి.

ఈ-క్రాప్ చేయకపోవటంతో నష్టపోయా

గాజుల నాగ శ్రీనివాసరావు, అచ్చెంపాలెం



పంటకు ఈ క్రాప్ నమోదు చేయలేదు. వ్యవసాయ శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదు. బస్తా రూ.1200లకు తెగనమ్ముకోవాల్సి వచ్చింది. అచ్చెంపాలెం గ్రామంలో అధిక శాతం 1262 రకం సాగు చేశారు. ధాన్యం కొనుగోలుకు మిల్లర్ నిరాకరించటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. అధికారులు స్పందించి 1262 ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి.



మొలకలను చూపుతున్న రైతు

ధాన్యానికి మొలకలు!

» ఆందోళనలో రైతులు

మోపిదేవి : గడిచిన మూడు రోజులుగా కురిసిన వర్షాలకు రహదారుల వెంబడి ఉంచిన ధాన్యం తడిసి మొలకలు వస్తుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పెదప్రోలు, కప్తానుపాలెం, కాసానగర్, శివరామపురం, వెంకటాపురం, మోపిదేవి గ్రామాల్లో యంత్రాల ద్వారా వరి కోతలు, నూర్పిడులు చేపట్టారు. వాయుగుండం ప్రభావంతో కురిసిన అకాల వర్షాలతో రైతులు రహదారుల వెంబడి, ఖాళీ ప్రదేశాల్లో గుట్టలుగా పోసి పట్టాలు కప్పి కాపాడుకుంటున్నారు. పట్టాల కింద నీరు, తేమ చేరటంతో రాశుల అడుగు భాగంలో ఉన్న ధాన్యం మొలకలు వస్తున్నాయి. మొలకల ధాన్యాన్ని చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ధాన్యాన్ని మిల్లులకు తోలుకువెళ్లేందుకు అవసరమైన గోనె సంచులు రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో లేకపోవటంతో మరి కొద్దిరోజులు రహదారులపై రాశులుగా ఉంచాల్సి వస్తుందని ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికే తేమశాతం సాకుతో ఇష్టమొచ్చిన రీతిలో ధర నిర్ణయిస్తున్నారని, ఇప్పుడు మొలకలు కూడా రావటంతో మా పరిస్థితి ఏమిటని ఆందోళన చెందుతున్నారు.



కాసానగర్ వద్ద ధాన్యం రాశుల అడుగుభాగంలో వచ్చిన మొలకలు

నిబంధనలు సడలించి ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

- మండవ పవన్ కుమార్, కప్తానుపాలెం కౌలు రైతు

వర్షాల కారణంగా తడిసిన ధాన్యాన్ని తేమశాతం నిబంధనలు సడలించి గిట్టుబాటు ధరతో ప్రభుత్వం కొనుగోలు చేయాలి. వెంటనే సరిపడిన స్థాయిలో గోనె సంచులు అందించి రైతులను ఆదుకోవాలి.



ధాన్యం కొనుగోలుకు సంబంధించి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న దేవినేని ఉమా, పక్కన ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా

చివరి గింజా కొనాల్సిందే..

» కలెక్టర్ దృష్టికి రైతుల సమస్యలు : దేవినేని ఉమామహేశ్వరరావు

పమిడిముక్కల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : రైతులు పండించిన ధాన్యం రకంతో సంబంధం లేకుండా మిల్లర్లు ప్రభుత్వ మద్దతుధర బస్తా రూ.1,740కు కొనాల్సిందేనని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా అన్నారు. హనుమంతపురంలో సోమవారం టీడీపీ నేత పరుచూరి వెంకటేశ్వరరావు కుటుంబసభ్యులను పరామర్శించేందుకు వచ్చిన నేతలను స్థానిక రైతులు కలిసి 1262 రకం ధాన్యం మిల్లర్లు కొనడంలేదని మొరపెట్టుకున్నారు. దీంతో డీఎస్‌వో, జిల్లా కలెక్టర్ లక్ష్మీశతో ఫోన్‌లో ఉమా మాట్లాడారు. మిల్లర్లతో మాట్లాడి 1262రకం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరామని, రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా ఇచ్చారు. రైతు పండించిన చివరి గింజవరకు కొనుగోలు చేయాలన్నది ప్ర భుత్వలక్ష్యమన్నారు. దళారులు చెప్పే మాటలు నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. మిల్లర్లను డిమాండ్‌చేసి, అధికారులను నిలదీసి పనిచేయించుకోవాలన్నారు.



రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మాగంటి హరిబాబు తదితరులు

1262 రకం విత్తనం కొనుగోలు చేయాలి

కంకిపాడు, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ చెప్పినా, ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా 1262 రకం ధాన్యం కొనుగోలు చేయడంలో మిల్లర్లు ఆసక్తి చూపించడం లేదని కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మండిపడ్డారు. రైతు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ తహసీల్దార్ భవన్నారాయణకు సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ, రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యానికి కనీస మద్దతు ధర ఇచ్చేందుకు మిల్లర్లు నానా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. రైతులకు అవసరమైన గోనుసంచులు, ట్రాన్స్‌పోర్టు సహకారాన్ని సకాలంలో అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతు సంఘం నాయకులు తాడంకి నరేష్, జాన్‌మోజస్, దాసు తదితరులు పాల్గొన్నారు.

కోటి ఆశలకు కొత్త రెక్కలు

(5వ పేజీ తరువాయి)

పెండింగ్ పనులు చేపట్టనున్నారు. ఈ పనులను రెండేళ్లలో పూర్తిచేసేలా కాంట్రాక్టు సంస్థకు దిశానిర్దేశం చేశారు. ఈ భవనాలకు సంబంధించి 2017లో రూ.785 కోట్లతో స్టిల్ట్ ప్లస్ 12 అంతస్థులతో కూడిన నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రూ.408.63 కోట్ల మేర పనులు 2019 కంటే ముందే పూర్తయ్యాయి. ఆ తర్వాత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం పనులను వదిలివేయటంతో అంచనా వ్యయం పెరిగింది. తాజా అంచనాల మేరకు రూ.594.54 కోట్లతో బ్యాలెన్స్ పనులను పూర్తి చేయాలని సీఆర్‌డీఏ అథారిటీ నిర్ణయించింది.

- గజిటెడ్ ఆఫీసర్స్ టైప్-1, 2, క్లాస్ ఉద్యోగుల క్వార్టర్ల దగ్గర తాగునీటి సదుపాయం, రోడ్లు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, బిల్డింగ్ సెక్యూరిటీ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ల్యాండ్ స్కేపింగ్ వంటి పనులను రూ.226.26 కోట్లతో చేపట్టేందుకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018, డిసెంబరు 18న రూ.121.34 కోట్ల పనులకు ఆమోదం తెలపగా, 2019లో పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ అధికారంలోకి రాగానే జూన్‌లో ఈ పనులు ఆగిపోయాయి. తాజాగా ఈ పనులు రెండేళ్లలో పూర్తి చేసేలా అథారిటీ నిర్ణయం తీసుకుంది.
- నాన్ గజిటెడ్ ఆఫీసర్ల భవనాలకు సంబంధించిన బ్యాలెన్స్ పనులను ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులు రూ.607.50 కోట్లతో చేపట్టడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. ఎన్జీవో భవనాలకు సంబంధించి మొత్తం 1,140 ఫ్లాట్లతో కూడిన 12 స్టిల్ట్ ప్లస్ టవర్ల పనులను చేపట్టనున్నారు.
- ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధుల నుంచి ఎన్జీవో ఆఫీసర్ల భవనాలకు మౌలిక వసతుల కల్పన పనులను రూ.594.36 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ ఆమోదించింది. ఇందులో మొత్తం 855 ఫ్లాట్లతో కూడిన తొమ్మిది స్టిల్ట్ ప్లస్ 12 టవర్స్ పనులు చేపట్టనున్నారు.
- ఐఏఎస్ అధికారులు, ముఖ్య కార్యదర్శులకు సంబంధించిన 111 బంగ్లాల పెండింగ్ పనులను రూ.516.6 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. గత టీడీపీ ప్రభుత్వ హయాంలోనే 2017, డిసెంబరు 27న ఈ భవనాలకు రూ.274.5 కోట్లకు పాలనాపరమైన అనుమతులు ఇచ్చారు. 2018లో పనులు ప్రారంభమయ్యాయి. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆగిపోయాయి. బ్యాలెన్స్ పనులను పూర్తి చేసేందుకు సవరించిన అంచనా రూ.516.6 కోట్లతో పనులు చేపట్టాల్సి వస్తోంది. మొత్తం 5,28,125 చదరపు అడుగుల విస్తీర్ణంలో 115 బంగ్లాలను రెండేళ్లలో కాంట్రాక్టు సంస్థ పూర్తి చేయాలని అథారిటీ నిర్దేశించింది.
- ఎల్పీఎస్ ఇన్‌ఫ్రా పనులను రూ.3,859.66 కోట్లతో చేపట్టేందుకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించింది. భూ సమీకరణ విధానంలో రైతుల నుంచి తీసుకున్న భూములకు ప్రతిగా, ప్యాకేజీ కింద ఇచ్చిన రిటర్నబుల్ ప్లాట్లకు సంబంధించి మొత్తం 13 ఎల్పీఎస్ జోన్లలో 8,496.30 ఎకరాల్లో మౌలిక సదుపాయాల పనులు చేపట్టనున్నారు. ఎల్పీఎస్ జోన్లలో రోడ్లు, స్ట్రామ్‌వాటర్ డ్రెయిన్లు, మంచినీటి సరఫరా, డ్రెయినేజీ, పవర్‌డక్ట్స్, రీయూజ్ వాటర్ నెట్‌వర్క్స్, వాకింగ్ ట్రాక్, సైకిల్ ట్రాక్ తదితర పనులను చేపట్టనున్నారు. గతంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో రూ.3,306.59 కోట్లతో చేపట్టాలని నిర్ణయించారు. వైసీపీ ప్రభుత్వం ఏ దశలోనూ ఈ పనులు చేపట్టడానికి ఇష్టపడలేదు. ఫలితంగా సవరించిన అంచనాలతో రూ.3,859.66 కోట్లతో పనులను చేపట్టాల్సి వస్తోంది. ఎల్పీఎస్ ఇన్‌ఫ్రాలో భాగంగా జోన్-1ఏలోని నెక్కల్లులో 1,390.1 ఎకరాలు, జోన్ 1బీలోని నెక్కల్లు, శాఖమూరులో 760.27 ఎకరాలు, జోన్-2బీలోని అనంతవరం, నెక్కల్లు, నేలపాడు, శాఖమూరు, తుళ్లూరు గ్రామాల్లో కొన్ని భాగాలకు సంబంధించి 1,223.76 ఎకరాలు, జోన్-5బీలోని అబ్బరాజుపాలెం, బోరుపాలెం, దొండపాడు, రాయపూడిలో 1,788.42 ఎకరాలు, జోన్-5డీలోని అబ్బరాజుపాలెం, తుళ్లూరు, రాయపూడిలో 1,488.81 ఎకరాలు, జోన్-6 పరిధిలోని కొండమరాజుపాలెం, రాయపూడిలో 981.72 ఎకరాల్లో ఎల్పీఎస్ పనులు చేపట్టనున్నారు.
- అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్ గతంలో సీడ్ యాక్సెస్ రోడ్డుతో పాటు ప్యాకేజీ 1 నుంచి 22 వరకు ఇచ్చిన కాంట్రాక్టులన్నింటినీ రద్దుచేస్తూ అథారిటీ నిర్ణయం తీసుకుంది. ట్రంక్ ఇన్‌ఫ్రా, వరద నివారణ పనులు, గ్రీనరీకి సంబంధించి గతంలో కాంట్రాక్టు ఇచ్చిన వాటిని కూడా అథారిటీ రద్దు చేసింది.
- ప్రపంచబ్యాంకు, ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంకు నిధుల నుంచి అమరావతిలో వరద నివారణ పనులు మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ఏడీసీ 45వ బోర్డు సమావేశంలో తీసుకున్న నిర్ణయం ప్రకారం వరద నివారణ పనులను 3 ప్యాకేజీలుగా చేపట్టాలని నిర్ణయించారు. ప్యాకేజీ-1 పనులకు రూ.580.74 కోట్లు, ప్యాకేజీ-2కు రూ.386.95 కోట్లు, ప్యాకేజీ-3కు రూ.608.26 కోట్లను కలిపి మొత్తంగా రూ.1,585.95 కోట్లు ఖర్చు చేసేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది.
- రాజధాని నగరంలో ఎన్-9 రోడ్డుకు, ప్యాకేజీ-4 కింద మిగిలిన నిర్మాణ పనులతో పాటు మౌలిక వసతులకు రూ.523.39 కోట్లు ఇస్తూ అనుమతులు మంజూరు చేసింది. ఎన్-9 రోడ్డు వెంబడి అంతర్గత రోడ్లు, తాగునీరు, వరదనీటి కాల్వలు, యుటిలిటీ డక్ట్స్, పాదచారుల ట్రాక్‌లు, సైకిల్ ట్రాక్, ఎవెన్యూ ప్లాంటేషన్, స్ట్రీట్ ఫర్నీచర్ వంటివి ఏర్పాటు చేయనున్నారు. అలాగే, ప్యాకేజీ-6 కింద మిగిలిన ఎన్-18 రోడ్డు పనులు, మౌలిక వసతుల కోసం రూ.98.17 కోట్లతో సీఆర్‌డీఏ ఆమోదముద్ర వేసింది. ఎన్-15 రోడ్డుకు సంబంధించి ప్యాకేజీ-6లో మిగిలిన పనులను రూ.482.01 కోట్లతో, ఈ-6 రోడ్డుకు సంబంధించి ప్యాకేజీ-7 కింద మిగిలిన పనులను రూ.452.96 కోట్లతో, ఈ-8 రోడ్డుకు సంబంధించి ప్యాకేజీ-8లో మిగిలిన పనులను రూ.522.92 కోట్లతో, ఎన్-11 రోడ్డుకు సంబంధించి ప్యాకేజీ-9లో మిగిలిన పనులను రూ.419.85 కోట్లతో చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది.

సీజనల్ హాస్టల్స్ నిర్వహణకు దరఖాస్తుల ఆహ్వానం

కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలకు సీజనల్ హాస్టల్స్ నిర్వహణకు రిజిస్టర్డ్ స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సమగ్ర శిక్ష జిల్లా అదనపు ప్రాజెక్టు కో-ఆర్డినేటర్ గుడ్ల మహేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమగ్ర శిక్ష సంచాలకుల ఆదేశాలననుసరించి ఎన్టీఆర్ జిల్లాలోని ఐదు (చందర్లపాడు, జగ్గయ్యపేట, ఇబ్రహీంపట్నం, వత్సవాయి, విస్సన్నపేట) మండలాల్లో వలస వెళ్లిన తల్లిదండ్రుల పిల్లలకు సీజనల్ హాస్టల్లో నిర్వహణకు దరఖాస్తులు కోరుతున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఎన్టీఆర్ జిల్లాకు మొత్తం 25 సీజనల్ హాస్టల్స్ మంజూరయ్యాయని, వీటి నిర్వహణకు అనుబంధ శాఖలైన ట్రైబల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, సోషల్ వెల్ఫేర్, స్వయం సహాయక సంఘాలు, రిజిస్టర్డ్ స్వచ్ఛంద సంస్థల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు తెలిపారు. దరఖాస్తును మెయిల్ ద్వారాగాని లెటర్ ద్వారా గాని తెలియపరచాలని పేర్కొన్నారు. స్వచ్ఛంద సంస్థలు రిజిస్ట్రేషన్ యాక్ట్ 1860 ద్వారా గుర్తింపు పొంది మూడు సంవత్సరాల ఆడిట్ కాపీలు, సమస్త బైలా రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, దర్పన్ ఐడీ, గతంలో చేసిన కార్యక్రమాలతో విజయవాడ కార్యాలయంలో డిసెంబరు 5లోగా సమర్పించాలని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏఎల్ఎస్ కో-ఆర్డినేటర్ 8712655816 నెంబర్‌లో సంప్రదించాలని తెలిపారు.

ఉత్కంఠగా టేబుల్ టెన్నిస్ ఎంపికలు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): నగరంలోని ఇందిరాగాంధీ కార్పొరేషన్ స్టేడియంలో టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ హాల్లో ఉమ్మడి జిల్లాల అండర్-15 బాల, బాలికలు, పురుషులు, మహిళల ఎంపిక పోటీలు ఉత్కంఠభరితంగా సాగాయి. పోటీలను సోమవారం రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శి పి.విశ్వనాథ్ ప్రారంభించారు. రెండు జిల్లాల నుంచి మొత్తం 120 మంది క్రీడాకారులు తలపడ్డారు. రాత్రి వరకు ఈ పోటీలు సాగాయి. విజేతలను మంగళవారం ప్రకటించనున్నారు. ఇందులో సత్తా చాటిన వారిని ఈ నెలలో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నారు. టీటీ జిల్లా అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ బొడ్డు శ్రీనివాస్, కోచ్‌లు షారూక్ అక్రమ్, రుత్విక్, గౌస్‌బాషా, ముంతాజ్‌లు పర్యవేక్షించారు.



మెట్రోకు గ్రీన్‌సిగ్నల్

(5వ పేజీ తరువాయి)

తొలిదశ మెట్రో పనులు ప్రారంభించటానికి ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ సిద్ధంగా ఉంది. తొలిదశలో పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ (పీఎన్‌బీఎస్) నుంచి గన్నవరం వరకు కారిడార్-1లో 25.95 కిలోమీటర్లు, పీఎన్‌బీఎస్ నుంచి బందరు రోడ్డు మీదుగా పెనమలూరు వరకు కారిడార్-2లో 12.45 కిలోమీటర్ల చొప్పున మొత్తంగా 38.40 కిలోమీటర్ల నిడివితో పనులు చేపట్టాలని భావిస్తోంది. ఈ పనులపై ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు గ్రౌండ్ ప్రిపరేషన్ చేసి ఉంచారు. కేంద్ర అనుమతులు రాగానే, విజయవాడ నగరంలో కార్పొరేషన్, పోలీసు, రెవెన్యూ, ఆర్టీసీ, విద్యుత్, ఆర్‌అండ్‌బీ తదితర శాఖలతో కమిటీలు ఏర్పాటు చేస్తారు. కారిడార్ల మార్గంలో ఆయా శాఖలు తక్షణం చేయాల్సిన పనులకు సంబంధించి మొదటి భేటీ ఉంటుంది. భూ సేకరణ ప్రతిపాదనలు గతంలోవే కాబట్టి.. ఆ మేరకు పనులు ప్రారంభించాల్సి ఉంటుంది. సెంట్రల్ డివైడర్‌పై పిల్లర్ల పనులకు ఇబ్బందులు లేవు కాబట్టి.. భూ సేకరణ జరిగే వరకు వేచి చూడకుండా, ముందుగా టెండర్లు పిలిచి పనులు అప్పగించటం జరుగుతుంది. అన్ని శాఖల పనులు సమాంతరంగా జరిగేలా ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ ఏర్పాట్లు చేస్తోంది.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	105, 113, 124
చికెన్ విత్ స్కిన్	200
చికెన్ స్కిన్‌లెస్	210

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 620

భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా సహస్ర లింగార్చన

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానంలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాలు చివరి రోజైన సోమవారం మల్లేశ్వరస్వామి ఆలయంలో సహస్ర లింగార్చన సేవా కార్యక్రమం నిర్వహించారు. వేద పండితులు, అర్చకులు భక్తిప్రపత్తులతో శాస్త్రోక్తంగా వేదమంత్ర సహితంగా సహస్ర లింగార్చన నిర్వహించారు. స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, ప్రత్యేక అర్చనలు చేశారు. సహస్ర లింగార్చన సేవలో ఈవో రామరావు దంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. సహస్ర లింగార్చన సేవలో స్వామిని పుష్పాలు, బిల్వాలతో నయనమనోహరంగా అలంకరించారు.



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం ధర్నా

లబ్బీపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పెంచిన ట్రూ అప్ చార్జీల పేరుతో ప్రజలపై మోపుతున్న విద్యుత్ చార్జీలను వెంటనే రద్దు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దోనేపూడి కాశీనాథ్ డిమాండ్ చేశారు. ట్రూ అప్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం రాణిగారితోటలోని విద్యుత్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎన్నికల సభల్లో ఎట్టి పరిస్థితుల్లో కరెంటు చార్జీలు పెంచమని హామీలు ఇచ్చి ఇప్పుడు ఏం చేస్తున్నారని అన్నారు. వెంటనే ట్రూ అప్ చార్జీలు భారాలు ఆపాలని లేని పక్షంలో రాష్ట్రంలో మరో బషీర్ బాగ్ తరహా ప్రజల పోరాటాన్ని ఎదుర్కోవలసి వస్తుందని హెచ్చరించారు. తూర్పు నగర కార్యదర్శి పి.కృష్ణ, తమ్మిన చంద్రశేఖర్, వరప్రసాద్, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధితో పనిచేస్తున్న కూటమి

వాటర్ ట్యాంక్‌కు భూమిపూజలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజల అవసరాలకు తగ్గట్టుగా చిత్తశుద్ధితో పనిచేస్తుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. ఐదవ డివిజన్ పరిధిలోని క్రీస్తురాజుపురం కొండ ప్రాంతంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ప్రతి ఇంటికి నీటి కష్టాలు లేకుండా చేయాలన్నదే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నామని తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన కొద్ది నెలల వ్యవధిలోనే కొండ ప్రాంతంలో వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి నిధులు సమకూర్చుకుని పనులు ప్రారంభించినట్లు తెలిపారు. త్వరితగతిన పనులు పూర్తి చేసి కొండపైన నివాసాలు ఉండేవారికి నీటి కొరత లేకుండా చేస్తామన్నారు. మరో నాలుగు ట్యాంక్‌ల నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేశామని చెప్పారు. అనంతరం జయప్రకాష్ నగర్ మూడోలైన్ రోడ్డు నిర్మాణ పనులకు గద్దె భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో 5వ డివిజన్ అధ్యక్షుడు నందిపాటి దేవానంద్, ఈఈ సామ్రాజ్యం, గద్దే రమేష్, సిద్దుల వివేక్, యలమంచలి రాజేష్, కోడూరు సుబ్రహ్మణ్యం, రిమ్మనపూడి బ్రహ్మేశ్వర రావు, రాచమళ్ల ఆంజనేయులు, కెనడి పాల్గొన్నారు.



వాటర్‌ట్యాంక్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

వారధి గూడ్స్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవం

రాణిగారితోట: కేంద్ర ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.30వేల కోట్లతో జనవరి నుంచి అమరావతిలో అద్భుతమైన నిర్మాణ పనులను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తారని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. రాణిగారితోట 18వ డివిజన్‌లో సోమవారం శ్రీ కనకదుర్గమ్మ వారధి గూడ్స్ ఆటో ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ప్రారంభోత్సవం, టీడీపీ జెండా దిమ్మ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణం పూర్తయితే కూలీలకు, ఆటో డ్రైవర్లకు స్వర్ణయుగం మొదలవుతుందని అన్నారు. ఉచిత ఇసుక పాలసీలో కొన్న లోపాలు ఉన్నాయని వాటిని సవరించేందుకు సబ్ కమిటిని వేసి మరింత పటిష్ఠంగా ఉచిత ఇసుక పాలసీని అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్న చంద్రబాబుకు అందరం అండగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతయ్య, శ్రీనివాస చౌదరి, అసోసియేషన్ అధ్యక్షుడు నరాల ప్రకాష్, సెక్రటరీ ఎస్కే మీరావలి పాల్గొన్నారు.



జెండా ఊపి కూరగాయల లారీని పంపుతున్న ధర్మకర్త సంగా నరసింహారావు, తదితరులు

టీటీడీ నిత్యాన్నదానానికి 10 టన్నుల కూరగాయల వితరణ

భారతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మూడో డివిజన్ పరిధిలోని శ్రీరామచంద్ర నగర్ కాలనీకి చెందిన ధనేకుల నాగేంద్రబాబు (బాబి), దుర్గ దంపతులు, వారి కుమారుడు సావంత్ సహకారంతో మండ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తిరుమల తిరుపతి దేవస్థాన నిత్య అన్నదాన ట్రస్ట్‌కు 10టన్నుల కూరగాయలను వితరణగా అందించారు.

సోమవారం కూరగాయల వాహనాన్ని శ్రీరామచంద్రనగర్ కాలనీలోని అపెజ్ టవర్స్ నుంచి టీటీడీకి యనమలకుదురు శ్రీరామలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రధాన ధర్మకర్త సంగా నరసింహారావు జెండా ఊపి పంపించారు. ఈ కార్యక్రమంలో దాతలు, కుటుంబ సభ్యులు, బంధు మిత్రులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఇనుప మూత

● మలుపులో స్కిడ్ అవుతున్న ద్విచక్రవాహనదారులు ● జీబ్రా లైన్లు, బ్లింకర్లు లేక స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపు తప్పుతున్న వాహనాలు

(పటమట, ఆంధ్రజ్యోతి)

పటమట పంటకాల్వ రోడ్డు పదకొండో డివిజన్ పోస్టల్ కాలనీ తుమ్మల వెంకటరత్నం పార్కు ఎదురుగా మలుపులో కల్వర్టు మీద వేసిన ఇనుప పలకల(మూత)ల వల్ల ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళ ద్విచక్రవాహనదారులు అదుపు తప్పి కింద పడి గాయపడుతున్నారు. పటమట నుంచి ఆటోనగర్, ఆటోనగర్ నుంచి పోస్టల్ కాలనీ, గురునానక్ కాలనీ నుంచి పంటకాల్వ రోడ్డులోకి నిత్యం వందల సంఖ్యలో జనాలు వాహనాలతో ఈ మలుపులోకి వస్తుంటారు. ఈ సందర్భంలో ఎవరైనా ఒకరు పడితే మిగిలిన రెండు మార్గాల్లో వచ్చే వారు కింద పడిన వాహనాన్ని ఢీకొట్టి కింద పడిపోతున్నారు. ఇలా పడిన ద్విచక్రవాహనం వెనుక కారు, బస్సు, లారీ వంటి వాహనాలు వస్తే ప్రాణాలు పోయే ప్రమాదం ఉంది. ఈ మలుపులో కల్వర్టు మీద వేసిన ఇనుప పలకలు సాఫీగా ఉండటంతో టైర్లు స్కిడ్ అవుతున్నాయి. ఆటోనగర్ నుంచి పటమట వచ్చే ఈ మలుపులోనే స్పీడు బ్రేకర్ వద్ద కూడా ఇదే పరిస్థితి. మలుపులో ఉన్న దీనికి నలుపు తెలుపు జీబ్రా లైన్లు కానీ, బ్లింకర్స్ కాని లేకపోవడంతో దగ్గరకు వచ్చే వరకు స్పీడ్ బ్రేకర్ కనపడక వాహనాలు స్పీడ్ బ్రేకర్ మీదకు ఎక్కగానే ఎగిరి పడి గాయపడుతున్నారు.

సిమెంట్ పలకలు వేయాలి



ఈ మలుపులో మాది షామియానా షాపు. ప్రతి రోజూ పాఠశాలలకు పిల్లలను తీసుకువెళ్లే ద్విచక్ర వాహనదారులు స్పీడ్ బ్రేకర్ వద్ద, ఇనుప పలకల వద్ద కిందపడి గాయపడు తున్నారు. రోడ్డు దెబ్బ తగిలినా, వెనుక భారీ వాహనం వచ్చినా అదుపు తప్పితే ప్రాణాలు పోతాయి. అధికారులు స్పందించి ఇనుప పలకల స్థానంలో సిమెంట్ పలకలు వేయాలి. స్పీడ్ బ్రేకర్ వద్ద బ్లింకర్‌లు ఏర్పాటు చేసి రంగులు వేయాలి. - పి. ప్రసాద్



కల్వర్టు మీద ఇనుప ప్లేటు వల్ల స్కిడ్ అయి కింద పడ్డ ద్విచక్రవాహనదారుడు



తుమ్మల వెంకటరత్నం పార్కు ఎదురుగా ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్

మద్రాస్ ఫిల్టర్ కాఫీ లోగో మార్ఫింగ్

● పోలీసులకు ఫిర్యాదు

విజయవాడ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి) : ట్రేడ్‌మార్క్ చట్టం ప్రకారం రిజిస్టర్ అయిన పేరు, లోగోను ఉపయోగిస్తున్న వ్యక్తులపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. పెనమలూరు మండలం కానూరులోని చలసాని నగర్‌కు చెందిన పరుచూరి యశ్వంత్‌కుమార్ మద్రాస్ ఫిల్టర్ కాఫీ పేరుతో వ్యాపారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన పేరు, లోగోను ఆయన ట్రేడ్‌మార్క్ చట్టం ప్రకారం రిజిస్టర్ చేయించుకున్నారు. సీహెచ్ కార్తీక్, కృష్ణమూర్తి, పాత్రగడ్డ సురేష్, గొట్టిపాటి దొరబాబు అనే నలుగురు వ్యక్తులు మద్రాస్ ఫిల్టర్ కాఫీ పేరుతో ఫ్రాంచైజీలు ఇవ్వడం మొదలుపెట్టారు. మద్రాస్ ఫిల్టర్ కాఫీ లోగోను అదే మాదిరిగా ఉపయోగిస్తున్నారు. చట్టవిరుద్ధంగా తమ పేరు, లోగోలను ఉపయోగించడం వల్ల వ్యాపారపరంగా నష్టం కలుగుతోందని యశ్వంత్ పటమట పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేశారు.



మాట్లాడుతున్న డాక్టర్ అనిత

మహిళలపై హింసాత్మక సంఘటనలను వ్యతిరేకించాలి

లబ్బీపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసాత్మక సంఘటనలను ప్రతి ఒక్కరూ వ్యతిరేకించాలని సేఫ్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ డాక్టర్ టి.విజయలక్ష్మి అన్నారు. నేటి సమాజంలో మహిళలపై జరుగుతున్న హింసకు వ్యతిరేకంగా మహిళలపై హింస-నిర్మూలన అనే అంశంపై నలంద కళాశాలలో సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ సమాజంలో మహిళలపట్ల గౌరవభావాన్ని పెంపొందించుకుని తమ సామాజిక బాధ్యతను తెలుసుకుని ఆదర్శప్రాయంగా మెలగాలన్నారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ జి.అనిత మాట్లాడుతూ సోషల్ మీడియా టెక్నాలజీ మంచి కోసం మాత్రమే ఉపయోగించాలని, సైబర్ నేరాలకు పాల్పడకుండా బాధ్యతాయుతంగా ఉండాలని సూచించారు. ప్రిన్సిపాల్ ఎం.అనూరాధ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సేఫ్ సభ్యులు స్వరూపరాణి, కుమారి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మాస్టర్ ఒరేటర్ పోటీలు

భారతీనగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): శ్రీనివాసనగర్ బ్యాంక్ కాలనీలోని పరిటాల ఓంకార కల్యాణ మండపంలో నారాయణ విద్యాసంస్థల ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయిలో మాస్టర్ ఒరేటర్ పోటీలను నిర్వహించారు.ఈ పోటీల్లో విద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణతో చక్కటి నైపుణ్యాలను ప్రదర్శించారు. ఏజీఎం మురళి కిషోర్ మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఈ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫైనల్స్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేస్తామన్నారు. నారాయణ స్కూల్స్ కో-ఆర్డినేటర్ ముత్తారెడ్డి, ఉపాధ్యాయులు, ఉమ్మడి జిల్లా విద్యార్థులు పాల్గొన్నారు.

యువత రసాయన శాస్త్రంపై దృష్టి పెట్టాలి

రావులపాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీనివాసరావు

గుణదల, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): యువత రసాయన శాస్త్రంపై దృష్టి పెడితే మంచి భవిష్యత్తు ఉంటుందని రావుల పాలెం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఎస్ఆర్ఆర్ కళాశాలలో రసాయన శాస్త్ర అధ్యయనం, దాని వల్ల ఉపయోగాలు అనే అంశంపై సోమవారం అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు రసాయన శాస్త్ర అధ్యయనం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. రసాయనాల తయారీకి సంబంధించిన కంపెనీలు పెరిగిపోతున్నాయని, వాటివల్ల ఎంతోమందికి ఉపాధి ఉద్యోగ అవకాశాలు రావడంతోపాటు సమాజం ఆర్థికంగా వృద్ధిలోకి వస్తుందన్నారు. రసాయన శాస్త్ర అధ్యయనం వల్ల ఫార్మా రంగంలో రాణించవచ్చని చెప్పారు. కెమిస్ట్రీ విత్ కంప్యూటర్ సైన్స్‌తో డిగ్రీ పొందిన వారికి మంచి భవిష్యత్ ఉందని చెప్పారు. అనంతరం రసాయనశాస్త్రంలో రాణించిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఆర్ఆర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భాగ్య లక్ష్మి, షేక్‌బేబి, ప్రియదర్శిని, సురేష్ పాల్గొన్నారు.



సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో అతిథి



ప్రమాదాలకు నిలయంగా ఏపీఐఐసీ సెంటర్

స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని స్థానికుల వినతి

(భారతీనగర్,ఆంధ్రజ్యోతి)

గురునానక్ రోడ్డులోని ఏపీఐఐసీ సెంటర్ ప్రమాదాలకు నిలయంగా మారింది. గురునానక్ రోడ్డులో ఏపీఐఐసీ సెంటర్ వద్ద తూర్పు వైపు ఆటోనగర్ రోడ్డు, పడమర వైపు గురునానక్ రోడ్డు తో పాటు ఒక వైపు పంటకాలువ(హైస్కూల్) రోడ్డు, మరొక వైపు ఏపీఐఐసీ కాలనీ మెయిన్ రోడ్డుతో కలిసి నాలుగు రోడ్డుల ప్రధాన కూడలి. ప్రధాన రహదారులు కావడంతో నిత్యం వాహనాలతో రద్దీగా ఉంటాయి. ఈ రోడ్డుల్లో వాహనదారులు వేగంగా రావడంతో ఈ సెంటర్‌లో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి తక్షణమే వాహనదారులు వేగాన్ని తగ్గించడానికి సెంటర్‌లో స్పీడ్ బ్రేకర్స్ వేయాలని స్థానికులు కోరుతున్నారు.

గోవిందరాజన్‌కు పదవీ విరమణ సత్కారం



గోవిందరాజన్‌కు స్వర్ణకంకణం తొడుగుతున్న ప్రముఖ వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి

విజయవాడ కల్చరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గుంటూరు కళాశాలలో వీణ సహాధ్యాపకునిగా, అధ్యాపకునిగా, ప్రధానాధ్యాపకునిగా 28 ఏళ్లు సుశిక్షణ అందించి సంగీత రంగానికి విశేష సేవలు అందించిన సేవా విద్వాంసుడు కేఎస్ గోవిందరాజన్‌ను ఘనంగా సత్కరించారు. సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో ఆయన శిష్యబృందం ఆధ్వర్యంలో పదవీ విరమణ సత్కార కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో అపారమైన గురు భక్తిని చాటుకున్నారు. పూర్ణ కుంభ స్వాగతం, వేద ఆశీర్వచనంతో సన్మానం వైభవంగా సాగింది. ప్రముఖ వయోలిన్ విద్వాంసులు అన్నవరపు రామస్వామి స్వర్ణకంకణం తొడిగి 'వైణిక సద్గురు విద్వన్మణి' బిరుదును ఇచ్చి అభినందించారు. సభాధ్యక్షులుగా ఎన్.సి.హెచ్.ఎస్ బుచ్చయ్యా చార్యులు, విశిష్ట అతిథిగా 'కళారత్న' మోదుమూడి సుధాకర్, గౌరవ అతిథిగా సాంస్కృతిక శాఖ సహాయ సంచాలకులు డి.పెంచలయ్య, ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు టి.కె.వి.రామానుజాచార్యులు, ప్రముఖ వీణ విద్వాంసులు, అయ్యగారి సత్యప్రసాద్‌లు పాల్గొని గోవిందరాజన్ కళాశాల అభివృద్ధికి, సంగీతానికి చేసిన సేవను కొనియాడారు. ఎంతో మంది శిష్యులను తయారు చేసారన్నారు. దానికి తార్కాణమే శిష్యులు మహాబృందంగా చేసిన సత్కారం రుజువు చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో పాటు పలువురు ప్రముఖులు, సంగీతజ్ఞులు పాల్గొన్నారు. తదుపరి నాదస్వరం-కర్నూలుకు చెందిన ఎం.వెంకటేశ్వరరావు, ఎం.సుబ్బరామయ్య బృందం వయోలిన్-సృజన్ కార్తికేయ, గోవిందరాజన్ శిష్య బృందం వీణావాదన, అజయ్ కుమార్ శిష్య బృందం నాట్య ప్రదర్శన, ప్రేక్షకులను అలరించాయి.



మారిస్ స్టెల్లా ఆడిటోరియం గోడ పక్కన పేరుకున్న వ్యర్థాలు

ముక్కు మూసుకోవాల్సిందే ...

పటమట, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పటమట ఎన్టీఆర్ సర్కిల్ దగ్గర నుంచి పంటకాల్వ రోడ్డుకు వెళ్లేదారిలో మారిస్ స్టెల్లా ఆడిటోరియం గోడ పక్కన వ్యర్థాలను గుట్టలుగుట్టలుగా మూటలు కట్టి అక్కడ పడేశారు. సుమారు నెలరోజులుగా ఆ వ్యర్థాలు అక్కడే ఉండటంతో వర్షాలు పడినపుడు కుళ్లిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. ఆ వైపుగా వెళ్లాలంటే ముక్కుమూసుకోవాల్సిందే. తరుచూ ఈ మార్గంలో ఉన్నతాధికారులు, మంత్రులు రాకపోకలు సాగిస్తుంటారు. అయినప్పటికీ శానిటరీ సిబ్బందికి చీమకుట్టినట్లైనా లేదు. సంబంధిత అధికారులు వెంటనే ఆ వ్యర్థాలను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

దుర్గగుడి కళావేదిక పై కూచిపూడి నృత్యం

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గన్నవరానికి చెందిన ప్రతిన్ కూచిపూడి నాట్య అకాడమీ బృందం సోమవారం దుర్గగుడి కళావేదిక పై నాట్య ప్రదర్శన చేసింది. 13 మంది కళాకారుల బృందం పలు కీర్తనలకు చేసిన కూచిపూడి నృత్యం ప్రేక్షకులను మంత్రముగ్ధులను చేసింది. ప్రతిన్ కూచిపూడి నాట్య అకాడమీ గురువు కొలచిన కమల నిఖి శిష్య బృందం తమ నాట్య ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నారు. డిప్యూటీ ఈవో రత్నరాజు కళాకారులను అభినందించి ప్రశంసాపత్రాలు అందచేశారు.



కళాకారులను అభినందిస్తున్న డిప్యూటీ ఈవో రత్నరాజు



నైట్ లైఫ్..!

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతిని ప్రకటించిన తరువాత విజయవాడ నగరానికి ఎనలేని ప్రాధాన్యత దక్కింది. పైగా నగరంలో నైట్ లైఫ్‌ను అభివృద్ధి చేయాలనే ఒక తలంపుతో నాటి ముఖ్యమంత్రి చంద్రబాబు ఫుడ్‌కోర్టులు, షాపింగ్ మాల్స్, థియేటర్ల వంటి వాటికి 24 గంటల పర్మిషన్ ఇచ్చారు. దీంతో నగరానికి మెట్రో కల్చర్ రాబోతున్నట్టు ప్రజలు ఊహించారు. కానీ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ అనుమతులన్నీ రద్దుచేసి రాత్రి 10 దాటితే రోడ్లపై ఎవరినీ తిరగనీయకుండా చేసింది. దీంతో నగరం ఒక్కసారిగా మూగబోయింది. రాత్రి పది అయిందంటే చాలు నిశ్శబ్ద వాతావరణం నెలకొనేది. పైగా కరోనా రెండేళ్లు ప్రజలు వినోదం, నైట్‌లైఫ్ అనే మాటే మర్చిపోయారు. ప్రస్తుతం చంద్రబాబు మరోసారి సీఎంగా పగ్గాలు అందుకున్నాక ఈ నైట్‌లైఫ్ అనే పేరు లైమ్‌టైమ్‌లోకి వచ్చింది. నగరంలో ఇప్పుడిప్పుడే నైట్‌లైఫ్ అభివృద్ధి చెందుతోంది. రాత్రివేళల్లో స్ట్రీట్‌ఫుడ్, షాపింగ్ కాంప్లెక్సులు, మాల్స్ వెలుగు జిలుగులతో ఆకర్షిస్తున్నాయి. మెట్రో నగరంగా అభివృద్ధి చెందుతుండటంతో ప్రజల జీవనశైలిలో సానుకూల మార్పులు వచ్చాయి. యువత పనితో పాటు వినోదానికి ప్రాముఖ్యతనిస్తోంది. రాబోయే రోజుల్లో ఈ కల్చర్ మరింత విస్తరించి, సమీప ప్రాంతాల పర్యాటకులను ఆకర్షించే అవకాశం ఉంది. దీంతో స్థానిక ఆర్థిక వ్యవస్థను మరింత బలపడే అవకాశం ఉంది. రాత్రి వేళల్లో సైతం పనిచేసే రెస్టారెంట్లు, కేఫేలు ఎంతోమందికి చక్కని ఉపాధిని అందిస్తున్నాయి. - విజయవాడ, ఆంధ్రజ్యోతి

పండ్ల రక్షణ కాగిత సంచులపై 18 శాతం జీఎస్టీ

● ఎంపీ చిన్ని ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పండ్ల రక్షణకు వినియోగించే కాగితపు సంచులపై దేశవ్యాప్తంగా ప్రస్తుతం 18శాతం జీఎస్టీ అమలవుతోందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. పండ్ల రక్షణకు వినియోగించే కాగితపు సంచులపై జీఎస్టీ వివరాలు తెలపాలని విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) పార్లమెంట్‌లో ప్రస్తావించారు. దీనిపై కేంద్ర సహాయమంత్రి పంకజ్ చౌదరి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. పండ్ల రక్షణ కాగితపు సంచులకు ప్రత్యేకంగా హెచ్.ఎస్.కోడ్ లేకపోవటంతో అయిదేళ్లుగా వీటిపై వసూలైన జీఎస్టీ వివరాలు అందుబాటులో లేవని మంత్రి బదులిచ్చారు. వీటిపై జీఎస్టీ రేటు తగ్గించేందుకు ప్రస్తుతానికి ఎటువంటి ప్రతిపాదనలు లేవని స్పష్టం చేశారు. జీఎస్టీ కౌన్సిల్ సూచనల మేరకు రేట్లను నిర్ణయిస్తామన్నారు. జీఎస్టీ కౌన్సిల్ నుంచి పండ్ల రక్షణ కాగితపు సంచులకు జీఎస్టీ తగ్గిస్తున్నట్టు సమాచారం లేదన్నారు.

వ్యర్థాల నిర్వహణలో నగరం నంబర్ వన్‌గా ఉండాలి

● వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

చిట్టినగర్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వ్యర్థ నిర్వహణలో విజయవాడ నగరాన్ని అగ్రస్థానంలో నిలపాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అధికారులను ఆదేశించారు. నగరాన్ని స్వచ్ఛతలో మొదటి స్థానంలో ఉంచేందుకు ఏడేళ్లుగా స్వచ్ఛ సర్వేక్షన్‌లో మొదటి స్థానంలో ఉన్న ఇండోర్ నగరంలో ధ్యానచంద్ర అధికారులతో పర్యటించారు. ఇండోర్‌లో అమలు చేస్తున్న వ్యర్థపదార్థాల నిర్వహణను పరిశీలించారు. అక్కడ అమలు చేస్తున్న ఇంటి వద్దనే వ్యర్థాలను వేరుచేసే విధానం, వారు వాడుతున్న వ్యర్థ సేకరణ వాహనాలు, వాటికున్న జీపీఎస్ మెకానిజం, చెత్త సేకరణ రూటు మారితే జీపీఎస్‌లో గమనించే కమాండ్ కంట్రోల్ రూమ్ సిబ్బంది, సంబంధిత శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కి తెలియపరచి వ్యర్థ సేకరణను కచ్చితంగా జరిగేటట్టు చూసుకునే విధానం, ఎంఆర్‌ఎఫ్ ప్లాంట్, వ్యర్థ నిర్వహణలో ఉపయోగించే టెక్నాలజీ, తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. విజయవాడకు తగ్గట్టుగా ఇండోర్ వారు వాడుతున్న టెక్నాలజీ, అమలుపరిచి వ్యర్థ నిర్వహణలో అగ్రస్థానంలో నిలపాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో సూపరిండెంటింగ్ ఇంజనీర్ (ప్రాజెక్ట్స్) పి.సత్యకుమారి, ఇన్‌చార్జి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వెహికల్ డిపో ఏసుపాదం పాల్గొన్నారు.

డైట్ ప్రిన్సిపాల్స్‌గా సీనియర్లను నియమించాలి

● నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్

ధర్నాచౌక్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): డైట్ ప్రిన్సిపాల్స్‌గా జిల్లా విద్యా శిక్షణా సంస్థలు సీనియర్ డైట్ లెక్చరర్లను నియమించాలని నవ్యాంధ్ర టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కరణం హరికృష్ణ, మాగంటి శ్రీనివాసరావు సోమవారం ఒక ప్రకటనలో రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కు లేఖ రాయడం జరిగిందన్నారు. ఆ పోస్టుల్లో నిబంధనలకు విరుద్ధంగా ఉన్నవారిని రివర్ట్ చేయాలన్నారు. ఎం.హెచ్.ఆర్.డీ, ఎన్.సీ.టీ.ఈ, ఎన్.సీ.ఈ.ఆర్.టీ నిబంధనలు అమలు చేయాలన్నారు. డైట్ ప్రిన్సిపాల్స్ పోస్టులు కేవలం ప్రమోషన్ ద్వారానే నియమించాలన్నారు. పలువురు అధికారులు నిబంధనలకు విరుద్ధంగా డైట్ ప్రిన్సిపాల్ పోస్టులను ఫీడర్ కేటగిరి వారిని కాకుండా ఇతరులతో నింపడం జరిగిందన్నారు. జీతం కోసం మాత్రమేనంటూ సర్దుబాటు చేయడం అశాస్త్రీయం, నిబంధనలకు వ్యతిరేకమన్నారు. జిల్లా శిక్షణ సంస్థలను బలోపేతం చేయాలని, విద్యారంగ పరిరక్షకు తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు.

నేటినుంచి రాష్ట్రస్థాయి సీనియర్ ఆర్చరీ టోర్నీ

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): నగరంలోని శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో ఈ నెల 3 నుంచి 5 వరకు ఆంధ్రప్రదేశ్ 31వ సీనియర్ ఇండియన్ రౌండ్, 44వ సీనియర్ రికర్వ్, 20వ సీనియర్ కాంపౌండ్ రాష్ట్రస్థాయి (అంతర్ జిల్లాల) ఆర్చరీ టోర్నీ నిర్వహిస్తున్నట్టు ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఆర్చరీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగే ఈ టోర్నీలో ఏపీ నుంచి 250 మంది ఆర్చర్లు బరిలో దిగుతున్నారని, పోటీలను మంగళవారం ఉదయం 9 గంటలకు శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రారంభిస్తారని వివరించారు.

కృష్ణమ్మకు పోలి దీపకాంతులు

● భక్తిప్రపత్తులతో పోలిస్వర్గం వేడుకలు ● కృష్ణానదిలో దీపాలను వదిలిన భక్తులు ● భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): పోలి స్వర్గం వేడుక సందర్భంగా భక్తులు అరటి డొప్పల్లో వెలిగించిన దీపాలను కృష్ణానదిలో వదలటంతో నది అంతా దీపాల వెలుగులను విరజిమ్మింది. కార్తీక మాసం ముగింపు సందర్భంగా పురాణేతిహాసాల మేరకు పోలి స్వర్గంను కార్తీకమాసం ముగింపు సందర్భంగా మార్గశుద్ధ పాడ్యమి నాడు పోలి స్వర్గం వేడుకలను హిందూ సంప్రదాయం మేరకు జరుపుకుంటారు. ఈ క్రమంలో సోమవారం విజయవాడ దుర్గాఘాట్ కృష్ణాది వద్ద భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చి పుణ్యస్నానాలు ఆచరించి పూజలు చేసి కార్తీకమాసం నెల రోజులు భక్తి ప్రపత్తులతో శివపూజ చేసి స్వర్గానికి వెళ్లిన పోలిని తలచుకుంటూ అదేమాదిరి తమకు కూడా స్వర్గప్రాప్తి కలిగించాలంటూ శివ పార్వతులను వేడుకున్నారు. తెల్లవారుజామునే నదికి తరలి వచ్చిన భక్తులు పవిత్ర స్నానాల అనంతరం అరటి డొప్పల్లో ఆవునెయ్యితో తడిపిన వత్తులను వెలిగించి దీప పూజ చేసి నదిలో వదిలారు. కాంతులీనుతున్న దీపాలు ప్రాతఃసమయాన ఎంతో మనోహరంగా కనిపించి భక్తిభావనలను వెదజల్లాయి. ఇదే సమయంలో సోమవారం కూడా కావటంతో శివాలయాలు కిటకిటలాడాయి. దుర్గగుడిలోని మల్లేశ్వరాలయం, ఇంద్రకీలాద్రి దిగువన విజయేశ్వరస్వామి గుడి, భ్రమరాంబ మల్లేశ్వరాలయం (పాత శివాలయం), యనమలకుదురు రామలింగేశ్వరస్వామి ఆలయం, సత్యనారాయణపురం శివాలయం, రామకోటి మైదానంలోని శివాలయం, చల్లపల్లి బంగా వద్ద శివాలయం, ముత్యాలంపాడులోని పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయం, మాచవరం డౌన్‌లోని శివాలయం, కొత్తపేట ధర్మేశ్వరాలయం, బ్రాహ్మణవీధిలో వసంత మల్లికార్జునస్వామి గుడి (బుద్దు వారి గుడి), ఇలా విజయవాడలోని అన్ని ప్రాంతాల్లో ఉన్న శివాలయాలను భక్తులు సందర్శించి పూజాదికాలు నిర్వహించారు.





నదిలో దీపాలను వదులుతున్న మహిళలు



సుమిత్ర ధావ్రా, రవిగుప్తాకు చిత్రపటం, ఏఎం రత్నం, జ్యోతికృష్ణకు స్తోత్ర పుస్తకం ఇస్తున్న అధికారులు

దుర్గమ్మ సన్నిధిలో ప్రముఖులు

వన్‌టౌన్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను సోమవారం కేంద్ర కార్మిక, ఉపాధి మంత్రిత్వ శాఖ కార్యదర్శి సుమిత్ర ధావ్రా దర్శించుకున్నారు. అధికారులు ఆమెకు సాదర స్వాగతం పలికారు. ఆలయ మర్యాదల అనంతరం ఆమె అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలనంతరం ఆమెకు వేద పండితులు వేద ఆశీస్సులు, ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

అమ్మవారిని దర్శించుకున్న రవిగుప్తా

తెలంగాణ ప్రభుత్వ హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా సోమవారం కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు ఆయనకు సాదర స్వాగతం పలికి ఆలయ మర్యాదలు అందించి అమ్మవారి దర్శనం చేయించారు. ప్రత్యేక పూజలు అనంతరం అధికారులు చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందచేశారు. వేద పండితులు వేద ఆశీస్సులందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో సినీ దర్శకుడు జ్యోతికృష్ణ, నిర్మాత ఏఎం రత్నం

ఇంద్రకీలాద్రిపైనున్న అమ్మవారిని సోమవారం హరిహర వీరమల్లు చిత్ర దర్శకుడు జ్యోతి కృష్ణ, నిర్మాత ఏఎం రత్నం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానంతరం వారికి ప్రసాదం, శేష వస్త్రం, చిత్రపటం అందజేశారు. వేద పండితులు ఆశీస్సులందజేశారు. ఈవో రామారావు వారికి అమ్మవారి స్తోత్ర పుస్తకాలను అందజేశారు. అలాగే తెలంగాణ చీఫ్ సెక్రటరీ ఎ.శాంతికుమారి, ఐఏఎస్ అధికారి వి.శేషగిరి, ఇతర అధికారుల బృందం అమ్మవారి దర్శనానికి విచ్చేయగా అధికారులు వారికి స్వాగతం పలకగా డిప్యూటీ ఈవో వారికి దుర్గమ్మ చిత్రపటం అందజేశారు.

ప్రజల మనిషికి మద్దతివ్వండి

● ప్రజా సంఘాల ఆత్మీయ సమావేశం

గవర్నర్‌పేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కృష్ణా-గుంటూరు జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థిగా పోటీచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావుకు మద్దతుగా సోమవారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ భవన్‌లో ప్రజా సంఘాల ప్రతినిధుల ఆత్మీయ సమావేశం జరిగింది. యూటీఎఫ్ ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఏ సుందరయ్య అధ్యక్షత వహించారు. వివిధ ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్స్ సంఘాల ప్రతినిధులు పెద్ద ఎత్తున సమావేశంలో పాల్గొని లక్ష్మణరావు విజయం కోసం ఐక్యంగా పనిచేయాలని తీర్మానించారు. విద్యారంగ పరిరక్షణకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు చేస్తున్న కృషిని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్పీ మనోహర్‌కుమార్, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు ఏ శ్రీనివాసరావు వివరించారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎంసీహెచ్ శ్రీనివాస్, ప్రజారోగ్య వేదిక కన్వీనర్ విజయప్రకాష్, మెడికల్ రిప్ అసోసియేషన్ నేతలు యూవీ కృష్ణయ్య, ఎల్ఐసీ యూనియన్ నేత తులసీరావు, బీఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ నేత కె. బాలాజీ, టాక్స్ పేయర్స్ అసోసియేషన్ నేత ఎంవీ ఆంజనేయులు, పోస్టల్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరెడ్డి, అమరావతి బాలోత్సవ్ భవన్ అధ్యక్షుడు ఎస్వీ రామరాజు, సచివాలయ ఉద్యోగ సంఘ నేత డీఎం సుభానీ, బ్యాంకు ఎంప్లాయీస్ ఫెడరేషన్ నేత సీహెచ్ రాములు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. లింగారెడ్డి, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నేత ఎన్‌సీహెచ్ సుప్రజ, శ్రామిక మహిళా కన్వీనర్ కమల, సీపీఎం అనుబంధ సంఘాల నేతలు ఎస్ దేవ్, మల్లిఖార్జురెడ్డి, రామారావు, వెంకటరమణ పాల్గొని లక్ష్మణరావుకు మద్దతు పలికారు.

జిల్లా ఎఫ్ఎస్‌వోగా రవీంద్రరావు



కృష్ణలంక, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ జిల్లా ఫారెస్టు సెటిల్‌మెంట్ అధికారి (ఎఫ్ఎస్‌వో)గా ఎ.రవీంద్రరావు సోమవారం విజయవాడ స్టేట్ గెస్ట్‌హౌస్‌లోని కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. గతంలో నందిగామ ఆర్డీవోగా పనిచేసిన రవీంద్రరావును ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా నియమిస్తూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ఈ నేపథ్యంలో సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. టీమ్ ఎన్టీఆర్‌లో భాగమవుతూ జిల్లా సమగ్రాభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ నూతన ఎస్ఎఫ్‌వోకు సూచిస్తూ శుభాకాంక్షలు తెలిపారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భీమేశ్వర్

వైద్య విద్యార్థులు క్రీడల్లో రాణించాలి

● పిన్నమనేనిలో రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టీమ్ ఎంపిక

గన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): వైద్య విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అన్నారు. మండలంలోని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలలో సోమవారం డాక్టర్ ఎన్టీఆర్ వర్శిటీ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని అన్ని మెడికల్ కళాశాలలు, దంత వైద్య కళాశాలలు, నర్సింగ్, హోమియోపతి కళాశాలల విద్యార్థులకు ఫుట్‌బాల్ టీమ్ సెలక్షన్ జరిగాయి. క్రీడాకారులను పరిచయం చేసుకుని డాక్టర్ భీమేశ్వర్ మాట్లాడుతూ క్రీడలతో మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యం కలుగుతుందన్నారు. వైద్య విద్యార్థులకు క్రీడలు ప్రశాంతతను కలిగిస్తాయన్నారు. 80 మంది వైద్య విద్యార్థులు రాగా 16 మంది ఫుట్‌బాల్ టీమ్‌కు సెలక్ట్ అయ్యారు. వర్శిటీ సెలక్షన్ కమిటీ సభ్యులు ఈ త్రిమూర్తులు పాల్గొన్నారు.

ఆర్చరీలో విజయవాడ క్రీడాకారులకు స్వర్ణాలు



విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు రాష్ట్రం దిండిగల్‌లో ఈ నెల 1న జరిగిన మూడో జాతీయ విలువిద్య (ట్రెడిషనల్ ఆర్చరీ) టోర్నీలో తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌కు ప్రాతినిధ్యం వహించిన విజయవాడ నగర క్రీడాకారులు స్వర్ణాలతో సత్తాచాటారు. పాల్గొన్న ముగ్గురూ స్వర్ణాలను వశం చేసుకోవడం గమనార్హం. స్వర్ణాలు సాధించిన సిరంగి సురేష్, ప్రశాంత్, అద్వైత్‌ను కోచ్, ఏపీటీఏఏ సెక్రటరీ అలుగోలు నాగేశ్వరరావు అభినందించారు.



ముస్తాబాద రహదారి గుంతలమయం

ప్రసాదంపాడు, నవంబరు 2 (ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు ఫ్లై ఓవర్ నుంచి ముస్తాబాదకు వెళ్లే రహదారి గుంతలమయమైంది. భారీ వాహనాలు ప్రయాణం సాగించే ఈ రహదారి గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైంది. రహదారిపై గుంతలు పూడ్చే కార్యక్రమం కూటమి ప్రభుత్వం తీసుకొచ్చినా ఈ రహదారి వైపు కన్నెత్తి చూడటం లేదు. పైగా ఇటీవల వచ్చిన వరదలకు రోడ్డంతా కొట్టుకుపోయి రహదారి అంతా రాళ్లు తేలి గతుకులమయం కావడంతో వాహనాలు దెబ్బతింటున్నాయని ద్విచక్ర వాహనదారులు గగ్గోలు పెడుతున్నారు. రహదారి మరమ్మతులు చేయకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ముస్తాబాద వెళ్లే రహదారికి మోక్షం ఎప్పుడు కలుగుతుందో తెలియని పరిస్థితి నెలకొంది. అధికారులు స్పందించి రహదారి మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

ప్రారంభోత్సవానికి సిద్ధం

శరవేగంగా నిర్మాణం పూర్తిచేసుకున్న ఐజీఎంసీ టాయిలెట్లు

● ఆంధ్రజ్యోతి కథనానికి వేగంగా చర్యలు

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియానికి తగ్గట్టుగా వీఎంసీ ఉన్నతాధికారులు టాయిలెట్లు నిర్మించి తమ నిబద్ధతను చాటుకున్నారు. ఇక్కడ టాయిలెట్లు దుస్థితిపై ఆంధ్రజ్యోతిలో ఛీ..ఛీ ఇదేం దుస్థితి శీర్షికన సెప్టెంబరు 20న ప్రచురితమైన ప్రత్యేక కథనానికి కమిషనర్ ధ్యానచంద్ర స్పందించి పాడైన వాటిని పూర్తిగా మరమ్మతులు చేయించడానికి ఆదేశించారు. రెండు నెలల వ్యవధిలోనే శరవేగంగా టాయిలెట్లు ఆధునీకరించగా, అవి ప్రారంభానికి సిద్ధమయ్యాయి. బాలుర, బాలికలకు వేర్వేరుగా ఆధునీకరించగా, ఇందులో అధునాతన విద్యుత్ లైట్లు, వైరింగ్ అమరికతో పాటు మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేశారు. క్రీడాకారులకు, వాకర్లు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటిని త్వరగా ప్రారంభించే బాధ్యతను వీఎంసీ కమిషనర్ తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.



ఆధునీకరించిన స్టేడియం టాయిలెట్లు



మొరాయిస్తున్న సిటీస్కాన్

● అవస్థలు పడుతున్న రోగులు

ప్రభుత్వాసుపత్రి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): కొత్త ప్రభుత్వాసుపత్రిలో సిటీ స్కానింగ్ మిషన్ మొరాయించడంతో రోగులు అవస్థలు పడుతున్నారు. 22 రోజులుగా సిటీ స్కానింగ్ లేక ఇక్కట్లు పడుతున్నామని రిపోర్టులు లేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. సర్జరీలు నిలిచిపోయాయని ఆవేదన చెందుతున్నారు. సిటీ స్కాన్ రిపోర్టు, ఫిలిం ఇవ్వలేని దయనీయ స్థితిలో ప్రభుత్వాసుపత్రి వైద్యులున్నారని రోగుల బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆసుపత్రి సూపరింటిండెంట్‌కు దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని అంటున్నారు. ఆసుపత్రిలో పదే పదే మిషన్లు పనిచేయక రోగులు పడుతున్న ఇబ్బందులపై వైద్య ఆరోగ్యశాఖ మంత్రితో పాటు జిల్లా కలెక్టర్ స్పందించాలని, రోగుల వైద్యానికి కలుగుతున్న ఇబ్బందులను తొలగించాలని వారి బంధువులు కోరుతున్నారు.

వర్మపై తొందరపాటు

చర్యలొద్దు

» హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ



అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టడంపై వివిధ పోలీసు స్టేషన్లలో నమోదైన కేసుల్లో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ దర్శకుడు రాంగోపాల్ వర్మ దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను ఈ నెల 9వ తేదీకి హైకోర్టు వాయిదా వేసింది. అప్పటి వరకు ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను ఆదేశించింది. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్.హరినాథ్ ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌పై గతేడాది సామాజిక మాధ్యమాలలో అసభ్యకర, అనుచిత పోస్టులు పెట్టారనే ఆరోపణలతో అనకాపల్లి జిల్లా రావికమతం, గుంటూరు జిల్లా తుళ్లూరు, ప్రకాశం జిల్లా మద్దిపాడు పోలీసులు నమోదు చేసిన మూడు వేర్వేరు కేసుల్లో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ రాంగోపాల్‌వర్మ హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వర్మ తరఫు న్యాయవాది స్పందిస్తూ... పిటిషనర్ తన సినిమా విడుదలపై గత ఏడాది 'ఎక్స్'లో పోస్టులు పెట్టారన్నారు. దీనిపై వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టారన్నారు. పోలీసులు పిటిషనర్‌ను అరెస్ట్ చేస్తారనే ఆందోళన ఉందని, అరెస్ట్ నుంచి రక్షణ కల్పిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ... పిటిషనర్‌పై నమోదైన కేసుల్లో పోలీసులు పెట్టిన సెక్షన్లు అన్నీ ఏడేళ్ల లోపు శిక్షకు వీలున్నవేనన్నారు. విచారణకు హాజరు కావాలని పోలీసులు ఇచ్చిన నోటీసులను పిటిషనర్ తిరస్కరించారని తెలిపారు.

మరో కేసు విచారణ 11కు వాయిదా

చంద్రబాబు, పవన్ కల్యాణ్, లోకేశ్‌పై సామాజిక మాధ్యమాలలో అనుచిత, అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో ఇకపై ఎలాంటి కేసులు నమోదు చేయకుండా హోం శాఖ ముఖ్యకార్యదర్శి, డీజీపీని ఆదేశించాలని కోరుతూ రాంగోపాల్ వర్మ హైకోర్టులో దాఖలు చేసిన వ్యాజ్యం సోమవారం విచారణకు వచ్చింది. ఈ నెల 9లోగా కౌంటర్ వేయాలని పోలీసులను న్యాయమూర్తి జస్టిస్ టీవీఎల్ఎన్ చక్రవర్తి ఆదేశించారు. వ్యాజ్యంపై తదుపరి విచారణను ఈ నెల 11వ తేదీకి వాయిదా వేశారు.

పారిపోలేదు.. నా డెన్‌లోనే ఉన్నా

» జైలుకు పంపిస్తే సినిమా కథలు రాసుకుంటా: ఆర్జీవీ

హైదరాబాద్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): తనపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని ఏపీ హైకోర్టు ఆదేశించిన నేపథ్యంలో దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. ఆర్జీవీ గోడ దూకి పారిపోయాడు, దాక్కున్నాడు.. అంటూ మీడియానే కథలల్లుతోందని అసహనం వ్యక్తం చేశారు. తాను ఎక్కడికీ పారిపోలేదని, డెన్‌లోనే ఉన్నానని, షూటింగ్‌లతో బిజీగా ఉన్నానని పేర్కొన్నారు. ఎప్పుడో సంవత్సరం క్రితం పెట్టిన ట్వీట్లతో కొందరి మనోభావాలు దెబ్బతిన్నాయంటూ ఇప్పుడు తన మీద కేసులు నమోదు చేయడం విచిత్రంగా ఉందన్నారు. ఒకవేళ అరెస్టు చేస్తే.. జైలుకెళ్లి, అక్కడ ఖైదీలతో పరిచయం పెంచుకొని, నాలుగు సినిమా కథలు రాసుకుంటానన్నారు.

హత్యకు గౌతంరెడ్డి మనుషులను

పురమాయించారు

నిందితులకు ఆశ్రయం కల్పించారు

» ఆధారాలున్నాయి.. బెయిలిస్తే సాక్షులను ప్రభావితం చేస్తారు

» ముందస్తు బెయిల్ పిటిషన్‌ను కొట్టివేయండి: ఏజీ

» కేసు డైరీలోని వివరాలను కౌంటర్ రూపంలో మా ముందు ఉంచండి.. ప్రాసిక్యూషన్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'భూవివాదం శాశ్వత పరిష్కారం కోసం ఉమామహేశ్వరశాస్త్రిని హత్య చేయించేందుకు గౌతంరెడ్డి మనుషులను పురమాయించారు. హత్యాయత్నం అనంతరం నిందితులకు పిటిషనర్ వసతి కల్పించారు. అందుకు సంబంధించి సాక్ష్యాలు, సీసీటీవీ ఫుటేజ్ ఆధారాలు ఉన్నాయి' అని అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ సోమవారం హైకోర్టుకు నివేదించారు. ఫోర్జరీ పత్రాలతో తన భూమిని ఆక్రమించడమే కాకుండా, తనను చంపేందుకు ప్రయత్నించారంటూ విజయవాడకు చెందిన గండూరి ఉమామహేశ్వరశాస్త్రి వైసీపీ నేత గౌతంరెడ్డిపై కేసు పెట్టారు. ఈ ఫిర్యాదు ఆధారంగా సత్యనారాయణపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సోమవారం వ్యాజ్యం విచారణకు రాగా ఏజీ దమ్మాలపాటి తన వాదనలు వినిపించారు. 'ఉమామహేశ్వరశాస్త్రిని హత్య చేయించేందుకు పిటిషనర్ ప్రణాళికాబద్ధంగా వ్యవహరించారు. అందుకు సంబంధించి ప్రాథమిక ఆధారాలు ఉన్నాయి. హత్యాయత్నం కేసు నమోదుకు వ్యతిరేకంగా కోర్టు విధులు బహిష్కరించాలని పిటిషనర్ పిలుపునిచ్చారు. దీంతో విజయవాడ బార్ విధులను బహిష్కరించింది. పిటిషనర్ అజ్ఞాతంలో ఉండి కోర్టు విధులను బహిష్కరించేలా చేశారు. పిటిషనర్‌పై ఇప్పటివరకు 32 కేసులు నమోదయ్యాయి. ఇందులో ఐదు కేసుల విచారణ పెండింగ్‌లో ఉంది. పిటిషనర్‌పై ఉన్న రౌడీషీట్‌ను 2023లో ఎత్తివేశారు. దర్యాప్తు కీలక దశలో ఉంది. ఆయనకు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తుపై తీవ్ర ప్రభావం పడుతుంది. ముందస్తు బెయిల్ కోరుతూ గౌతంరెడ్డి వేసిన పిటిషన్‌ను కొట్టివేయండి' అని కోరారు. గౌతంరెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది వైవీ రవిప్రసాద్ వాదనలు వినిపిస్తూ... 'పిటిషనర్, ఫిర్యాదుదారు మధ్య సివిల్ వివాదం నడుస్తోంది. ఫిర్యాదుదారు ఉమామహేశ్వర శాస్త్రి సోదరుడు నుంచి పిటిషనర్ భూమిని కొనుగోలు చేశారు. స్థలానికి సంబంధించిన ఒరిజనల్ డాక్యుమెంట్స్ అన్నీ 2015 నుంచి పిటిషనర్ వద్దే ఉన్నాయి. అన్ని అనుమతులు తీసుకొని ఆ స్థలంలో పిటిషనర్ నిర్మాణాలు చేపట్టారు. గత ప్రభుత్వంలో వేధింపులు ఉండేవి. ప్రస్తుత ప్రభుత్వం కూడా వేధింపులు కొనసాగిస్తోంది' అని తెలిపారు. ఏజీ దమ్మాలపాటి పేర్కొన్న వివరాలను పరిగణనలోకి తీసుకున్న న్యాయస్థానం కేసు డైరీలో పేర్కొన్న వివరాలను అఫిడవిట్ లేదా మెమో రూపంలో కోర్టు ముందు ఉంచాలని ప్రాసిక్యూషన్‌ను ఆదేశించింది. గౌతంరెడ్డి తరఫు రిప్లై వాదనల కోసం విచారణను నేటికి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. గౌతంరెడ్డిపై తొందరపాటు చర్యలు వద్దని పోలీసులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను నేటివరకు పొడిగించారు.

ఐపీఎస్‌ల బెయిల్‌పై విచారణ వాయిదా

» జెత్వానీ కేసులో ముగిసిన పిటిషనర్ల వాదనలు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ముంబై నటి కాదంబరి జెత్వానీ ఫిర్యాదు మేరకు నమోదు చేసిన కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు, పోలీసు ఉన్నతాధికారులు దాఖలు చేసిన పిటిషన్లపై విచారణను హైకోర్టు ఈ నెల 12వ తేదీకి వాయిదా వేసింది. సోమవారం జరిగిన విచారణలో పిటిషనర్ల తరఫు వాదనలు ముగిశాయి. ప్రాసిక్యూషన్ తరఫు వాదనల కోసం విచారణ వాయిదా వేస్తున్నట్లు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఉత్తర్వులు జారీ చేశారు. వ్యాజ్యాలపై నిర్ణయం వెల్లడించే వరకు పిటిషనర్లపై తొందరపాటు చర్యలు వద్దంటూ ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను పొడిగించారు. కాదంబరి జెత్వానీ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసులో ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఐపీఎస్ అధికారులు క్రాంతిరాణా తాతా, విశాల్ గున్నీ, అప్పటి విజయవాడ ఏసీపీ హనుమంతరావు, దర్యాప్తు అధికారి సత్యనారాయణ, న్యాయవాది ఇంకొల్లు వెంకటేశ్వర్లు వేర్వేరుగా హైకోర్టులో పిటిషన్లు వేశారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు... కౌంటర్ దాఖలు చేయాలని సీఐడీని ఆదేశించింది. దీంతో సీఐడీ ఉమెన్ ప్రొటెక్షన్ సెల్ ఎస్పీ సరిత వేర్వేరుగా కౌంటర్లు దాఖలు చేశారు. ఈ పిటిషన్లు సోమవారం మరోసారి విచారణకు వచ్చాయి. అప్పటి ఏసీపీ హనుమంతరావు తరఫున సీనియర్ న్యాయవాది పట్టాభి వాదనలు వినిపించారు. జెత్వానీపై కేసు నమోదు, దర్యాప్తు విషయంలో పిటిషనర్ చట్టనిబంధనల ప్రకారమే నడుచుకున్నారని అన్నారు. సీఐడీ కౌంటర్‌లో పేర్కొన్న విషయాలను పత్రికల్లో ప్రచురించడంపై అభ్యంతరం తెలిపారు. కోర్టు పరిధిలో ఉన్న కేసుపై మీడియా ట్రయల్ నిర్వహించడం సరికాదని, ఇది కోర్టు ధిక్కరణ కిందికి వస్తుందన్నారు. పిటిషనర్లపై న్యాయస్థానానికి దురభిప్రాయాన్ని కలిగించేందుకు ప్రయత్నం చేశారన్నారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ స్పందిస్తూ... సీనియర్ న్యాయవాది ముందస్తు బెయిల్ పిటిషన్‌పై వాదనలు వినిపిస్తున్నారా? లేక వార్తల ప్రచురణపై ఏమైనా గ్యాగ్ ఉత్తర్వులు జారీ చేయాలని కోరుతున్నారా? అని సందేహం వ్యక్తం చేశారు. వివిధ కేసుల్లో వాదనలు వినిపిస్తున్న చాలామంది న్యాయవాదులు మీడియా ముందుకు వెళ్లి ప్రకటనలు చేస్తున్నారని గుర్తు చేశారు. వ్యాజ్యాలపై మరో రోజు వాదనలు వినిపిస్తానన్నారు. ఇరువైపుల వాదనలు పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.


రాజీ చేసుకున్నారు.. కేసు కొట్టేయండి

» హైకోర్టులో హోం మంత్రి తరఫు న్యాయవాది

» పూర్తి వివరాలతో అఫిడవిట్ వేయాలన్న కోర్టు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): చెక్ బౌన్స్ కేసులో రాజీ కుదిరిందని, ఈ నేపథ్యంలో కేసును కొట్టివేయాలని కోరుతూ హోం మంత్రి వంగలపూడి అనిత తరఫు న్యాయవాది హైకోర్టును కోరు. అయితే.. ఫిర్యాదిదారు వేగి శ్రీనివాసరావుతో కుదుర్చుకున్న రాజీ ఏమిటి? ఏ అంశాల ప్రాతిపదికన రాజీ చేసుకున్నారో వివరిస్తూ పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. రాజీకి సంబంధించి అన్ని వివరాలు తాజా అఫిడవిట్‌లో పేర్కొనలేదని తెలిపింది. ఈ నేపథ్యంలో మరిన్ని వివరాలతో అఫిడవిట్ వేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 10కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. తన వద్ద తీసుకున్న రూ.70 లక్షల అప్పును చెల్లించేందుకు 2018లో అనిత చెక్కు ఇచ్చారని, అది చెల్లలేదని పేర్కొంటూ వేగి శ్రీనివాసరావు విశాఖపట్నం కోర్టులో 2019లో పిటిషన్ దాఖలు చేశారు. అయితే, వేగి శ్రీనివాసరావుకు తనకు మధ్య రాజీ కుదిరినందున సంబంధిత కేసును కొట్టివేయాలని హోంమంత్రి అనిత హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్ సోమవారం విచారణకు రాగా పిటిషనర్ తరఫున న్యాయవాది వీవీ సతీశ్ వాదనలు వినిపించారు. కేసును రాజీమార్గం ద్వారా పరిష్కరించుకోవాలని పిటిషనర్, వేగి శ్రీనివాసరావు నిర్ణయించుకున్నారని, ఇరువురు రాజీపత్రాన్ని కూడా రాసుకున్నారని చెప్పారు.

జైళ్లు, పీఎస్‌లలో ఎన్ని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి?



» మరమ్మతులకు, కొత్తవి పెట్టడానికి తీసుకున్న చర్యలేంటి?

» అఫిడవిట్ వేయండి... డీజీపీ, జైళ్ల డీజీకి హైకోర్టు ఆదేశం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో ఎన్ని సీసీ కెమెరాలు పనిచేస్తున్నాయి? పనిచేయని వాటి స్థానంలో కొత్తవి పెట్టడం లేదా మరమ్మతులకు ఏం చర్యలు తీసుకుంటున్నారో పూర్తి వివరాలతో వేర్వేరుగా అఫిడవిట్లు దాఖలు చేయాలని రాష్ట్ర డీజీపీ, జైళ్ల శాఖ డీజీని హైకోర్టు సోమవారం ఆదేశించింది. వ్యాజ్యంపై తదుపరి విచారణను డిసెంబరు 23కి వాయిదా వేసింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందనరావు, జస్టిస్ కుంచం మహేశ్వరరావుతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ 2019లో న్యాయవాది తాండవ యోగేశ్ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాన్ని విచారించిన హైకోర్టు ధర్మాసనం సుప్రీం కోర్టు ఆదేశాలకు అనుగుణంగా రాష్ట్రంలోని పోలీస్ స్టేషన్లు, జైళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని 2019 జూలై 15న ఆదేశాలిచ్చింది. ఏళ్లు గడుస్తున్నా ఉత్తర్వులు అమలు కాకపోవడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యం సోమవారం విచారణకు రాగా ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది(ఎస్‌జీపీ) టి.విష్ణుతేజ వాదనల వినిపిస్తూ... రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 1,001 పోలీస్ స్టేషన్లలో 10 వేల సీసీ కెమెరాలు, 81 జైళ్లలో 1,752 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. వాటి నిర్వహణ బాధ్యత రెండు ఏజెన్సీలకు అప్పగించామన్నారు. కొవిడ్ కారణంగా సీసీ కెమెరాలు ఏర్పాటు ప్రక్రియలో జాప్యం జరిగిందని తెలిపారు.

హోంగార్డుల పిటిషన్లపై ముగిసిన వాదనలు

పోలీసు కానిస్టేబుళ్ల ఎంపికలో సామాజిక రిజర్వేషన్లతో సంబంధం లేకుండా తమను ప్రత్యేక కేటగిరీగా పరిగణించేలా అధికారులను ఆదేశించాలని కోరుతూ పలువురు హోంగార్డులు హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. సామాజిక రిజర్వేషన్లను వర్తింపజేసి, ప్రిలిమినరీ పరీక్షలో తమకు క్వాలిఫైయింగ్ మార్కులు రాలేదంటూ తమను తదుపరి ఫిజికల్, తుది రాత పరీక్షకు అనుమతించలేదని పిటిషన్లలో పేర్కొన్నారు. ఈ వ్యాజ్యాలపై ఇంతకుముందే విచారణ జరిపిన హైకోర్టు సామాజిక రిజర్వేషన్లతో సంబంధం లేకుండా పిటిషనర్లను ఫిజికల్, తుదిరాతపరీక్షకు అనుమతించాలని పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డును ఆదేశిస్తూ మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చారు. ఇదే అంశంపై మరికొందరు హోంగార్డులు కూడా పిటిషన్లు దాఖలు చేయగా, వీటిపై హైకోర్టులో సోమవారం సుదీర్ఘ వాదనలు జరిగాయి. ఇరువైపులా వాదనలు ముగియడంతో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సత్తి సుబ్బారెడ్డి తీర్పును రిజర్వ్ చేస్తున్నట్లు ప్రకటించారు. అంతకుముందు పిటిషనర్ల తరఫున న్యాయవాదులు శీనాకుమార్, శివరామ్, ఆంజనేయులు వాదనలు వినిపించారు. 'పిటిషనర్లు ఎన్నో ఏళ్లుగా పోలీస్ శాఖలో హోంగార్డులుగా సేవలు అందిస్తున్నారు. వారిని సాధారణ అభ్యర్థులతో సమానంగా పోల్చి చూడడానికి వీల్లేదు. కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం జారీ చేసిన నోటిఫికేషన్‌లో హోంగార్డుల కోసం మొత్తం 1167 పోస్టులు కేటాయించగా 382మంది మాత్రమే ప్రాథమిక పరీక్షలో ఎంపికయ్యారు. మిగిలిన పోస్టులను జనరల్ కేటగిరీ అభ్యర్థులతో భర్తీ చేస్తున్నారు. దీని వల్ల హోంగార్డులకు నష్టం జరుగుతుంది. ప్రాథమిక రాత పరీక్షలో వచ్చిన మార్కులతో సంబంధం లేకుండా హోంగార్డులను ప్రత్యేక కేటగిరీగా పరిగణించి కానిస్టేబుల్ పోస్టులను భర్తీ చేయాలి' అని విన్నవించారు. అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ.. కానిస్టేబుల్ పోస్టుల భర్తీ కోసం ఇచ్చిన నోటిఫికేషన్‌ను కానీ, అందులో నిబంధనలనుకానీ హోంగార్డులు సవాల్ చేయలేదన్నారు. 'ప్రాథమిక పరీక్షలో కనీస మార్కులు సంపాదించి, తదుపరి ప్రక్రియకు ఎంపిక కానందుకే పిటిషనర్లు పిటిషన్లు వేశారు. సుప్రీం కోర్టు ఉత్తర్వుల ప్రకారం నోటిఫికేషన్ జారీ చేశాక, ఎంపిక ప్రక్రియ మధ్యలో నిబంధనలు మార్చడానికి వీల్లేదు. ఈ నేపథ్యంలో పిటిషన్లు చెల్లుబాటు కావు' అని వాదించారు.


నవ్య | చిత్రజ్యోతి



కన్నప్పలో కవలలు

డాక్టర్ మోహన్‌బాబు నిర్మిస్తున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'కన్నప్ప' వచ్చే ఏడాది ఏప్రిల్ 25న విడుదల కానుంది. విష్ణు మంచు టైటిల్ రోల్ పోషిస్తున్న ఈ సినిమాకు ముఖేశ్‌కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీ కాళహస్తి పురాణ కథ ప్రాముఖ్యాన్ని చాటి చెప్పే పాటలో విష్ణు కవల కుమార్తెలు అరియానా, వివియానా నటిస్తున్నారు. వారిద్దరి పుట్టిన రోజు సందర్భంగా గిరిజన వేషధారణలో ఉన్న వారి లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'పాట పాడినా, నృత్యం చేసినా.. ఇది శివుని కోసం' అని ఆ పోస్టర్‌లో పేర్కొన్నారు. ఈ సందర్భంగా విష్ణు మాట్లాడుతూ 'నా కుమార్తెల ఫస్ట్ లుక్ విడుదల చేయడం ఆనందంగా ఉంది. నా చిన్ని తల్లులు తెరపై సృష్టించే మ్యాజిక్‌ను చూడడానికి ఆసక్తిగా ఎదురు చూస్తున్నాను' అని చెప్పారు.

సంచారి సంచారి... ఎటువైపో నీ దారి



మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో ప్రియదర్శి, రూప కొడువాయూర్ జంటగా నటించిన చిత్రం 'సారంగపాణి జాతకం'. శ్రీదేవీ మూవీస్ పతాకంపై శివలెంక కృష్ణప్రసాద్ నిర్మించారు. డిసెంబరు 20న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రంలోని రెండో పాట 'సంచారి సంచారి.. ఎటువైపో నీ దారి'ని మేకర్స్ విడుదల చేశారు. ఈ గీతాన్ని రామజోగయ్య శాస్త్రి రాయగా, సంజిత్ హేగ్డే ఆలపించారు. వివేక్ సాగర్ స్వరపరిచారు. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు మోహనకృష్ణ ఇంద్రగంటి మాట్లాడుతూ 'ఎటువంటి కథలోనైనా భావోద్వేగం లేకపోతే ఆ కథకు పరిపూర్ణత ఉండదు. ఈ సినిమాలో ప్రధానమైన అంశం ప్రేమ. తాను ప్రాణంగా ప్రేమించిన అమ్మాయికి, తన నమ్మకానికి మధ్య నలిగిపోయిన వ్యక్తి కథే 'సారంగపాణి జాతకం' అని అన్నారు. ఈ చిత్రంలో నరేశ్ విజయకృష్ణ, తనికెళ్ల భరణి, శ్రీనివాస్ అవసరాల, వెన్నెల కిశోర్, వైవా హర్ష తదితరులు కీలక పాత్రల్లో నటించారు.

పాతికేళ్ల ప్రయాణం.. మరిచిపోలేని అనుభూతులు



గోపీచంద్ హీరోగా నటించిన 'విశ్వం' సినిమాతో హిట్ కొట్టి మళ్లీ ఫామ్‌లోకి వచ్చారు డైరెక్టర్ శ్రీనువైట్ల. ప్రస్తుతం తన తదుపరి సినిమా ప్రీ ప్రొడక్షన్ వర్క్స్‌లో ఉన్న శ్రీనువైట్ల.. తను తెరకెక్కించిన మొదటి సినిమా 'నీ కోసం' విడుదలై పాతికేళ్లు అయిన సందర్భంగా మీడియాతో ముచ్చటించారు.

"దర్శకుడిగా పాతికేళ్ల ప్రయాణాన్ని పూర్తి చేసుకున్నందుకు చాలా ఆనందంగా ఉంది. ఓ దర్శకుడిగా ఎన్నో జ్ఞాపకాలను.. మరెన్నో మర్చిపోలేని అనుభూతులను సొంతం చేసుకున్నాను. ఇన్నేళ్లు దర్శకుడిగా కొనసాగుతానని ఊహించలేదు. ఈ పాతికేళ్ల కెరీర్‌లో ఎన్నో అద్భుతాలు జరిగాయి. ఓ దర్శకుడిగా నాకు నచ్చిన నా టాప్ ఫైవ్ చిత్రాలు.. 'ఆనందం', 'వెంకీ', 'రెడీ', 'దూకుడు', 'ఢీ'. తొలి సినిమా 'నీ కోసం' టైమ్‌లో తోడ్పాటు అందించిన అందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను. 'విశ్వం'తో తిరిగి హిట్ కొట్టినందుకు చాలా సంతోషంగా ఉన్నా. నా నెక్ట్స్ చిత్రం ఓ ఫ్రెష్ ఐడియాతో పూర్తి వినోదాత్మకంగా ఉంటుంది. ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి నమ్మకం ఉంది. త్వరలోనే మరిన్ని వివరాలు ప్రకటిస్తా" అని చెప్పారు.

సిల్క్ స్మితపై మరో బయోపిక్



దక్షిణ భారత చలన చిత్ర పరిశ్రమలో ఓ వెలుగు వెలిగిన నటి సిల్క్ స్మిత జీవితంపై మరో బయోపిక్ రెడీ అవుతోంది. స్మిత పుట్టిన రోజు(డిసెంబరు 2) సందర్భంగా ఎస్‌టీఆర్‌ఐ సినిమాస్..తాము తీయబోయే నూతన చిత్రం 'సిల్క్ స్మిత- క్వీన్ ఆఫ్ ద సౌత్'ని అనౌన్స్ చేసింది. ఈ అఫీషియల్ బయోపిక్‌లో చంద్రిక రవి టైటిల్ రోల్ పోషిస్తున్నారు. ఈమేరకు మేకర్స్ ఒక ప్రత్యేక వీడియోను విడుదల చేశారు. ఈ వీడియోలో సిల్క్ స్మిత- సౌత్ క్వీన్ గురించి ప్రేక్షకులకు ఒక గ్లింప్స్ అందించారు. జయరామ్ శంకరన్ దర్శకత్వంలో ఎస్‌బి విజయ్ అమృత్‌రాజ్ నిర్మించనున్న ఈ చిత్రం ప్రొడక్షన్ 2025లో ప్రారంభం కానుంది. సిల్క్ స్మిత జీవితంపై పదమూడేళ్ల క్రితమే ఓ సినిమా వచ్చింది. 2011 మిలన్ లుథ్రియా దర్శకత్వంలో 'ద డర్టీ పిక్చర్' అనే హిందీ మూవీ రిలీజ్ అయ్యింది. ఏక్తాకపూర్, శోభా కపూర్ నిర్మించారు. టైటిల్ రోల్‌లో విద్యాబాలన్ నటించారు. ఈ మూవీతో విద్యాబాలన్ ఓవర్‌నైట్ స్టార్ అయిపోయారు. 'డర్టీ పిక్చర్' తర్వాత 13 ఏళ్లకు తాజాగా ఎస్‌టీఆర్‌ఐ సినిమాస్ 'సిల్క్ స్మిత'పై బయోపిక్ చిత్రీకరణకు పూనుకుంది. 'సిల్క్ స్మిత- క్వీన్ ఆఫ్ ద సౌత్' చిత్రాన్ని తెలుగు, తమిళం, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో పాన్ ఇండియా చిత్రంగా తెరకెక్కించనున్నట్లు నిర్మాణ సంస్థ ప్రకటించింది. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీతో సిల్క్ స్మిత ఇంట్రడక్షన్‌ని ప్లాన్ చేసిన విధానం మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్‌లో హైలెట్‌గా ఉంది. కొన్ని పత్రికలు చూస్తు...ఈ సిల్క్ ఎవరు? అని ఇందిరాగాంధీ అడిగితే 'మీరు ఐరన్ లేడీ అయితే...ఆమె మాగ్నటిక్ లేడీ' అంటూ సిల్క్ స్మితకి ఇచ్చిన ఎలివేషన్ అదిరిపోయింది.

31 రోజులు.. రూ.368 కోట్లు!



రొటీన్ యాక్షన్ చిత్రాలు, మాస్ చిత్రాలకంటే ఉత్తరాది ప్రేక్షకులు హారర్ కామెడీ చిత్రాలనే ఎక్కువ ఇష్టపడుతున్నారని మరోసారి రుజువైంది. కార్తిక్ ఆర్యన్, త్రిప్తి దిమ్రి, విద్యాబాలన్, మాధురీ దీక్షిత్ ముఖ్య పాత్రలు పోషించిన 'భూత్ భూలయ్య 3' చిత్రం బాక్సాఫీసుని కొల్లగొడుతోంది. నవంబర్ ఒకటిన విడుదలైన ఈ సినిమా 'సింగం అగైన్' వంటి భారీ చిత్రం పోటీని తట్టుకుని నిలబడడమే కాకుండా ఈ నెల రోజుల్లో ప్రపంచ వ్యాప్తంగా రూ. 368 కోట్ల గ్రాస్ వసూళ్లు సాధించడం విశేషం. 'సింగం అగైన్', 'భూల్ భూలయ్య 3' చిత్రాలు రెండూ ఒకే రోజున దీపావళి సందర్భంగా నవంబర్ ఒకటిన విడుదలయ్యాయి. అజయ్ దేవగణ్, అక్షయ్‌కుమార్, రణవీర్ సింగ్, టైగర్ ష్రాఫ్, కరీనా, దీపిక.. వంటి టాప్ స్టార్స్ ఉన్న సినిమా కనుక సహజంగానే 'సింగమ్ అగైన్' చిత్రానికి భారీ ఓపెనింగ్స్ వచ్చాయి. దాంతో పోలిస్తే 'భూల్ భూలయ్య 3' చిత్రానికి థియేటర్ల దగ్గర ప్రేక్షకులు తక్కువ సంఖ్యలో కనిపించారు. ఇందులో స్టార్స్ లేకపోవడమే ప్రధాన కారణం. అయితే స్టార్స్ కంటే కంటెంట్ ముఖ్యం కనుక రెండో వారం నుంచి భూల్ భూలయ్య 3' చిత్రానికి కాసుల వర్షం కురవడం మొదలైంది. నవ్విస్తూ భయపెడుతున్న ఈ సినిమా చూసి జనం తెగ ఎంజాయ్ చేస్తున్నారు.

సినిమాలకు విరామం



సాధారణంగా నటులు సినిమా తర్వాత సినిమా చేస్తూ.. లేదా ఒకేసారి పలు ప్రాజెక్టులు చేస్తూ అభిమానుల్ని ఖుషీ చేస్తుంటారు. అయితే, అందుకు భిన్నంగా 'ట్వల్త్ ఫెయిల్' సంచలనం విక్రాంత్ మస్సే తీసుకున్న ఓ నిర్ణయం ఇప్పుడు అభిమానులను నిరాశలో ముంచేసింది. ఇటీవలే 'సబర్మతీ రిపోర్ట్' సినిమాతో ప్రేక్షకులను పలకరించిన ఆయన... సినిమాలకు విరామం ప్రకటించారు. ఈ మేరకు ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ పోస్టు పెట్టారు. "ఓ నటుడిగా గడిచిన కొన్నేళ్లు అద్భుతమైన సంతృప్తినిచ్చాయి. వెలకట్టలేని మీ ప్రేమను.. ప్రోత్సాహాన్ని అందించిన మీ అందరికీ కృతజ్ఞతలు. నటుడిగా మీ అందరినీ అలరించినందుకు ఎంతో ఆనందంగా ఉంది. ఇప్పుడు నా సమయాన్ని కుటుంబానికి కేటాయించాలనుకుంటున్నాను. అందుకే సినిమాలకు విరామం తీసుకుంటున్నాను. మళ్లీ తగిన సమయం వచ్చే వరకు.. ప్రస్తుతం చేస్తున్న ప్రాజెక్టులే చివరివి. వచ్చే ఏడాది విడుదలయ్యే నా రెండు సినిమాలతో చివరిసారి కలుసుకుందాం. మరోసారి అందరికీ హృదయపూర్వక కృతజ్ఞతలు" అని పేర్కొన్నారు. కాగా, 2013లో 'లుటేరా' సినిమాతో తెరంగేట్రం చేశారు విక్రాంత్. తర్వాత 'హాఫ్ గర్ల్‌ఫ్రెండ్' చిత్రం.. 'మీర్జాపూర్', 'మేడ్ ఇన్ హెవెన్' వెబ్ సిరీస్.. 'హసీనా దిల్‌రుబా' మూవీ సిరీస్‌తో గుర్తింపు పొందారు. ఆయన ప్రస్తుతం 'యార్ జిగ్రీ'.. 'ఆంఖోకీ గుస్తాకియాన్' చిత్రాల్లో నటిస్తున్నారు.

శ్రీకృష్ణుడే మా సూపర్‌స్టార్



శ్రీకృష్ణుడికి, ఆయన భక్తుడికి మధ్య జరిగిన ఓ అద్భుతాన్ని ప్రేరణగా తీసుకుని రూపొందించిన చిత్రం 'డియర్ కృష్ణ'. అక్షయ్ హీరోగా నటించిన ఈ చిత్రంలో మలయాళ నటి మమిత బైజు ఒక హీరోయిన్ కాగా, ఐశ్వర్య మరో హీరోయిన్. దినేశ్‌బాబు దర్శకత్వంలో పి.ఎన్.బలరామ్ నిర్మిస్తున్నారు. సోమవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ ' ఈ సినిమాకు నేను నిర్మాతని కాదు.. శ్రీకృష్ణుని సందేశాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్న వ్యక్తిని. మా కుటుంబంలో జరిగిన ఓ అద్భుతాన్ని కథగా మలిచి ఈ సినిమా తీస్తున్నాం. మా అబ్బాయి అక్షయ్ హీరోగా నటిస్తున్నాడు.ఈ సినిమా కోసం మేం స్టార్స్‌ని తీసుకోవాలని అనుకోలేదు. శ్రీకృష్ణుడే మాకు సూపర్‌స్టార్' అని చెప్పారు. 'నా జీవితంలో జరిగిన అద్భుతాన్ని ప్రేరణగా తీసుకుని తీస్తున్న ఈ చిత్రంలో నేను నటించడం ఆనందంగా ఉంది' అన్నారు అక్షయ్. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం పాడిన 'చిరుప్రాయం' అనే చివరి పాట ఈ సినిమాలోదే కావడం విశేషం.

పుష్ప వైల్డ్ ఫైర్ జాతర

అల్లు అర్జున్ హీరోగా నటించిన 'పుష్ప 2' చిత్రం కోసం 'పుష్ప వైల్డ్ ఫైర్ జాతర' పేరుతో సోమవారం హైదరాబాద్‌లోని (యూసఫ్‌గూడా) పోలీస్ గ్రౌండ్స్‌లో భారీ స్థాయిలో నిర్వహించిన ఈవెంట్‌కు దర్శకదిగ్గజం రాజమౌళి, సీనియర్ నిర్మాత అల్లు అరవింద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. చిత్ర కథానాయిక రష్మిక, స్పెషల్ సాంగ్ చేసిన శ్రీలీల, సంగీత దర్శకుడు దేవి శ్రీప్రసాద్, దర్శకుడు సుకుమార్, నిర్మాతలు నవీన్, రవిశంకర్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా దర్శకుడు సుకుమార్ మాట్లాడుతూ 'బన్నీ మీద ప్రేమతోనే ఈ సినిమా తీశాను. నన్ను నమ్మి బన్నీ నాతో ప్రయాణం చేసినందుకు ఆయన కోసం ఏమైనా చేసేయ్యవచ్చు అనిపించింది' అన్నారు. అల్లు అర్జున్ మాట్లాడుతూ 'ప్రేమతో, భక్తితో ఈ సినిమా చేశాం. దర్శకుడు సుకుమార్ ఈ సినిమాకి చాలా కష్టపడ్డారు. తప్పకుండా మిమ్మల్ని అలరించే సినిమా అవుతుంది' అన్నారు .

2040లో ఏం జరుగుతుంది?



కన్నడ సూపర్ స్టార్ ఉపేంద్ర స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'యూఐ ద మూవీ'. కెపి శ్రీకాంత్ నిర్మిస్తున్నారు. నవీన్ మనోహరన్ సహ నిర్మాత. సినిమా డిసెంబరు 20న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ వార్నర్‌తో ముందుకు వచ్చారు. ఇది సినీ ప్రపంచంలో ఒక గ్లింప్స్‌ని అందిస్తోంది. వార్నర్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంది. ఉపేంద్ర మరో వినూత్నమైన కాన్సెప్ట్‌తో ఆకట్టుకునేలా ప్రెజెంట్ చేశారు. చిత్రకథ 2040లో జరుగుతుంది. బాధాకరమైన సమాజానికి దారితీసే గ్లోబల్ వార్మింగ్, కొవిడ్-19, ఏఐ, నిరుద్యోగం వంటి అంశాలతో చిత్రాన్ని తెరకెక్కించారు. రీష్మా నానయ్య, మురళీ శర్మ, సన్నీ లియోన్, నిధి సుబ్బయ్య, సాధు కోకిల తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు.

రెండో వారంలో అక్కడ రిలీజ్



లక్ష్మీరాయ్ పోలీస్ అధికారిగా నటించిన ' ఝాన్సీ ఐపీఎస్' చిత్రాన్ని ఈ నెల రెండో వారంలో ఆంధ్రా, సీడెడ్ ప్రాంతాల్లో విడుదల చేస్తున్నట్లు నిర్మాత ప్రతాని రామకృష్ణ గౌడ్ చెప్పారు. గురుప్రసాద్ దర్శకత్వంలో రూపొందిన తమిళ చిత్రాన్ని తెలుగులో అనువదించి మొదట తెలంగాణలో విడుదల చేశామనీ, ప్రేక్షకుల ఆదరణ అద్భుతంగా ఉండడంతో ఇప్పుడు ఆంధ్రా ప్రాంతంలో విడుదల చేస్తున్నామని తెలిపారు. మహిళా ప్రేక్షకుల ఆదరణ బాగుందనీ, ఆంధ్రాలో కూడా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉందనీ ఆయన తెలిపారు.

భయపెట్టాలని చూశారు

ఆసీస్ మీడియాపై గవాస్కర్

న్యూఢిల్లీ: ఆస్ట్రేలియాతో జరిగిన తొలి టెస్టులో భారత్ ఘనవిజయాన్ని మాజీ కెప్టెన్ సునీల్ గవాస్కర్ కొనియాడాడు. ఈ టెస్టుకు ముందు అక్కడి మీడియా ఆసీస్ బౌన్సీ పిచ్‌ల గురించి రాస్తూ భారత జట్టును భయభ్రాంతులకు గురి చేయాలని చూసినట్టు ఆరోపించాడు. వారికి ఈ విజయం చెంపపెట్టులాంటిదని తన కాలమ్‌లో పేర్కొన్నాడు. 2007/08లోనూ పేసర్ షాన్ టైట్‌ను జట్టులోకి చేర్చినప్పుడు ఇలాగే కథనాలు రాశారని, కానీ రాహుల్ ద్రవిడ్, సెహ్వాగ్ అతడిని ఆడుకున్నారని గుర్తు చేశాడు.

5 పరుగులు 4 వికెట్లు

సీల్స్ సూపర్ బౌలింగ్

బంగ్లా తొలి ఇన్నింగ్స్ 164



కింగ్‌స్టన్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న తొలి టెస్టులో విండీస్ పేసర్ జేడన్ సీల్స్ (4/5) అత్యంత కట్టుదిట్టమైన బౌలింగ్‌తో సంచలనం సృష్టించాడు. 15.5 ఓవర్లు వేసిన తను కేవలం ఐదు పరుగులే ఇచ్చి నాలుగు వికెట్లు తీయడం విశేషం. ఇందులో పది మెయిడిన్ ఓవర్లున్నాయి. 1978 తర్వాత టెస్టుల్లో నమోదైన అత్యంత పొదుపైన బౌలింగ్ ఇదే. ఓవరాల్‌గా టెస్టు చరిత్రలో అత్యంత ఎకానమీ బౌలింగ్ భారత్‌కు చెందిన ఆర్‌జీ నాద్‌కర్ణి (32-27-5-0) పేరిట ఉంది. ఇక 122/6 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం తొలి ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా 164 పరుగులకే కుప్పకూలింది. మెహిదీ హసన్ (36), జైజుల్ (16) ఓ మాదిరిగా రాణించారు. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో విండీస్ 146 పరుగులకు ఆలౌటైంది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన బంగ్లా.. కడపటి వార్తలందేసరికి వికెట్ నష్టానికి 18 పరుగులు చేసింది.

కతార్ జీపీ విజేత వెర్‌స్టాపెన్



లుసాలి (కతార్): కతార్ గ్రాండ్ ప్రీ టైటిల్‌ను రెడ్‌బుల్స్ ఎఫ్-1 డ్రైవర్ మ్యాక్స్ వెర్‌స్టాపెన్ సొంతం చేసుకొన్నాడు. ఆదివారం జరిగిన ఫైనల్ రేస్‌లో వెర్‌స్టాపెన్ టాప్‌లో నిలవగా.. ఫెరారీ డ్రైవర్ చార్లెస్ లీక్లెర్క్ రెండో స్థానం, మెక్‌లారెన్‌కు చెందిన ఆస్కార్ పియాస్ట్రి మూడో స్థానం దక్కించుకొన్నారు. ఈ ఏడాది వెర్‌స్టాపెన్‌కు ఇది తొమ్మిదో విజయం.



అశ్విన్.. అవసరమెంత?

రవిచంద్రన్ అశ్విన్.. భారత్ తరఫున టెస్టుల్లో 536 వికెట్లు తీయడంతో పాటు ఎన్నో విజయాల్లో పాలు పంచుకున్న అనుభవం అతడిది. ఆఫ్ స్పిన్నర్‌గానే కాకుండా టెయిలెండర్‌లో బ్యాటింగ్‌కు దిగి విలువైన పరుగులతో ఆకట్టుకున్న నేపథ్యం. కానీ ప్రస్తుతం ఆస్ట్రేలియాతో జరుగుతున్న బోర్డర్-గవాస్కర్ ట్రోఫీలో మాత్రం అతడు జట్టు ప్రణాళికల్లో ఉండడం లేదు. ఎందుకంటే ఇటీవలి ఫామ్‌తో పాటు అక్కడి పరిస్థితులు, జట్టు వ్యూహాల కారణంగా టీమ్ మేనేజ్‌మెంట్ 38 ఏళ్ల అశ్విన్‌కన్నా వాషింగ్టన్ సుందర్ వైపు మొగ్గు చూపుతోంది. మరోవైపు పాత రికార్డులను కాకుండా కోచ్ గంభీర్ తమ ఆటగాళ్ల ప్రస్తుత ఫామ్‌ను మాత్రమే పరిగణనలోకి తీసుకుంటున్నాడు. అందుకే న్యూజిలాండ్‌తో సిరీస్‌లో విశేషంగా రాణించిన సుందర్‌ను వెంటనే ఆసీస్‌తో తొలి టెస్టుకు ఎంపిక చేశారు. ఈనెల 6 నుంచి అడిలైడ్‌లో జరిగే గులాబీ టెస్టుకు కూడా ఇదే బౌలింగ్ కూర్పుతో వెళ్లే అవకాశం ఉంది.

పేలవ ఫామ్‌తో ఇబ్బంది

ఆస్ట్రేలియాలో అశ్విన్ ఉత్తమ బౌలింగ్ (4/55) ప్రదర్శన 2021 అడిలైడ్ టెస్టులోనే వచ్చింది. 'సెనా' జట్లుగా పేర్కొనే దక్షిణాఫ్రికా, ఇంగ్లండ్, న్యూజిలాండ్, ఆస్ట్రేలియాలపైనా అతడికిదే బెస్ట్ కావడం గమనార్హం. ఇక తాజా సిరీస్‌కు ముందు కివీస్‌తో జరిగిన మూడు టెస్టుల సిరీస్‌లో అశ్విన్ తీసింది తొమ్మిది వికెట్లే. ఇందులో రెండు టెస్టులు పూర్తిగా స్పిన్‌కు అనుకూలించినా ప్రభావం చూపలేకపోయాడు. అదీగాకుండా.. ఇప్పటివరకు 'సెనా' జట్లపై ఒక్కసారి కూడా ఐదు వికెట్లు తీయలేకపోవడం మైనస్‌గా మారింది. మొత్తంగా 43 మ్యాచ్‌ల్లో 71 వికెట్లు తీశాడు. అందుకే అతడికి మిగతా నాలుగు టెస్టుల్లో చాన్స్ లభించడం కష్టమే. అటు జడేజా మాత్రం ఒకసారి ఐదు వికెట్ల ఫీట్ సాధించగలిగాడు. అలాగే ఈ జట్లపై ఐదు హాఫ్ సెంచరీలు, ఓ సెంచరీ కారణంగా ఇప్పటివరకు టీమిండియా అశ్విన్‌కన్నా జడేజా వైపు మొగ్గుచూపింది. అయితే గత పదేళ్ల కాలంలో 'సెనా' జట్లపై ఒక్కసారి మాత్రమే వీరి నుంచి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్ల ఫీట్ నమోదు కావడం ఆందోళన పరిచే విషయం. బ్యాటింగ్ విషయానికి వస్తే ఈ ఇద్దరికన్నా సుందర్ టెక్నికల్‌గానూ అదరగొడుతున్నాడు. కివీస్‌పైనే కాకుండా పెర్త్ టెస్టులో, వామప్ మ్యాచ్‌లోనూ మెరుగ్గా ఆడాడు. అదీగాకుండా అశ్విన్, పాతికేళ్ల సుందర్ మధ్య వయస్సు అంతరం కూడా ప్రభావం చూపుతోంది. ఇలాంటి పరిస్థితిల్లో అశ్విన్, జడేజాలకు తుది జట్టులో చోటెక్కడ? అనే ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. ఒకవేళ సుందర్‌కు గాయమైనా వికెట్ స్పందనను బట్టి నిర్ణయం తీసుకోవడం జరుగుతుంది. ఇద్దరు స్పిన్నర్లు అవసరమనుకున్నా సుందర్‌కు జతగా జడేజాతో వెళ్తారనడంలో సందేహం లేదు.

(ఆంధ్రజ్యోతి క్రీడావిభాగం)

యువ వ్యాపారవేత్తతో సింధు వివాహం

22న ఉదయ్‌పూర్‌లో పెళ్లి





హైదరాబాద్: స్టార్ షట్లర్ పీవీ సింధు (29) త్వరలో పెళ్లిపీటలెక్కనుంది. ఈ నెల 22న యువ వ్యాపారవేత్త గౌరవెల్లి వెంకట దత్త సాయితో ఆమె వివాహం జరగనుంది. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో పెళ్లి జరగనుండగా.. 24న హైదరాబాద్‌లో రిసెప్షన్ ఏర్పాటు చేశారు. ఈ నెల 20 నుంచి పెళ్లి కార్యక్రమాలు మొదలవుతాయని కుటుంబ వర్గాలు తెలిపాయి. బెంగళూరు ట్రిపుల్ ఐటీలో మాస్టర్స్ డిగ్రీ చేసిన దత్త.. హైదరాబాద్‌కు చెందిన పోసిడెక్స్ టెక్నాలజీస్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నాడు. అతడి తండ్రి జీటీ వెంటేశ్వరరావు అదే కంపెనీకి మేనేజింగ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో సింధు డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తోంది. గత ఏడాది కాలంగా సింధు, సాయి మధ్య పరిచయం ఉందని, గత నెలలోనే వీరి పెళ్లికి సంబంధించి ఓ నిర్ణయానికి వచ్చామని సింధు తండ్రి పీవీ రమణ తెలిపాడు. వీరిద్దరూ కొన్ని మ్యాచ్‌లు, సినిమాలకు కలసి హాజరయ్యారు. అయితే, జనవరి నుంచి సింధుకు బిజీ షెడ్యూల్ ఉండడంతో.. ఈనెలలో వివాహం చేయాలని నిర్ణయించుకొన్నట్టు రమణ తెలిపాడు. రెండేళ్లుగా ఫామ్‌లోలేని సింధు గత ఆదివారం సయ్యద్ మోదీ అంతర్జాతీయ టోర్నీలో విజేతగా నిలిచింది. 2013లో వరల్డ్ చాంపియన్‌షిప్ పతకంతో సింధు ఒక్కసారిగా వెలుగులోకి వచ్చింది. ఆ తర్వాత 2019లో ప్రపంచ చాంపియన్‌షిప్‌ను సొంతం చేసుకొంది. 2016 రియో ఒలింపిక్స్‌లో రజతం సాధించిన సింధు.. 2021 టోక్యో క్రీడల్లో కాంస్యం దక్కించుకొంది. ఈ క్రమంలో విశ్వక్రీడల్లో రెండు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా రికార్డు సృష్టించింది. 2017లో వరల్డ్ ర్యాంకింగ్స్‌లో తొలిసారి రెండో ర్యాంక్‌కు చేరుకొంది. 2028 ఒలింపిక్స్ వరకు కెరీర్‌లో కొనసాగాలని సింధు భావిస్తోంది.

అమన్ మెరుపు శతకం

జపాన్‌పై యువ భారత్ ఘన విజయం

అండర్-19 ఆసియా కప్



షార్జా: కెప్టెన్ అమన్ (118 బంతుల్లో ఏడు ఫోర్లతో 122 నాటౌట్) మెరుపు శతకంతో చెలరేగగా, కార్తికేయ (57), ఆయుష్ (54) హాఫ్ సెంచరీలతో ఆకట్టుకోవడంతో అండర్-19 ఆసియా కప్‌లో భారత్ తొలి విజయం అందుకుంది. గ్రూప్ 'ఏ' మొదటి మ్యాచ్‌లో పాకిస్థాన్ చేతిలో ఓడిన భారత్..సోమవారం 211 పరుగులతో జపాన్‌ను చిత్తు చేసింది. మొదట భారత్ 50 ఓవర్లలో 339/6తో భారీ స్కోరు సాధించింది. సిద్దార్థ్ (35), హార్దిక్ రాజ్ (25 నాటౌట్), వైభవ్ సూర్యవంశీ (23) ఉపయుక్త ఇన్నింగ్స్ ఆడారు. ఛేదనలో జపాన్ 50 ఓవర్లలో 128/8 స్కోరుకే పరిమితమై ఓడింది. హ్యూగో కెల్లి (50), చార్లెస్ (35 నాటౌట్) మాత్రమే రాణించారు. హార్దిక్, చేతన్ శర్మ, కార్తికేయ తలా రెండు వికెట్లు తీశారు.

కేకేఆర్ కెప్టెన్ రహానె?



కోల్‌కతా: కోల్‌కతా నైట్‌రైడర్స్ కొత్త కెప్టెన్‌గా వెటరన్ ఆటగాడు అజింక్యా రహానె నియామకం దాదాపు ఖరారైనట్టు తెలిసింది. ఇటీవలి మెగా వేలంలో రహానెను రూ. 1.5 కోట్ల ఆరంభ ధరతో కోల్‌కతా కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. వేలంలో రూ. 23.75 కోట్ల కళ్లు చెదిరే మొత్తంతో ఆల్‌రౌండర్ వెంకటేశ్ అయ్యర్‌ను కోల్‌కతా దక్కించుకోవడంతో అతడికే సారథ్య బాధ్యతలు అప్పగిస్తారని వార్తలొచ్చాయి. కానీ సీనియర్ రహానెను కెప్టెన్‌గా నియమించాలని కోల్‌కతా ఫ్రాంచైజీ యాజమాన్యం నిర్ణయించినట్టు సమాచారం. అందుకే వేలంలో అతడిని కొనుగోలు చేసినట్టు భావిస్తున్నారు. వెంకటేశ్‌ను వైస్-కెప్టెన్ చేయనున్నట్టు తెలిసింది.

చాంపియన్స్ ట్రోఫీపై మళ్లీ పీటముడి!

పాకిస్థాన్ షరతుకు బీసీసీఐ నో?



న్యూఢిల్లీ: హైబ్రిడ్ విధానానికి పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అంగీకరించిన నేపథ్యంలో చాంపియన్స్ ట్రోఫీపై ఏర్పడిన ప్రతిష్టంభన తొలగిపోయినట్టేనని భావించారు. కానీ తాజా పరిణామాలను గమనిస్తే టోర్నీపై మళ్లీ నీలినీడలు కమ్ముకొనే అవకాశాలు కనిపిస్తున్నాయి. చాంపియన్స్ ట్రోఫీని హైబ్రిడ్ పద్ధతిలో జరిపేందుకు పీసీబీ అంగీకరించిన విషయం తెలిసిందే. అదే సమయంలో ఓ మెలిక కూడా పెట్టింది. అదేంటంటే..భవిష్యత్‌లో భారత్ ఆతిథ్యమిచ్చే ఐసీసీ టోర్నమెంట్లకు పాకిస్థాన్ హాజరుకాకపోతే..ఆ జట్టు ఆడే మ్యాచ్‌లనూ తటస్థ వేదికల్లో నిర్వహించడం. ఈమేరకు ఐసీసీ తమకు రాతపూర్వకంగా హామీ ఇవ్వాలని పీసీబీ పట్టుపడుతోంది. అప్పుడే చాంపియన్స్ ట్రోఫీ హైబ్రిడ్ విధానానికి అంగీకరిస్తామని పీసీబీ స్పష్టంజేసింది. మొత్తంగా.. వచ్చే ఏడాది జరిగే చాంపియన్స్ ట్రోఫీకి మార్గం సుగమమైనట్టు భావించారు. అయితే పీసీబీ డిమాండ్‌కు బీసీసీఐ ససేమిరా అంటున్నట్టు విశ్వసనీయ సమాచారం. పాకిస్థాన్ డిమాండ్‌కు తలొగ్గితే..భారత్‌లో జరిగే పాకిస్థాన్ మ్యాచ్‌లను ఇతర వేదికలకు తరలించాల్సి వస్తుంది. ఇది బీసీసీఐకి ఆందోళన కలిగిస్తోందట! ఐసీసీ కొత్త చైర్మన్‌గా భారత్‌కు చెందిన జై షా బాధ్యతలు చేపట్టాడు. మరి..పీసీబీ డిమాండ్‌కు అతడు తలొగ్గుతాడా? ఒకవేళ పాకిస్థాన్‌ను షరతుకు అంగీకరించకపోతే చాంపియన్స్ ట్రోఫీ జరగడం కష్టమే!

ఆగని రూపాయి పతనం



- సరికొత్త రికార్డు కనిష్ఠానికి డాలర్-రూపీ మారకం విలువ
- మరో 12 పైసల క్షీణత..
- 84.72కి చేరిక

భారత కరెన్సీ సరికొత్త జీవితకాల కనిష్ఠ స్థాయికి పతనమైంది. డాలర్‌తో రూపాయి మారకం విలువ మరో 12 పైసలు క్షీణించి 84.72 వద్ద ముగిసింది. అంతర్జాతీయంగా డాలర్ బలపడటంతో పాటు దేశీయంగా జీడీపీ, మాన్యుఫాక్చరింగ్ రంగాల పనితీరు గణాంకాలు నిరాశపర్చడం మన రూపాయికి గండి కొట్టాయి. అమెరికా డాలర్‌ను బలహీనపరిచేందుకు ప్రయత్నిస్తే, బ్రిక్స్ (బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌతాఫ్రికా) దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించడంతో రూపాయితో పాటు ఆసియా కరెన్సీలన్నీ బలహీనపడ్డాయని ఫారెక్స్ వర్గాలు వెల్లడించాయి. గత శుక్రవారం డాలర్‌తో రూపాయి మారకం విలువ 13 పైసలు క్షీణించింది. మున్ముందు డాలర్-రూపీ ఎక్స్ఛేంజ్ రేటు 84.50-84.95 శ్రేణిలో కదలాడవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అన్నారు.

ఆరంభ నష్టాల్లోంచి లాభాల్లోకి..

సెన్సెక్స్ 445 పాయింట్లు అప్

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం ట్రేడింగ్‌లో ఆరంభ నష్టాల నుంచి తేరుకుని లాభాల్లో పయనించాయి. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఇన్ఫోసిస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ వంటి దిగ్గజ షేర్లలో కొనుగోళ్లతో పాటు అంతర్జాతీయ మార్కెట్ల సానుకూల సంకేతాలు ఇందుకు దోహదపడ్డాయి. సెప్టెంబరు త్రైమాసికానికి జీడీపీ రెండేళ్ల కనిష్ఠానికి పడిపోయిన నేపథ్యంలో స్వల్ప నష్టాలతో ట్రేడింగ్ ఆరంభించిన సెన్సెక్స్.. ఒక దశలో దాదాపు 500 పాయింట్ల వరకు కోల్పోయి 79,308.95 వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని నమోదు చేసింది. మధ్యాహ్నం నుంచి లాభాల్లోకి మళ్లిన సూచీ ఒక దశలో 535 పాయింట్ల వృద్ధితో 80,337.82 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని రికార్డు చేసింది. రోజంతా 1,030 పాయింట్ల శ్రేణిలో కదలాడిన సెన్సెక్స్.. చివరికి 445.29 పాయింట్ల లాభంతో 80,248.08 వద్ద స్థిరపడింది. 80,000 స్థాయిని మళ్లీ నిలబెట్టుకోగలిగింది. నిఫ్టీ విషయానికొస్తే, 144.95 పాయింట్ల లాభంతో 24,276.05 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 21 రాణించాయి.

11 నెలల కనిష్ఠానికి తయారీ రంగ వృద్ధి

భారత మాన్యుఫాక్చరింగ్ రంగ వృద్ధి 11 నెలల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. హెచ్‌ఎస్‌బీసీ ఇండియా మాన్యుఫాక్చరింగ్ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) గత నెలలో 56.5కు పడిపోయింది. మార్కెట్లో పోటీతో పాటు ధరలూ పెరగడంతో పరిశ్రమలకు ఆర్డర్లు మందగించాయి. అయితే, సూచీ ఇప్పటికీ వృద్ధి పథంలోనే కొనసాగిందని హెచ్‌ఎస్‌బీసీ చీఫ్ ఇండియా ఎకనామిస్ట్ ప్రంజుల్ భండారీ అన్నారు. పీఎంఐ స్కోర్ 50కి పైన ఉంటే వృద్ధికి, దిగువన నమోదైతే క్షీణతకు సంకేతం.

ఆడి కార్లు మరింత ప్రియం

న్యూఢిల్లీ: వచ్చే ఏడాది జనవరి 1 నుంచి తమ కార్ల ధరలను 3 శాతం వరకు పెంచుతున్నట్లు జర్మనీ లగ్జరీ కార్ల దిగ్గజం ఆడి సోమవారం ప్రకటించింది. ఉత్పత్తి వ్యయం, రవాణా ఖర్చులు గణనీయంగా పెరిగిన నేపథ్యంలో ధరలు పెంచక తప్పట్లేదని కంపెనీ పేర్కొంది. ప్రస్తుతం ఆడి భారత మార్కెట్లో ఏ4, ఏ6, క్యూ3, క్యూ5, క్యూ7 సహా పలు మోడళ్లను విక్రయిస్తోంది. కాగా వచ్చే జనవరి నుంచి కార్ల ధరలు పెంచుతున్నట్లు జర్మనీకి చెందిన బీఎండబ్ల్యూ, మెర్సిడెస్ బెంజ్ ఇప్పటికే ప్రకటించాయి.

ఆయిల్ కంపెనీలకు ఊరట

విండ్‌ఫాల్ ట్యాక్స్ రద్దు

న్యూఢిల్లీ: చమురు కంపెనీలకు పెద్ద ఊరట లభించింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం నేపథ్యంలో ఈ కంపెనీల అసాధారణ లాభాలపై విధిస్తున్న విండ్‌ఫాల్ ట్యాక్స్‌ను ప్రభుత్వం రద్దు చేసింది. దీనికి సంబంధించిన బిల్లును కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి సోమవారం రాజ్యసభలో ప్రవేశపెట్టారు. దేశీయంగా ఉత్పత్తి చేసే ముడి చమురు, దేశం నుంచి ఎగుమతి చేసే విమాన ఇంధనం (ఏటీఎఫ్), పెట్రోల్, డీజిల్‌పై గత 30 నెలలుగా ప్రభుత్వం స్పెషల్ అడిషనల్ ఎక్సైజ్ డ్యూటీ (ఎస్‌ఏఈడీ) పేరుతో ఈ ట్యాక్స్ విధిస్తోంది. అంతర్జాతీయ మార్కెట్లో ముడి చమురు ధరలు దిగి రావడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్టు మంత్రి తెలిపారు. ఈ నిర్ణయంతో ప్రభుత్వ రంగంలోని ఓఎన్‌జీసీ, ప్రైవేట్ రంగంలోని రిలయన్స్ ఇండస్ట్రీస్ బాగా లబ్ది పొందనున్నాయి. దీంతో పాటు పెట్రోల్, డీజిల్ ఎగుమతులపై రోడ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ సెస్ (ఆర్‌ఐసీ) పేరుతో విధిస్తున్న సెస్‌ను కూడా ప్రభుత్వం రద్దు చేసింది.

ఏపీ, తెలంగాణ రాష్ట్రాల నుంచి

పెరగనున్న పన్ను వసూళ్లు

2024-25లో రూ. 1.21 లక్షల కోట్ల లక్ష్యం

ఇప్పటికే రూ.59,000 కోట్ల వసూళ్లు



ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ మధుస్మిత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి ఆదాయ పన్ను (ఐటీ) వసూళ్లు పెరుగుతున్నాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తెలుగు రాష్ట్రాల నుంచి రూ.1.21 లక్షల కోట్ల ఆదాయ పన్ను వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కమిషనర్ (ఏపీ అండ్ తెలంగాణ) మితాలి మధుస్మిత తెలిపారు. వివాదాల్లో ఉన్న పన్ను బకాయిల వసూలు కోసం ఐటీ శాఖ ప్రారంభించిన 'వివాద్ సే విశ్వాస్ 2.0' పథకంపై తెలంగాణ వాణిజ్య, పరిశ్రమల సమాఖ్య (ఎఫ్‌టీసీసీ) ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో ఆమె ఈ విషయం వెల్లడించారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24)లో వసూలైన మొత్తంతో పోలిస్తే ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఏపీ, తెలంగాణ నుంచి ఆదాయ పన్ను వసూళ్లు 15 శాతం ఎక్కువగా ఉంటాయని ఆశిస్తున్నట్టు తెలిపారు. అయితే గత ఆర్థిక సంవత్సరం నమోదైన 22 శాతం వృద్ధి రేటుతో పోలిస్తే ఇది తక్కువే. తెలంగాణలో వసూళ్లు బాగున్నా, ఏపీలో పన్ను వసూళ్ల వృద్ధి రేటు తగ్గడం ఇందుకు ప్రధాన కారణమని మధుస్మిత తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరానికి లక్ష్యంగా నిర్ణయించిన రూ.1.21 లక్షల కోట్లలో ఇప్పటికే రూ.59,000 కోట్లు వసూలు చేసినట్టు వెల్లడించారు. మిగతా మొత్తం వసూళ్లలో పెద్ద సమస్యలేమీ ఉండకపోవచ్చన్నారు. ఏపీ, తెలంగాణ నుంచి దాదాపు రూ.2 లక్షల కోట్ల పన్ను బకాయిల వసూళ్లు వివాదాల్లో ఉన్నట్టు ఆమె వెల్లడించారు. వివాద్ సే విశ్వాస్ పథకం ద్వారా పన్ను చెల్లింపుదారులు ఈ వివాదాలు పరిష్కరించుకోవాలని సూచించారు.

జేఎస్‌డబ్ల్యూ ఎంజీ ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కార్

రూ.65-70 లక్షల స్థాయిలో ధర



న్యూఢిల్లీ: జేఎస్‌డబ్ల్యూ ఎంజీ మోటార్ ఇండియా కూడా లగ్జరీ కార్ల విభాగంలోకి ప్రవేశించబోతోంది. సైబర్‌స్టర్ పేరుతో ఎలక్ట్రిక్ స్పోర్ట్స్ కారును వచ్చే ఏడాది జనవరిలో మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు సంస్థ తెలిపింది. దీని ధర రూ.65-70 లక్షల స్థాయిలో ఉండే అవకాశం ఉంది. అలాగే, లగ్జరీ కార్ల విక్రయాల కోసం ఎంజీ సెలెక్ట్ పేరుతో కొత్త రిటైల్ చానల్‌ను కూడా ప్రారంభించనున్నట్లు తెలిపింది. వచ్చే రెండేళ్లలో కంపెనీ 4 లగ్జరీ మోడళ్లను అందుబాటులోకి తీసుకురావాలని భావిస్తోంది.

స్కోడా కైలాక్ బుకింగ్స్ షురూ

ప్రారంభ ధర రూ.7.89 లక్షలు



న్యూఢిల్లీ: చెక్ రిపబ్లిక్ ఆటో మొబైల్ కంపెనీ స్కోడా తన తొలి సబ్ కాంపాక్ట్ ఎస్‌యూవీ మోడల్ కైలాక్ బుకింగ్స్‌ను సోమవారం నుంచి ప్రారంభించింది. కారు డెలివరీ వచ్చే ఏడాది జనవరి 27 నుంచి ప్రారంభం కానుంది. మొత్తం ఏడు రంగులు, ఏడు వేరియంట్లలో లభించనున్న ఈ కారు ప్రారంభ ధర రూ.7.89 లక్షలు కాగా.. గరిష్ఠ రేటు రూ.14.4 లక్షలుగా ఉంది. మారుతి బ్రెజ్జా, హ్యూండయ్ వెన్యూ, మహీంద్రా ఎక్స్‌యూవీ 300, టాటా నెగ్జాన్, కియా సోనెట్‌కు పోటీగా స్కోడా ఈ కారును అందుబాటులోకి తెస్తోంది.

ఫోన్ పే నుంచి డెంగ్యూ, మలేరియా బీమా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్) : ఫోన్ పే నుంచి డెంగ్యూ, మలేరియా బీమా అందుబాటులోకి వచ్చింది. ఏడాదికి కేవలం రూ.59 ప్రీమియంతోనే దీన్ని ప్రవేశపెట్టినట్టు ఫోన్ పే ప్రకటించింది. దోమలు, ఇతర క్రిమి కీటకాల (పరాన్నభుక్కుల) ద్వారా వ్యాపించే రోగాలకు తీసుకునే చికిత్సకు ఇది రూ.లక్ష వరకు ఏడాది పొడవునా బీమా రక్షణ కల్పిస్తుంది. అంటే బీమా కవరేజీ రుతుపవనాల కాలానికి మాత్రమే పరిమితం కాదు. ఫోన్ పే కస్టమర్లకు మాత్రమే అందుబాటులో ఉండే ఈ ప్లాన్ ఆస్పత్రి ఖర్చులు, డయాగ్నోస్టిక్ ఖర్చులు, ఐసీయూ చికిత్స వంటి అన్నింటికీ కవరేజీ కల్పిస్తుంది. ఫోన్ పే యాప్ ద్వారా ఈ పాలసీని కొనుగోలు చేయవచ్చు. పూర్తిగా డిజిటల్ విధానంలోనే క్లెయిమ్ సెటిల్మెంట్ ఉంటుంది. కార్పొరేట్ ఆరోగ్య బీమా కలిగిన వారు కూడా దీన్ని కొనుగోలు చేయవచ్చునని ఫోన్ పే ఇన్సూరెన్స్ బ్రోకింగ్ సర్వీసెస్ సీఈఓ విశాల్ గుప్తా అన్నారు.

రిలయన్స్ బిగ్ ఆస్తుల జప్తు : సెబీ

న్యూఢిల్లీ : అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు సెబీ మరోసారి షాకిచ్చింది. ఈ సంస్థకు చెందిన బ్యాంకు, డీమ్యాట్, మ్యూచువల్ ఫండ్ ఖాతాలు జప్తు చేయాలని ఆదేశించింది. గత నెల 14న విధించిన రూ.26 కోట్ల జరిమానాను కంపెనీ నిర్ణీత 15 రోజుల్లో చెల్లించకపోవడంతో సెబీ ఈ చర్య తీసుకుంది. రిలయన్స్ హోమ్ ఫైనాన్స్ నిధుల దారి మళ్లింపులో రిలయన్స్ బిగ్ ఎంటర్‌టైన్‌మెంట్‌కు పాత్ర ఉండడంతో సెబీ ఈ చర్య తీసుకుంది. దీనికి సంబంధించి సెబీ ఇప్పటికే కంపెనీ ప్రధాన ప్రమోటర్ అనిల్ అంబానీపైనా రూ.25 కోట్ల జరిమానా, ఐదేళ్ల పాటు క్యాపిటల్ మార్కెట్ నుంచి బహిష్కరించింది.

బిజినెస్

ట్రంప్ హెచ్చరికలో పస లేదు

- డాలర్ ఆధిపత్యం ఏ మాత్రం తగ్గదు
- బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీతో చైనాకే మేలు
- ఆర్‌బీఐ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు



హైదరాబాద్: బ్రిక్స్ దేశాలు డాలర్‌కు ప్రత్యామ్నాయ కరెన్సీని తీసుకొస్తే ఆ దేశాల దిగుమతులపై 100 శాతం సుంకాలు తప్పవన్న డొనాల్డ్ ట్రంప్ హెచ్చరికపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ హెచ్చరికలో స్పష్టత లేదని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. అమెరికా చట్టాలు అందుకు అనుమతిస్తాయా? లేదా? అనే విషయాన్నీ పరిశీలించాల్సి ఉందన్నారు. డాలర్ ఆధిపత్యాన్ని అడ్డుకునేందుకు బ్రిక్స్ దేశాలు ఒకే ఉమ్మడి కరెన్సీని తీసుకు వచ్చే అవకాశాలపైనా ఆయన అనుమానం వ్యక్తం చేశారు. ఈ దేశాల ఆర్థిక, రాజకీయ పరిస్థితులూ ఇందుకు అనుమతించే అవకాశం లేదన్నారు. ట్రంప్‌ను మాటల మనిషిగా చూడాలే తప్ప, చేతల మనిషిగా చూడలేమని సుబ్బారావు స్పష్టం చేశారు.

బ్రిక్స్ ఉమ్మడి కరెన్సీ కోసం భారత్ వంటి దేశాలు తమ ద్రవ్య విధానాలు, స్వయం ప్రతిపత్తి వదులుకుని బ్రిక్స్‌లోని ఇతర దేశాల్లో ఏర్పడే ఆటుపోట్లకు సిద్ధమవుతాయా? అనే విషయాన్నీ ఆలోచించాల్సి ఉందన్నారు. ఒకవేళ అదే జరిగితే బ్రిక్స్ దేశాలపై చైనా ఆధిపత్యం పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	77,350 ▼	70,090 ▼	99,500 ▼
ముంబై	76,308 ▼	69,898 ▼	88,611 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

3వ తేదీ

హైదరాబాద్	615	విజయవాడ	620
వరంగల్	617	గోదావరి	615
చిత్తూరు	633	విశాఖపట్నం	605
		దజను గుడ్లు రూ. 84	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	85	విజయవాడ	104
వరంగల్	85	గుంటూరు	99
కరీంనగర్	85	ఒంగోలు	99
మహబూబ్‌నగర్	85	చిత్తూరు	92
కర్నూలు	85	నెల్లూరు	92
విశాఖపట్నం	100	అనంతపురం	92
గోదావరి	104		



రక్తపోటు అదుపులో

రక్తపోటును అదుపులో ఉంచుకోవటం కోసం ఒత్తిడిని తగ్గించుకునే మార్గాలను అనుసరించటం, జీవన శైలి మార్పులు, మందులు, వ్యాయామం... ఇలా ఎన్నో ప్రయత్నాలు చేస్తూ ఉంటాం. అయితే తీసుకునే ఆహారం కూడా రక్తపోటు మీద ప్రభావం చూపిస్తుంది. అలాంటి ఆహారంలో 'అరటి పండు' ఒకటి.

రక్తపోటు ఉన్నవాళ్లకు వైద్యులు అరటి పండు తినమని సూచిస్తూ ఉంటారు. కానీ నిజానికి అరటి పండుకు అంత శక్తి ఉందా? అనే అనుమానం అందరికీ వస్తుంది. అయితే అరటిపండు మన శరీరం మీద చూపించే ప్రభావం గురించి తెలుసుకునే ముందు మూత్రపిండాల పనితీరు గురించి తెలుసుకోవాలి. మూత్రపిండాలు మన శరీరంలోని ద్రవాలను వడపోస్తూ అదనంగా ఉన్న ద్రవాల్ని విసర్జించేలా చేస్తూ శరీరంలో నీటి శాతాన్ని సమంగా ఉంచుతూ ఉంటాయి. ఈ విధానం అంతా మన రక్తపోటు మీద ప్రభావం చూపిస్తుంది. శరీరంలో

చిట్కా



ఎక్కువ ద్రవాలు నిల్వ ఉండిపోతే రక్తపోటు పెరిగిపోతుంది, తక్కువ ఉంటే రక్తపోటు పడిపోతుంది. ఈ రెండూ ప్రమాదమే! ఇలా శరీరంలోని ద్రవ పరిమాణం హెచ్చుతగ్గులకు గురికాకుండా మూత్రపిండాలు సోడియం, పొటాషియం అనే రసాయనాల మధ్య సమతూకాన్ని పాటిస్తాయి. పొటాషియం ఎక్కువగా నీటిని మూత్రపిండాల్లోకి చేరవేస్తే, సోడియం నీటిని మూత్రపిండాల్లోకి చేరకుండా నియంత్రిస్తుంది. మనం ఆహారం ద్వారా తీసుకునే ఉప్పు వల్ల శరీరంలో నీరు నిల్వ ఉండిపోయి రక్తపోటు పెరిగిపోతుంది. ఇలా జరగకుండా ఉండాలంటే అలా నిల్వ ఉన్న నీటిని మూత్రపిండాల్లోకి చేరవేసే పొటాషియం ఉన్న ఆహారం తీసుకోవాలి. ఒక అరటి పండులో 422 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. మనకు ఒక రోజుకి అవసరమైన 4,700 మిల్లీగ్రాముల్లో ఇది పది శాతానికి సమానం. కాబట్టి రక్తపోటు ఉన్నవారు రోజుకో అరటిపండు తినటం మేలని వైద్యులు సూచిస్తూ ఉంటారు.

అవగాహన

మూత్రపిండాలు ఇలా క్షేమం

శరీరంలో ఏ కారణంగా వ్యర్థాలు పేరుకుపోయినా వాటి దుష్ప్రభావం ముందు కిడ్నీల పైన పడుతుంది. అందుకే కిడ్నీలు సక్రమంగా పనిచేయాలంటే, శరీరంలోని అన్ని అవయవాలూ ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి. అందుకు ఒక్కో అవయవానికీ శక్తినిచ్చే సహజ సిద్ధమైన కొన్ని ప్రత్యేక ఆహార పదార్థాలు తీసుకోవాలి. అలాంటి ఆహార పదార్థాల్లో కొన్ని...

- **నిమ్మ:** అన్ని కాలాల్లోనూ, అన్ని ప్రాంతాల్లోనూ అందుబాటులో ఉండే వాటిల్లో నిమ్మకాయ ఒకటి. ఎక్కువ మంది అందులోని విశేషాలను పెద్దగా పరగణనలోకి తీసుకోరు. నిజానికి, శరీరంలోని కలుషితాలను బయటికి పంపడంలో నిమ్మకాయ అద్భుతంగా పనిచేస్తుంది. రోజూ పరగడుపున ఒక నిమ్మకాయ రసాన్ని, నీళ్లలో కలిపి తాగితే శరీరంలోని మలినాలన్నీ తొలగిపోతాయి. శరీర బరువును తగ్గించడం నిమ్మ కలిగి ఉండే మరొక గొప్ప గుణం.



- **యాపిల్:** దీనిలో విటమిన్లు, లవణాలు, పీచుపదార్థం ఎలాగూ ఉంటాయి. వీటితో పాటు యాపిల్‌లో ఉండే ఫైటో కెమికల్స్ శరీర వ్యర్థాలను చాలా వేగంగా బయటికి పంపిస్తాయి. విటమిన్- సి చర్మాన్ని కూడా ఆరోగ్యంగా మారుస్తుంది.
- **బెర్రీ పండ్లు:** స్ట్రాబెర్రీ, బ్లాక్ బెర్రీ, బ్లూ బెర్రీ... ఈ జాతి పండ్లన్నింటిలోనూ సి విటమిన్, పీచుపదార్థం సమృద్ధిగా ఉంటాయి. ఈ పండ్లలో ఉండే ఫ్యాటీ యాసిడ్ శరీరం బరువును అదుపులో ఉంచుతుంది.
- **పైనాపిల్:** ఈ పండుతో కీళ్ల సమస్యల వల్ల వచ్చే వాపు తగ్గడంతో పాటు, గాయాలు కూడా త్వరగా మానతాయి.

సమతులాహారం, వ్యాయామం, టీకాలు ఇవే కాలేయానికి ప్రాణ స్నేహితులు. వీటి మీద దృష్టి పెడితే కాలేయాన్ని దెబ్బతీసే ఫ్యాటీ లివర్, లివర్ క్యాన్సర్ లాంటి శత్రువులు దరి చేరకుండా ఉంటాయంటున్నారు వైద్యులు.



కాలేయం క్షేమంగా...

కామెర్లు సోకితే పత్యంతో సరిపెట్టేసుకుంటాం. నోరూరించే బర్గర్లు ఆబగా లాగించేస్తూ ఉంటాం. పెరిగే బరువును నిర్లక్ష్యం చేస్తూ ఉంటాం. మద్యపానాన్ని సరదా కాలక్షేపంగా పరిగణిస్తూ ఉంటాం. కానీ జీవనశైలితో ముడిపడి ఉండే ఈ అంశాలన్నీ కాలేయాన్ని క్రమేపీ కుదేలు చేస్తాయనే విషయం గుర్తు పెట్టుకోవాలి.

పొంచి ఉండే హెపటైటిస్

కాలేయం దెబ్బతినడానికి మద్యపానం, ఫ్యాటీ లివర్ డిసీజ్, హెపటైటిస్ 'బి', హెపటైటిస్ 'సి'లు ప్రధాన కారణాలు. నిజానికి వీటన్నిటినీ నియంత్రించుకునే మార్గాలున్నాయి. పదేళ్ల క్రితం హెపటైటిస్ 'సి' ప్రాణాంతకమైన వ్యాధిగా ఉండేది. ఈ వ్యాధితో కాలేయం బాగా దెబ్బతిని, క్యాన్సర్‌కు గురై, కాలేయ మార్పిడి చేసినా మళ్లీ హెపటైటిస్‌తో పూర్తిగా కోలుకోలేనంతగా దెబ్బతినే పరిస్థితులు ఉండేవి. ఇప్పుడు అందుబాటులో ఉన్నంత సమర్థమైన చికిత్సలు అప్పట్లో లేవు. కాబట్టి మరణాల సంఖ్య ఎక్కువగా ఉండేది. కానీ ఇప్పుడు ఎన్నో అత్యాధునిక చికిత్సలు అందుబాటులోకొచ్చాయి. వీటితో 95 శాతానికి పైగా హెపటైటిస్ వ్యాధిని వైద్యులు సమూలంగా నయం చేయగలుగుతున్నారు. దాంతో ఈ ప్రాణాంతకమైన తీవ్ర వ్యాధి, చికిత్సకు లొంగే సాధారణ రుగ్మతగా మారిపోయింది. అయితే ఈ రుగ్మతను ఎంత సమర్థంగా నిలువరించగలిగినా, రుగ్మతలో భాగంగా కాలేయంలో కణుతులు పెరగకుండా నియంత్రించలేని పరిస్థితి. కాబట్టి ఈ రుగ్మత నుంచి పూర్తిగా కోలుకున్న తర్వాత కూడా వైద్యులను కలుస్తూ క్రమం తప్పకుండా కాలేయాన్ని పరీక్షించుకుంటూ ఉండాలి.

కాలేయ కొవ్వుతో ముప్పు

ఇప్పటికి పదేళ్ల క్రితం, వంద కాలేయ మార్పిడి చికిత్సల్లో 10 నుంచి 15 కాలేయ మార్పిడులు ఫ్యాటీ లివర్ డిసీజ్‌కు సంబంధించినవే అయి ఉండేవి. కానీ ఇప్పుడు వాటి సంఖ్య 40 నుంచి 50కి పెరిగిపోయేలా ఫ్యాటీ లివర్ డిసీజ్ అత్యంత సాధారణ కాలేయ సమస్యగా మారిపోయింది. అలాగే ఫ్యాటీ లివర్ డిసీజ్ మూలంగా కాలేయ మార్పిడి అవసరమయ్యే తీవ్ర కాలేయ సమస్యల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. మన జీవనశైలే ఈ సమస్యకు ప్రధాన కారణం. పాశ్చాత్య ఆహారపుటలవాట్లు, అధిక క్యాలరీలతో కూడిన ఆహారం, అస్తవ్యస్థ జీవనశైలి, వ్యాయామం లోపించడం, అధిక బరువు... ఇవన్నీ ఫ్యాటీ లివర్‌కు కారణాలే! స్థూలకాయంతో మధుమేహం, అధిక రక్తపోటు, ఈ రెండింటితో కాలేయ కొవ్వు సమస్యలు పెరుగుతాయి. అందుకే తాజాగా ఈ కాలేయ సమస్యను 'మెటబాలిక్ అసోసియేటెడ్ ఫ్యాటీ లివర్ డిసీజ్' అంటున్నారు. స్థూలకాయ సంబంధిత ఫ్యాటీ లివర్‌కు సంబంధించిన ఆధునిక మందులు కూడా రెండేళ్లుగా అందుబాటులోకొచ్చాయి. ఈ మందులతో బరువు తగ్గడంతో పాటు ఫ్యాటీ లివర్ పరిస్థితి కూడా కొంత మెరుగుపడుతుంది. అయితే ఈ మందులతోనే ఆరోగ్యం పూర్తిగా కుదుట పడుతుందనుకుంటే పొరపాటు. వీటిని వాడుకుంటూ అదనంగా ఆహారపుటలవాట్లను పాటిస్తూ, వ్యాయామం కూడా కొనసాగించవలసి ఉంటుంది. అప్పుడే సత్ఫలితాలను సాధించడం సాధ్యపడుతుంది.

ఓ కన్నేసి ఉంచి...

హెపటైటిస్, ఫ్యాటీ లివర్ వల్ల దెబ్బతిన్న కాలేయం తేలికగా క్యాన్సర్ బారిన పడుతుంది. ప్రతి వంద మంది కాలేయ క్యాన్సర్ రోగుల్లో, 80 మంది అప్పటికే కాలేయ జబ్బులతో బాధపడుతూ ఉంటారు. కాబట్టి కాలేయ జబ్బులతో బాధపడేవాళ్లు క్రమం తప్పకుండా కాలేయ పరీక్షలు చేసుకుంటూ, మందులు వాడుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో నడుచుకుంటూ ఉండాలి. ప్రతి మూడు నెలలకోసారి రక్తపరీక్షలు, ప్రతి ఆరు నెలలకోసారి అల్ట్రాసౌండ్ స్కాన్ చేయించుకుంటూ ఉండాలి. పొట్ట, పిత్తాశయ క్యాన్సర్లలో సర్జరీతో క్యాన్సర్ నయమయ్యే అవకాశాలు 30 నుంచి 40 శాతం మేరకే ఉంటాయి. కానీ కాలేయ క్యాన్సర్‌లో... కాలేయ మార్పిడి చేయగలిగితే వ్యాధి నయమయ్యే అవకాశాలు 80 శాతం మేరకు ఉంటాయి. కాబట్టి కాలేయ క్యాన్సర్‌కు కాలేయ మార్పిడే ఉత్తమమైన ప్రత్యామ్నాయం.

> **పసికందుల్లో కామెర్లు**
>
> అప్పుడే పుట్టిన పసికందుల్లో కామెర్లు సహజమే! అయితే ఈ సమస్య వారం రోజుల్లో తగ్గిపోవాలి. రెండు వారాలకు కూడా తగ్గకపోతే, ఆలస్యం చేయకుండా పిల్లల వైద్యులకు చూపించాలి. ప్రస్తుతం 'బిలేరీ అట్రేసియా' అనే కాలేయ సమస్య పసికందుల్లో కాలేయ మార్పిడిలకు కారణమవుతోంది. ఈ సమస్యను సకాలంలో గుర్తించాలంటే పసికందుల్లో కొన్ని లక్షణాలను గమనించాలి. రెండు వారాలకు మించి కామెర్లు తగ్గకపోవడం, మలం లేత రంగులో ఉండడం ఈ సమస్య ప్రధాన లక్షణాలు.

ఇమ్యునోథెరపీతో...

కాలేయ క్యాన్సర్‌లో లక్షణాలు తక్కువ కాబట్టి వ్యాధి ఆలస్యంగా బయటపడుతూ ఉంటుంది. అలాగని చివరి దశకు చేరుకున్న కాలేయ క్యాన్సర్‌ను నయం చేయడం సాధ్యపడదని అనుకోడానికి వీల్లేదు. మొదటి దశ అయినా, చివరి దశ అయినా కాలేయ క్యాన్సర్‌కు ఉత్తమమైన ప్రత్యామ్నాయం కాలేయ మార్పిడే! అయితే చివరి దశలో కాలేయంలో ఎక్కువ గడ్డలు ఉన్నా, ఒకే గడ్డ పెద్దదిగా పెరిగిపోయినా, సర్జరీ సఫలమయ్యే అవకాశాలు తక్కువగా ఉంటాయి. సర్జరీ చేసినా మళ్లీ వ్యాధి తిరగబెట్టే అవకాశాలు ఉంటాయి. కాబట్టి ఇమ్యునోథెరపీతో గడ్డ పరిమాణం తగ్గించి, ఆ తర్వాత కాలేయ మార్పిడి సర్జరీ చేసి క్యాన్సర్‌ను సమూలంగా నయం చేయవలసి ఉంటుంది. ఇమ్యునోథెరపీతో శరీరం క్యాన్సర్‌తో పోరాడే బలాన్ని పుంజుకుంటుంది. ఫలితంగా కణితి కుంచించుకుపోతుంది. అప్పుడు కాలేయ మార్పిడికి పరిస్థితి అనుకూలిస్తుంది. క్యాన్సర్ మొదటి దశలో, అంటే... కాలేయంలో క్యాన్సర్ గడ్డ చిన్నదిగా ఉన్నప్పుడు కూడా మెరుగైన ఫలితం కోసం కాలేయ మార్పిడినే ఆశ్రయించాలి.

ఆధునిక చికిత్సలు ఇవే!

కాలేయంలో తలెత్తే క్యాన్సర్లకు వైద్యులు వేర్వేరు చికిత్సలను ఆశ్రయిస్తూ ఉంటారు. ఒకరికి తగిన చికిత్స ఇంకొకరికి తగినది కాకపోవచ్చు. కాబట్టి ఎవరికి ఎలాంటి చికిత్సా విధానాన్ని ఎంచుకోవాలో, ఏ అనుబంధ చికిత్సలతో ఫలితం మెరుగ్గా ఉంటుందో వైద్యులు అంచనా వేస్తారు. వయసు, క్యాన్సర్ తత్వం, దశ, గడ్డ పరిమాణం, గడ్డ పెరిగిన ప్రదేశం, మునుపటి కాలేయ వ్యాధులు... ఈ అంశాలన్నిటినీ వైద్యులు పరిగణలోకి తీసుకుంటారు. కొందరికి సర్జరీ చేసి గడ్డను తొలగిస్తే వ్యాధి నయమైపోవచ్చు. ఇంకొందరికి నేరుగా కాలేయ మార్పిడి అవసరం పడొచ్చు. ఇంకొంతమందికి ఇతరత్రా చికిత్సలను అందించి, ఫలితం ఆధారంగా తదనంతర చికిత్సలను ఎంచుకుంటారు. ఇలా కాలేయ సర్జరీ, కాలేయ మార్పిడిలకు వెళ్లకుండా, నేరుగా క్యాన్సర్ గడ్డకే చికిత్స చేసే వెసులుబాట్లు కూడా ఉన్నాయి. వాటిలో చెప్పుకోదగినవి 'టేస్', 'టేర్'. ఈ రెండు చికిత్సల్లో క్యాన్సర్ కణితికి రక్తాన్ని సరఫరా చేసే రక్తనాళం గుండా కణితికే నేరుగా కీమోథెరపీ, లేదా రేడియోథెరపీ ఇవ్వడం జరుగుతుంది. ఈ చికిత్సలతో కొందర్లో క్యాన్సర్ పూర్తిగా నయం అయిపోవచ్చు, ఇంకొందరికి అదనంగా ఇమ్యునోథెరపీ కూడా అవసరం పడొచ్చు.

డాక్టర్ మెట్టు శ్రీనివాస్ రెడ్డి
సీనియర్ లివర్ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్, స్టార్ హాస్పిటల్స్, నానక్‌రామ్‌గూడ, హైదరాబాద్.



మీకు తెలుసా?

ప్లాస్టిక్ నుంచి పలాయనం

ప్లాస్టిక్ ప్రమాదకరమని తెలిసీ దాన్నుంచి తప్పించుకోలేకపోతున్నాం. మన ఊహకందని మార్గాల్లో ప్లాస్టిక్ మన శరీరాల్లోకి చేరుకుంటూనే ఉంది. ఆ ప్లాస్టిక్ మహమ్మారి నుంచి ఎలా తప్పించుకోవచ్చో తెలుసుకుందాం!

ప్లాస్టిక్ వస్తువుల్లో ప్రమాదకర బిస్ఫినాల్ రసాయనం దాగి ఉంటుంది. ప్లాస్టిక్ వేడికి గురయినప్పుడు ఈ రసాయనం బయటకు వచ్చేస్తూ ఉంటుంది. నిల్వ పదార్థాలను ప్లాస్టిక్ సీసాలో నింపేటప్పుడు, మూతను స్టెరిలైజ్ చేస్తారు. ఆ క్రమంలో వేడి వెలువడి, ప్లాస్టిక్‌లోని ప్రమాదకర రసాయనాలు పదార్థాల్లో కలుస్తాయి. సూపర్ మార్కెట్‌లో నీళ్ల డబ్బాలు కొంటూ ఉంటాం. కానీ ఆ సీసాలు షాపుకు చేరే లోపు ఎంతసేపు ఎండకు గురయ్యాయి? దుకాణాల్లో వాటిని నిల్వ చేసే జాగా లేక, బయట ఉంచి, తర్వాత ఫ్రిజ్‌లో పెట్టారా? అనేది ఎవరికి తెలుసు? ఆకర్షణీయమైన రంగుల్లో దొరికే ప్లాస్టిక్ లంచ్ బాక్సుల్లో పదార్థాలు సర్దుకుంటున్నాం! కానీ పదార్థాలు చల్లారేంత సమయం ఆగుతున్నామా? ఓవెన్‌లో పదార్థాలు వేడిచేసే పాత్రలు ప్రధానంగా ప్లాస్టిక్‌తోనే తయారవుతూ ఉంటాయి. పిల్లలు ఆడుకునే వస్తువుల్లో 90% ప్లాస్టిక్‌వే! కర్రీ పాయింట్ నుంచి కూరలు తెచ్చుకున్నా, టీ షాపు నుంచి టీ తెప్పించుకున్నా, వాటిని ప్యాక్ చేస్తున్నదీ ప్లాస్టిక్ కవర్లలోనే!

ప్లాస్టిక్ ప్రత్యామ్నాయాలు ఇవే!

టూత్‌బ్రష్ లాంటి కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు ప్రత్యామ్నాయాలు (వేప పుల్ల) ఉన్నా ఉరుకులు పరుగుల జీవితంలో వాటిని పాటించడం కొంత కష్టం. కాబట్టి తప్పనిసరిగా ఉపయోగించవలసివచ్చే కొన్ని ప్లాస్టిక్ వస్తువుల్లో మేలైనవి, బిపిఎ ఫ్రీ రకానికి చెందినవే ఎంచుకోవాలి. ఆ వస్తువులు కొనే సమయంలో, లేబుల్ మీద బిపిఎ ఫ్రీ అని రాసి ఉందో, లేదో గమనించాలి. సాధారణంగా ప్రసిద్ధ కంపెనీలు తయారుచేసే ప్లాసిక్ వస్తువులు ఈ కోవకే చెంది ఉంటాయి. కాబట్టి ప్లాస్టిక్ నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. అలాగే కొన్ని ప్లాస్టిక్ వస్తువులకు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయ వస్తువులు ఎంచుకోవాలి. అవేంటంటే...

- **ప్లాస్టిక్ బాటిల్**
  ప్రత్యామ్నాయం: గాజు సీసా, స్టీలు లేదా రాగి బాటిల్
- **ప్లాస్టిక్ గిన్నెలు**
  ప్రత్యామ్నాయం: ఓవెన్‌లో గాజు లేదా పింగాణీ గిన్నెలే వాడాలి.
- **ప్లాస్టిక్ ప్లేట్లు**
  ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ ప్లేట్లలో భోజనం చేయాలి


> **మూడు తరాల వరకూ...**
>
> ప్లాస్టిక్ వాడకంతో శరీరం మీద పడే దుష్ప్రభావాలు మూడు తరాల వరకూ కొనసాగుతాయి. బాల్యంలో, యుక్తవయసులో, మధ్య వయసులో... ఇలా జీవితంలోని మూడు దశల్లో వేర్వేరు ఆరోగ్య సమస్యలను కూడా కలిగిస్తాయి. అండాలు, వీర్యకణాల డిఎన్ఎల్లో తేడాలు ఏర్పడి, మూడు తరాల వరకూ పునరుత్పత్తి సమస్యలు వంశపారంపర్యంగా కొనసాగుతాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు. కాబట్టి సాధ్యమైనంత వరకూ ప్లాస్టిక్‌కు బహిర్గతం కాకుండా జాగ్రత్త పడాలి.



- **ప్లాస్టిక్ కప్పులు**
  ప్రత్యామ్నాయం: స్టీలు, పింగాణీ కప్పులు
- **ప్లాస్టిక్ ఆట వస్తువులు**
  ప్రత్యామ్నాయం: సాఫ్ట్ టాయిస్
- **ప్లాస్టిక్ స్ట్రా**
  ప్రత్యామ్నాయం: స్టీలు స్ట్రా

ఊబకాయం

పిల్లలు ముద్దుగా బొద్దుగా ఉండాలి అని ప్రతి తల్లీ కోరుకుంటుంది. అయితే పిల్లల బరువు వాళ్ల ఆరోగ్యకరమైన భవిష్యత్తుకు అవరోధం కాకుండా చూసుకోవాలి. ఊబకాయానికి ఆస్కారం లేని పిల్లల పోషకాహారం మీద ప్రతి తల్లీ దృష్టి పెట్టాలి.



బొద్దు ముద్దు కాదు

శారీరక శ్రమ కొరవడడం, బయటి ఆహారం తినే అలవాటు పెరగడం పిల్లల ఊబకాయానికి ప్రధాన కారణాలు. అలాగే ల్యాప్‌టాప్‌లు, సెల్‌ఫోన్లతో కాలక్షేపం చేయడం, చక్కెర, మైదాలతో తయారయ్యే చిరుతిళ్లు, పానీయాలు తాగే అలవాటు కూడా పిల్లల్లో పెరిగిపోతోంది. వీటన్నిటి వల్ల పిల్లల్లో ఊబకాయ సమస్య పెరిగిపోతోంది. కానీ పిల్లల భోజనానికి కొన్ని పోషక నియమాలున్నాయి. వాళ్ల భోజనంలో 30% పిండిపదార్థాలు, 30% కూరగాయలు, ఆకుకూరలు, 20% పండ్లు, 15 నుంచి 20% మాంసకృత్తులు, 5 నుంచి 10% (500 మిల్లీలీటర్లు) పాల ఉత్పత్తులు ఉండేలా చూసుకోవాలి. రోజుకు రెండు సార్లు పండ్లు, ప్రతి భోజనంలో కూరగాయలు, వయసును బట్టి రోజుకు ఒకసారి నట్స్‌ను నేరుగా అందించడం లేదా పొడి చేసి పాలలో కలిపి ఇవ్వడం చేస్తూ ఉండాలి. ఏడాది వయసు దాటిన పిల్లలైతే రెండేళ్ల వయసొచ్చేవరకూ వెన్న తీయని పాలు ఆ తర్వాత వెన్న తీసిన పాలు ఇవ్వాలి. వంట నూనెల విషయంలో కూడా కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వీలైనంతవరకూ గానుగ నూనెలు వాడుకోవాలి. అలాగే నూనెలో ముంచి వేయించిన పదార్థాలు తగ్గించాలి. వాడిన నూనెనే మళ్లీ మళ్లీ వాడే అలవాటు మానుకోవాలి. ఇలాంటి జాగ్రత్తలు పాటిస్తే స్థూలకాయం దరి చేరదు.

తల్లితండ్రులే ఆదర్శం

ఇప్పటికే స్థూలకాయులుగా మారిన పిల్లల విషయంలో మరీ ముఖ్యంగా తల్లితండ్రులు వారికి ఆదర్శంగా మారాలి. తల్లితండ్రులు ఆరోగ్యకరమైన ఆహారపుటలవాట్లను అనుసరిస్తూ పిల్లలకు ఆదర్శంగా నిలవాలి. లావుగా ఉన్న పిల్లలను 'లావుగా ఉన్నావు' అంటూ కించపరచడం వల్ల వాళ్లు మానసికంగా కుంగిపోతారు. కాబట్టి 'బరువు పెరగడం అనారోగ్యకరం, ఆరోగ్యకరమైన ఆహారం తింటూ, ఒళ్లు అలసిపోయేలా ఆడుకోవాలి' అంటూ పిల్లలను ప్రోత్సహించాలి. హోటల్ భోజనాలకు, స్విగ్గీ, జొమాటోలకు స్వస్తి చెప్పి, ఇంటి భోజనానికే పరిమితం చేయాలి. పాలిష్ పట్టని బియ్యం వాడుకుంటూ, భోజనంలో అన్నంతో సమానంగా కూరలు తినేలా పిల్లలను ప్రోత్సహించాలి. పిల్లలు విపరీతమైన ఊబకాయంతో బాధపడుతున్నప్పుడు పిల్లల వైద్యులను తప్పక కలవాలి.

చక్కెరకు దూరంగా...

పిల్లలను చక్కెరకు వీలైనంత దూరంగా ఉంచాలి. తీపి పదార్థాల పట్ల వ్యామోహం ఏర్పడకుండా చూసుకోవాలి. అరుదుగా, పరిమితంగానే పిల్లలకు తీపిపదార్థాలు అందించాలి. చక్కెర కంటే బెల్లం మేలు అనేది కూడా అపోహే! చక్కెర కంటే బెల్లంతో రక్తంలోని చక్కెర మోతాదులు వేగంగా పెరుగుతాయి. పాలల్లో కలిపే బోర్న్‌వీటా, హార్లిక్స్‌లలో కూడా చక్కెర ఉంటుంది. వీటి వల్ల పిల్లలకు అదనంగా ఒరిగే ప్రయోజనం కూడా ఏమీ ఉండదు. పసికందులకు పోత పాలు పట్టించేటప్పుడు కూడా చక్కెర కలపకుండా ఇవ్వాలి.

> **పిల్లల ఆహారం గురించి తల్లుల్లో ఎన్నో అనుమానాలు ఉంటూ ఉంటాయి. పిల్లలు సరిపడా తినరేమోననే భయంతో స్వయంగా తినిపించడం, బలవంతంగా కూరడం లాంటివి చేస్తూ ఉంటారు. కానీ చిన్న వయసు నుంచే పిల్లలు స్వయంగా తినేలా తల్లులు అలవాటు చేయాలి.**

ఈ సమస్యలు తప్పవు

పిల్లల్లో ఊబకాయం వల్ల తక్షణమే ఆరోగ్య సమస్యలు బయల్పడకపోయినా, భవిష్యత్తులో కీళ్ల నొప్పులు, మధుమేహం, అధిక రక్తపోటు, యుక్తవయసులోనే గుండెపోటు, తిన్న వెంటనే వాంతి తెచ్చుకునే 'బులీమియా' లాంటి మానసిక సమస్యలు చిన్న వయసు నుంచే మొదలవుతాయి. కొన్ని రకాల హార్మోన్ల సమస్యలున్నప్పుడు కూడా పిల్లలు ఊబకాయుల్లా మారిపోతారు. పిల్లలు ఎత్తు పెరగకుండా, బరువు పెరుగుతుంటే, హార్మోన్ అసమతౌల్యంగా భావించి ఎండోక్రైనాలజిస్ట్ చేత పరీక్షలు చేయించాలి. పిల్లలకు రోజుకు గంట వ్యాయామం తప్పనిసరి. పరుగు, సైకిల్ తొక్కడం, ఈత, బ్యాడ్మింటన్... ఇలా నచ్చిన వ్యాయామం ఎంచుకునే స్వేచ్ఛ పిల్లలకు ఇవ్వాలి. పిల్లలు టీనేజీకి చేరుకుని, ఎత్తు పెరగడం ఆగిపోయిన తర్వాతే బరువులెత్తే వ్యాయామాలు చేయాలి. లేదంటే ఎత్తు పెరగడం ఆగిపోతుంది.

డాక్టర్ శివరంజని సంతోష్
సీనియర్ కన్సల్టెంట్, పీడియాట్రిక్స్, మాగ్నా సెంటర్స్, హైదరాబాద్.



పోషణ

మహిళలు - పోషకాలు!

మహిళలకు కొన్ని పోషకాలు అత్యవసరం. వీటి లోపం ఏర్పడితే కీలకమైన జీవక్రియలు అదుపు తప్పుతాయి. కాబట్టి పోషకాలు, వాటి అవసరాల గురించి అవగాహన ఏర్పరుచుకోవాలి.

- **ఇనుము:**
  ఇనుము శక్తినిస్తుంది. ఆక్సిజన్ శరీరంలో సక్రమంగా ప్రసరించడానికి కూడా ఇనుము అవసరమే! వ్యాధినిరోధకశక్తి, కండరాల పనితీరు మెరుగ్గా ఉండాలన్నా తగుమాత్రం ఇనుము తీసుకోవడం తప్పనిసరి.
- **బి12:**
  మెదడు, నాడీవ్యవస్థ, రక్తకణాల పనితీరుకు బి12 సరిపడా ఉండాలి. శరీరం హుషారుగా ఉండాలంటే బి12 తగు ప్రమాణాల్లో శరీరానికి అందాలి.



- **బయోటిన్:**
  చర్మం, వెంట్రుకలు, గోళ్లు ఆరోగ్యంగా ఉండాలంటే తగినంత బయోటిన్ అందేలా చూసుకోవాలి. నాడీ, జీర్ణ, గుండె సంబంధ జీవక్రియలు సక్రమంగా జరగాలన్నా ఈ పోషకం అందాలి.
- **క్యాల్షియం:**
  బలమైన ఎముకల కోసం క్యాల్షియం అవసరం. గుండె, కండరాలు, నాడులు చురుగ్గా పని చేయాలన్నా క్యాల్షియం సరిపడా తీసుకోవాలి.
- **మెగ్నీషియం:**
  నెలసరి నొప్పుల నుంచి ఉపశమనం దొరకాలన్నా, నెలసరి సమస్యలు తొలగాలన్నా, నీరసం, ఒళ్లు నొప్పులు వదలాలన్నా మెగ్నీషియం సమృద్ధిగా తీసుకోవాలి.

బియ్యం దొంగల భరతం పడదాం!

(మొదటి పేజీ తరువాయి)

నిర్ణయాలు తీసుకున్నారు. కాకినాడ పోర్టు నుంచి అక్రమ రేషన్ బియ్యం ఎగుమతుల వెనుక ఉన్న కీలక వ్యక్తులను గుర్తించి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. బియ్యం స్మగ్లింగ్‌తో అక్రమంగా ఆర్జించిన ఆస్తులను కూడా స్వాధీనం చేసుకునే దిశగా దృష్టిసారించింది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మధ్య జరిగిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు సమాచారం. సోమవారం మధ్యాహ్నం చంద్రబాబు నివాసానికి వచ్చిన పవన్ ఆయనతో గంటన్నర పాటు సమావేశమయ్యారు. అక్కడే మధ్యాహ్న భోజనం చేశారు. ఈ సమావేశంలో కాకినాడ పోర్టు నుంచి అక్రమంగా జరుగుతున్న రేషన్ బియ్యం ఎగుమతుల అంశం ప్రధానంగా చర్చకు వచ్చినట్లు సమాచారం. రాష్ట్రంలో రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం నిరోధించడానికి తీసుకోవాల్సిన చర్యలపై పర్యవేక్షణకు ప్రత్యేకంగా ఒక మంత్రివర్గ ఉప సంఘాన్ని నియమించాలని ఈ సమావేశంలో నిర్ణయం తీసుకొన్నారు. రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులు ఇప్పుడు రాష్ట్రంలోని గంగవరం, కృష్ణపట్నం వంటి పోర్టులకు మారుతున్నట్లు వార్తలు వస్తుండటంతో అక్కడ కూడా తనిఖీలు పెంచాలని నిర్ణయించారు. కాకినాడ పోర్టును ఇకపై రాష్ట్ర పోలీసుల పరిధిలోకి తేవాలని, అక్కడ ప్రత్యేకంగా ఒక పోర్టు పోలీస్ స్టేషన్ నెలకొల్పాలని తీర్మానించారు.

సీఎం చేతికి చిట్టా...

పవన్ కల్యాణ్‌తో భేటీ అనంతరం చంద్రబాబు సీఎస్ నీరభ్ కుమార్, డీజీపీ ద్వారకా తిరుమలరావు, ఇంటెలిజెన్స్ అధిపతి మహేశ్‌చంద్ర లడ్హాతో ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. పేద ప్రజల ఆకలి తీర్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉచితంగా అందజేస్తున్న రేషన్ బియ్యం అక్రమ ఎగుమతులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఆపాల్సిందేనని ఆదేశించారు. కాకినాడ పోర్టు నుంచి లక్షలాది టన్నుల రేషన్ బియ్యాన్ని ఆఫ్రికా దేశాలకు అక్రమంగా రవాణా చేస్తూ, వేలకోట్లు దోచుకుంటున్న మాఫియా సంగతి తేల్చేందుకు సీనియర్ ఐపీఎస్ నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలన్నారు. సమర్థవంతమైన ఐపీఎస్ అధికారిని పోర్టు సీఈవోగా నియమిస్తే ఫలితం ఉంటుందని అభిప్రాయపడినట్లు తెలిసింది. ఐదేళ్లుగా స్మగ్లింగ్ చేసిన వారి జాబితాతో పాటు జిల్లాలవారీగా ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న నేతలు, ప్రజాప్రతినిధులు, అధికారుల వివరాలివ్వాలని సీఎం సూచించారు. ఏపీ పోలీసుశాఖలో అంతర్భాగమైన మెరైన్ పోలీసు విభాగాన్ని మరింత బలోపేతం చేసి, కేంద్ర ప్రభుత్వ పరిధిలోని కోస్టుగార్డు విభాగంతో సమన్వయం చేస్తే భవిష్యత్తులో ఎలాంటి భద్రత సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవచ్చన్నారు. ఈ అంశంపై ఒక నివేదిక సిద్ధం చేసి కేంద్ర హోం శాఖకు పంపాలని సూచించారు. ఇప్పటి వరకూ సేకరించిన సమాచారాన్ని, ఎమ్మెల్యేల పాత్ర, అధికారుల అవినీతి, మాఫియా కింగ్ పిన్‌ల వివరాలను ఈ సందర్భంగా డీజీపీ వెల్లడించారు. నిఘా అధిపతి త్వరలో నివేదిక అందజేస్తారని చెప్పినట్లు తెలిసింది.

వ్యవస్థీకృత నేరంగా...

రేషన్ బియ్యం అక్రమ రవాణా నేపథ్యంలో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌లతో కూడిన మంత్రివర్గ ఉపసంఘం సోమవారం రాష్ట్ర సచివాలయంలో భేటీ అయ్యింది. కాకినాడ పోర్టులో భద్రతా వ్యవస్థను బలోపేతం చేయాలని, ఇందుకోసం చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్‌ను నియమించాలని నిర్ణయించారు. రేషన్ బియ్యం అక్రమ రవాణాను వ్యవస్థీకృత నేరంగా పరిగణించాలని, ఇక మీదట అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాకినాడ పోర్టు, పరిసర ప్రాంతాల్లో రవాణా కార్యకలాపాలపై నిఘాను మరింత కట్టుదిట్టం చేయాలని అధికారులను ఆదేశించారు. కాకినాడ యాంకరేజ్ పోర్టులో ఉన్న 5 వేర్‌హౌసుల్లో సార్టెక్స్ మిషన్లను ఎలా ఏర్పాటు చేశారని మారిటైం బోర్డు అధికారులు, కాకినాడ పోర్టు అధికారులను మంత్రులు ప్రశ్నించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ డీజీ, శాంతిభద్రతల ఐజీ, సివిల్ సప్లయిస్ కమిషనర్, ఎక్స్ అఫిషియో సెక్రటరీ, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఎండీ, మారిటైం బోర్డు సీఈవో, కస్టమ్స్ అధికారి, కాకినాడ పోర్టు అధికారులు, రవాణా శాఖ అధికారులు పాల్గొన్నారు.

నౌక స్వాధీనానికి కసరత్తు

కాకినాడ పోర్టు నుంచి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న స్టెల్లా నౌకను సీజ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాలుగా ప్రయత్నాలు చేస్తోంది. చట్టపరంగా నౌకను స్వాధీనం చేసుకునే మార్గాలను అన్వేషిస్తోంది. స్మగ్లింగ్ కారణంతో కస్టమ్స్ అధికారులు నౌకను సీజ్ చేసే అధికారం ఉంది. కానీ రేషన్ బియ్యం స్మగ్లింగ్ పరిధిలోకి రాని నేపథ్యంలో కస్టమ్స్ అధికారుల నుంచి సహకారం కొరవడింది. దీంతో అడ్మిరాలిటీ కోర్టులో రాష్ట్ర ప్రభుత్వమే పౌర సరఫరాల శాఖ ద్వారా కేసు వేసి సీజ్‌కు ప్రయత్నించవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ అడిషనల్ అడ్వకేట్ జనరల్ సోమవారం రంగంలోకి దిగారు. పౌర సరఫరాలు, పోర్టు అధికారులతో చర్చించారు.

15 రోజుల్లో నామినేటెడ్ నాలుగో జాబితా

రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల భర్తీకి సంబంధించి నాలుగో జాబితా మరో పదిహేను రోజుల్లో విడుదలయ్యే అవకాశం ఉంది. చంద్రబాబు, పవన్ కల్యాణ్ మధ్య భేటీ సందర్భంగా దీనిపై చర్చ జరిగినట్లు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల సమయంలో టికెట్ రాని కొందరు ఆశావహులకు కూటమి పార్టీలు నామినేటెడ్ పదవులపై హామీలు ఇచ్చాయి. వారికి ఆ మేరకు చోటు కల్పించడంపై ఈ ఇద్దరు నేతలు చర్చించారు. రాష్ట్రంలో అభివృద్ధి కార్యక్రమాల అమలు, పనుల పురోగతిపై కూడా వారు చర్చించారు. రాజధాని అమరావతిలో ఈ నెల 15 తేదీ నుంచి పనులు ప్రారంభించబోతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఇటీవల తాను ఢిల్లీలో ప్రధానిని, వివిధ శాఖల కేంద్ర మంత్రులను కలిసి చర్చించిన విషయాలను పవన్ ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి సోదరుడు నారా రామ్మూర్తి నాయుడు ఇటీవల మరణించడంపై పవన్ విచారం వ్యక్తం చేశారు.

కాకినాడ ఎస్పీ తీరుపై చర్చ

కాకినాడ ఎస్పీ విక్రాంత్ పాటిల్‌ను బదిలీ చేయాలని పవన్ సీఎం వద్ద పట్టుబట్టినట్లు రాజకీయ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. తాను నౌక తనిఖీకి వస్తున్నట్లు తెలియగానే ఎస్పీ సెలవుపై వెళ్లారని పవన్ ఆరోపించిన విషయం తెలిసిందే. రేషన్ బియ్యం మాఫియాను కట్టడి చేయడానికి ఎస్పీ ప్రయత్నించలేదని, పైగా ఎన్నికల కోడ్ పేరుతో తనను నౌక వద్దకు వెళ్లకుండా అడ్డుకునే ప్రయత్నం చేశారని, కలెక్టర్ వచ్చినా ఎస్పీ రాలేదని ముఖ్యమంత్రికి ఆయన చెప్పినట్లు సమాచారం. కాకినాడ ఎస్పీ బదిలీపై ఆలోచించి చెబుతానని సీఎం అన్నట్లు ప్రచారం జరుగుతోంది. కాగా, పవన్ సీఎంను కలవడానికి ముందు కాకినాడ ఎస్పీ తన వాదనను సీఎంవోకు వినిపించినట్లు తెలిసింది. తాను వారం నుంచి సెలవులో ఉన్నానని ఆయన చెప్పారు.



దొంగలు దొరికేదెలా?

రేషన్ స్మగ్లింగ్ ముఠా పని పట్టేదెలా? కూటమి సర్కారుకు బిగ్ చాలెంజ్

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

కాకినాడ కేంద్రంగా జగన్ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల రేషన్‌బియ్యం ఎగుమతి దందాను, దీనివెనుక ఉన్న భారీ మాఫియా నెట్‌వర్క్‌ను ఛేదించడం ఎలా అనేది కూటమి ప్రభుత్వానికి సవాల్‌గా మారింది. గత ప్రభుత్వ పెద్దల సహకారంతో కాకినాడలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి, ఆయన అనుచరులు లక్షల టన్నుల రేషన్ బియ్యాన్ని ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి సేకరించారు. ఆ బియ్యాన్ని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని పలు రహస్య మిల్లుల్లో సార్టెక్స్ యంత్రాల ద్వారా పాలిష్ చేసి విదేశాలకు విక్రయించి రూ.వందల కోట్లకు పడగలెత్తారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం వచ్చిన నేపథ్యంలో రేషన్ బియ్యం ఎగుమతిని అడ్డుకోవడం ఒక ఎత్తయితే, రేషన్ బియ్యాన్ని తరలించిన అక్రమార్కులను పట్టుకోవడం మరో పెద్ద సవాలుగా మారింది. ఎందుకంటే సరుకు విదేశాలకు వెళ్లినప్పుడు అందులో రేషన్ బియ్యం పాళ్లు ఎంత అనేది గుర్తించడం చాలాకష్టం. ఒకరకంగా చెప్పాలంటే వైసీపీ చివరి మూడేళ్లపాలనలో కాకినాడ పోర్టు నుంచి రూ.48 వేల కోట్ల విలువైన 1.31 కోట్ల టన్నుల బియ్యం ఎగుమతి అయింది. దీనిలో సగానికిపైగా రేషన్ బియ్యమే ఉందని అంచనా. దీన్ని ఎగుమతి చేసిన మాఫియాను.. ఎలా బాధ్యులు చేయాలనేదానిపై ఇప్పటికీ అధికారులకు అంతుచిక్కడం లేదు. పోర్టు ద్వారా బియ్యం ఎగుమతి చేసిన వారి లెక్కలు తీసి ఆ బియ్యం ఎక్కడెక్కడి నుంచి, ఎవరెవరి నుంచి కొనుగోలు చేశారో లోతుగా తవ్వితే ఆధారాలు లభించే అవకాశం ఉంది. ఈ క్రమంలో గోదాముల స్టాక్ రిజిస్టర్‌లను కూడా పరిశీలించాలి. సదరు ఎగుమతి చేసిన బియ్యానికి బిల్లులు చూపించకపోతే పూర్తిగా రేషన్ కిందే లెక్కించాలి. అదేవిధంగా అటు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మిల్లులు, సార్టెక్స్ మిల్లుల విద్యుత్ బిల్లులను కూడా పరిశీలించాలి. తద్వారా ప్రభుత్వం ఇచ్చిన సీఎంఆర్ కంటే ఖర్చయ్యే విద్యుత్ వాడకం రేషన్ కోసమే వాడినట్లుగా పరిగణించాలి. ఒకరకంగా ఇది ప్రభుత్వానికి పెద్ద ఇబ్బందే. అయినా.. ముందుకు సాగితే అక్రమార్కులను పట్టుకోవచ్చని పారిశ్రామికవేత్తలు చెబుతున్నారు. దీనిపై మంగళవారం జరిగే కేబినెట్ సమావేశంలో లోతుగా చర్చ జరగాల్సి ఉంది.

అంత సులువేం కాదు!

కాకినాడ కేంద్రంగా రేషన్‌బియ్యం విదేశాలకు కొన్నేళ్లుగా యథేచ్ఛగా తరలిపోతోంది. ఇక్కడున్న యాంకరేజ్, డీప్‌వాటర్ పోర్టుల నుంచి వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రేషన్ బియ్యం రూపు మార్చుకుని సముద్రాలు దాటేస్తోంది. ముఖ్యంగా వైసీపీ ప్రభుత్వం అండతో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి కుటుంబం, ఆయన అనుచరులు లక్షల టన్నుల బియ్యాన్ని ఓడల్లో తరలించేశారు. రేషన్ బియ్యాన్ని వైసీపీ అండదండలున్న 16 కంపెనీల వ్యాపారులు రాష్ట్రవ్యాప్తంగా అనేక ప్రాంతాల నుంచి కిలో రూ.10కి కొనుగోలు చేశారు. వీటిని ద్వారంపూడి కుటుంబం, ఆయన మనుషులు వ్యాపారుల నుంచి కొనుగోలు చేసి మిల్లుల్లో పాలిష్ చేసి కిలో రూ.70 చొప్పున విదేశాలకు ఎగుమతి చేశారు. ఈ క్రమంలో రూ.కోట్లకు కోట్లు సంపాయించారు. పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అధికారికంగా చెప్పిన లెక్కల ప్రకారం వైసీపీ చివరి మూడేళ్ల పాలనలో పోర్టు నుంచి రూ.48 వేల కోట్ల విలువైన 1.30 కోట్ల టన్నుల బియ్యం విదేశాలకు తరలిపోయింది. దీనిలో అసలు రేషన్ బియ్యం ఎన్ని లక్షల టన్నులు అనేది తేలితేనే అక్రమార్కులను పట్టుకునేందుకు అవకాశం ఉంటుంది. అయితే, ఇప్పుడు సరుకే లేనప్పుడు తరలిపోయిన బియ్యంలో రేషన్ బియ్యం ఎంతనేది గుర్తించడం కష్టం. అలాగని ఎగుమతి అయిన బియ్యం అంతా రేషన్ బియ్యం అని చెప్పడానికి లేదు. ఎందుకంటే కాకినాడ పోర్టు నుంచి ద్వారంపూడి, ఆయన బినామీలతోపాటు కొన్ని పెద్ద కంపెనీలు ఉప్పుడు బియ్యం, హస్క్ రైస్ లక్షల టన్నుల్లో ఎగుమతి చేశారు. ఈ నేపథ్యంలో అసలు రేషన్ బియ్యం ఎంత తరలిపోయింది? అనేది నిర్ధారించడం సర్కారుకు కష్టమేనని వ్యవసాయ రంగ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత అంచనాల ప్రకారం ఎగుమతి అయిన బియ్యంలో దాదాపు 58 లక్షల టన్నుల వరకు రేషన్ బియ్యం ఉంటుంది. ఈ బియ్యాన్ని ఎగుమతి చేసిన మాఫియాను గుర్తించాలి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రేషన్ బియ్యం విదేశాలకు ఎగుమతి చేయడంపై ఉక్కుపాదం మోపింది. దీంతో అక్రమార్కులు తమ వ్యాపారం మానకపోయినా పలు రకాల కొత్త మార్గాల్లో బియ్యాన్ని విదేశాలకు తరలిస్తున్నారు. దీంతో తాము రేషన్ బియ్యం ఎగుమతి చేయలేదని ఎవరికివారు ధృవీకరించుకుని తప్పించుకునే అవకాశముంది. ఈ నేపథ్యంలో పోర్టు ద్వారా ఇన్నేళ్లలో బియ్యం అకస్మాత్తుగా ఎగుమతి పెంచిన కంపెనీల వివరాలను తీసుకుని లెక్కలు రాబట్టాల్సి ఉంది. వాస్తవానికి రేషన్ బియ్యం పాలిష్ చేసి ఎగుమతి చేసిన వ్యాపారులు నకిలీ బిల్లుల ద్వారా లెక్కలు తయారు చేస్తారు. ఈ నేపథ్యంలో ఆ బిల్లుల చిరునామా ఆధారంగా తీగ లాగితే నకిలీలను గుర్తించవచ్చు.

రూటు మార్చితేనే చెక్..

కూటమి ప్రభుత్వం మారిన తర్వాత రేషన్ ఎగుమతిని అడ్డుకోవడానికి అన్నిరకాల ప్రయత్నాలు చేస్తోంది. యాంకరేజ్ పోర్టు వద్ద రెండు చెక్‌పోస్టులను ఏర్పాటు చేసి రోజుకు 1,100 లారీలను తనిఖీలు చేస్తోంది. ప్రతిలారీలో బియ్యాన్ని శాంపిళ్లు తీసి అక్కడికక్కడే నిర్ధారిస్తున్నారు. దీనివల్ల లోడింగ్ ఆలస్యమవుతోందని ఇటీవల ఎగుమతిదారులు ఆందోళనకు దిగారు. దీనివల్ల లారీ కిరాయిలు పెరిగిపోతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పోర్టు నుంచి ఎగుమతులు ఆపేస్తామని హెచ్చరించారు. దీంతో చెక్‌పోస్టుల్లో రాత్రిపూట తనిఖీలు నిలిపివేశారు. ఇదే అదనుగా ఇటీవల రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేస్తుండగా నౌక దొరికిపోయింది. దీంతో మళ్లీ రాత్రి తనిఖీలు మొదలుపెట్టారు. అయితే ఇప్పటికీ కాకినాడ, చుట్టుపక్కనున్న అనేక గోదాముల్లో అసలు నిఘాలేదు.

ఎన్నో అక్రమాలు

1 ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో భారీ గోదాములు వందల్లో ఉన్నాయి. వీటిలో ద్వారంపూడి కుటుంబీకులు, అనుచరులవే పదుల్లో ఉన్నాయి. వీటిలోనే రేషన్ బియ్యాన్ని నిల్వ చేశారు. దీనికి సంబంధించి స్టాక్ రిజిస్టర్ వివరాలేవీ ఎక్కడా లేవు. దీంతో అసలు ఈ గోదాములకు సరుకు ఎలా? ఎక్కడి నుంచి? ఏ లారీలో వచ్చిందో కూడా కనీస సమాచారం దొరకదు. దీంతో ఈపాయింట్‌లో అక్రమార్కులు దొరకడం కష్టం.

1 గోదాముల్లో రేషన్ బియ్యాన్ని మిల్లులకు తరలించి అక్కడ సార్టెక్స్ యంత్రాల ద్వారా పాలిష్ చేసి ప్యాకింగ్ చేస్తారు. వాస్తవానికి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో దాదాపు 350 వరకు రైస్‌మిల్లులున్నాయి. వీటిలో సార్టెక్స్ యంత్రాలున్న మిల్లుల్లో అనుమానిత లావాదేవీలను విద్యుత్ బిల్లుల ద్వారా గుర్తించొచ్చు.

1 ఒక్క కాకినాడ చుట్టుపక్కలే 90 వరకు సార్టెక్స్ మిల్లులు ఉన్నాయి. వీటికి ఏటా ఖరీఫ్, రబీ సీజన్లలో ప్రభుత్వం ఇచ్చే సీఎంఆర్ ధాన్యాన్ని ఆడించి వెనక్కు ఇస్తాయి. దీనికి అయిన విద్యుత్ వినియోగం లెక్కల్లో తేడా వస్తే కచ్చితంగా అక్కడ రేషన్‌బియ్యం పాలిషింగ్ అయినట్లే.

1 కాకినాడ చుట్టుపక్కల సార్టెక్స్ మిల్లులు ఉన్నప్పటికీ అధికారిక లెక్కల్లో అవి లేవు. దీంతో వీటిని గుర్తించి లెక్కలు రాబట్టడం కష్టతరమైన పనే. ఈ నెట్‌వర్క్‌లో ఎక్కడికక్కడ ఆధారాలు దొరకకుండా, దొరికే అవకాశం లేకుండా మాఫియా తమ సామ్రాజ్యాన్ని విస్తరించిదనే చెప్పాలి.

1 మంగళవారం జరిగే కేబినెట్‌లో ప్రధానంగా కాకినాడ పోర్టు నుంచి తరలిపోయిన రేషన్ బియ్యం మాఫియాపైనే చర్చ జరగనున్నందున దీన్నిఎలా ఛేదించాలనే అంశంపై లోతుగా చర్చించాలి.



విజయవాడ, విశాఖ మెట్రోరైల్

ప్రాజెక్టు డీపీఆర్‌కు ఆమోదం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టు డీపీఆర్ ఆమోదానికి రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. విజయవాడ మెట్రో ఫేజ్-1లో గన్నవరం నుంచి బస్టాండ్ వరకు, బస్టాండ్ నుంచి పెనమలూరు వరకు రూపొందించిన డీపీఆర్‌ను ఆమోదిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా విజయవాడలో మెట్రోరైల్ ప్రాజెక్టును 2 దశల్లో నిర్మించాలని యోచిస్తున్నారు. ఫేజ్-1లో రూ.11,009 కోట్లతో 38.40 కిలోమీటర్ల మేర 1ఏ, 1బీ కారిడార్లను, రూ.1,152 కోట్లతో భూసేకరణను రాష్ట్ర ప్రభుత్వ వ్యయంతో చేపట్టనున్నారు. ఫేజ్-2లో మూడో కారిడార్‌ను 27.75 కి.మీ మేర చేపట్టనున్నారు. అదేవిధంగా విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టును కూడా 2 దశల్లో చేపట్టాలని నిర్ణయించారు. ఫేజ్-1లో రూ.11,498 కోట్లతో 46.23 కి.మీ మేర 3 కారిడార్లు నిర్మిస్తారు. మొదటి దశలో విశాఖపట్నం మెట్రోరైల్ ప్రాజెక్టును అమలు చేసేందుకు ఆమోదం తెలుపుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది.

'ఏక్ భారత్..

శ్రేష్ఠ భారత్'తో ఐక్యత: గవర్నర్

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): 'ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్' కార్యక్రమం ద్వారా రాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం, మంచి ఐక్యత ఏర్పడుతుందని గవర్నర్ అబ్దుల్ నజీర్ అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజ్‌భవన్‌లో నాగాలాండ్, అసోం రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. అంతకు ముందు నాగాలాండ్ గవర్నర్ గణేశన్, అసోం గవర్నర్ లక్ష్మణ్‌ప్రసాద్ ఆచార్య వీడియో సందేశాలు ఇచ్చారు. ఆయా రాష్ట్రాల సంప్రదాయ నృత్యాలతో విద్యార్థులు అలరించారు.

280 సీఏఎస్ పోస్టుల

భర్తీకి నోటిఫికేషన్

» 13 వరకు ఆన్‌లైన్ దరఖాస్తులు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, డైరెక్టర్ ఆఫ్ హెల్త్ పరిధిలోని మరికొన్ని సంస్థల్లో 280 మంది సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం (ఏపీ మెడికల్ సర్వీసెస్ అండ్ రిక్రూట్‌మెంట్ బోర్డు)సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ పోస్టుల్లో బ్యాక్‌లాగ్‌తో పాటు రెగ్యులర్ పోస్టులు ఉన్నాయి. అర్హతగల వైద్యులు డిసెంబరు 4 నుంచి 13 వరకు 'ఏపీఎంఎస్‌ఆర్‌బీ.ఏపీ.జీవోవీ' వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

జగన్‌పై సుప్రీంలో మళ్లీ పిల్

» మాజీ సీజేఐ జస్టిస్ రమణపై గతంలో వైసీపీ అధినేత ఆరోపణలు

» మాజీ సీఎంపై చర్యలు కోరుతూ వ్యాజ్యం

» గతంలో వేసిన పిల్ స్థానంలో మరొకటి

» పాత విషయాలు ఇప్పుడెందుకన్న ధర్మాసనం

» విచారణ జనవరికి వాయిదా

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌పై సుప్రీం కోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణపై అప్పటి సీఎం స్థానంలో ఉన్న జగన్ పలు ఆరోపణలు చేశారని, అవన్నీ నిరాధారమని పిటిషనర్ పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జగన్‌పై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ పిటిషన్‌పై న్యాయమూర్తులు జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం స్పందిస్తూ.. న్యాయ వ్యవస్థ పట్ల సున్నితమైన వైఖరిని అవలంబించాలని అభిప్రాయపడింది. "పాత విషయాలన్నీ అనవసరంగా ఇప్పుడు ఎందుకు లేవనెత్తుతున్నారు? న్యాయ వ్యవస్థ పట్లయినా కనీసం మీరు సున్నితంగా ఉండాలి" అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. అయితే, తాము పాత విషయాలేమీ తవ్వే ప్రయత్నం చేయడం లేదని, 2020 అక్టోబర్‌లోనే ఈ మేరకు పిటిషన్ దాఖలు చేశామని పిటిషనర్ సునీల్ కుమార్ సింగ్ తరఫున న్యాయవాది తెలిపారు. దీంతో ధర్మాసనం ఈ వ్యాజ్యాన్ని విచారణకు స్వీకరించి.. జనవరికి వాయిదా వేసింది.

అసలేం జరిగింది?

2020, అక్టోబరు 6న సీఎం జగన్ అప్పటి సుప్రీం కోర్టు సిట్టింగ్ న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణపై నిరాధారమైన ఆరోపణలు చేశారని, అలా చేయడం సరైందికాదని సునీల్‌కుమార్ సింగ్ సుప్రీంకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేశారు. జస్టిస్ ఎన్వీ రమణపై ఆరోపణలు గుప్పిస్తూ అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బాబ్డేకు జగన్ లేఖ రాయడమే కాకుండా అక్టోబరు 11న జగన్‌కు ప్రధాన సలహాదారుగా ఉన్న అజయ్ కల్లం ఈ లేఖను మీడియాకు విడుదల చేశారని వివరించారు. టీడీపీ అధినేత చంద్రబాబు ప్రయోజనాలను కాపాడేందుకు ఏపీ హైకోర్టు సిట్టింగ్ న్యాయమూర్తులను జస్టిస్ ఎన్వీ రమణ ప్రభావితం చేశారని, కొంతమంది న్యాయమూర్తుల రోస్టర్‌ను కూడా మార్పించారని జగన్ తన లేఖలో వివరించినట్టు తెలిపారు. జస్టిస్ ఎన్వీ రమణ.. చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడని, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన తన ప్రభుత్వాన్ని కూల్చేందుకు ఏపీ హైకోర్టును ఉపయోగించుకుంటున్నారని కూడా తన లేఖలో జగన్ ఆరోపించారని పిటిషనర్ ప్రస్తావించారు. అమరావతిని రాజధానిగా ప్రకటించక ముందే జస్టిస్ రమణ కుమార్తెలు అక్కడ భూములు కొన్నారని కూడా పేర్కొన్నారన్నారు. అయితే, జస్టిస్ ఎన్వీ రమణపై జగన్ చేసిన ఆరోపణలు నిరాధారమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బాబ్డే నియమించిన అంతర్గత కమిటీ తేల్చిందన్నారు. దీంతో జస్టిస్ ఎన్వీ రమణను 48వ ప్రధాన న్యాయమూర్తిగా నియమించాలని సీజేఐ జస్టిస్ బాబ్డే కేంద్రానికి సిఫారసు చేశారని తెలిపారు. జస్టిస్ రమణపై జగన్ చేసిన ఆరోపణలు సాధారణ ప్రజానీకాన్ని దిగ్భ్రాంతికి గురిచేశాయని, దేశవ్యాప్తంగా అడ్వకేట్ సంఘాలతోపాటు అనేక మంది న్యాయ నిపుణులు జగన్ వైఖరిని ఖండించారని పిటిషనర్ తన పిల్‌లో వివరించారు. ఈ నేపథ్యంలోనే తాజాగా పిల్ దాఖలు చేసినట్టు సుప్రీంకోర్టుకు తెలిపారు.

మహాకుంభమేళా జిల్లా!



» యోగి సర్కారు అసాధారణ నిర్ణయం

లఖ్‌నవూ, డిసెంబరు 2: పుష్కరానికి ఒక పర్యాయం జరిగే మహాకుంభమేళా మహోత్సవం కోసం ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అసాధారణ ఏర్పాట్లు చేస్తోంది. మేళా నిర్వహణ కోసం ప్రత్యేకంగా ఒక కొత్త జిల్లాను ఏర్పాట్లు చేస్తూ, తాజాగా కీలక నిర్ణయం తీసుకుంది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ జిల్లాలో కుంభమేళా నిర్వహించడం సంప్రదాయంగా వస్తున్న ఆనవాయితీ. మేళా జరిగే ప్రాంతాన్ని ఇప్పుడు ఈ జిల్లా నుంచి వేరు చేసి.. ప్రత్యేక సరిహద్దులతో కొత్త జిల్లాను నెలకొల్పారు. దీనికి మహాకుంభమేళా జిల్లాగా నామకరణం చేసింది. మేళాను ఉత్సవ హేలగా బ్రహ్మాండంగా నిర్వహించేందుకు ఇప్పటికే సన్నాహాలు మొదలుపెట్టారు. వచ్చే ఏడాది జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26 వరకు ఈ కార్యక్రమం జరుగుతుంది. లక్షలాది మంది పాల్గొనే ఈ కార్యక్రమ ఏర్పాట్లు, నిర్వహణ, వసతులు, భక్తుల రక్షణకు చర్యలు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్టు యోగి ఆదిత్యానాథ్ ప్రభుత్వం వివరించింది. దీనివల్ల ప్రత్యేక అధికార యంత్రాంగం అందుబాటులోకి వచ్చి కుంభమేళా నిర్వహణ సులభతరం అవుతుందని భావిస్తోంది. ప్రయాగ్‌రాజ్ మేళా అథారిటీ, ప్రయాగ్‌రాజ్ యాక్ట్, 2017లోని సెక్షన్ 2ను అనుసరించి.. కొత్త జిల్లా ఉనికిలోకి వచ్చినట్టు ఆ జిల్లా కలెక్టర్ రవీంద్రకుమార్ మండడ్ తెలిపారు. వచ్చేఏడాది జరిగే మహాకుంభమేళ నిర్వహణకు దీనిని ఏర్పాటుచేసినట్టు పేర్కొన్నారు.

బడులపై క్షేత్రస్థాయి అధ్యయనం

» రెండు నెలల్లో జీవో 117కు ప్రత్యామ్నాయం

» నెల రోజుల్లో ఉపాధ్యాయ బదిలీల చట్టం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వం అమల్లోకి తెచ్చిన వివాదాస్పద జీవో 117కు ప్రత్యామ్నాయంగా వేరొక జీవోను తీసుకొచ్చే ప్రక్రియను కూటమి ప్రభుత్వం వేగవంతం చేసింది. ఆ జీవోను రద్దుచేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకోగా, దాని స్థానంలో మరో జీవోపై అధ్యయనం చేయనుంది. దీనికి పాఠశాల విద్యాశాఖ వారం రోజుల్లో ఉత్తర్వులు ఇవ్వనుంది. వాటి ప్రకారం ప్రతి గ్రామానికీ వెళ్లి అక్కడ పాఠశాలలో ఎంత మంది విద్యార్థులున్నారు, ఎంతమంది టీచర్లు అవసరం అనేది అంచనా వేస్తారు. అలా రాష్ట్రవ్యాప్తంగా అధ్యయనం చేసి 2 నెలల్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పిస్తారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి కొత్త జీవో అమల్లోకి వస్తుంది. అలాగే ఉపాధ్యాయ బదిలీలకు చట్టం తేవాలని ఇప్పటికే ప్రభుత్వం నిర్ణయించింది. దానిని కూడా నెల రోజుల్లో కొలిక్కి తీసుకురానుంది. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో టీచర్ల బదిలీల చట్టాలను అధికారులు అధ్యయనం చేశారు. టీచర్ల నుంచి కూడా అభిప్రాయాలు స్వీకరించి చట్టం తేవాలని యోచిస్తోంది. చట్టం తెస్తే ఇక బదిలీలకు అడ్డంకులు ఏర్పడవు. ప్రస్తుతం బదిలీల షెడ్యూలు జారీచేసిన వెంటనే కొందరు టీచర్లు కోర్టులకు వెళ్లడంతో ప్రక్రియ ఆగిపోతోంది.

'పది' పరీక్షలకు 100 రోజుల ప్రణాళిక

» విద్యార్థులపై వ్యక్తిగతంగా దృష్టి

పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్న నేపథ్యం లో పాఠశాల విద్యాశాఖ 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక ప్రకటించింది. రోజుల వారీగా ఇకనుంచి వంద రోజుల పాటు పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు ఎలాంటి బోధన చేయాలి, పరీక్షలకు ఎలా సన్నద్ధం చేయాలి అనే అంశాలను ఈ ప్రణాళికలో పేర్కొంది. దీనిపై పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ వి.విజయ రామరాజు సోమవారం ఉత్తర్వులు జారీచేశారు. 100 రోజుల ప్రణాళిక ప్రకారం విద్యార్థులపై టీచర్లు వ్యక్తిగతంగా దృష్టిసారిస్తారు.

2026 మార్చికి పోలవరం మొదటి దశ పూర్తి

» రాజ్యసభలో కేంద్ర మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు మొదటి దశ 2026 మార్చి నాటికి పూర్తవుతుందని అంచనా వేస్తున్నట్లు కేంద్ర జలశక్తి సహాయ మంత్రి రాజ్‌భూషణ్ చౌదరి తెలిపారు. సోమవారం, రాజ్యసభలో బీజేపీ ఎంపీ సస్మిత్ పాత్ర అడిగిన ప్రశ్నకు సమాధానమిస్తూ.. 2014 ఏప్రిల్ 1 నుంచి నీటి పారుదల పనులకు సంబంధించి నూటికి నూరు శాతం నిధులను తిరిగి చెల్లించాలని కేంద్రం నిర్ణయించినట్లు చెప్పారు. 2023-24లో రూ.274.93 కోట్ల నిధులు విడుదల చేసినట్లు తెలిపారు. నిర్మాణ సంస్థను మార్చడం, భూసేకరణ, కొవిడ్ కారణాల వల్ల ప్రాజెక్టు ఆలస్యమైందన్నారు.

అమృత్ నిధులు ఇప్పటికే విడుదల చేశాం: కేంద్రం

అమృత్ పథకం కింద రూ.2890.17 కోట్ల వ్యయంతో ప్రాజెక్టులు చేపట్టాలని రాష్ట్ర వార్షిక ప్రణాళికలో నిర్ణయించారని, ఇందులో కేంద్రం వాటా కింద రూ.1056.62 కోట్లకు గాను ఇప్పటికే రూ.1049.89 కోట్లు విడుదల చేసినట్లు కేంద్రం తెలిపింది. వైసీపీ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అడిగిన ప్రశ్నకు కేంద్ర మంత్రి టోకన్ సాహు ఈ వివరాలు వెల్లడించారు.

విద్యా సంస్థలకు 8,557 కోట్లు ఖర్చు చేశాం

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీలో మొత్తం 45,032 విద్యాసంస్థల్లో మౌలికసదుపాయాల కల్పనకు కేంద్రం రూ.7,480.21 కోట్లు కేటాయించగా, రాష్ట్రప్రభుత్వ నిధులతో కలిపి మొత్తం రూ.8,557.21 కోట్లు ఖర్చు చేసినట్లు కేంద్ర మంత్రి జయంత్ చౌదరి తెలిపారు. ఏపీలో జిల్లాల వారీగా విద్యార్థుల సమగ్ర అభివృద్ధి కోసం విద్యాసంస్థల మౌలిక సదుపాయాలను అప్‌గ్రేడ్ చేయడానికి ముఖ్యంగా ఏలూరు జిల్లాలో కేంద్ర పథకాల ద్వారా కేటాయించిన, వినియోగించిన నిధుల వివరాలను ఎంపీ పుట్టా మహేష్ లోక్‌సభలో అడిగిన ఒక ప్రశ్నకు కేంద్ర మంత్రి సమాధానం ఇచ్చారు.

కంపెనీల్లో మహిళా డైరెక్టర్లు.. నిబంధన లేదు

» ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు ప్రశ్నకు కేంద్రం బదులు

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గత నెల 15 నాటికి రూ.100 కోట్ల మూలధనం అంతకంటే ఎక్కువ, లేదా రూ.300 కోట్లు అంతకంటే ఎక్కువ టర్నోవర్‌తో దేశవ్యాప్తంగా 1,708 లిస్టెడ్ కంపెనీలు, 3,383 అన్‌లిస్టెడ్ పబ్లిక్ కంపెనీలు ఉన్నాయని టీడీపీపీ నేత ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు అడిగిన ప్రశ్నకు కార్పొరేట్ వ్యవహారాల కేంద్ర సహాయ మంత్రి హర్ష మల్హోత్రా లిఖితపూర్వక సమాధానమిచ్చారు. దేశవ్యాప్తంగా ఉన్న కార్పొరేట్ బోర్డుల్లో లింగవైవిధ్యంపై కేంద్రం తీసుకుంటున్న చర్యలపై ప్రశ్నించగా.. నిర్దేశిత కంపెనీలకు కనీసం ఒక మహిళా డైరెక్టర్ కలిగి ఉండాలని తప్పనిసరి చేసే నిబంధనలేవీ లేవని కేంద్ర మంత్రి చెప్పారు.

గ్రామాల్లో ఎల్ఈడీ లైట్ల పునరుద్ధరణ

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఎల్ఈడీ లైట్ల పునరుద్ధరణకు పంచాయతీరాజ్ శాఖ చర్యలు ప్రారంభించింది. గత టీడీపీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన లైట్లను ఒప్పందం ప్రకారం ఈఈఎస్ఎల్ ఆధ్వర్యంలో తిరిగి నిర్వహణ చేపట్టేందుకు రోడ్‌మ్యాప్ రూపొందించనుంది. ఇందుకు ప్రభుత్వం పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణతేజ, ఆర్థిక శాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్, ట్రాన్స్‌కో జేఎండీ చేకూరి కీర్తిలతో త్రిసభ కమిటీని ఏర్పాటు చేసింది.

పేదల బియ్యం పోర్టులో ఉంది: జవహర్

'పేదల ఇంట్లో ఉండాల్సిన రేషన్ బియ్యం కాకినాడలో పోర్టులో కనిపిస్తోంది. రేషన్ బియ్యం స్మగ్లింగ్‌కు కాకినాడ పోర్టును జగన్ అండ్ కో అడ్డాగా మార్చారు' అని మాజీ మంత్రి జవహర్ సోమవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ఐదేళ్లలో జగన్ అండ్ కో నేతృత్వంలో రేషన్ మాఫియా ఆగడాలు ఎక్కువయ్యాయన్నారు. కాకినాడ పోర్టు ద్వారా రూ.వేల కోట్ల దందాలు నడిచాయన్నారు.

జగన్ హయాంలో గిరిజనులకు అన్యాయం: దారూనాయక్

'జగన్ హయాంలో ప్రభుత్వ విధానాలన్నీ నిర్వీర్యమైపోయాయి. గిరిజనులకు తీవ్ర అన్యాయం జరిగింది' అని టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ అధ్యక్షులు ఎం.దారూనాయక్ అన్నారు. సొంత ఆర్థిక ప్రయోజనాల కోసం గిరిజన చట్టాలను నిర్వీర్యం చేసిన గిరిజన ద్రోహి జగన్ అని దారూనాయక్ మండిపడ్డారు.

గుంటూరులో వైసీపీ నేత అరాచకం

- మహిళను బెదిరించి లొంగదీసుకున్న వైనం
- నగ్న ఫొటోలు, వీడియోలతో బెదిరింపు
- ప్రాణ భయంతో ఎస్పీని ఆశ్రయించిన బాధితురాలు

గుంటూరు, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): తమ పార్టీ అధికారంలో ఉందన్న ధీమాతో ఓ వైసీపీ నేత అరాచకానికి పాల్పడ్డాడు. ఓ దుకాణం నిర్వాహకురాలిని బెదిరించి లొంగదీసుకున్నాడు. ఆ క్రమంలో ఫొటోలు, వీడియోలు తీశాడు. వాటిని చూపించి రెండేళ్లుగా అత్యాచారం చేస్తున్నాడు. అక్కడితో ఆగకుండా ప్రతి రోజూ రూ.4,000 చొప్పున గత రెండేళ్లుగా వసూలు చేశాడు. తనకు అడ్డుగా ఉన్నాడని భావించి ఆమె భర్తపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. డబ్బులు ఇచ్చుకోలేని దుస్థితిలోకి జారిపోయిన ఆ మహిళపై భౌతిక దాడికి పాల్పడ్డాడు. దెబ్బలు చూసి ప్రశ్నించిన భర్తకు, బాధితురాలు అసలు విషయాన్ని చెప్పింది. దాంతో వారిద్దరూ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. అక్కడ పోలీసులు పట్టించుకోలేదు. ప్రాణభయంతో బాధితులు గుంటూరు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించారు. బాధితురాలు ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

దేవరకొండ దౌర్జన్యం తీరిది...

గుంటూరులోని ఓ కాలనీకి చెందిన మహిళ ఇంటికి సమీపంలో మెయిన్ రోడ్డు పక్కన తన భర్తతో కలిసి మరమరాల బట్టీ నిర్వహిస్తోంది. మరమరాలు కొనుగోలు నిమిత్తం గుంటూరు రూరల్ మండలం వెంగళాయపాలెం గ్రామానికి చెందిన వైసీపీ నేత దేవరకొండ నాగేశ్వరరావు రెండేళ్ల క్రితం ఈ దుకాణానికి వచ్చాడు. షాపు నిర్వాహకురాలిపై కన్నేశాడు. మాటలు కలిపేందుకు ప్రయత్నించాడు. ఆమె స్పందించలేదు. దీంతో దుకాణంలో వరుసగా మూడు దఫాలు దొంగతనం చేయించాడు. వైసీపీ నాయకులు అప్పిరెడ్డి, మద్దాలి గిరి తెలుసని, పోలీసులకు చెప్పి దొంగలను పట్టుకునేలా చేస్తానంటూ మాయమాటలు చెప్పాడు. ఫోన్ నంబరు తీసుకున్నాడు. పరిచయం పెంచుకొని లొంగదీసుకున్నాడు. ఆక్రమంలోనే ఆ మహిళ నగ్న ఫొటోలు, వీడియోలు తీశాడు. అవి దగ్గర పెట్టుకొని బ్లాక్‌మెయిల్‌కు దిగాడు. ప్రతి రోజూ రూ.4,000 చొప్పున ఇవ్వాలంటూ డిమాండ్ చేసి వసూలు చేశాడు. గత రెండేళ్లుగా బలవంతంగా శారీరక సంబంధం కొనసాగిస్తూ, డబ్బులు వసూలు చేశాడు. ఆమె భర్త తనకు అడ్డుగా ఉన్నాడని భావించి ఆయననూ అడ్డు తొలగించుకునేందుకు పథకం రూపొందించాడు. గత ఏడాది డిసెంబరు, ఈ ఏడాది ఏప్రిల్‌లో... రెండుసార్లు హత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ నేపథ్యంలో గత నెల 13న డబ్బులు ఇవ్వలేదన్న కోపంతో నాగేశ్వరరావు ఆ మహిళపై దాడి చేసి కొట్టాడు. దీంతో ఆమె ముఖంపై గాయాలయ్యాయి. వాటిని గమనించిన భర్త ఏం జరిగిందంటూ ప్రశ్నించాడు. దీంతో ఆమె వ్యవహారం మొత్తాన్నీ భర్తకు వివరించింది. విషయం తెలుసుకున్న నాగేశ్వరరావు మరోసారి ఆ మహిళ భర్తపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. దీంతో భార్యాభర్తలు ఇద్దరూ పోలీసులకు ఫిర్యాదు చేయాలని నిర్ణయించుకున్నారు. నవంబరు 23న నగరంపాలెం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీంతో నాగేశ్వరరావు రెచ్చిపోయి బెదిరింపులకు దిగాడు. భయంతో వణికిపోయిన ఆ కుటుంబం తమకు రక్షణ కల్పించాలని, చట్ట ప్రకారం వైసీపీ నేత నాగేశ్వరరావుపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని ఆశ్రయించింది. వారి ఫిర్యాదును స్వీకరించిన ఎస్పీ కార్యాలయం అధికారులు చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలంటూ నగరంపాలెం సీఐను ఆదేశించారు.

సూర్యలంక తీరంలో 13 రోజులు క్షిపణి పరీక్షలు

బాపట్ల రూరల్, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రక్షణ శాఖ ఆధ్వర్యంలో బాపట్ల జిల్లా సూర్యలంక తీరంలో సోమవారం క్షిపణి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలు 13 రోజులపాటు కొనసాగుతాయని మత్స్యశాఖ ఏడీ కృష్ణకిశోర్ వెల్లడించారు. సూర్యలంక తీరం నుంచి బంగాళాఖాతంలో సుమారు 150 కిలోమీటర్ల పరిధి వరకు ఈ పరీక్షలు నిర్వహిస్తారని ఆయన పేర్కొన్నారు. క్షిపణి పరీక్షల నేపథ్యంలో సుమద్రంలో చేపల వేటను నిలిపివేసినట్టు ఆయన తెలిపారు. మత్స్యకారులెవరూ ఆ సమయంలో వేటకు వెళ్లరాదని సూచించారు.

బీద.. సానా.. కృష్ణయ్య!

మూడు రాజ్యసభ స్థానాలకు అభ్యర్థుల ఎంపికపై కూటమి కసరత్తు కొలిక్కి


బీద మస్తాన్‌రావు


సానా సతీశ్


ఆర్.కృష్ణయ్య

అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): రాజ్యసభ అభ్యర్థుల ఎంపికపై ఎన్డీయే కూటమి కసరత్తు ఒక కొలిక్కి వచ్చినట్లు సమాచారం. బీద మస్తాన్‌రావు, సానా సతీశ్, ఆర్.కృష్ణయ్యలను బరిలోకి దింపనున్నట్లు తెలిసింది. మూడు రాజ్యసభ స్థానాల ఎన్నికలకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల కానుంది. 10వ తేదీ వరకూ నామినేషన్లకు గడువు ఉంటుంది. వైసీపీకి చెందిన ముగ్గురు ఎంపీల రాజీనామాలతో ఈ ఎన్నికలు అనివార్యమయ్యాయి. రాజీనామా చేసిన ముగ్గురు ఎంపీల్లో మోపిదేవి వెంకట రమణ, బీద మస్తాన్‌రావు టీడీపీలో చేరగా.. ఆర్.కృష్ణయ్య బీజేపీ పెద్దలతో టచ్‌లో ఉన్నట్లు ప్రచారం ఉంది. వీరిలో మస్తాన్‌రావు, సతీశ్‌ను టీడీపీ నుంచి, కృష్ణయ్యను బీజేపీ నుంచి బరిలో నిలపబోతున్నట్లు సమాచారం. పదవీ కాలం ఇంకా నాలుగేళ్లు ఉండగానే బీద, కృష్ణయ్యలు రాజీనామా చేయగా.. మోపిదేవి పదవీ కాలం ఒకటిన్నర ఏడాది మాత్రమే మిగిలి ఉంది. మోపిదేవి స్థానంలో తూర్పు గోదావరి జిల్లాకు చెందిన పార్టీ నేత సానా సతీశ్‌ను నిలపాలని టీడీపీ అధినాయకత్వం యోచిస్తోంది. సతీశ్‌ను ఇటీవలి ఎన్నికల్లో కాకినాడ లోక్‌సభ స్థానం నుంచి బరిలో నిలపాలని పార్టీ భావించింది. కానీ పొత్తులో భాగంగా ఆ సీటును జనసేనకు కేటాయించారు. దీంతో ఇప్పుడు రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇవ్వాలని నిర్ణయించినట్లు పార్టీ వర్గాలు అంటున్నాయి. సతీశ్ ఎంపికపై పార్టీ అధినేత చంద్రబాబు ఒకరిద్దరు పార్టీ ముఖ్య నేతలకు సంకేతం ఇచ్చినట్లు సమాచారం. టీడీపీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఆర్థికంగా అండగా ఉన్నవారికి అవకాశాలు ఇవ్వాల్సి ఉందని ఆయన వారితో అన్నట్లు తెలిసింది. కాగా, మరోవైపు ఆర్.కృష్ణయ్యను తమ పార్టీ తరఫున నిలపబోతున్నట్లు బీజేపీ అధిష్ఠానం ఇప్పటికే టీడీపీ నాయకత్వానికి సమాచారం ఇచ్చింది.

జనసేనకు ఈసారి లేనట్లేనా?

మూడు రాజ్యసభ స్థానాల్లో ఒక సీటును జనసేన ఆశించింది. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తన సోదరుడు నాగబాబును పెద్దల సభకు పంపాలన్న యోచనలో ఉన్నారు. ఇటీవల ఢిల్లీ పర్యటనలో ఆయన దీనిపై బీజేపీ నాయకత్వాన్ని కూడా సంప్రదించినట్లు ప్రచారం జరిగింది. ఆ పార్టీ కోటా కింద వచ్చిన సీటును తమకు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. కానీ బీజేపీ నాయకత్వం సుముఖంగా ఉన్నట్లు లేదు. దీంతో టీడీపీ నాయకత్వాన్ని పవన్ రాజ్యసభ సీటు కోసం కోరే అవకాశం ఉందా? అనే దానిపై రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. టీడీపీ వర్గాలు మాత్రం జనసేన నాయకత్వం నుంచి తమకు ఇంతవరకూ ఎలాంటి ప్రతిపాదన రాలేదని అంటున్నాయి. ఒకటి రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.

నాడు అబ్బాయ్... నేడు బాబాయ్!?





(మొదటి పేజీ తరువాయి)

విస్తృతంగా లభించే ఈ ఖనిజ నిక్షేపాలకు డిమాండ్ పెరిగింది. ఈ జిల్లాలోని సైదాపురం మండలంలో క్వార్ట్జ్ గనులు పెద్ద సంఖ్యలో ఉన్నాయి. ప్రభుత్వ భూముల్లో, ప్రైవేటు భూములు కలిపి మొత్తం 200లకు పైగా గనులు ఉన్నాయి. సరిగ్గా ఏడాదిన్నర క్రితం నెల్లూరు క్వార్ట్జ్‌కు చైనాలో విపరీతమైన డిమాండ్ వచ్చింది. దీంతో ధర అమాంతం పెరిగింది. ఒకప్పుడు పిచ్చిరాయిగా పిలుచుకునేది కాస్తా రత్నమై పోయింది. టన్ను ధర కనిష్ఠంగా రూ.75వేల నుంచి 2 లక్షల వరకు పలుకుతోంది. వైసీపీ ప్రభుత్వంలో అప్పటి మంత్రి అనిల్ కుమార్ కొన్ని నెలలపాటు ఈ గనులను శాసించారు. ఇప్పుడు... ఆయన బాబాయ్ రూప్‌కుమార్ యాదవ్ ఏకంగా వచ్చే ఐదేళ్ల కాలానికి స్కెచ్ వేశారు.

ఎవరీ రూప్ కుమార్?

రూప్ కుమార్ నెల్లూరు నగర కార్పొరేషన్ నుంచి పలు సార్లు కార్పొరేటర్‌గా ఎన్నికయ్యారు. ప్రస్తుతం డిప్యూటీ మేయర్‌గా పనిచేస్తున్నారు. రూప్‌కుమార్‌కు స్వయానా అన్న కొడుకే అనిల్ కుమార్. అనిల్ వైసీపీ ప్రభుత్వంలో మంత్రిగా పనిచేసిన కాలంలో రూప్‌కుమార్ షాడో మంత్రిగా వ్యవహరించారు. అప్పుడే క్వార్ట్జ్ తవ్వకాల్లో చక్రం తిప్పసాగారు. అనిల్ 'మాజీ' అయిన కొద్ది నెలలకే రూప్ కుమార్ పక్కకు వచ్చేశారు. వైసీపీలో కొనసాగుతూనే అనిల్‌కు వ్యతిరేకంగా నెల్లూరు నగరంలో ఒక వర్గాన్ని తయారు చేసుకున్నారు.

నాడు తాడేపల్లి అండతో...

తన కంట్లో నలుసులా తయారైన బాబాయ్ రూప్ కుమార్‌ను దెబ్బతీయడం కోసం అనిల్ దారులు వెతికారు. ఆయన క్వార్ట్జ్ వ్యాపారాన్ని అడ్డుకునేందుకు ప్రయత్నించారు. కానీ... వైసీపీలోని కీలక నాయకుడి ఆశీస్సులు ఉండటంతో అది కుదరలేదు. దీంతో... నెల్లూరు జిల్లాలో ఉన్న క్వార్ట్జ్ గనులు, రోజువారీ వ్యాపారం, ఆదాయం, వైసీపీ పెద్దలు రహస్యంగా పొందుతున్న ప్రయోజనాలపై నేరుగా 'తాడేపల్లి ప్యాలెస్'కు అనిల్ ఫిర్యాదు చేశారు. దీంతో సీన్ మారింది. జిల్లా పరిధిలోని క్వార్ట్జ్ గనులు మొత్తం అనిల్‌కు అప్పగిస్తూ తాడేపల్లి ప్యాలెస్ మౌఖిక ఆదేశాలు జారీ చేసింది. సంబంధిత అధికారులు తు.చ. తప్పకుండా ఆ ఆదేశాలను పాటించారు. క్వారీలన్నీ అనిల్ చేతికి వచ్చాయి.

మళ్లీ రూప్ రంగ ప్రవేశం...

ఎన్నికలకు సరిగ్గా నెల రోజుల ముందు రూప్ కుమార్ టీడీపీలో చేరారు. ఆయన ఒక ద్వితీయ శ్రేణి నాయకుడు మాత్రమే! కానీ... అత్యంత చిత్రంగా జిల్లాలో ఆయనే చక్రం తిప్పడం మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా క్వార్ట్జ్ క్వారీలకు ఎక్కడా అనుమతులివ్వని ప్రభుత్వం.... రూప్ కుమార్ ఆధ్వర్యంలో నడిచే నాలుగు క్వారీలకు వారం రోజుల క్రితం అనుమతులిచ్చింది. ఈ నాలుగు గత వైసీపీ ప్రభుత్వంలో కూడా రూప్‌కుమార్ ఆధ్వర్యంలో నడుస్తున్నవే. వాటికి మాత్రమే అనుమతులివ్వడం, ఇతర క్వారీ లీజుదారులు ఎవరు అడిగినా రూప్ కుమార్‌ను కలవండి అని సంబంధిత శాఖ మంత్రుల పీఏలు, అధికారులు చెబుతుండటం చర్చనీయాంశంగా మారింది. మరోవైపు... రూప్ కుమార్ జిల్లా పరిధిలోని క్వార్ట్జ్ యజమానులను పిలిపించుకొని బెదిరిస్తున్నట్లు సమాచారం. 'మీ క్వారీలు మాకు వదిలిపెట్టండి. లేదా మీరు తవ్విన రాయిని మేం చెప్పిన ధరకు మాకే విక్రయించండి. కాదంటే మీరు క్వారీలు నడుపుకోలేరు' అని హెచ్చరిస్తున్నట్లు క్వారీ యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రూప్‌కుమార్ వంటి సాధారణ నాయకునికి ఇంత పలుకుబడి ఎలా వచ్చింది? వేల కోట్ల విలువ చేసే క్వార్ట్జ్ వ్యాపారాన్ని గంపగుత్తగా కైవసం చేసుకోవడం ఎలా సాధ్యమైంది? ఆయన ముందు, వెనుక ఎవరున్నారు? అనేది ఆసక్తికరంగా మారింది. రూప్ కుమార్ వర్గం మాత్రం మంత్రి లోకేశ్ పేరు వాడుకుంటూ ఈ దందా చేస్తున్నట్లు సమాచారం. ఈ పరిణామాలపై స్థానిక టీడీపీ సీనియర్ నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, క్వార్ట్జ్ వ్యవహారాన్ని జిల్లా పరిధిలోని ఎమ్మెల్యేలు, మంత్రులు పెద్దగా పట్టించుకోలేదు. నిజమైన లీజుదారులు ఎమ్మెల్యేలను కలుసుకుని తమ గోడు వెళ్లబోసుకున్నారు. అంతలోనే... రూప్‌కుమార్ క్వారీలకు వారం రోజుల కిందట రాత్రి అనుమతి లభించింది. ఏదో తప్పు జరుగుతోందని గ్రహించి మరుసటి రోజు ఉదయానికల్లా నిలుపుదల చేసింది.

తీరంపై హేల్ డ్రోన్ల నిఘా

- 18న సర్వే నౌక నిర్దేశక్ జలప్రవేశం
- 4న ఒడిశాలోని పూరీలో నేవీ దినోత్సవం
- ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరు
- చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్



విశాఖపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): సముద్ర తీర ప్రాంతాల్లో నిఘా కోసం త్వరలోనే హై ఆల్టిట్యూడ్ లాంగ్ ఎండ్యూరెన్స్(హేల్) మానవ రహిత ఎయిర్‌క్రాఫ్ట్‌లు అందుబాటులోకి రానున్నాయని తూర్పు నౌకాదళం చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేశ్ పెంధార్కర్ వెల్లడించారు. అత్యంత ఎత్తులో ఎగురుతూ ఎక్కువ సమయం నిఘా పెట్టగల ఈ డ్రోన్లను రిమోట్‌తో ఆపరేట్ చేయవచ్చన్నారు. నేవీ దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఆయన మాట్లాడుతూ... ప్రాంత రక్షణను మరింత బలోపేతం చేస్తున్నామని చెప్పారు. ఇప్పటికే నేవీ నౌకల్లో మానవరహిత ఏరియల్ వెహికల్స్(యుఏవీ)ను ఉపయోగిస్తున్నామన్నారు. అమెరికాతో చేసుకున్న ఒప్పందం ప్రకారం హేల్ ఎంక్యు-9బి సీ గార్డియన్స్ అందుబాటులోకి రావడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. సర్వే నౌక 'నిర్దేశక్' ఈ నెల 18న జలప్రవేశం చేయనుందని చెప్పారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో వాణిజ్య నౌకల రాకపోకలు, భద్రతకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నామని పెంధార్కర్ చెప్పారు. ఈ నెల 4న నేవీ దినోత్సవాన్ని ఒడిశాలోని పూరీలో నిర్వహిస్తున్నామని, దీనికి రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ముఖ్య అతిథిగా హాజరవుతారని ఆయన వెల్లడించారు. విశాఖపట్నం ప్రజల కోసం సాహస విన్యాసాల ప్రదర్శనను జనవరి 4న నిర్వహిస్తామని, ఈ కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరవుతారని చెప్పారు.

తడిసిన ధాన్యం కొనాలి

- ఫెంగల్ తుఫానుపై సమీక్షలో సీఎం ఆదేశాలు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఫెంగల్ తుఫాను కారణంగా భారీ వర్షాలకు సంభవించిన పంట నష్టాన్ని అంచనా వేసి, రైతులకు నష్టపరిహారం చెల్లించాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. అలాగే వర్షం కారణంగా తడిసిన ధాన్యం ఉంటే రైతులకు ఇబ్బంది లేకుండా కొనుగోలు చేయాలని సూచించారు. రెండు మూడు రోజులు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. తుఫాను ప్రభావం, ప్రభుత్వ సహాయ చర్యలపై సోమవారం ఉండవల్లిలోని తన నివాసంలో సీఎం సమీక్ష జరిపారు. సీఎస్ నీరబ్‌కుమార్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మొత్తం 53 మండలాల్లో తుఫాను ప్రభావం ఉందని, భారీ వర్షాలు కురిసిన ప్రాంతాల్లో సహాయ పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి, ప్రజలను తరలించినట్టు అధికారులు తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం 6,824 హెక్టార్లలో వ్యవసాయ పంటలు దెబ్బతిన్నాయని అధికారులు వివరించారు.

అప్రమత్తత అవసరం: మంత్రి అనిత

ఫెంగల్ తుపాను ప్రభావిత జిల్లాల్లో అధికార యంత్రాంగం అందుబాటులో ఉండాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత ఆదేశించారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో సోమవారం ఆమె ఫోన్‌లో మాట్లాడి, తాజా పరిస్థితులను ఆరా తీశారు.

సచివాలయ వ్యవస్థలో సమూల మార్పులు

- గ్రామ, వార్డు సచివాలయ శాఖ సమీక్షలో సీఎం

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చి మరింత అర్థవంతంగా, పటిష్ఠంగా వ్యవస్థను తయారుచేసి ప్రజలకు ఉపయోగకరంగా నిలపాలని ముఖ్యమంత్రి చంద్రబాబు భావిస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం గ్రామ, వార్డు సచివాలయాలపై ముఖ్యమంత్రి నివాసంలో సమీక్ష నిర్వహించారు. గ్రామాలు, పట్టణాల్లో సచివాలయాలు ప్రజలకు మరింత చేరువై, ఏ విధంగా మెరుగైన సేవలు అందించాలనే దానిపై చర్చ ప్రధానంగా సాగింది. సచివాలయాల పునర్వవస్థీకరణ ప్రధాన అజెండాగా జరిగిన మొదటి సమావేశంలో వ్యవస్థ పనితీరు, ప్రజలకు అందుతున్న సేవలపై అధికారులు ప్రజంటేషన్ ఇచ్చారు.

పంచాయతీలు ఎక్కువ...సచివాలయాలు తక్కువ

రాష్ట్రంలో గ్రామ పంచాయతీలు 13,291 ఉండగా, గ్రామ సచివాలయాలు మాత్రం 11,162 మాత్రమే ఉన్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 15,004 గ్రామ-వార్డు సచివాలయాలు ఉండగా వీటిలో 1,19,803 మంది ఉద్యోగులను నేరుగా నియమించారు. ఇతర విభాగాలవారిని కూడా కలుపుకుంటే 1,27,175 మంది గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్నారు. వారిలో గ్రామ సచివాలయాల్లో 95,533 మంది, వార్డు సచివాలయాల్లో 31,592 మంది ఉన్నారు. వీరిలో 18 - 27 సంవత్సరాల వయస్సు ఉన్న ఉద్యోగులు 50,284మంది, 28-37 సంవత్సరాల వయసున్న ఉద్యోగులు 54,774 మంది ఉన్నారు. సచివాలయ ఉద్యోగుల్లో పీజీ, పీహెచ్‌డీ, ఇంజినీరింగ్, వైద్య విద్య చదివిన వాళ్లు ఉన్నారు. పీజీ, ఆపైన చదివిన ఉద్యోగులు 14 శాతం, వృత్తివిద్యా కోర్సులు చదివినవాళ్లు 31శాతం ఉన్నారు. యువత అధికంగా ఉండే ఈ వ్యవస్థను ఎలా వినియోగించుకోవాలనేది చర్చించారు. రానున్న రోజుల్లో మరింత కసరత్తు జరిపి ప్రభుత్వం ఈ విభాగంపై ముందడుగు వేయనుంది.

'డిజిటల్'తో దోపిడీ..!

(మొదటి పేజీ తరువాయి)

విధులకు హాజరు కాకుండానే జీతాలు తీసుకున్నట్లు బయటపడింది. ఒక యూ ట్యూబ్ చానెల్ యజమాని ఇంట్లో పనోళ్ల నుంచి, నాటి విపక్ష నేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై బురద జల్లిన ప్రతి యూ ట్యూబ్ చానెల్‌కు కూడా ఇక్కడి నుంచే చెల్లింపులు జరిగాయి. జగన్ ఎన్నికల ప్రచారంలో డ్రామా సీన్లు రక్తికట్టించేందుకు ప్రయత్నించి అట్టర్ ఫ్లాప్ అయిన ఐ-ప్యాక్, ఐడ్రీమ్స్‌తోపాటు బూతులతో ప్రతిపక్షాలపై విరుచుకుపడే సజ్జల భార్గవ రెడ్డి, మార్ఫింగ్ ఫొటోలతో టీడీపీ, జనసేన నేతల పరువు తీసేందుకు ప్రయత్నించే సినీ దర్శకుడు రామ్‌గోపాల్ వర్మ కూడా ఏపీ డిజిటల్ కార్పొరేషన్ నుంచి లబ్ధి పొందినట్లు తెలుస్తోంది. మొత్తం ఆరు విభాగాలుగా చేసిన చెల్లింపుల్లో ఇప్పటి వరకూ నాలుగు విభాగాలకు సంబంధించిన ఫోరెన్సిక్ ఆడిట్ పూర్తి చేయించిన విజిలెన్స్ అధికారులు యాభై కోట్ల రూపాయలకుపైగా అక్రమ చెల్లింపులను గుర్తించారు. మరో రెండు పూర్తి అయితే ఈ మొత్తం మరింత పెరిగే అవకాశం ఉందని విజిలెన్స్ వర్గాల సమాచారం.

సైకోలకు రాజపోషణ..

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు అంటూ....2020 సెప్టెంబరు 23న వైసీపీ ప్రభుత్వం ఏపీ డిజిటల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసింది. గ్రామీణ ప్రాంతాల్లో డిజిటల్ తరగతులు, లైబ్రరీలు ఏర్పాటు చేస్తామని అప్పట్లో బయటికి ప్రకటించింది. అంతర్గతంగా మాత్రం.. జగన్‌కు బాకా ఊదాలి.. ప్రతిపక్షాలపై బురద జల్లాలి.. అనే లక్ష్యంతో వైసీపీ కార్యకర్తలు, సోషల్ సైకోలు ఇందులో ఉద్యోగులుగా ఆనాడు చేరి జీతాలు తీసుకున్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్, నారా లోకేశ్, వంగలపూడి అనిత.. వారి కుటుంబ సభ్యులను మాత్రమే కాకుండా ఏకంగా హైకోర్టు న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు సీజేఐ కుమార్తెలను సైతం వదిలిపెట్టలేదు. ఇటువంటి వారికి వేల రూపాయల నుంచి లక్షల రూపాయల్లో వేతనాల కింద ప్రతి నెలా రెండు కోట్ల చొప్పున జగన్ ప్రభుత్వం చెల్లించింది. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఉంటూ వైసీపీ సోషల్ మీడియా విభాగం ఇచ్చిన కంటెంట్ పోస్టు చేస్తూ అసలు ఉద్యోగానికే రాని వారంతా జగన్ హయాంలో జీతాలు తీసుకున్నారు. అరాచక వైసీపీ ప్రభుత్వాన్ని దారుణంగా ఓడించి ప్రజలు ఎన్డీఏ ప్రభుత్వానికి పట్టం కట్టడంతో దర్యాప్తు సంస్థలు గత ఐదేళ్ల అక్రమాలను వెలికి తీస్తున్నాయి. తనకు సొంత మీడియా లేదంటూ పదే పదే అబద్ధాలు చెప్పే జగన్ తన రోత పత్రిక, టీవీకి వందల కోట్ల రూపాయల ప్రకటనలు జారీ చేయించుకున్నారు. ఇందుకు సహకరించిన నాటి సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ విజయ్ కుమార్ రెడ్డిపై పాత్రికేయ సంఘాలు ప్రభుత్వానికి ఫిర్యాదు చేశాయి. పత్రికల సర్క్యులేషన్ పరిగణనలోకి తీసుకోకుండా ఏకపక్షంగా, అడ్డగోలుగా ఆనాడు ముఖ్యమంత్రి జగన్ సొంత మీడియాకు వందల కోట్ల రూపాయల ప్రభుత్వ సొమ్మును ఆయన దోచిపెట్టారని ఆక్షేపించాయి. చంద్రబాబు ప్రభుత్వం దీనిపై విచారణకు ఆదేశించడంతో అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) ప్రాథమిక సమాచారాన్ని సేకరించింది. అందులో రోత పత్రిక ఉద్యోగులకు అడ్డగోలుగా జీతాలు.. జగన్ మీడియాకు వందల కోట్ల ప్రకటనలు ఇచ్చినట్లు తేలింది.

కార్పొరేషన్‌ను దోచేశారు..

ఏపీ డిజిటల్ కార్పొరేషన్‌లో అక్రమాలపై వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా విచారణ చేపట్టిన విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం పలు అవకతవకలను గుర్తించింది. అందులో కొన్ని..

- ఐ డ్రీమ్స్ యూ ట్యూబ్ చానల్ యజమాని చైర్మన్‌గా, మధుసూధన్ రెడ్డి ఎండీగా గత ప్రభుత్వం డిజిటల్ కార్పొరేషన్‌ను ఏర్పాటుచేసింది.
- అర్హత, అవసరంతో పనిలేకుండా 129 మంది ఉద్యోగుల్ని(ఎక్కువగా ఎంపీ అవినాశ్ రెడ్డి సిఫారసు) నియమించుకుని కార్పొరేషన్ నుంచి ఇష్టారాజ్యంగా జీతాలు చెల్లించింది. అంటే ఒకే పనిచేసే ఉద్యోగుల్లో ఒకరికి పాతిక వేలు, మరొకరికి 40వేలు, ఇంకొకరికి 70వేలు, లక్ష రూపాయలు కూడా చెల్లించింది.
- జగన్ మీడియాతోపాటు వైసీపీ సోషల్ మీడియాలో 49మంది పనిచేశారు. వారికి నాడు కార్పొరేషన్ సొమ్ము జీతాల రూపంలో చేరింది.
- ప్రతిపక్ష నేతలతోపాటు హైకోర్టు న్యాయమూర్తులు, సుప్రీంకోర్టు సీజేఐ కుటుంబ సభ్యులపై అనుచిత పోస్టులు సోషల్ మీడియాలో పెట్టిన వాళ్లు సైతం డిజిటల్ కార్పొరేషన్ నుంచే జీతాలు తీసుకున్నారు.
- జగన్‌కు ఆనాడు బాకా ఊదుతూ.. టీడీపీ, జనసేన నేతలపై బురద జల్లే.. యూ ట్యూబ్ చానెళ్లు, వెబ్ సైట్లకు కూడా డిజిటల్ కార్పొరేషన్ నుంచే ఆర్థిక సహకారం అందింది.
- వైసీపీని ఎన్నికల్లో గెలిపించేందుకు శక్తివంచన లేకుండా పనిచేసినా...దారుణంగా విఫలమైన ఐ-ప్యాక్‌లో సిబ్బంది కొందరికి కార్పొరేషన్ నుంచే డబ్బులు ఇచ్చారు.
- జగన్‌కు భజన చేసే యాడ్స్ కోసం గూగుల్‌కు.. జగన్‌పై సినిమా తీసి చంద్రబాబు, పవన్‌పై సెటైర్లు వేసే దర్శకుడు రామ్‌గోపాల్ వర్మకు కూడా ప్రకటనల రూపంలో చెల్లింపులు ఇక్కడి నుంచే జరిగాయి.
- డిజిటల్ కార్పొరేషన్‌లో కీలక స్థానంలో పనిచేసిన రాయలసీమకు చెందిన వ్యక్తి... జాతీయ స్థాయిలో పేరుగాంచిన హోటల్ ఫ్రాంఛైజీ తీసుకుని తిరుపతిలో నిర్మాణం చేస్తున్నట్లు గుర్తించిన విజిలెన్స్ అధికారులు, ఆ విషయాన్ని ప్రభుత్వానికి నివేదించనున్నారు.

టీడీపీలోకి ఆళ్ల నాని!

- ఆయన దారిలోనే మరో ఇద్దరు వైసీపీ నేతలు?



ఏలూరు డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): వైసీపీలో కీలకంగా వ్యవహరించి, వైఎస్ కుటుంబానికి అత్యంత సన్నిహితంగా మెలిగి.. జగన్ ప్రభుత్వంలో మంత్రులు, ఎమ్మెల్యేలుగా రాణించినవారు ఇప్పుడు టీడీపీ వైపు చూస్తున్నారు. ఈ కోవలోనే మాజీ ఉపముఖ్యమంత్రి ఆళ్ల నాని సైకిల్ ఎక్కేందుకే సిద్ధమవుతున్నారు. ఏలూరు నియోజకవర్గంలో వైసీపీ అంతా ఖాళీ అయ్యి టీడీపీలో చేరిపోగా, ఆ పార్టీకి ఇంతకు ముందే వైసీపీకి రాజీనామా చేసిన ఆళ్ల నాని కూడా ఒకట్రెండు రోజుల్లోనే సైకిల్ ఎక్కనున్నారు. ఆళ్ల నాని రెండు నెలల క్రితం వైసీపీ జిల్లా అధ్యక్ష పదవికి, ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేశారు. నానీ కాంగ్రెస్ ఎమ్మెల్యేగా ఉండగా దానికి రాజీనామా చేసి మరీ వైసీపీలో చేరారు. గడచిన ఎన్నికల్లో ఏలూరు నుంచి నాలుగోసారి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. మరోవైపు, భీమవరం మాజీ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ టీడీపీలో చేరే అవకాశాలు లేకపోలేదని కొందరు, ఆయన జనసేనలో చేరతారని ఇంకొందరు చాలా కాలం క్రితం నుంచే ప్రచారం జరుగుతోంది. ఇప్పుడు దీనిపై టీడీపీ దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. మరో మాజీ మంత్రి శ్రీరంగనాథ రాజు వైసీపీని వీడబోతున్నట్లు ప్రచారం సాగుతూ వచ్చింది. ఆయనను పార్టీలోకి తీసుకోవడానికి టీడీపీ సానుకూలంగానే ఉన్నట్టు చెబుతున్నారు.

రోజంతా సీఎంతో ఉండే చాన్స్..!

- ఎన్‌ఆర్‌ఐ ఉన్నం నవీన్‌కు అరుదైన గౌరవం
- 'డే విత్ సీబీఎన్' కార్యక్రమానికి ఎంపిక
- స్వీడన్ నుంచి వచ్చి ఎన్నికల్లో పనిచేసినందుకు గుర్తింపు



అమరావతి, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో స్వీడన్ నుంచి వచ్చి ఐదు నెలలపాటు తెలుగుదేశం పార్టీ కోసం పనిచేసిన ప్రవాసాంధ్రుడు ఉన్నం నవీన్‌కు అరుదైన గౌరవం దక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆయనకు ఒక రోజంతా తనతోపాటు ఉండే అవకాశం కల్పించారు. ఎన్నికల్లో పార్టీ కోసం శ్రమించిన వారిలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన వారి కోసం టీడీపీ 'డే విత్ సీబీఎన్' కార్యక్రమాన్ని చేపట్టింది. అందులో భాగంగా నవీన్ ఇక్కడ ముఖ్యమంత్రి నివాసంలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ చంద్రబాబుతోనే ఉండి ఆయన నిర్వహించే సమావేశాల్లో, వివిధ చర్చల్లో పాల్గొన్నారు. కాగా.. నవీన్ తనకు ఇచ్చిన ఈ అద్భుత అవకాశానికి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు.

డిస్కమ్‌ల బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలి

- చార్జీల పెంపును ఉపసంహరించుకోవాలి
- కాకినాడ పోర్టులో పవన్ కల్యాణ్ డ్రామా చేశారు
- షర్మిలను నాయకురాలిగా గుర్తించడం లేదు: బొత్స



విశాఖపట్నం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యుత్ డిస్కమ్‌లకు ఉన్న రూ.15,485 కోట్ల ట్రూ అప్ చార్జీల బకాయిలను ప్రభుత్వమే చెల్లించాలని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆ భారాన్ని ప్రజలపై మోపాలనే నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకోవాలన్నారు. 'కాకినాడ పోర్టులో బియ్యం రవాణాపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ డ్రామా చేశారు. తన పార్టీకి చెందిన వ్యక్తే పౌర సరఫరాల మంత్రి అనే విషయాన్ని ఆయన మరిచిపోయి, కాకినాడ ఎమ్మెల్యేను ప్రశ్నించడం ఆశ్చర్యంగా ఉంది. కాకినాడ పోర్టు ఎవరిదనే విషయాన్ని పక్కనపెట్టి అక్కడ నుంచి చట్ట వ్యతిరేకంగా ఎగుమతులు, దిగుమతులు జరుగుతున్నాయా? లేదా? అనేది గుర్తించి చర్యలు తీసుకోవాలి. కూటమి ప్రభుత్వానికి ఒక విధానం లేదు. పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలను ఒక రాజకీయ నాయకురాలిగా మేం గుర్తించడం లేదు' అని బొత్స తెలిపారు.

జగన్ ప్రభుత్వంలో 48 వేలకోట్ల రేషన్ దోపిడీ

- స్మగ్లింగ్ వెనుక ప్రజా ప్రతినిధుల పాత్ర
- కొంతమంది అవినీతి అధికారులూ ఉన్నారు
- ఏపీని రేషన్ బియ్యం మాఫియాగా మార్చారు
- అక్రమ రవాణాపై దర్యాప్తు చేయాలి: షర్మిల




అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ప్రపంచానికి అన్నం పెట్టే రాష్ట్రాన్ని రేషన్ బియ్యం మాఫియాగా గత జగన్ ప్రభుత్వం మార్చేసిందని పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల ఆరోపించారు. పీడీఎస్ బియ్యం విదేశాలకు తరలించడం పెద్ద జాతీయ కుంభకోణమని, ఇదో పెద్ద మాఫియా అని ఆరోపించారు. సోమవారం ఆమె ఎక్స్ వేదికగా స్పందించారు. 'ఆరుగాలం కష్టపడే రైతులకు దక్కేది కన్నీళ్లయితే, పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా చేసేవారికి కోట్లు వస్తున్నాయి. గత ప్రభుత్వ హయాంలో పేదల పొట్ట కొట్టి రూ.48,000 కోట్లను పందికొక్కుల్లా తినేశారు. భారీ దోపిడీ జరిగింది. రేషన్ బియ్యం స్మగ్లింగ్ వెనుక ప్రజాప్రతినిధుల పాత్ర ఉంది. కింది నుంచి ఉన్నత స్థాయి వరకూ కొంతమంది అవినీతి అధికారుల పాత్ర ఉంది. ఎవరికి దక్కాల్సిన వాటా వాళ్లకు చేరుతుండటంతో నిఘా వ్యవస్థ పూర్తిగా కళ్లు మూసుకుంది. గడచిన మూడేళ్లలో రాష్ట్రంలోని పోర్టుల నుంచి రెండు కోట్ల టన్నుల రేషన్ బియ్యం తరలిపోయింది. అక్రమంగా బియ్యం రవాణా అయిందంటే చెక్‌పోస్టుల పనితీరేంటో అంచనా వేయవచ్చు. ఏస్థాయిలో అవినీతి జరిగిందో కూడా తెలుస్తుంది. బియ్యం అక్రమ రవాణాపై సమగ్ర దర్యాప్తు చేయాలి. పేదలకు దక్కాల్సిన రేషన్ బియ్యం అక్రమంగా పోర్టు దాకా ఎలా చేరుతోంది? సముద్రంలో బోట్లు వేసుకుని వెళ్లి హడావిడి చేయడం కాదు. నిజాలు నిగ్గు తేల్చాలి' అని షర్మిల పేర్కొన్నారు.

బియ్యం అక్రమ రవాణాపై సీబీఐ దర్యాప్తు

- కేఏ పాల్ డిమాండ్

న్యూఢిల్లీ, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): కాలుష్యం ఇబ్బంది పెడుతున్న పార్లమెంట్ సమావేశాలు ఢిల్లీలోనే పెడుతున్నారని, ఇకనైనా వాటిని హైదరాబాద్‌లో నిర్వహించాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. దక్షిణాదికి న్యాయం జరగడంలేదని, ఇలా అయితే ప్రత్యేక దేశం కోసం పోరాడే పరిస్థితి వస్తుందని వ్యాఖ్యానించారు. సోమవారం ఇక్కడి తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. కాకినాడ పోర్టు నుంచి జరుగుతున్న బియ్యం అక్రమ రవాణాపై సీబీఐ దర్యాప్తు చేయాలన్నారు. బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను ఆపేందుకు ప్రధాని మోదీ జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. జనసేనను బీజేపీలో విలీనం చేసే పని జరుగుతోందని, అందుకే పవన్‌కల్యాణ్ సనాతన ధర్మం, లడ్డూల గురించి మాట్లాడుతున్నారని కేఏ పాల్ విమర్శించారు.



నింగి నేలకు దిగింది!

దట్టమైన అడవులు.. నేలను కమ్మేసిన పొగ మంచు. నింగీ నేలా కలిసిపోయిందా! అన్నట్టుగా కనిపించిన ఈ ప్రకృతి కమనీయ దృశ్యం... అల్లూరి సీతారామరాజు జిల్లా మోతుగూడెంలోనిది. తెల్లవారుజామున మన్యంలో భారీ వర్షం కురిసింది. వర్షం వెలిశాక.. అంతటా పొగమంచు అలముకుంది. ఆ పొగమంచు.. మేఘాలు కలిసిపోయిన దృశ్యమే ఇది.

- మోతుగూడెం, ఆంధ్రజ్యోతి

పోలి స్వర్గంలో దీపాల వెలుగులు!



కార్తీక మాసం ముగిసింది. ఆ తర్వాతి రోజైన సోమవారం పోలి పాడ్యమి. దీంతో పుణ్యస్నానాలు చేసేందుకు మహిళలంతా తెల్లవారుజామునే తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని గోదావరి నదికి తరలివచ్చారు. పుష్కర ఘాట్‌లో స్నానాలు చేసి.. దీపాలు వదిలారు.



విజయవాడలో కృష్ణా నది ఒడ్డున దీపాలు వదులుతున్న భక్తులు

మాచార్రావుకు ఘన సన్మానం



ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్-టెండర్/ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యుడు సీఏ మీనవల్లి మాచార్రావు సన్మాన కార్యక్రమంలో పాల్గొన్న డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు

మియాపూర్, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రభుత్వ ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్-టెండర్/ప్రొక్యూర్‌మెంట్ కమిటీ సభ్యుడిగా నియమితులైన సీఏ మీనవల్లి మాచార్రావును సోమవారం హైదరాబాద్‌లో ఘనంగా సన్మానించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఏపీ అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ కె.రఘురామకృష్ణరాజు మాట్లాడుతూ మాచార్రావు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఏపీ స్టేట్ క్రియేటివ్ అండ్ కల్చరల్ కమిషన్ ఛైర్‌పర్సన్ తేజస్వి పొడపాటి, సీఏ జె.వెంకటేశ్వర్లు, సీఏ ఎం.వెంకట నరసింహం తదితరులు పాల్గొన్నారు.

రేపే నింగిలోకి పీఎస్ఎల్వీ-సీ59



సూళ్లూరుపేట, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఇస్రో మరో అంతరిక్ష యానానికి సిద్ధమైంది. తిరుపతి జిల్లా శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ అంతరిక్ష కేంద్రం షార్ నుంచి బుధవారం సాయంత్రం 4:08 గంటలకు పీఎస్ఎల్వీ-సీ59 రాకెట్ ప్రయోగాన్ని చేపట్టనుంది. ఈ రాకెట్ ద్వారా యూరోపియన్ స్పేస్ ఏజెన్సీ (ఈఎస్ఏ)కి చెందిన ప్రోబా-3 ఉపగ్రహాన్ని ఇస్రో కక్ష్యలోకి చేర్చనుంది. ఇస్రో ఛైర్మన్ ఎస్.సోమనాథ్ ఈ ప్రయోగానికి సంబంధించిన మిషన్ రెడినెస్ రివ్యూ (ఎంఆర్ఆర్) సమావేశాన్ని సోమవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. అనంతరం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ అధ్యక్షతన లాంచింగ్ ఆథరైజేషన్ బోర్డు సమావేశమై ప్రయోగానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ప్రయోగానికి 25:30 గంటల ముందు అంటే.. మంగళవారం మధ్యాహ్నం 2:38 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నారు.

ఇక అమరావతి పనులు పరుగు

(మొదటి పేజీ తరువాయి)



సీఆర్‌డీఏ సమీక్షా సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారాయణ, సీఎస్, అధికారులు

కార్యాలయంలో చంద్రబాబు ఆధ్వర్యంలో 41 వ అథారిటీ సమావేశం జరిగింది. సమావేశం అనంతరం వివరాలను మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ మీడియాకు తెలిపారు. కొంతమేర రాష్ట్ర ప్రభుత్వ నిధులతో, ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధులతో మిగిలిన పనులు చేపట్టేలా ఈ సమావేశంలో ఆర్థిక కేటాయింపులు జరిపారు. ఆర్థిక కేటాయింపులు ఇలా.. రాజధానిలో గత ఐదేళ్లు నిలిచిపోయిన గజిటెడ్ ఆఫీసర్స్ టైప్ - 1, టైప్ - 2, క్లాస్ - 4 ఉద్యోగుల అపార్ట్‌మెంట్స్ నిర్మాణ పనులను పూర్తి చేయటానికి రూ. 594.54 కోట్లను ఖర్చు చేసేందుకు సీఆర్‌డీఏ అథారిటీ సమ్మతి తెలిపింది. అక్కడ తాగునీటి సదుపాయం, రోడ్లు, వీధి దీపాలు, అంతర్గత రహదారులు, బిల్డింగ్ సెక్యూరిటీ, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ, ల్యాండ్ స్కేపింగ్ వంటి పనులను రూ.226.26 కోట్లతో చేపట్టేందుకు నిర్ణయించింది. నాన్ గజిటెడ్ ఆఫీసర్ల భవనాలకు సంబంధించిన బ్యాలెన్స్ పనులను ప్రపంచ బ్యాంకు, ఏడీబీ నిధులు రూ. 607.50 కోట్లతో చేపట్టడానికి అథారిటీ ఆమోదం తెలిపింది. ప్రపంచబ్యాంకు, ఏడీబీ నిధుల నుంచి ఎన్‌జీఓ ఆఫీసర్ల భవనాలకు మౌలిక వసతుల కల్పనకు రూ. 594.36 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు అథారిటీ ఆమోదించింది. అఖిల భారత సర్వీసు అధికారులు, ముఖ్య కార్యదర్శులకు సంబంధించిన 111 బంగళాల పెండింగ్ పనులను రూ. 516.6 కోట్ల వ్యయంతో చేపట్టాలని నిర్ణయించారు. ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులను రూ. 3859.66 కోట్ల వ్యయంతో చేపట్టేందుకు సీఆర్‌డీఏ అథారిటీ ఆమోదించింది.

భవన నిర్మాణ పనులు	1,931.76 కోట్లు
ఎల్‌పీఎస్ ఇన్‌ఫ్రా పనులు	3,859.66 కోట్లు
రోడ్ల నిర్మాణం, మౌలిక సదుపాయాల పనులు	2,498.3 కోట్లు
వరద నివారణ పనులు	1,585.95 కోట్లు
హ్యాపీనెస్ట్ ప్రాజెక్టు	984.10 కోట్లు

హ్యాపీనెస్ట్ నష్టాలు భరించనున్న సర్కారు..

అమరావతిలో ప్రజల భాగస్వామ్యంతో చేపడుతున్న హ్యాపీనెస్ట్ ప్రాజెక్టుకు సంబంధించి సవరించిన అంచనా వ్యయం రూ.984.10 కోట్లకు సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. కొత్తగా టెండర్లు పిలిచేందుకు కూడా అథారిటీ ఆమోదం తెలిపింది. వైసీపీ ప్రభుత్వ నిర్వాకం వల్ల జరిగిన ఆలస్యం కారణంగా లబ్ధిదారులు నష్టపోయిన వడ్డీ, ప్రాజెక్టు ఆలస్యం వల్ల జరిగిన నష్టం మొత్తం రూ.270.71 కోట్లను ప్రభుత్వమే భరించాలని నిర్ణయం తీసుకున్నారు. హ్యాపీనెస్ట్ ప్రాజెక్టును 20,89,260 చదరపు అడుగుల విస్తీర్ణంలో మొత్తం 1,200 ఫ్లాట్లతో కూడిన పన్నెండు జీప్లస్ 18 టవర్లను చేపట్టనున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో సెల్ఫ్ ఫైనాన్సింగ్ ప్రాజెక్టుగా సీఆర్డీఏ ఈ టౌన్‌షిప్ ప్రాజెక్టును చేపట్టింది. అప్పట్లో 2018 - 19 అంచనాల ప్రకారం రూ. 720.5 కోట్లకు ఆమోదం తెలిపారు. వైసీపీ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిర్వీర్యం చేసింది. పనులు చేపట్టకపోవటం వల్ల ప్రస్తుతం సవరించిన అంచనాల కారణంగా రూ. 984.10 కోట్ల వ్యయంతో చేపట్టాల్సి వస్తోంది. కాగా, ప్రపంచబ్యాంకు , ఏషియన్ డెవలప్ మెంట్ బ్యాంక్ల నిధుల నుంచి అమరావతిలో వరద నివారణ పనులను మూడు ప్యాకేజీలుగా చేపట్టేందుకు అథారిటీ ఆమోదం తెలిపింది. ప్యాకేజీ -1 పనులను రూ. 580.74 కోట్లు, ప్యాకేజీ - 2 రూ.386.95 కోట్లు, ప్యాకేజీ రూ. 608.26 కోట్లను కలిపి మొత్తంగా రూ. 1585.95 కోట్ల వ్యయంతో ఖర్చు చేసేందుకు అథారిటీ ఆమోదించింది. వీటన్నింటి కోసం ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ కన్సల్టెంట్‌ను (పీఎంసీ) ఏర్పాటుచేయాలని నిర్ణయించారు.

మూడేళ్లలో అమరావతి నిర్మాణ పనులు పూర్తి : మంత్రి నారాయణ

రాజధాని అమరావతి నిర్మాణ పనులను మూడేళ్లలో పూర్తి చేస్తామని మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ తెలిపారు. "గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం మూడు ముక్కలాటతో అమరావతిని నిర్వీర్యం చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అమరావతి విషయంలో పలు కమిటీలు వేసి.. వాటి నివేదికల ఆధారంగా ముందుకెళ్తున్నాం. సీడ్ కేపిటల్‌లో నిర్మించే 360 కిలోమీటర్ల ట్రంక్‌రోడ్డులో రూ.2,498 కోట్లతో కొన్ని పనులు ప్రారంభించడానికి సీఆర్డీఏ అథారిటీ ఆమోదం తెలిపింది. అమరావతి గవర్నమెంట్ కాంప్లెక్స్‌లోని ఐదు ఐకానిక్ టవర్లు, అసెంబ్లీ, హైకోర్టు భవనాలు డిజైన్లకు ఇప్పటికే టెండర్లు పిలిచాం. ఈ నెల 15 నాటికి డిజైన్ల టెండర్లు పూర్తవుతాయి. నెలాఖరుకు ఆయా భవనాల నిర్మాణాలకు కూడా టెండర్లు పిలుస్తాం" అని మంత్రి తెలిపారు.

కోటి రూపాయల చెట్టు..!

- అన్నవరం సత్యదేవుడి ఆలయంలో రావిచెట్టు
- దీని వద్ద ఆవునెయ్యి దీపాల విక్రయానికి వేలంపాట ద్వారా భారీగా ఆదాయం



అన్నవరంలోని రావిచెట్టు వద్ద భక్తుల పూజలు

అన్నవరం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): ఒక చెట్టు నుంచి మహా అయితే ఎంత ఆదాయం వస్తుంది! అది ఏ రకమైనా.. పండ్లు, పూలు లేదా ఆయుర్వేద ఔషధ రూపంలో వందల నుంచి వేల రూపాయల్లో ఉండొచ్చు. అయితే కాకినాడ జిల్లా అన్నవరంలోని సత్యనారాయణ స్వామి ఆలయంలో తూర్పు రాజగోపురం ఎదురుగా ఉన్న రావిచెట్టు వలన ఏడాదికి రూ.కోటికి పైగా ఆదాయం వస్తుందంటే మీరు నమ్మగలరా? కానీ ఇది నిజం! ఈ రావి చెట్టు వద్ద దీపాలు వెలిగిస్తే కోర్కెలు తప్పక నెరవేరుతాయని భక్తుల విశ్వాసం. అందువల్ల దేవస్థానం ఈ చెట్టు వద్ద ఆవు నెయ్యి దీపాలు విక్రయించేందుకు ప్రతి ఏటా బహిరంగ వేలం నిర్వహిస్తూ వస్తోంది. గతేడాది ప్రతినెలా రూ.7,51,599 చొప్పున చెల్లించేలా కాంట్రాక్టరు హెచ్చుపాటకు దక్కించుకున్నారు. ఈ ఏడాది కార్తీక మాసం ప్రారంభానికి ముందు 10శాతం అదనంతో నెలకు రూ.8,26,758 చెల్లించేలా హెచ్చుపాట వెళ్లింది. ఈ లెక్కన ఈ ఏడాదికి రూ.99,21,096 ఆదాయం వస్తుంది. దీంతోపాటు అక్కడి ప్రత్యేక హుండీ ద్వారా ఏటా రూ.4 లక్షల వరకు వస్తాయి. వెరసి ఈ రావిచెట్టు ద్వారా మొత్తం రూ.1.03 కోట్ల వరకు సత్యదేవుడి ఖజానాకు జమ కానుంది.

మద్యం ఎమ్మార్పీ ఉల్లంఘిస్తే భారీ జరిమానా

(మొదటి పేజీ తరువాయి)

కొనసాగిస్తే లైసెన్స్ రద్దుచేస్తారు. ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్టు షాపుల కేసుల కాకుండా ఇతరత్రా ఉల్లంఘనలకు ప్రస్తుతం అమల్లో ఉన్న జరిమానాలు కొనసాగిస్తారు. కాగా మద్యం అక్రమాలపై భారీ జరిమానాలు విధించడాన్ని గతంలో తెలుగుదేశం ప్రభుత్వం అమల్లోకి తెచ్చింది. 2018లో ఇచ్చిన జీవో ప్రకారం మద్యం షాపుల లైసెన్సీలు ఎలాంటి ఉల్లంఘనలకు పాల్పడినా మొదటిసారి రూ.లక్ష నుంచి రూ.2 లక్షలు, రెండోసారి రూ.2లక్షల నుంచి రూ.5 లక్షలు జరిమానాలు విధించేవారు. మూడోసారి ఉల్లంఘనకు పాల్పడితే లైసెన్స్ రద్దుచేస్తారు. అయితే అప్పట్లో అన్ని రకాల ఉల్లంఘనలకు ఒకే విధమైన జరిమానాలు అమలు చేశారు. ఇటీవల ఎమ్మార్పీ ఉల్లంఘనలు, బెల్టు షాపులపై ఆరోపణలు పెరిగడంతో ఈ రెండు రకాల ఉల్లంఘనలకు భారీ జరిమానాలు అమల్లోకి తీసుకొచ్చారు. అది కూడా రెండోసారి ఉల్లంఘిస్తే ఏకంగా లైసెన్స్ రద్దుచేస్తామనే నిబంధన తేవడంతో లైసెన్సీలు హడలిపోతున్నారు. ఇప్పటికే ప్రభుత్వం చెప్పినంత మార్జిన్ తమకు రావట్లేదని గగ్గోలు పెడుతున్న లైసెన్సీలు.. ఈ భారీ జరిమానాలతో ఆందోళన చెందుతున్నారు.

సజ్జల భార్గవకు సుప్రీంలో చుక్కెదురు

- కేసులు కొట్టేయాలన్న పిటిషన్‌పై విచారణకు నిరాకరణ
- దుర్భాషలాడేవాళ్లు చట్టపర చర్యలు ఎదుర్కోవాల్సిందే
- విజ్ఞప్తులేవైనా హైకోర్టుకే చెప్పుకోవాలని స్పష్టీకరణ

న్యూఢిల్లీ, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): సోషల్ మీడియాలో అసభ్యకర పోస్టులు పెట్టిన వ్యవహారంలో... వైసీపీ సోషల్ మీడియా విభాగం మాజీ ఇన్‌చార్జి సజ్జల భార్గవరెడ్డికి సుప్రీంకోర్టులో చుక్కెదురైంది. తనపై నమోదైన కేసులు కొట్టివేయాలంటూ ఆయన దాఖలు చేసిన పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు న్యాయస్థానం నిరాకరించింది. ఈ పిటిషన్‌ను ఆయన గతనెల 22న సుప్రీంకోర్టులో దాఖలుచేశారు. దానిపై సోమవారం జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల్, సిద్ధార్థ్ దవే వాదనలు వినిపించారు. పాత విషయాలకు కొత్త చట్టాల ప్రకారం కేసులు పెడుతున్నారని సిబల్ వాదించారు. ఒకే సంఘటనకు సంబంధించి అనేక కేసులు నమోదు చేస్తున్నారన్నారు.

అయితే, దీనిపై సిద్ధార్థ లూథ్రా అభ్యంతరం వ్యక్తం చేశారు. చట్టాలు ఎప్పటివన్నది ముఖ్యం కాదని, మహిళలపై అసభ్య పోస్టులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. సోషల్ మీడియాలో వైసీపీ కార్యకర్తలు విచ్చలవిడిగా అసభ్యకర పోస్టులు పెట్టడంలో భార్గవరెడ్డి కీలక సూత్రధారి అని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దర్యాప్తునకు భార్గవరెడ్డి సహకరించడం లేదన్నారు. ఇరుపక్షాల వాదనల అనంతరం ధర్మాసనం.. భార్గవరెడ్డి పిటిషన్‌పై జోక్యానికి నిరాకరించింది. ఇటువంటి విషయాల్లో తమకెలాంటి సానుభూతి లేదని తెలిపింది. దుర్భాషలాడే వాళ్లెవరైనా చట్టపరమైన పరిణామాలను ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పింది. భార్గవరెడ్డి రెండువారాలల్లోగా హైకోర్టుకు వెళ్లవచ్చని, అప్పటివరకు అరెస్టు నుంచి మధ్యంతర రక్షణ ఉంటుందని తెలిపింది. ఇరుపక్షాల వాదనలు విని నిర్ణయం తీసుకునే స్వేచ్ఛ హైకోర్టుకు ఉంటుందని స్పష్టం చేసింది. విజ్ఞప్తులు ఏమైనా ఉంటే హైకోర్టు ముందు చెప్పుకోవచ్చని పిటిషనర్‌కు సూచించింది. కాగా, సెక్షన్ 111ను రాష్ట్ర ప్రభుత్వం దుర్వినియోగం చేసి అక్రమ కేసులు పెడుతున్నదని, వరుస అరెస్టులకు పాల్పడుతోందని సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి సోమవారం ఢిల్లీలో ఆరోపించారు. ఈ ఏడాది జూలై 1కి ముందు జరిగిన ఘటనలకు సెక్షన్ 111 వర్తించదని పొన్నవోలు తెలిపారు.

జగన్‌పై కేసుల వివరాలన్నీ ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

మాజీ ఎంపీ, ఏపీ అసెంబ్లీ ప్రస్తుత డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణ రాజు గతేడాది నవంబరు 1న సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. జగన్ సాక్షులను ప్రభావితం చేసే అవకాశం ఉందని, తెలంగాణ సీబీఐ కోర్టులో విచారణ మందకొడిగా సాగుతోందని, అందుకే విచారణను మరో రాష్ట్రానికి బదిలీ చేసి రోజువారీ విచారణ జరపాలని ఆ పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. ఆ పిటిషన్ సోమవారం జస్టిస్ అభయ్ ఎస్ ఓకా, జస్టిస్ అగస్టీన్ జార్జ్ మసీహ్‌లతో కూడిన సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనం ఎదుట విచారణకు వచ్చింది. జగన్ అక్రమాస్తుల కేసుల విచారణ తీరుపై ధర్మాసనం అసహనం వ్యక్తం చేసింది. ఆ కేసులపై రోజువారీ పద్ధతిలో విచారణకు ఇప్పటికే తెలంగాణ హైకోర్టు ఆదేశాలు జారీ చేసిందని ఇరుపక్షాల న్యాయవాదులు ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. అయితే, విచారణలో ఇంత జాప్యం ఎందుకు జరుగుతోందని ధర్మాసనం ప్రశ్నించింది. దానికి డిశ్చార్జ్, వాయిదా పిటిషన్లు, ఉన్నత కోర్టుల్లో విచారణ పెండింగ్ కారణమని న్యాయవాదులు తెలిపారు. దీంతో పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలన్నీ ఇస్తే తగు ఆదేశాలు జారీ చేస్తామని ధర్మాసనం తెలిపింది. 'కింది కోర్టులో ఉన్న డిశ్చార్జ్ పిటిషన్ల వివరాలన్నీ ఇవ్వండి. తెలంగాణ హైకోర్టులో ఉన్న పెండింగ్ అప్లికేషన్ల వివరాలు సమగ్రంగా అందించండి. అన్ని కోర్టులకు సంబంధించిన సీబీఐ, ఈడీ కేసుల వివరాలను విడివిడిగా పట్టిక రూపంలో అందించండి. అన్ని వివరాలతో కూడిన సమగ్ర అఫిడవిట్లను రెండు వారాల్లో దాఖలు చేయండి. అఫిడవిట్ రూపంలో ఇచ్చిన పట్టిక చూసిన తరువాత ఏం చేయాలో చెబుతాం' అని ధర్మసనం స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 13వ తేదీకి వాయిదా వేసింది.

లేబర్ సెస్ పంపకానికి ఓకే

- తెలుగు రాష్ట్రాల మధ్య కుదిరిన ఏకాభిప్రాయం
- క్లాస్, 3, 4 ఉద్యోగుల చేరికకు మరో 45 రోజుల సమయం
- వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ నిధుల వివాదాలు కొలిక్కి
- విద్యుత్ బకాయిలు, షెడ్యూల్ 9పై కుదరని పరిష్కారం
- విభజన సమస్యలపై సీఎస్‌ల నేతృత్వంలోని అధికారుల కమిటీ భేటీ
- పరిష్కారంకాని అంశాలపై తదుపరి సమావేశంలో చర్చ



విభజన అంశాలపై జరిగిన ఏపీ, తెలంగాణ అధికారుల సమావేశంలో సీఎస్‌లు, అధికారులు

అమరావతి, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలకు సంబంధించిన లేబర్‌సెస్ విభజనకు ఏకాభిప్రాయం కుదిరింది. ఆ సెస్ విభజనకు రెండు ప్రభుత్వాలు సుముఖత వ్యక్తం చేశాయి. ఉభయ తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యల పరిష్కారం కోసం ఏపీలో తొలిసారి సోమవారం ఉన్నతస్థాయి అధికారుల కమిటీ భేటీ అయింది. మంగళగిరిలోని ఏపీఐఐసీ భవనంలో జరిగిన ఈ భేటీకి రెండు రాష్ట్రాల సీఎస్‌లు అధ్యక్షత వహించారు. ఆంధ్రప్రదేశ్ విభజన చట్టంలోని 9, 10 షెడ్యూలు సంస్థల ఆస్తుల పంపకాలపై ప్రధానంగా చర్చ జరిగింది. దాదాపు 15 అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఏపీలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జూలై 5వ తేదీన ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు తెలంగాణలోని ప్రగతి భవన్‌లో సమావేశం అయ్యారు. ఆ సమావేశంలో చర్చించిన అంశాలపై కొనసాగింపుగా ఉన్నతాధికారుల చర్చలు జరిగాయి. రెండు రాష్ట్రాల మధ్య ఉద్యోగుల బదిలీకి మరో 45 రోజుల సమయం ఇవ్వాలని భేటీలో నిర్ణయించారు. వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ నిధుల పంపకాలపై ఉన్న వివాదాలపై చర్చలు ఒక కొలిక్కి వచ్చాయి. ఎక్సైజ్ ట్యాక్స్‌లో ఏపీకి అదనంగా రూ. 81 కోట్లు సెటిల్ చేయాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇక అత్యంత కీలకమైన షెడ్యూల్ 9లోని సంస్థల విభజన, విద్యుత్ బకాయిలపై ఇంకా పరిష్కారం లభించలేదు. తదుపరి సమావేశంలోనూ ఈ సమస్యలపై చర్చలు కొనసాగుతాయి. ముఖ్యంగా ఇరు రాష్ట్రాలను తీవ్రంగా వేధిస్తున్న డ్రగ్స్, గంజాయి నివారణపై ప్రత్యేక దృష్టిపెట్టాలని అధికారులు అభిప్రాయపడ్డారు. డ్రగ్ ట్రాఫికింగ్ నిరోధం కోసం ఇరురాష్ట్రాల అధికారులతో జాయింట్ కమిటీ ఏర్పాటు చేయాలని, పోలీసు, ఎక్సైజ్ శాఖలతో పాటు సీనియర్ అధికారులతో ఆ కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఉమ్మడి సంస్థల ఖర్చులను తిరిగి చెల్లించే అంశంతో పాటు విభజన పూర్తికాని సంస్థలకు చెందిన నగదు నిల్వలపైనా చర్చించారు. ఇరు రాష్ట్రాలకు షెడ్యూల్ 9, 10లోని సంస్థల బ్యాంకు ఖాతాల్లో పంపకం కాకుండా మిగిలిపోయిన రూ. 8 వేల కోట్ల అంశంపైనా చర్చించారు.

లేబర్ సెస్‌పై ఫ్రీజింగ్ ఎత్తివేత

లేబర్ సెస్‌కు సంబంధించి రూ. 861.35 కోట్లలో రూ. 732.18 కోట్ల ఎఫ్‌డీలను తెలంగాణ ప్రభుత్వం ఫ్రీజ్ చేసింది. రూ. 129.19 కోట్లు సేవింగ్స్ బ్యాంక్ ఖాతాలో ఉన్నాయి. ఎఫ్‌డీలపై ఫ్రీజింగ్ ఎత్తేయమని ఏపీ కోరగా తెలంగాణ అధికారులు సానుకూలంగా స్పందించారు. ఇక ఏపీ నుంచి తెలంగాణకు, తెలంగాణ నుంచి ఏపీకి శాశ్వతంగా వెళ్లాలనుకుంటున్న ఉద్యోగులకు రెండు ప్రభుత్వాలు అనుమతిచ్చాయి. క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగులు వారు కోరుకున్న రాష్ట్రానికి వెళ్తున్నారు. కానీ, ఇంకా పూర్తవలేదు. దీంతో మరో 45 రోజుల సమయం ఇవ్వాలని ఈ సమావేశంలో నిర్ణయించారు.

వాణిజ్య పన్నులు, ఎక్సైజ్ నిధుల వివాదాలు కొలిక్కి

వాణిజ్య పన్నుల శాఖ పరిధిలో ఉండే ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ 2014 మే నాటికి రూ. 208.24 కోట్లు ఉందని రెండు రాష్ట్రాల అధికారుల సమక్షంలో 2017 జూన్ 6న ఏజీ నిర్ణయించింది. అయితే, ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్‌ను డీలర్లవారీగా సర్దుబాటు చేయడానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది. తెలంగాణ ప్రభుత్వం కూడా డీలర్లవారీ సర్దుబాటు పూర్తిచేయాలని కోరింది. తెలంగాణ ప్రభుత్వం నుంచి ఈ నివేదిక వచ్చాకే ఈ అంశంపై ముందుకెళ్లాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. 2014 మే నెలకు సంబంధించిన ఎక్సైజ్ ఆదాయం వివాదంపై స్పష్టత రావడం కోసం ఏజీ వద్ద ఉన్న వివరాలు పరిశీలించి దాని ప్రకారం ఈ వివాదం పరిష్కరించుకోవాలని సూత్రప్రాయ అంగీకారానికి వచ్చారు. 2014-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర ప్రభుత్వం ఏపీ ఖాతాలో జమ చేసిన కేంద్ర ప్రభుత్వ ప్రాయోజిత పథకాల గ్రాంట్లను రెండు ప్రభుత్వాలు లెక్క చూసుకుని పంచుకోవాలని ఈ సమావేశంలో నిర్ణయించారు. రాష్ట్రం విడిపోయేనాటికి 15 ఈఏపీ ప్రాజెక్టులు అమల్లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులకు సంబంధించి మరోసారి రెండు రాష్ట్రాలు లెక్కలు చూసుకుని చెల్లింపులు చేసుకోవాలని నిర్ణయించారు. విభజన సమస్యల్లో అత్యంత కీలకమైన షెడ్యూల్ 9లోని సంస్థల విభజనపై ఈ సమావేశంలో ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు.

విద్యుత్ బకాయిలు చెల్లించాల్సిందే

విద్యుత్ బకాయిలు చర్చకు వచ్చిన సమయంలో "ఆపర్చ్యునిటీ" విధానంలో తమకు రూ. 21,000 కోట్లను ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్‌ను తెలంగాణ డిమాండ్ చేసింది. రాష్ట్ర విభజన తర్వాత తమకు ఏపీ అకస్మాత్తుగా విద్యుత్తు సరఫరాను ఆపేసిందని, అందువల్ల తాము బయట నుంచి అధిక ధరలు చెల్లించి విద్యుత్తును కొనుగోలు చేశామంటూ చెప్పుకొచ్చింది. ఈ వాదనను ఆంధ్రప్రదేశ్ సమర్థంగా తిప్పికొట్టింది. తమకు తెలంగాణ నుంచి విద్యుత్తు బకాయిల కింద రూ. 14,000 కోట్ల వరకు రావాల్సి ఉందని ఏపీ స్పష్టం చేసింది. తాము సరఫరా చేసిన విద్యుత్తుకు తెలంగాణ ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించి ఉంటే.. తామెందుకు కరెంటు సరఫరాను నిలిపివేసేవారమని ప్రశ్నించింది. రాష్ట్రావసరాల కోసం బయట నుంచి అధిక ధరలకు విద్యుత్తు కొంటే తమకేమి సంబంధమని నిలదీసింది. ఆస్తులు, అప్పుల పంపకంలో భాగంగా.. రెవెన్యూ రిజర్వు నుంచి విద్యుత్తు బకాయిలను మినహాయించుకోవాలని తెలంగాణ సలహా ఇచ్చింది. దీనిపై ఏపీ స్పందిస్తూ.. ఆస్తులూ అప్పులు పంపకాలు తేలాక ఇక రెవెన్యూ రిజర్వు ఎక్కడ ఉంటుందని తెలంగాణను ప్రశ్నించింది. విద్యుత్తు బకాయిల వివాదం రెండు కంపెనీల మధ్య తేల్చుకోవాలని ఏపీ సీఎస్ సూచించారు. బకాయిల వివాదం న్యాయస్థానంలో తేలాల్సిందేనని తెలంగాణ సీఎస్ స్పష్టం చేశారు. వాద ప్రతివాదాల మధ్య విద్యుత్తు వివాదంపై ఇరు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులూ ఎటూ తేల్చలేకపోయారు. ఈ భేటీలో ఆంధ్రప్రదేశ్ సీఎస్ నీరబ్ కుమార్‌ప్రసాద్, తెలంగాణ సీఎస్ శాంతి కుమారితో పాటు తెలంగాణకు చెందిన ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, హోం శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రవిగుప్తా తదితరులు హాజరయ్యారు. ఏపీ నుంచి ఆర్థిక శాఖ కార్యదర్శి జానకి, హోం శాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజిత్, ఎక్సైజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్ మీనా, ఏపీ జెన్కో సీఎండీ చక్రధర్‌బాబు, వాణిజ్యపన్నుల శాఖ చీఫ్ కమిషనర్ బాబు.ఎ తదితరులు పాల్గొన్నారు.

సీఎంతో సీఎస్ భేటీ..

తెలుగు రాష్ట్రాల సీఎస్ కమిటీ భేటీ అనంతరం ఆంధ్రప్రదేశ్ సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ముఖ్యమంత్రి నివాసానికి వెళ్లారు. సీఎస్‌ల కమిటీలో చర్చించిన అంశాలను సీఎం చంద్రబాబుకు వివరించారు. విద్యుత్ బకాయిలపై సుదీర్ఘంగా చర్చించినట్లు తెలిపారు. లేబర్‌సెస్ పంపకానికి దాదాపు అంగీకారం కుదిరిందని, మిగిలిన అంశాలపై మరోసారి భేటీలో చర్చించే విధంగా నిర్ణయించినట్లు సీఎంకు వివరించారు.

డిజిటల్ అరెస్టు ముఠా ఆటకట్టు

- విజయనగరం పోలీసుల చొరవ.. మహారాష్ట్రలో నిందితుల అరెస్టు

విజయనగరం క్రైం, డిసెంబరు 2(ఆంధ్రజ్యోతి): విజయనగరంలో విశ్రాంత అధ్యాపకురాలిని మోసం చేసిన కేసులో పోలీసులు సైబర్ నేరగాళ్ల ఆటకట్టించారు. వారి వద్ద నుంచి నగదు, ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. ఆ వివరాలను సోమవారం విజయనగరం ఎస్పీ వకుల్ జిందాల్ విలేకరుల సమావేశంలో వెల్లడించారు. అక్టోబరు 10న విజయనగరంలోని కొత్తఅగ్రహారం ప్రాంతానికి చెందిన విశ్రాంత అధ్యాపకురాలు ఉసిరకళ సుజాత కుమారికి గుర్తు తెలియన వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. తాము పోలీసులమని, మీరు పంపిన పార్శిల్లో డ్రగ్స్ ఉన్నాయని, మిమ్మల్ని అరెస్ట్ చేస్తామని బెదిరించారు. బ్యాంక్ ఖాతాలో ఉన్న నగదును తాము సూచించిన ఖాతాకు పంపితే విచారణ పూర్తయిన తర్వాత, తిరిగి మీ అకౌంట్‌కు పంపుతామని చెప్పారు. దీంతో వారు సూచించిన బ్యాంక్ ఖాతాకు ఆమె రూ. 40,11,000 బదిలీ చేశారు. వెంటనే ఆ ఫోన్ స్విచ్ ఆఫ్ కావడంతో అనుమానం వచ్చి ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు తక్షణం స్పందించి నేరగాళ్ల ఖాతాలో ఉన్న రూ. 20లక్షలు ఫ్రీజ్ చేయించారు. నిందితుడి ఖాతా జమ్మూకశ్మీర్‌లో ఉందని గుర్తించారు. స్థానిక సీఐ శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది ముమిన్ తారీఖ్ బట్‌ను అరెస్ట్ చేసి విచారణ జరిపారు. అతడిచ్చిన సమాచారంతో మహారాష్ట్రకు వెళ్లి డిజిటల్ అరెస్ట్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను గుర్తించారు. వీరిలో ఖసిద్దీ చంద్రకాంత్ సుతార్, క్లెవిన్ గ్లెన్ బ్రిటో, నితిన్ నందలాల్ సరోజ్, సైఫ్ తలమీదమాందు అనే ముంబై, పుణెకు చెందిన నలుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 10 లక్షల నగదు, రూ. 9.20 లక్షలు విలువైన బంగారు ఆభరణాలు, 6 సెల్‌ఫోన్లు సీజ్‌చేశామని ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు.

అత్యాచారం కేసులో నిందితుడికి మరణించే వరకు జైలుశిక్ష

- ఒంగోలు పోక్సో కోర్టు సంచలన తీర్పు
- బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన టీచర్

ఒంగోలు క్రైం, డిసెంబరు 2 (ఆంధ్రజ్యోతి): మైనర్ బాలికపై అత్యాచారం కేసులో ఒంగోలు పోక్సో కోర్టు జడ్జి సంచలన తీర్పు ఇచ్చారు. దోషిగా తేలిన షేక్ మొహ్మద్ అప్సర్‌బాషాకు మరణించే వరకు జైలుశిక్ష విధిస్తూ ఇన్‌చార్జి న్యాయమూర్తి రాజా వెంకటాద్రి సోమవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు కంభంకు చెందిన అప్సర్ బాషా.. అక్కడే ఒక ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేసేవాడు. పాఠశాలలో ఓ బాలికతో అసభ్యకరంగా ప్రవర్తించడంతో అప్పట్లో అతన్ని ఉద్యోగం నుంచి తొలిగించారు. అనంతరం ఆ బాలిక ఒంగోలులో చదువుకుంటుండగా.. 2017 ఆగస్టు 6న మాయమాటలు చెప్పి హైదరాబాద్, నరసరావుపేట ప్రాంతాలకు తీసుకెళ్లాడు. అక్కడ బాలికపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధితురాలి తల్లిదండ్రులు ఒంగోలు టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు పెట్టారు. అప్పటి డీఎస్పీ గుంటుపల్లి శ్రీనివాసరావు కేసు విచారణ చేపట్టి, కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. నేరం రుజువైనందున కోర్టు అప్సర్ బాషాకు మరణించే వరకు జైలుశిక్ష, రూ.25 వేలు జరిమానా విధించింది. బాధితురాలికి రూ.7 లక్షల పరిహారం అందేలా చూడాలని న్యాయ సేవాధికార సంస్థను ఆదేశించింది. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎస్.వసుంధర వాదనలు వినిపించారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** *on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107,* **Editor : N.Rahul Kumar,**
RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** *K.L.N. Prasad.*